గురువారం
8-3-2018
హైదరాబాద్
• వెల.5 రూ.
• సంపుటి 7 • సంచిక 270
• పేజీలు : 16 + (20/16)

మన రాష్ట్రం • మన పత్రిక

నమస్తే తెలంగాణ

WWW. NTNEWS.COM
/NTDAILYONLINE

PUBLISHED FROM HYDERABAD I KARIMNAGAR I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD



నేడు అంతర్జాతీయ
మహిళా దినోత్సవం

గవర్నర్ నరసింహన్, సీఎం కేసీఆర్ శుభాకాంక్షలు

మహిళల సాధికారతకు యావత్ సమాజం అండగా నిలువాలి: కేసీఆర్

- నేడు మహిళా ఉద్యోగులకు క్యాజువల్ లీవ్
- నేడు వీ హబ్ ప్రారంభం

2

షీటీమ్స్‌తో ఆమెకు భరోసా!

11

రాష్ట్రవ్యాప్తంగా 2,374 మంది పోకిరీలపై కేసులు

కర్ణాటక లోకాయుక్తకు కత్తిపోట్లు



జస్టిస్ విశ్వనాథ శెట్టి

- చాంబర్‌లోనే విశ్వనాథ శెట్టిపై కత్తితో దాడిచేసిన యువకుడు
- రక్తమోడుతున్న స్థితిలో దవాఖానకు తరలింపు
- దాడికి పాల్పడిన తేజ్‌రాజ్ శర్మ అరెస్ట్

కర్ణాటక లోకాయుక్త జస్టిస్ విశ్వనాథశెట్టిపై తేజ్‌రాజ్‌శర్మ అనే యువకుడు దాడిచేసి కత్తితో మూడు, నాలుగుసార్లు పొడిచాడు. జస్టిస్ శెట్టి త్రీపీస్ సూట్ ధరించడం వల్ల కత్తిపోట్లు లోతుగా పడలేదు. ఆయనను వెంటనే దవాఖానకు తరలించారు. ఓ టెండర్ వివాదంలో తను పేర్కొన్న అధికారులపై చర్యలకు ఆదేశించనందుకు ఆ యువకుడు ఆగ్రహంతో దాడికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు.

జాతీయస్థాయి పరీక్షలకు ఆధార్ తప్పనిసరి కాదు

సీబీఎస్‌ఈని ఆదేశించిన సుప్రీంకోర్టు
ఆధార్ అనుసంధాన గడువు మళ్లీ పొడిగింపు!

'నీట్'కు హాజరయ్యే విద్యార్థులకు ఆధార్ నంబర్‌ను తప్పనిసరి చేస్తూ సీబీఎస్‌ఈ తీసుకున్న నిర్ణయాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు స్పందించింది. జాతీయస్థాయిలో ఏ పరీక్షకైనా ఆధార్‌ను తప్పనిసరి చేయవద్దంటూ సీబీఎస్‌ఈని ధర్మాసనం ఆదేశించింది. మరోవైపు ప్రభుత్వ పథకాలకు ఆధార్ అనుసంధానం గడువును పెంచే అవకాశముందని కేంద్రం సుప్రీంకోర్టుకు తెలిపింది.

5

కోటా పోరు ఉధృతం

డిల్లీలో మూడోరోజూ టీఆర్‌ఎస్ ఎంపీల నిరసన.. మద్దతు పలికిన మజ్లిస్ ఎంపీ అసదుద్దీన్

ప్లకార్డులతో పార్లమెంటు ప్రవేశద్వారం వద్ద ఆందోళన..
డిమాండ్లు నెరవేరేదాకా పోరాటం ఆగదు.. తేల్చిచెప్పిన ఎంపీ జితేందర్‌రెడ్డి
11 నెలలుగా నాన్చితే ఎలా?.. కేంద్రానికి ఒవైసీ ప్రశ్న

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

గత ఏడాది తెలంగాణ రాష్ట్ర శాసనసభ ఆమోదించిన రిజర్వేషన్ల పెంపుదల బిల్లును కేంద్రం వెంటనే ఆమోదించాలని డిమాండ్ చేస్తూ టీఆర్‌ఎస్ ఎంపీలు దేశ రాజధాని ఢిల్లీలో పోరాటాన్ని మరింత ఉధృతం చేశారు. తొలి రెండ్రోజులు లోక్‌సభను స్తంభింపజేసిన టీఆర్‌ఎస్ ఎంపీలు, అదే ఒరవడిని కొనసాగిస్తూ.. మూడో రోజైన బుధవారంకూడా తమ ఆందోళనను కొనసాగించారు. లోక్‌సభ లోపలా, బయటా నిరసన తెలిపారు. వీరికి ఎంఐఎం నేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ మద్దతు పలికారు. లోక్‌సభ వెలుపల ప్లకార్డులతో టీఆర్‌ఎస్ ఎంపీలు నిర్వహించిన ఆందోళన, నిరసనలో పాల్గొన్నారు. అనంతరం టీఆర్‌ఎస్ ఎంపీలు ఉభయ సభల్లో గళమెత్తారు. ఇదే సమయంలో కావేరీ జలాల అంశంపై తమిళనాడు ఎంపీలు, ప్రత్యేక హోదా కోసం ఏపీ ఎంపీల ఆందోళన, త్రిపుర ఎన్నికల ఫలితాల అనంతరం లెనిన్, అంబేద్కర్, పెరియార్ విగ్రహాల ధ్వంసం తదితర అంశాలపై ప్రతిపక్ష సభ్యులు చర్చకు పట్టుబట్టడంతో బుధవారం కూడా పార్లమెంటు ఉభయ సభలు ఎలాంటి చర్చలు లేకుండానే ముగిశాయి. రిజర్వేషన్లపై హక్కులు రాష్ట్రాలకే ఇవ్వాలని టీఆర్‌ఎస్ ఎంపీలు ఉదయం లోక్‌సభను స్తంభింపజేశారు. దీంతో సభ ప్రారంభమైన కొద్దిసేపటికే గంటపాటు వాయిదాపడింది. సభ తిరిగి ప్రారంభమైన తర్వాత టీఆర్‌ఎస్ ఎంపీలు జై తెలంగాణ నినాదాలు చేస్తూ వెల్‌లోకి దూసుకుపోయారు. ఈ పరిస్థితుల్లో సభను స్పీకర్ సుమిత్రా మహాజన్ మరుసటిరోజుకు వాయిదావేశారు. అటు రాజ్యసభలోనూ విపక్షాల ఆందోళనతో ఎలాంటి చర్చ జరుగలేదు. పంజాబ్ నేషనల్ బ్యాంకు కుంభకోణం, కావేరీ వాటర్ బోర్డు ఏర్పాటు, ఏపీకి విభజన చట్టం హామీల అమలు, దేశవ్యాప్తంగా విగ్రహాల ధ్వంసంపై చర్చకు పలు పార్టీలు డిమాండ్ చేశాయి. పలువురు సభ్యులు వెల్‌లోకి దూసుకురావడంతో చైర్మన్ వెంకయ్యనాయుడు

మిగతా 2వ పేజీలో



బుధవారం పార్లమెంట్ వద్ద ఆందోళన చేస్తున్న టీఆర్‌ఎస్ ఎంపీలు జితేందర్‌రెడ్డి, కే కేశవరావు, కవిత, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, సీతారాం నాయక్, బూర నర్సయ్య గౌడ్, బీబీ పాటిల్, మల్లారెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, నగేశ్, కొత్త ప్రభాకర్‌రెడ్డి

కేంద్ర ఉద్యోగుల డీఏ 2 శాతం పెంపు

పెన్షనర్ల డీఆర్ కూడా.. జనవరి 1 నుంచి అమలు




న్యూఢిల్లీ, మార్చి 7: కేంద్రప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు శుభవార్త. కరువు భత్యం(డీఏ), కరువు సాయం(డీఆర్)లను కేంద్ర ప్రభుత్వం రెండు శాతం చొప్పున పెంచింది. ప్రధాని మోదీ అధ్యక్షతన బుధవారం జరిగిన క్యాబినెట్ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ నిర్ణయంతో ప్రస్తుతం 5శాతం చొప్పున ఉన్న డీఏ, డీఆర్‌లు 7 శాతానికి పెరుగనున్నాయి. ఈ పెంపుదల ఈ ఏడాది జనవరి 1 నుంచి వర్తించనుంది. డీఏ, డీఆర్‌ల పెంపు వల్ల కోటీ 10 లక్షల మంది ఉద్యోగులు, పెన్షనర్లు లబ్ధిపొందనున్నారు. ఈ పెంపుదల వల్ల ఖజానాపై ఏడాదికి రూ.6,077.72 కోట్ల భారం పడనుంది. ఏడవ వేతన సంఘం సిఫారసుల ప్రకారం ఉద్యోగులకు డీఏ, పెన్షనర్లకు డీఆర్ పెంచినట్లు కేంద్ర ప్రభుత్వం పేర్కొంది.

యాదాద్రి జిల్లా సైదాపూర్ గుట్టల్లో
రాములోరి ఆలయం!

రాతిగుండుపై సీతారాముల అర్ధ శిల్పం

భద్రాచలం శిల్పంకన్నా పురాతనమని నిర్ధారణ



దేశంలోనే ఎంతో అరుదైన సీతారాముల అర్ధశిల్పం

14

ధాన్యం కొనుగోళ్లకు ఆన్‌లైన్ భేష్

సివిల్ సప్లై ఐటీ ప్రాజెక్టులను పరిశీలించిన ఛత్తీస్‌గఢ్ అధికారుల బృందం

తమ రాష్ట్రంలో తెలంగాణ విధానాల అమలుకు పరిశీలన

3

'డబుల్' కాలనీలు అద్భుతం!

కేంద్ర బృందం ప్రశంస

సౌకర్యాలను ఆసక్తిగా పరిశీలించిన అధికారులు

చెక్కుల పంపిణీకి కసరత్తు

పంట పెట్టుబడికి గ్రామాలవారీగా చెక్కుల ముద్రణ

ఒక్కో మండలానికి ఒక్కో బ్యాంకుకు పంపిణీ బాధ్యత

రైతులు చెక్కును నేరుగా నగదుగా మార్చుకునే అవకాశం

కలెక్టర్లకు స్థానికంగానే సమస్యల పరిష్కారం బాధ్యత

12

డిజిటల్ సంతకాలు రేపటికల్లా పూర్తి!

ఇప్పటికే 16 లక్షల రైతు ఖాతాలకు డిజిటల్ సంతకాలు

అతిపెద్ద ఐటీ కారిడార్

హైదరాబాద్ నగర శివార్లలో విస్తరణ

- బుద్వేల్‌నుంచి కొల్లూరుదాకా ఐటీ క్లస్టర్లు
- సంబంధిత అధికారులతో మంత్రి కేటీఆర్ సమీక్ష
- అనువైన భూముల సేకరణపై అధికారుల దృష్టి
- ఎంపిక చేసిన భూములు టీఎస్‌ఐఐసీకి
- భారీగా పెట్టుబడులకు ముందుకొస్తున్న ఐటీ సంస్థలు
- హైదరాబాద్ చుట్టుపక్కల భూములకు డిమాండ్



రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ:

దేశ ఐటీ రంగంలో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న హైదరాబాద్‌లో మరో భారీ ఐటీ కారిడార్ ఏర్పాటు కానున్నది. నగర శివార్లలోని రంగారెడ్డి జిల్లాలో మూడు కొత్త ఐటీ పార్కులు రానున్నాయి. రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని బుద్వేల్, కోకాపేట్, పుప్పాల్‌గూడలో నూతనంగా ఐటీ క్లస్టర్లను ప్రభుత్వం ప్రతిపాదించింది. ప్రస్తుతం సైబరాబాద్‌లో ప్రధానంగా కేంద్రీకృతమైన ఐటీ కారిడార్‌కు సమాంతరంగా బుద్వేల్ నుంచి తెల్లాపూర్‌మీదుగా కొల్లూరు వరకు అతి పెద్ద 'ఐటీ కారిడార్'ను అభివృద్ధి చేయనున్నారు. ఈ విషయంలో ప్రత్యేక చొరవ చూపిస్తున్న ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి కే తారకరామారావు బుధవారం


మిగతా 12వ పేజీలో

ధ్వంసరచన!


- యూపీలో అంబేద్కర్, బెంగాల్‌లో శ్యామా ప్రసాద్ ప్రతిమలకు అవమానం
- ఈశాన్యం నుంచి దక్షిణ భారతానికి పాకిన విగ్రహాల ధ్వంసం
- తమిళనాడులో బీజేపీ ఆఫీసుపై పెట్రోలు బాంబు దాడి
- విగ్రహాల కూల్చివేతను ఖండించిన ప్రధాని మోదీ
- అల్లరిమూకలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిక
- ఎస్పీలు, కలెక్టర్లను బాధ్యులను చేస్తామన్న హోం శాఖ



పెరియార్ విగ్రహం



అంబేద్కర్ విగ్రహం



శ్యామా ప్రసాద్ విగ్రహం

ఈశాన్య రాష్ట్రమైన త్రిపురలో బీజేపీ అధికారంలోకి రావడంతో మొదలైన విగ్రహాల కూల్చివేతలు.. పశ్చిమభారతం మీదుగా దక్షిణాదికి పాకాయి. బీజేపీ చర్యలకు ప్రతిచర్యలు కూడా తోడయ్యాయి. త్రిపురలో లెనిన్ విగ్రహాల కూల్చివేత, వాటికి గవర్నర్, కేంద్రమంత్రుల వత్తాసుతో రెచ్చిపోయిన బీజేపీ కార్యకర్తలు తమిళనాడులో ద్రవిడ ఉద్యమ వ్యవస్థాపకుడు పెరియార్ రామస్వామి విగ్రహాన్ని ధ్వంసం చేశారు. మరోవైపు ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌లో రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ విగ్రహాన్ని అగ్రకులానికి చెందినవారు ధ్వంసం చేశారు. బీజేపీ చర్యలకు ప్రతీకారంగా కోల్‌కతాలోని జనసంఘ్ వ్యవస్థాపకుడు శ్యామాప్రసాద్ ముఖర్జీ విగ్రహానికి రాడికల్స్‌గా చెప్పుకొన్న కొందరు నల్లరంగు పులిమారు. తమిళనాడులోని కోయంబత్తూరులో బీజేపీ కార్యాలయంపై పెట్రోలు బాంబు దాడి జరిగింది. ద్రవిడార్ విడుత్తళై కళగం (డీవీకే)కు చెందిన నలుగురు కార్యకర్తలు మైలాపూర్‌లోని నల్లతంబి రోడ్డుపై నడుచుకుంటూ వెళుతున్న ఎనిమిదిమంది జంధ్యాలను కోసివేశారు. విగ్రహాల కూల్చివేతలను ప్రధాని మోదీ తీవ్రంగా ఖండించారు. ఈ ఘటనలను తీవ్రంగా పరిగణిస్తున్నామని, నిందితులపై కఠినచర్యలు తీసుకోవాలని సంబంధిత రాష్ట్రాలను ఆదేశించామని కేంద్ర హోం శాఖ తెలిపింది.

వివరాలు 5వ పేజీలో

1551 వర్సిటీ పోస్టులకు త్వరలో నోటిఫికేషన్లు

జూన్‌లోగా నియామక ప్రక్రియ పూర్తికావాలి

- అన్ని కాలేజీలలో బయోమెట్రిక్ తప్పనిసరి
- పీహెచ్‌డీ పూర్తికి గరిష్ఠంగా ఐదేండ్ల గడువు
- వర్సిటీల భూములను కాపాడండి
- వెంటనే ప్రహరీలు నిర్మించండి
- వైస్‌చాన్స్‌లర్లకు దిశానిర్దేశం చేసిన డిప్యూటీ సీఎం కడియం



హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

రాష్ట్రంలోని పదకొండు యూనివర్సిటీలలో ఖాళీగా ఉన్న 1,551 అధ్యాపకుల పోస్టుల భర్తీ ప్రక్రియను జూన్ నెలాఖరుకల్లా పూర్తిచేసి, ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలను జారీ చేయాలని ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి.. వైస్ చాన్స్‌లర్లను ఆదేశించారు. సర్దుబాటు చేసుకొన్న పోస్టుల మంజూరు కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాలని సూచించారు. నియామకాల ప్రక్రియలో రిజర్వేషన్ విధానాన్ని పాటించాల్సి ఉన్నదని తెలిపారు. యూనివర్సిటీల పురోగతి అంశంపై యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్లు, రిజిస్ట్రార్లతో డిప్యూటీ సీఎం బుధవారం సమీక్షాసమావేశం నిర్వహించారు. గత ఏడాది అక్టోబర్‌లో గవర్నర్‌తో సమావేశంలో నిర్దేశించిన పది అంశాలపై వీసీలతో చర్చించామని సమీక్షాసమావేశం అనంతరం ఆయన తెలిపారు. వర్సిటీలలో పీహెచ్‌డీ నోటిఫికేషన్ విడుదలైన నాటినుంచి పీహెచ్‌డీ పూర్తి చేసేంతవరకు ఉండాల్సిన నూతన మార్గదర్శకాలు వీసీల కమిటీ ఆధ్వర్యంలో కొత్తగా సిద్ధమవుతున్నాయని చెప్పారు. పీహెచ్‌డీని

మిగతా 12వ పేజీలో

రేపటి నుంచి సినిమాల ప్రదర్శన

12

డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్లతో చర్చలు సఫలం: జేఏసీ చైర్మన్ డీ సురేశ్‌బాబు



అవార్డులకు ఎంపికైన మహిళలకు టీపీయూఎస్ సన్మానం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో అన్నిరంగాల మహిళలకు సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిన ఘనత సీఎం కేసీఆర్‌కు దక్కుతుందని కరీంనగర్ జెడ్పీ చైర్‌పర్సన్ తుల ఉమ అన్నారు. పలురంగాల్లో రాష్ట్ర ప్రభుత్వ అవార్డులకు ఎంపికైన మహిళలను తెలంగాణ ప్రైవేటు ఉద్యోగుల సంఘం (టీపీయూఎస్) మహిళా విభాగం ఆధ్వర్యంలో బుధవారం తెలంగాణ భవన్‌లో సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటైన కార్యక్రమంలో ఉమ మాట్లాడుతూ.. చిన్నపిల్లలు, పెళ్లి కాని అమ్మాయిలు, గర్భిణులు, బాలింతలు, వృద్ధ మహిళలు ఇలా అన్నివయసులవారికి సీఎం కేసీఆర్ సంక్షేమ కార్యక్రమాలను రూపొందించారని చెప్పారు. టీఆర్‌ఎస్ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు గుండు సుధారాణి మాట్లాడుతూ, బాలికల విద్యను ప్రోత్సహించడానికి గాను పెద్ద ఎత్తున ప్రత్యేక గురుకులాలను, డిగ్రీ కాలేజీలను ఏర్పాటు చేశారన్నారు. మార్కెట్ కమిటీల్లో రిజర్వేషన్లు కల్పించిన ఘనత కేసీఆర్‌దేనని అన్నారు. పత్రికా విభాగంలో అవార్డుకు ఎంపికైన నాగపురి సౌమ్య(నమస్తే తెలంగాణ), క్రీడల విభాగం నుంచి అరుణా రెడ్డి కోచ్ స్వర్ణలత, వైద్య విభాగం నుంచి ప్రేమలత, ఉద్యమ గాయని స్పందన, సామాజిక సేవకురాలు మేరీ మాదిగలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీపీయూఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గంధం రాములు, మహిళా, శిశు సంక్షేమశాఖ సమన్వయకర్తలు సుశీల రెడ్డి, లక్ష్మి, టీపీయూఎస్ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు ప్రభారెడ్డి, ప్రధాన కార్యదర్శి తులసి, కోశాధికారి శ్రావణిరెడ్డి, ప్రచార కార్యదర్శి గీతారెడ్డి, సంయుక్త కార్యదర్శి రాధిక, గ్రేటర్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షురాలు విజయలక్ష్మి, ప్రధాన కార్యదర్శి శ్రీదేవి, వర్కింగ్ ప్రెసిడెంట్ అనిత, గీతాగౌడ్ తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసిన 20 మంది మహిళా ప్రముఖులకు గురువారం విశిష్ట పురస్కారాలను అందజేయనున్నది.



మహిళా దినోత్సవ అవార్డులకు ఎంపికైనవారిని తెలంగాణ భవన్‌లో సన్మానిస్తున్న దృశ్యం. చిత్రంలో కరీంనగర్ జెడ్పీ చైర్‌పర్సన్ తుల ఉమ, టీపీయూఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గంధం రాములు తదితరులు





మహిళలకు గవర్నర్, సీఎం శుభాకాంక్షలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: మహిళా దినోత్సవం సందర్భంగా గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్, ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు రాష్ట్ర మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు. దేశ సమగ్రత, సమైక్యతలను పరిరక్షించడం, దేశంలో శాంతియుత వాతావరణం పెంపొందించడంలో భారతీయ మహిళలు గొప్ప పాత్రను పోషిస్తున్నారని గవర్నర్ అన్నారు. మహిళలు అన్ని రంగాల్లో అభివద్ధి చెందినప్పుడే ఏ సమాజం అయినా సంపూర్ణంగా పురోగమిస్తుందని సీఎం కేసీఆర్ తన అభినందన సందేశంలో పేర్కొన్నారు. మహిళలకు స్వేచ్ఛ, భద్రత, ప్రోత్సాహం కల్పించేందుకు తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టంచేశారు.

నేడు వీ- హబ్‌ను ప్రారంభించనున్న కేటీఆర్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: మహిళా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన ఉమెన్ ఎంటర్‌ప్రెన్యూర్ హబ్ (వీ-హబ్)ను గురువారం ఐటీశాఖ మంత్రి కే తారక రామారావు ప్రారంభించనున్నారు. ప్రపంచ పారిశ్రామికవేత్తల సదస్సు (జీఈఎస్) ముగింపు సందర్భంగా మంత్రి కేటీఆర్ రూ.15 కోట్లతో వీ-హబ్ ఏర్పాటు చేయనున్నట్టు ప్రకటించిన విషయం తెలిసిందే. దీనిని ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రారంభించాలని నిర్ణయించారు. జూబ్లీహిల్స్ అంబేద్కర్ యూనివర్సిటీ ప్రాంగణంలోని టీసాట్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన వీ-హబ్‌కు రావుల దీప్తిని సీఈవోగా నియమించారు.

అదో క తుస్సు యాత్ర

కాంగ్రెస్ బస్సు యాత్రపై మండిపడ్డ మంత్రులు

కాంగ్రెస్ నాయకులు ఉనికి కోసమే బస్సుయాత్ర పేరుతో రోడ్లపైకి వస్తున్నారని, వారు నిర్వహిస్తున్నది ఒక తుస్సు యాత్ర అని మంత్రులు మండిపడ్డారు. టీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలను, వాటికి ప్రజల నుంచి వస్తున్న స్పందనను చూసి తట్టుకోలేక ఆ పార్టీ నాయకులకు పిచ్చిపడుతున్నదని వారు పేర్కొన్నారు. యాత్రపై ప్రజలకు ఎలాంటి గౌరవం లేదని తెలిపారు.



అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి



పోచారం శ్రీనివాసరెడ్డి



పట్నం మహేందర్‌రెడ్డి

ఉత్తరకుమారుడు: అల్లోల

నిర్మల్ ప్రధాన ప్రతినిధి, నమస్తే తెలంగాణ: ఉత్తర కుమారుడు ఉత్తమ్ రెడ్డి అని.. రేవంత్‌రెడ్డి పెద్ద బ్రోకరని రాష్ట్ర గృహ నిర్మాణ, దేవాదాయశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి దుయ్యబట్టారు. బుధవారం నిర్మల్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. ఉత్తర కుమారుడిలా ఉత్త సైన్యాన్ని వెంట బెట్టుకుని బస్సు యాత్రకు వస్తున్నారని, అది పూర్తిగా అట్టర్‌ఫ్లాప్ అయ్యిందన్నారు. యాత్రలో జనాల కంటే నాయకులే ఎక్కువగా ఉంటున్నారని ఎద్దేవా చేశారు. ఏ సర్వేలోనైనా, చివరికి కాంగ్రెస్ సర్వేలో కూడా టీఆర్‌ఎస్‌కు 102 నుంచి 106 సీట్లు వస్తాయనే తెలిసి వారికి ఏం తోచడం లేదన్నారు. రేవంత్‌రెడ్డి హైదరాబాద్‌లో పెద్ద బ్రోకరని.. బిల్డింగులు, వెంచర్ల వారికి ఫోన్లుచేసి అపోజిషన్ లీడరని డబ్బులు వసూలు చేస్తాడన్నారు. చంద్రబాబు తన్ని తరిమేస్తే కాంగ్రెస్‌లో చేరాడని చెప్పారు. బాసరలో సరస్వతి అమ్మవారి విగ్రహం, భద్రాచలంలో మంగళసూత్రం పోయిందని చెప్పడం సరి కాదనీ, అలా జరిగిందని నిరూపిస్తారా? అని సవాల్ విసిరారు. కాస్తా ఆలోచించి మాట్లాడాలని హితవు పలికారు.

జీర్ణించుకోలేకే: పోచారం

నిజామాబాద్ ప్రతినిధి, నమస్తే తెలంగాణ: కాంగ్రెస్ నాయకుల బస్సుయాత్ర తుస్సు యాత్ర అని, వారి యాత్రకు ప్రజల నుంచి స్పందన కరువైందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ఈ యాత్రకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మాత్రమే వస్తున్నారని, సామాన్య ప్రజలకు యాత్రపై గౌరవం, మర్యాద లేదన్నారు. నిజామాబాద్ ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సీఎం కేసీఆర్ మూడున్నర ఏండ్లలో అనేక పథకాలు, కార్యక్రమాలు అమలు చేస్తూ రాష్ట్రాన్ని ఎంతో అభివృద్ధి చేశారన్నారు. కానీ, 70 ఏళ్ల మీ పాలనలో ఏం చేశారని కాంగ్రెస్ నాయకులను పోచారం ప్రశ్నించారు. టీఆర్‌ఎస్ ప్రభుత్వం చేస్తున్న మంచి పనులను జీర్ణించుకోలేక పోతున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో టీఆర్‌ఎస్ 106 స్థానాల్లో గెలుపొంది అధికారాన్ని నిలుపుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు.

ఉనికి కోసమే: పట్నం

బషీరాబాద్: ఉనికి కోసమే కాంగ్రెస్ నాయకులు బస్సు యాత్ర నిర్వహిస్తున్నారని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి విమర్శించారు. బుధవారం వికారాబాద్ జిల్లా తాండూరు నియోజక వర్గంలోని బషీరాబాద్ మండలంలో రైతు సమన్వయ సమితుల సభ అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ప్రజల ఆశీర్వాదంతో సీఎం కేసీఆర్ సారథ్యంలో మరో 20 ఏండ్లు టీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలో కొనసాగుతుందని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్‌కు సరైన నాయకుడు, నాయకత్వం లేదని, ఆ పార్టీ ఇప్పుడు ఉనికిని కాపాడుకునేందుకు తాపత్రయ పడుతున్నదని చెప్పారు. టీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలకు ప్రజల నుంచి మంచి స్పందన వస్తున్నదని, దీంతో కాంగ్రెస్ పార్టీ నాయకులు మతి భ్రమించి తిరుగుతున్నారని ఎద్దేవా చేశారు.

నేడు మహిళా ఉద్యోగులకు ప్రత్యేక సెలవు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: అంతర్జాతీయ మహిళా దినోత్సం సందర్భంగా మహిళా ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం స్పెషల్ క్యాజువల్ లీవును ప్రకటించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి ఎస్కే జోషి బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. మహిళా ఉద్యోగులు రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన ఈ సదుపాయాన్ని వినియోగించుకోవచ్చునని ఆయన పేర్కొన్నారు.

ప్రత్యేక శాఖగా 'భూసేకరణ, పునరావాస' సంస్థ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: భూసేకరణ, పునరావాస సహాయ కల్పన సంస్థ (ల్యాండ్ అక్విజిషన్ రిహాబిలిటేషన్ అండ్ రీసెటిల్‌మెంట్ అథార్టీ) ఇకపై ప్రత్యేక శాఖాకార్యాలయంగా పనిచేస్తుంది. సంస్థ ప్రిసైడింగ్ ఆఫీసర్‌ను శాఖ అధిపతిగా ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు బుధవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి ఉత్తర్వులు జారీచేశారు.

అసెంబ్లీ సమావేశాలకు ఏర్పాట్లు

- నేడు అధికారులతో చైర్మన్, స్పీకర్ భేటీ
- 12 నుంచి బడ్జెట్ సమావేశాలు.. తొలి రోజు గవర్నర్ ప్రసంగం
- అదేరోజు రాజ్యసభ నామినేషన్ల తుది గడువు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఈ నెల 12 నుంచి రాష్ట్ర శాసనసభ బడ్జెట్ సమావేశాలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో ఆయా శాఖలపరంగా తీసుకోవాల్సిన చర్యలు, భద్రతాఏర్పాట్లపై శాసన మండలి చైర్మన్ కనకమామిడి స్వామిగౌడ్, శాసనభ స్పీకర్ సిరికొండ మధుసుదనాచారి గురువారం అధికారులతో చర్చించనున్నారు. ఉదయం 10 గంటలకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి, ఆయా శాఖల ముఖ్య కార్యదర్శులు, ఇతర ఉన్నతాధికారులతో స్పీకర్ చాంబర్‌లో చైర్మన్, స్పీకర్ సమావేశం కానున్నారు. బడ్జెట్ సమావేశాల్లో ఆయా ప్రభుత్వ శాఖలపరంగా తీసుకోవాల్సిన చర్యలు, సభ్యులు అడిగే ప్రశ్నలకు నిర్ణీత కాలవ్యవధిలో శాఖలవైపు నుంచి సమాధానాలు అందజేయడం వంటి అంశాలపై చర్చించనున్నారు. ఆ తర్వాత ఉదయం 11.15 గంటల ప్రాంతంలో రాష్ట్ర డీజీపీ, పోలీసు శాఖ ఉన్నతాధికారులు, అసెంబ్లీ అధికారులతో ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటుచేశారు. బడ్జెట్ సమావేశాల సందర్భంగా అసెంబ్లీ ప్రాంగణం, పరిసర ప్రాంతాల్లో చేపట్టాల్సిన భద్రతా ఏర్పాట్లపై చైర్మన్, స్పీకర్ చర్చించి, తగు సూచనలు ఇవ్వనున్నారు. ఈ నెల 12న బడ్జెట్ సమావేశాల ప్రారంభాన్ని పురస్కరించుకుని రాష్ట్ర గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ ఉభయసభల సభ్యులనుద్దేశించి ప్రసంగించనుండటం, అదే రోజు తెలంగాణ నుంచి మూడు రాజ్యసభ స్థానాలకు నామినేషన్ల దాఖలుకు చివరి రోజు కావడంతో అసెంబ్లీ వద్ద తీసుకోవాల్సిన భద్రతాచర్యలపై వీరు చర్చించనున్నట్లు తెలిసింది.

మూడోరోజు కూడా దాఖలుకాని నామినేషన్లు

రాష్ట్రం నుంచి మూడు రాజ్యసభ స్థానాలకు జరుగుతున్న ఎన్నికలకు నోటిఫికేషన్ వెలువడిన మూడో రైజన బుధవారం కూడా ఒక్క నామినేషన్ దాఖలుకాలేదు. నామినేషన్ల దాఖలుకు ఈ నెల 12 చివరి తేది. ఈ మూడు స్థానాలకు అధికార టీఆర్‌ఎస్ పోటీ చేయనున్నది. ఆ పార్టీ అభ్యర్థులు చివరిరోజు నామినేషన్లు దాఖలుచేస్తారని తెలుస్తున్నది.



తెలంగాణలో రిజర్వేషన్ కోటాను పెంచాలని డిమాండ్‌చేస్తూ బుధవారం పార్లమెంట్ ఆవరణలో ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న ఎంపీలు బీబీ పాటిల్, కవిత, అసదుద్దీన్ ఒవైసీ, విశ్వేశ్వర్‌రెడ్డి, మల్లారెడ్డి



బుధవారం పార్లమెంట్ ప్రాంగణంలో మీడియాతో మాట్లాడుతున్న టీఆర్‌ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత కే కేశవరావు, లోక్‌సభా పక్షనేత ఏపీ జితేందర్‌రెడ్డి. చిత్రంలో ఎంపీలు కవిత, విశ్వేశ్వర్‌రెడ్డి, బూర నర్సయ్యగౌడ్, బీబీ పాటిల్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొత్త ప్రభాకర్‌రెడ్డి, మల్లారెడ్డి. సీతారాంనాయక్, జీ నగేశ్

ముహూర్తం



సూర్యోదయం: 6.33 గంటలకు



సూర్యాస్తమయం: 6.21 గంటలకు

హేవళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, ఫాల్గుణమాసం, కృష్ణపక్షం సప్తమి రా.తె. 3.47వరకు, తదుపరి అష్టమి, నక్షత్రం: అనురాధ, అమృతఘడియలు: మధ్యాహ్నం 1.25 నుంచి 3.01 వరకు, రాహుకాలం: మధ్యాహ్నం 1.55 నుంచి 3.24 వరకు, దుర్ముహూర్తం: మధ్యాహ్నం 3.12 నుంచి సాయంత్రం 4.46 వరకు, వర్జ్యం: తె. 2.57 నుంచి 4.33 వరకు.

లోకం పోకడ



ఈ రోజు ఒత్తిడేం చేయను, నీకిష్టమైనవే వండిపెట్టు. అన్నట్టు.. హ్యాపీ ఉమెన్స్ డే!

కోటా పోరు ఉధృతం

మొదటిపేజీ తరువాయి...

తొలుత మధ్యాహ్నం రెండు గంటలవరకు వాయిదావేశారు. అనంతరం కూడా సభ సద్దుమణగకపోవడంతో సభాధ్యక్ష స్థానంలో ఉన్న డిప్యూటీ చైర్మన్ కురియన్ మరుసటిరోజుకు సభను వాయిదావేశారు. లోక్‌సభలో నెలకొన్న ప్రతిష్టంభనకు తెరదించేందుకు స్పీకర్ సుమిత్రా మహాజన్ చొరవచూపారు. ఆయా పార్టీల సభ్యులతో చర్చించారు. అయితే, ఈ సమావేశం కూడా ఫలితాలనిచ్చేట్టు కనిపించలేదు. తొలుత సభ ప్రారంభానికి ముందు పార్లమెంటు ప్రవేశద్వారం మెట్లపై టీఆర్‌ఎస్ పార్లమెంటరీ పార్టీ నాయకుడు డాక్టర్ కే కేశవరావు, లోక్‌సభలో టీఆర్‌ఎస్ పార్టీ నేత జితేందర్‌రెడ్డి, ఎంపీలు కల్వకుంట్ల కవిత, సీతారాంనాయక్, బూర నర్సయ్యగౌడ్, జీ నగేశ్, బీ మల్లారెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, బీబీ పాటిల్ బైఠాయించి ప్లకార్డులతో నిరసన తెలిపారు. వీరికి మజ్లిస్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ మద్దతు పలికారు. అనంతరం తమ డిమాండ్లను వివరించేందుకు స్పీకర్ సుమిత్రా మహాజన్‌ను కలిశారు.

నాలుగేండ్లు ఓపిక పట్టాం: జితేందర్‌రెడ్డి

స్పీకర్‌తో భేటీ అనంతరం పార్లమెంట్ వద్ద విలేకరులతో మాట్లాడిన టీఆర్‌ఎస్ లోక్‌సభాపక్ష నేత జితేందర్‌రెడ్డి.. గత నాలుగేండ్లుగా రాష్ట్రానికి సంబంధించిన వివిధ సమస్యలపై టీఆర్‌ఎస్ ఎంపీలు చాలా ఓపికగా వ్యవహరించారని చెప్పారు. ఆయా అంశాలు, సమస్యలపై ముఖ్యమంత్రి కేసీఆర్, రాష్ట్ర మంత్రులు పలుమార్లు ఢిల్లీకి వచ్చి ప్రధాని నరేంద్రమోదీకి, కేంద్ర మంత్రులకు విన్నవించుకున్నారని, వాటిని పరిష్కరించాలని కోరారని గుర్తుచేశారు. ముస్లింలు, ఎస్టీల రిజర్వేషన్లకు సంబంధించిన అంశంతోపాటు మరికొన్ని విషయాలు టీఆర్‌ఎస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఉన్నాయన్నారు. రిజర్వేషన్ల అంశంపై గతేడాది అసెంబ్లీ ఏకగ్రీవంగా తీర్మానం చేసి కేంద్రానికి పంపించిందని, దానిపై ఇప్పటివరకు కేంద్రం తన వైఖరిని స్పష్టం చేయలేదని జితేందర్‌రెడ్డి విమర్శించారు. రేపు ఎన్నికలు రాబోతున్నాయని, మ్యానిఫెస్టోలోని అంశాలను అమలుచేయలేకపోతే తాము ప్రజలకేం సమాధానం చెప్పాలని నిలదీశారు. తమ డిమాండ్లను పరిష్కరించేంత వరకు పార్లమెంట్‌లో పట్టుబడుతామని ఆయన స్పష్టంచేశారు. ఇదే విషయాన్ని లోక్‌సభ స్పీకర్‌కు తెలియజేశామని, అయినా స్పీకర్ వైపు నుంచి, కేంద్రం నుంచి ఎలాంటి హామీ రాలేదని చెప్పారు. ఈ పార్లమెంట్‌లోనే పోరాడి కేసీఆర్ తెలంగాణ రాష్ట్రం తీసుకొచ్చారని, తమ డిమాండ్లను కూడా పార్లమెంట్‌లో పోరాడి సాధించుకుంటామని జితేందర్‌రెడ్డి స్పష్టంచేశారు. విభజన చట్టంలో తెలుగు రాష్ట్రాల్లో పారిశ్రామికరంగానికి అనేక ప్రోత్సాహకాలు ఇచ్చారని, కానీ, వాటిని అమలు చేయక పోవడంవల్ల పరిశ్రమలు చెన్నైకి తరలిపోతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తంచేశారు.

11 నెలలు కావస్తున్నా తేల్చకపోతే ఎలా?: అసద్

రిజర్వేషన్లకు సంబంధించి తెలంగాణ అసెంబ్లీ గత ఏడాది ఏప్రిల్ 16న ప్రత్యేక సమావేశం ద్వారా ఏకగ్రీవంగా తీర్మానం చేసి కేంద్రానికి పంపించిందని, 11 నెలలు కావస్తున్నా ఇప్పటివరకు దీని విషయంలో కేంద్రం నిర్ణయం తీసుకోకుండా, ఎటూ తేల్చకుండా తీర్మానాన్ని అట్టి పెట్టుకున్నదని మజ్లిస్ పార్టీ అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ విమర్శించారు. పార్లమెంట్ వద్ద ఆయన తనను కలిసిన మీడియాతో మాట్లాడుతూ అసెంబ్లీ చేసిన రిజర్వేషన్ల తీర్మానాన్ని దేశాధ్యక్షుడి వద్దకు పంపించారని, దీన్ని రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్లో చేర్చేందుకు పార్లమెంట్‌లో నిర్ణయం తీసుకోవాల్సి ఉండగా ప్రధాని ఇప్పటివరకు ఏమీ చేయలేదని అన్నారు. సీఎం కేసీఆర్ ఢిల్లీకి వచ్చినప్పుడల్లా రిజర్వేషన్ల అంశాన్ని ప్రధాని, కేంద్రం దృష్టికి తీసుకెళ్ళారని, అయినా కేంద్రం స్పందించకపోతే ఎలాగని ప్రశ్నించారు. ఈ తీర్మానంపై ఏదో ఒకటి తేల్చకుండా, కేంద్ర వైఖరిని స్పష్టం చేయకుండా నాన్చితే ఎలా? అని మండిపడ్డారు. తమిళనాడులో 69% రిజర్వేషన్లు గత 20 ఏండ్లుగా అమలవుతున్నాయని అసదుద్దీన్ గుర్తుచేశారు. మహారాష్ట్ర, రాజస్థాన్, హర్యానా, జార్ఖండ్, తెలంగాణ రాష్ట్రాలు రిజర్వేషన్లను 50 శాతం నుంచి పెంచాలని డిమాండ్ చేస్తున్నాయని, ఏపీలో కాపులకు రిజర్వేషన్ల డిమాండ్ వస్తున్నదని ఆయన తెలిపారు. తెలంగాణ తీర్మానంపై ఆర్టికల్ 16(4)ను సవరించి, రిజర్వేషన్ల కోటాను పెంచాల్సి ఉండగా, 11 నెలలుగా కేంద్రం జాప్యం చేస్తున్నదని ఆయన ధ్వజమెత్తారు.



మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి

నిజామాబాద్ ఎంపీ కల్వకుంట్ల కవిత



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: మహిళలు అన్నిరంగాల్లో రాణించాలని, అందివచ్చిన అవకాశాలు ఉపయోగించుకొని ముందడుగువేసి విజయం సాధించాలని నిజామాబాద్ ఎంపీ కల్వకుంట్ల కవిత ఆకాంక్షించారు. మహిళాదినోత్సవాన్ని పురస్కరించుకొని ఆమె మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు. కేవలం మహిళా దినోత్సవం నాడే కార్యక్రమాలు నిర్వహించడం కాదని, సంవత్సరమంతా కార్యక్రమాలు కొనసాగాలని అన్నారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్ బిల్లును పార్లమెంటులో ఎప్పుడు ప్రవేశపెట్టినా తమ మద్దతు ఉంటుందని చెప్పారు. కేంద్రంలోని బీజేపీ సర్కారు ఈ విషయం ఆలోచించాలని దేశవ్యాప్తంగా మహిళలందరి తరపున ప్రధాని మోదీకి ఎంపీ కవిత విజ్ఞప్తి చేశారు. మహిళల భద్రత, అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని చెప్పారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ ఆడబిడ్డల అభివృద్ధి, సంక్షేమం కోసం అనేక పథకాలు అమలు చేస్తున్నారని తెలిపారు.

షీటీంలతో నేరాల తగ్గుముఖం

తెలంగాణలో షీటీంలు ఏర్పాటుచేశాక నేరాల సంఖ్య తగ్గిందని ఎంపీ కవిత అన్నారు. నేరం జరుగకముందే నిరోధించగలిగితే నేరాలు తగ్గుతాయని, తెలంగాణలో చేసి చూపించామని కవిత వివరించారు. ఎన్నో అవరోధాలను దాటుకుని మహిళలు ఈ స్థితికి చేరారని తెలిపారు. మహిళలు వంటింటికే పరిమితమనే ఆలోచనా ధోరణిని మార్చగలిగామని చెప్పారు.

66 ఉర్దూ అధికారుల పోస్టుల భర్తీకి గ్రీన్‌సిగ్నల్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో 66 ఉర్దూ అధికారుల పోస్టుల (ఉర్దూ ఆఫీసర్ల) భర్తీకి తెలంగాణ ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. మరో 10 రోజుల్లో నోటిఫికేషన్ వెలువడనుంది. రెండు క్యాటగిరీల్లో ఉర్దూ అధికారి గ్రేడ్-1లో ఆరు పోస్టులు, ఉర్దూ అధికారి గ్రేడ్-2లో 60 పోస్టులను తెలంగాణ రాష్ట్ర ఉర్దూ అకాడమీ ద్వారా భర్తీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. గ్రేడ్-1 పోస్టులకు దరఖాస్తు చేసుకొనే అభ్యర్థులు 10వ తరగతిలో తెలుగు సెకండ్ లాంగ్వేజ్ సబ్జెక్ట్‌గా, డిగ్రీలో ఉర్దూ ఒక సబ్జెక్ట్‌గా చదివి.. ఏదైనా మీడియంలో పీజీ పూర్తి చేసి ఉండాలి. గ్రేడ్-2 పోస్టుల కోసం దరఖాస్తు చేసేవారు 10వ తరగతిలో సెకండ్ లాంగ్వేజ్‌గా తెలుగు సబ్జెక్ట్, డిగ్రీలో ఉర్దూ సబ్జెక్ట్‌తో ఏదైనా మీడియంలో ఉత్తీర్ణులైనవారు అర్హులు. గ్రేడ్-1 పోస్టుల ఎంపిక రాత పరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా, గ్రేడ్-2 పోస్టుల ఎంపిక రాత పరీక్ష ద్వారా జరుగనుంది.

ఉర్దూలోనూ సైన్‌బోర్డులు పెట్టాలని అధికార భాషా సంఘానికి లేఖ

రాష్ట్ర ప్రభుత్వం ఉర్దూను ద్వితీయభాషగా ప్రకటించడంతో అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో సైన్‌బోర్డులు ఉర్దూలో కూడా ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర అధికార భాషా సంఘానికి మైనారిటీ సంక్షేమశాఖ లేఖ రాసింది. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు (మైనారిటీ సంక్షేమం) ఏకే ఖాన్ బుధవారం హజ్‌హౌస్‌లోని ఉర్దూ అకాడమీ కార్యాలయంలో అకాడమీ డైరెక్టర్, కార్యదర్శి ప్రొఫెసర్ ఎస్‌ఏ షకూర్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు. తెలంగాణ ఉర్దూ అకాడమీ ద్వారా త్వరలోనే ఉర్దూ- ఇంగ్లిష్, ఇంగ్లిష్- ఉర్దూ డిక్షనరీ (నిఘంటువు)ని తీసుకురానున్నట్టు చెప్పారు.

జపాన్ చిన్న పరిశ్రమలకు పార్కు

- హైదరాబాద్ అత్యంత సురక్షితమైన నగరం
- రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి కే తారక రామారావు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

జపాన్ నుంచి హైదరాబాద్ పెట్టుబడులు పెట్టే సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమలకు ప్రత్యేక పారిశ్రామిక పార్కు ఏర్పాటు చేయనున్నట్టు రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు ప్రకటించారు. జపాన్‌కు దేశానికి చెందిన అనేక కంపెనీలు ఇప్పటికే రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాయని, ఆ దేశానికి చెందిన మరో ప్రముఖ కంపెనీ పెట్టుబడులు పెట్టడానికి ముందుకొచ్చిందని వెల్లడించారు. ఈ నెల 12, 13 తేదీల్లో కంపెనీ తన నిర్ణయాన్ని హైదరాబాద్‌లో అధికారికంగా ప్రకటిస్తుందని చెప్పారు. బుధవారం మాదాపూర్‌లో జపాన్ ఎక్స్‌టర్నల్ ట్రేడ్ ఆర్గనైజేషన్ (జెట్రో), భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) ఆధ్వర్యంలో ఇండో-జపాన్ వ్యాపార భాగస్వామ్య సదస్సు నిర్వహించారు. రెండుదేశాల మధ్య సంబంధాలు, జపాన్‌లో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను ఇందులో చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ జపాన్ కంపెనీల్లో పనిచేయడానికి ప్రపంచస్థాయి ప్రమాణాలు కలిగిన యువత అవసరం ఉంటుందని పేర్కొన్నారు. ఇక్కడి యువత, విద్యార్థులను తీర్చిదిద్దడానికి నైపుణ్య శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. హైదరాబాద్ నగరం భారతదేశంలో నాణ్యమైన జీవన విధానంలో మొదటిస్థానంలో నిలిచిందని మంత్రి కేటీఆర్ చెప్పారు. అందుకే ప్రపంచంలోని ఐదు ప్రముఖ ఐటీ కంపెనీలు.. గూగుల్, మైక్రోసాఫ్ట్, ఆమెజాన్, ఫేస్‌బుక్, యాపిల్.. అమెరికా తరువాత అతి పెద్ద కార్యాలయాలను ఇక్కడ స్థాపించాయని చెప్పారు. జెట్రో కార్యనిర్వాహక ఉపాధ్యక్షుడు షిగేకి మిదా మాట్లాడుతూ భారత్ -జపాన్‌ల మధ్య సంబంధాలు మెరుగ్గా ఉన్నాయని తెలిపారు. జపాన్‌కు చెందిన 1368 కంపెనీలు భారత్‌లోని 4,838 ప్రాంతాల్లో పెట్టుబడులు పెట్టాయన్నారు. సీఐఐ రాష్ట్ర అధ్యక్షుడు రాజన్న మాట్లాడుతూ ద్వితీయ శ్రేణి నగరాలకు వేగవంతమైన రవాణా వ్యవస్థను ఏర్పాటు చేయడానికి జపాన్ సహకారం అవసరమని పేర్కొన్నారు. వరంగల్ లాంటి ద్వితీయశ్రేణి నగరానికి హైదరాబాద్ నుంచి రోజువారీ రాకపోకలు సాగడానికి వీలుగా బుల్లెట్ ట్రైన్ అవసరమని గతంలోనే నివేదిక ఇచ్చామని ఆయన గుర్తుచేశారు. మ్యానుఫ్యాక్చరింగ్ విభాగంలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటుచేయాలని మంత్రి కేటీఆర్ కోరారని, తప్పకుండా ఏర్పాటుచేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సన్ ఫార్మా బోర్డు మెంబర్ కీర్తి గనోర్కర్ పాల్గొన్నారు.



బుధవారం మాదాపూర్‌లో జెట్రో, సీఐఐ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఇండో-జపాన్ వ్యాపార భాగస్వామ్య సదస్సులో మాట్లాడుతున్న మంత్రి కే తారక రామారావు

నామాపల్లిలో బీడీ కార్మికులకు ఔషధశాల

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణలోని బీడీ కార్మికులకు వైద్య అవసరాలను దృష్టిలో ఉంచుకొని రాజన్న సిరిసిల్ల జిల్లా నామాపల్లిలో తాత్కాలిక ప్రాతిపదికన ఔషధశాలను నిర్వహిస్తున్నట్టు కేంద్ర కార్మిక, ఉపాధికల్పనశాఖ సహాయమంత్రి సంతోష్ గంగ్వార్ చెప్పారు. రాజ్యసభలో కేవీపీ రాంచందర్‌రావు బుధవారం అడిగిన ప్రశ్నకు కేంద్రమంత్రి ఈ మేరకు సమాధానమిచ్చారు. నామాపల్లిలో ఉన్న ఔషధశాలలో ప్రస్తుతం రెగ్యులర్ వైద్యుడు, ఫార్మాసిస్టు, ఒకనర్సు, నలుగురు వైద్య సహాయకులు నియమితులయ్యారని, రోజుకు 40 మంది వరకు రోగులకు సేవలందిస్తున్నదని తెలిపారు. సిరిసిల్లలో తలపెట్టిన దవాఖాన నిర్మాణానికి తెలంగాణ ప్రభుత్వం 11.2 ఎకరాలు కేటాయించిందని, రూ.46.28లక్షలతో దానిచుట్టూ ప్రహరీని నిర్మించనున్నట్టు చెప్పారు.

ఫార్మా సమస్యల పరిష్కారానికి పీఆర్ సెల్ ఏర్పాటు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఫార్మారంగంలో సమస్యల పరిష్కారానికి న్యూఢిల్లీలోని ఎఫ్‌డీఏ భవన్‌లో కేంద్రం పబ్లిక్ రిలేషన్స్ విభాగాన్ని ఏర్పాటుచేసింది. ఫార్మారంగంలో స్టార్టప్‌ల నియంత్రణ, ఆవిష్కరణల మధ్య నెలకొనే దూరాన్ని పరిష్కరించాల్సిన అవసరం ఉందని ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన బయో ఏషియా సదస్సులో కంట్రోల్ జనరల్ ఆఫ్ ఇండియా (డీసీజీఐ) డాక్టర్ ఈశ్వర్‌రెడ్డి పేర్కొన్న విషయం తెలిసిందే. ఆయన సూచనల మేరకు పీఆర్ విభాగాన్ని ఏర్పాటుచేస్తూ కేంద్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. అసిస్టెంట్ డ్రగ్స్ కంట్రోలర్ సునీల్ కుల్‌శ్రేష్ఠ ఈ విభాగానికి నేతృత్వం వహిస్తారు. ఫార్మారంగంలో వివిధ సంస్థలు, స్టార్టప్‌లు ఎదుర్కొనే సమస్యలను పరిష్కరించే దిశగా ఈ విభాగం పనిచేస్తుంది.

నేడు ఏపీలో బీజేపీ మంత్రుల రాజీనామా!

హైదరాబాద్ / అమరావతి, నమస్తే తెలంగాణ: ఏపీ క్యాబినెట్‌లో ఉన్న బీజేపీ మంత్రులు గురువారం రాజీనామా చేయనున్నట్టు తెలిసింది. రాజీనామాలకు సిద్ధం కావాలని పార్టీ హైకమాండ్ నుంచి బీజేపీ మంత్రులకు ఆదేశాలు వచ్చినట్టు పార్టీవర్గాల సమాచారం. అంతకుముందు బుధవారం ఏపీ అసెంబ్లీ లాబీలో ఇదేవిషయమై బీజేఎల్పీలో చర్చ జరిగింది. రాష్ట్రాభివృద్ధి విషయంలో టీడీపీ తమను నిందిస్తే చూస్తూ ఊరుకోబోమని, ఆ పార్టీకి దీటైన జవాబు ఇస్తామని బీజేపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తేల్చిచెప్పారు. భేటీలో బీజేపీ మంత్రులు కామినేని శ్రీనివాసరావు, మాణిక్యాలరావు, ఎమ్మెల్యేలు విష్ణుకుమార్‌రాజు, ఆకుల సత్యనారాయణ, ఎమ్మెల్సీలు సోము వీర్రాజు, మాధవ్ పాల్గొన్నారు. ఏపీ బీజేపీ నేతలతో పార్టీ అధ్యక్షుడు అమిత్‌షా గురువారం ఢిల్లీలో సమావేశం కానున్నారు. ఈ భేటీలో టీడీపీతో పొత్తు, భవిష్యత్ కార్యాచరణపై ఒక స్పష్టత వచ్చే అవకాశం ఉన్నది.


రాష్ట్ర ఎన్నికల అధికారి రజత్‌కుమార్‌కు బుధవారం పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలుపుతున్న రాష్ట్ర అసెంబ్లీ కార్యదర్శి నరసింహాచార్యులు

పారదర్శకంగా ఎన్నికల నిర్వహణ

రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రధానాధికారిగా రజత్‌కుమార్ బాధ్యతల స్వీకరణ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఎలాంటి రాజకీయ ఒత్తిడులు తలొగ్గకుండా ఎన్నికలను పారదర్శకంగా నిర్వహిస్తామని రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రధానాధికారి రజత్‌కుమార్ చెప్పారు. ప్రజలు నిర్భయంగా తమ ఓటుహక్కు వినియోగించుకోవాలని సూచించారు. తెలంగాణ ఎన్నికల సంఘం తొలి ప్రధానాధికారిగా బాధ్యతలు చేపట్టిన రజత్‌కుమార్ బుధవారం సచివాలయంలో మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో అన్ని ఎన్నికలను నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు పటిష్ఠచర్యలు తీసుకుంటామని తెలిపారు. అందరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని ఎన్నికలను పారదర్శకంగా నిర్వహిస్తామన్నారు. ఈ నెల 23న జరిగే రాజ్యసభ ఎన్నికలకు నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతున్నదని రజత్‌కుమార్ తెలిపారు.

టీఎస్‌ఈసీవోను కలిసిన అసెంబ్లీ కార్యదర్శి

రాష్ట్ర ఎన్నికల అధికారి(టీఎస్‌సీఈవో)గా మంగళవారం బాధ్యతలు స్వీకరించిన రజత్‌కుమార్‌ను బుధవారం రాష్ట్ర అసెంబ్లీ కార్యదర్శి డాక్టర్ వేదాంతం నరసింహాచార్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ రాజ్యసభ ఎన్నికలకు నరసింహాచార్యులు రిటర్నింగ్ అధికారిగా వ్యవహరిస్తున్నారు. రాజ్యసభ ఎన్నికల సందర్భంగా అసెంబ్లీ అధికారులు చేసిన ఏర్పాట్లు, తీసుకున్న చర్యలను ఈ సందర్భంగా ఆయన రజత్‌కుమార్‌కు వివరించారు.

115 చెరువుల పునరుద్ధరణకు

అనుమతి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: మిషన్ కాకతీయ నాలుగో దశ కింద పలు జిల్లాల్లోని 115 చెరువుల పునరుద్ధరణ పనులకు పాలనా అనుమతినిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. వనపర్తి, రంగారెడ్డి, వికారాబాద్, నల్లగొండ, సిద్దిపేట, యాదాద్రి-భువనగిరి జిల్లాల్లోని 115 చెరువుల కింద 4721.88 ఎకరాల ఆయకట్టు ఉంది. వీటి పునరుద్ధరణకుగాను సుమారు రూ.20.11 కోట్ల విలువైన ప్రతిపాదనలకు ప్రభుత్వం తాజాగా అనుమతిచ్చింది.

కృష్ణాబోర్డు ఎస్‌ఈగా మహేందర్

తెలంగాణ నుంచి ఇద్దరు ఇంజినీర్ల డిప్యుటేషన్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్ (సీడీవో) కార్యాలయంలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న సీ మహేందర్‌ను కృష్ణా నదీ యాజమాన్య బోర్డు సూపరింటెండెంట్ ఇంజినీర్‌గా బదిలీచేస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. వాస్తవంగా రెండు తెలుగు రాష్ట్రాల నుంచి వివిధ హోదాల్లో ఉన్న ఇంజినీర్లు డిప్యుటేషన్‌పై బోర్డులో పనిచేస్తారు. ఈ క్రమంలో తెలంగాణ నుంచి తాజాగా ఇద్దరు ఇంజినీర్లను ప్రభుత్వం బోర్డుకు పంపింది. సీ మహేందర్‌ను కృష్ణా బోర్డు ఎస్‌ఈగా (ఇంచార్జి), నాగార్జునసాగర్ ప్రాజెక్టు పరిధిలోని ఏఎమ్మార్పీలో డీఈఈగా పనిచేస్తున్న సీ అశోక్‌కుమార్‌ను ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఇంచార్జి)గా బోర్డుకు బదిలీచేసింది.

నేటినుంచి వింగ్స్‌ఇండియా-2018 సదస్సు

- బేగంపేటలో అంతర్జాతీయ వైమానిక ప్రదర్శన
- 12కుపైగా దేశాల నుంచి ప్రతినిధులు హాజరు
- సందర్శనకు అందుబాటులో 15 రకాల విమానాలు



అంతర్జాతీయ వైమానిక ప్రదర్శన కోసం బేగంపేట విమానాశ్రయానికి వచ్చిన విమానాలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: హైదరాబాద్ మరో అంతర్జాతీయ సదస్సుకు వేదిక కానుంది. నాలుగు రోజులపాటు జరిగే అంతర్జాతీయ వైమానిక సదస్సు, ప్రదర్శనను గురువారం ఉదయం 10 గంటలకు బేగంపేట విమానాశ్రయంలో ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు, కేంద్ర పౌరవిమానయానశాఖ మంత్రి పీ అశోకగజపతిరాజు, రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి కే తారకరామారావు ప్రారంభించనున్నారు. వింగ్స్ ఇండియా-2018 పేరుతో ఈ నెల 8 నుంచి 11వ తేదీ వరకు కార్యక్రమా లు జరుగుతాయి. ఈ కార్యక్రమానికి 'ఇండియా-గ్లోబల్ ఏవియేషన్ హబ్'ను ఇతివృత్తంగా ఎంపికచేశారు. అమెరికా, జపాన్, జర్మనీ, రష్యా, సింగపూర్, ఫ్రాన్స్, మలేషియా, హాంగ్‌కాంగ్, ఇటలీ, ఇరాన్ , బ్రిటన్ దేశాల నుంచి ప్రతినిధులు హాజరయ్యే ఈ సదస్సును కేంద్ర పౌర విమానయాన శాఖ, ఎయిర్ పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా, ఫిక్కీలు సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. మొదటి రెండురోజులు విమానయానరంగంతోపాటు పర్యాటకం, నైపుణ్య శిక్షణ, కార్గో సర్వీసులు, లాజిస్టిక్స్‌రంగాలపై ప్రతినిధులు చర్చించనున్నారు. వైమానికరంగంలోని ప్రముఖసంస్థలు తమ ఉత్పత్తులతో 125 ప్రదర్శనశాలలను ఏర్పాటు చేశాయి. ఏటీఆర్, హోండా, ట్రూజెట్, గల్ఫ్ స్ట్రీమ్, బోయింగ్, దసాల్ట్, క్లబ్ వన్ ఎయిర్, ఏరోటెక్, జూమ్ ఎయిర్, ఎయిరిండియా, ఎన్‌ఏఎల్, ఎంబరర్ తదితర 15 రకాల ఎయిర్‌క్రాఫ్ట్‌లకు ప్రదర్శనకు ఉంచుతారు. సదస్సులో ప్రాంతీయ కనెక్టవిటీపై మరింత లోతుగా చర్చించే అవకాశముంది.


తెలంగాణలో సివిల్ సప్లై ఐటీ ప్రాజెక్టుల అమలుతీరును ఛత్తీస్‌గఢ్ అధికారుల బృందానికి వివరిస్తున్న సీవీ ఆనంద్

ఆన్‌లైన్‌లో ధాన్యం కొనుగోళ్లు భేష్

- ఛత్తీస్‌గఢ్ సివిల్ సప్లై అధికారుల బృందం కితాబు
- పౌరసరఫరాలశాఖలోని ఐటీ ప్రాజెక్టులను పరిశీలించిన ఆ రాష్ట్ర అధికారులు
- ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో వీటి అమలుకు కసరత్తు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయడంతోపాటు వారికి డబ్బులు చెల్లించే వరకు మధ్యవర్తుల ప్రమేయానికి ఆస్కారం లేకుండా తెలంగాణలో ఆన్‌లైన్ విధానం అమలవుతున్న తీరు అద్భుతంగా ఉన్నదని ఛత్తీస్‌గఢ్ పౌరసరఫరాలశాఖ అధికారులు కొనియాడారు. 'ఆన్‌లైన్ ప్రొక్యూర్‌మెంట్ మేనేజ్‌మెంట్ సిస్టం' సాఫ్ట్‌వేర్‌ను తయారుచేసి దాని ద్వారా కొనుగోళ్లు జరుపడంతో రైతులకు కనీస మద్దతు ధర లభించడమే కాకుండా మూడు, నాలుగు రోజుల్లోనే నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో ధాన్యం డబ్బులు జమ కావడం మంచి విధానమని పేర్కొన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థంగా వినియోగించడం ద్వారా అక్రమాలకు అడ్డుకట్ట వేస్తూ పేద ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో తెలంగాణ అన్ని రాష్ట్రాల కంటే ముందు వరుసలో ఉన్నదని ఛత్తీస్‌గఢ్ బృందం ప్రశంసించింది. తెలంగాణ పౌరసరఫరాల శాఖలో చేపట్టిన వినూత్న చర్యలను, సంస్కరణలను ఛత్తీస్‌గఢ్‌లో అమలుచేసేందుకు ఆ రాష్ట్రానికి చెందిన ఉన్నతాధికారుల బృందం మంగళ, బుధవారాల్లో రాష్ట్రంలో పర్యటించి అధ్యయనం చేసింది. ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర పౌరసరఫరాలశాఖ ప్రత్యేక కార్యదర్శి మనోజ్‌కుమార్ సోనీ, అడిషనల్ డైరెక్టర్ రాజీవ్ జైస్వాల్, ఎన్వోసీ టెక్నికల్ డైరెక్టర్ సోమశేఖర్, సీఎంవో గుడ్‌గవర్నెన్స్ అధికారి అశ్‌తోష్ మిశ్రాతోపాటు ఇతర అధికారుల బృందం రాష్ట్రంలోని పౌరసరఫరాలశాఖకు చెందిన వివిధ ప్రాజెక్టులను పరిశీలించింది. అనంతరం పౌరసరఫరాలశాఖ కమిషనర్ సీవీ ఆనంద్‌తో సమావేశమైంది.


బుధవారం చర్లపల్లిలోని అహ్మద్‌గూడలో డబుల్ బెడ్‌రూం కాలనీలను పరిశీలిస్తున్న కేంద్రప్రభుత్వ అధికారులు

డబుల్ కాలనీలు అద్భుతం!

- కేంద్రబృందం ప్రశంస..
- సౌకర్యాలను పరిశీలించిన అధికారులు

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న డబుల్ బెడ్‌రూం ఇండ్ల కాలనీలు అద్భుతంగా ఉన్నట్టు కేంద్ర ప్రభుత్వ అధికారుల బృందం సంతృప్తి వ్యక్తంచేసింది. ఇండ్లలో సమకూర్చుతున్న సౌకర్యాలను ఆసక్తిగా పరిశీలించిన బృందం సభ్యులు.. లబ్ధిదారులు, కాంట్రాక్టర్లు, రాష్ట్ర అధికారులతో మాట్లాడి వివరాలు సేకరించారు. పథకం అమలుపై ఈ బృందం కేంద్రానికి నివేదిక సమర్పిస్తుంది. దేశవ్యాప్తంగా గృహనిర్మాణంపై అధ్యయనం చేస్తున్న కేంద్రం వాటి నివేదికల ఆధారంగా ఆయా నగరాలకు ర్యాంకులను కేటాయించనున్నది. ఇటీవలే జీహెచ్‌ఎంసీ కమిషనర్ బీ జనార్దన్‌రెడ్డి కేంద్ర పట్టణాభివృద్ధి, గృహనిర్మాణశాఖ సమావేశానికి హాజరై డబుల్ బెడ్‌రూం ఇండ్ల కాలనీల నిర్మాణాల వివరాలను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ నేపథ్యంలో బుధవారం కేంద్రబృందం సభ్యులు నాచారంలోని సింగంచెరువు తండా, చర్లపల్లి వద్దగల అహ్మద్‌గూడ, రాంపల్లి తదితర ప్రాంతాల్లో డబుల్ బెడ్‌రూం కాలనీలను సందర్శించారు. ఇండ్ల నిర్మాణం చూసి ఆశ్చర్యపోయారు. అద్భుతమైన నిర్మాణాలు చేస్తున్నారని కితాబిచ్చారు. పక్కన తాత్కాలిక గుడిసెల్లో ఉంటున్న లబ్ధిదారులతో ముచ్చటించారు. అక్కడి మహిళలతో కలిసి ఆడిపాడారు. బిజయ్ సెల్వరాజ్, సొనాలీ ఘోష్ తదితర ఐఎఫ్‌ఎస్ అధికారులు, పలువురు ఐఏఎస్ అధికారులు ఈ కేంద్ర బృందంలో ఉండగా, వారివెంట జీహెచ్‌ఎంసీ కమిషనర్ బీ జనార్దన్‌రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

హోదా లేదు.. ప్యాకేజీనే

- ప్రత్యేక హోదాతో సమానంగా ఏపీకి నిధులు
- నాబార్డ్ ద్వారా.. 90:10 నిష్పత్తిలో అందజేస్తాం
- హామీల అమలుకు కట్టుబడి ఉన్నాం
- కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ వెల్లడి



న్యూఢిల్లీ, మార్చి 7: ఆంధ్రప్రదేశ్ విభజన హామీల విషయంలో కేంద్రం మళ్లీ పాతపల్లవినే అందుకుంది. ఏపీకి ప్రత్యేకహోదా సాధ్యంకాదని స్పష్టం చేసింది. అయితే ప్రత్యేకహోదాతో సమానమైన ప్యాకేజీని అందించేందుకు కేంద్రం కట్టుబడి ఉందని ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ తెలిపారు. ఏపీకి ప్రత్యేక హోదా కోరుతూ పార్లమెంట్ వేదికగా కొద్దిరోజులుగా ఆందోళనలు కొనసాగుతున్న నేపథ్యంలో బుధవారం సాయంత్రం జైట్లీ మీడియాతో మాట్లాడారు. జీఎస్టీ రాబడిని కేంద్ర, రాష్ట్రాలకు పంపిణీ చేస్తున్నందున ప్రత్యేక హోదా ఆచరణ సాధ్యంకాదని చెప్పారు. తగినంత రాబడి లేకపోవడం వల్లే గతంలో ఈశాన్య రాష్ట్రాలకు ప్రత్యేకహోదా ఇచ్చామని, 14వ ఆర్థిక సంఘం సూచనల తర్వాత దేశంలో ఏ రాష్ట్రానికీ ప్రత్యేక హోదా ఇవ్వలేదని జైట్లీ స్పష్టంచేశారు. ఈశాన్య రాష్ట్రాలకు ప్రస్తుతం 90:10 చొప్పున నిధుల పంపిణీ జరుగుతున్నదని ఆయన వెల్లడించారు. రాష్ట్ర విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్ ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నదన్న వాదనతో తాను ఏకీభవిస్తున్నానన్న జైట్లీ విభజనచట్టంలో పొందుపర్చిన ప్రతీ హామీకి కట్టుబడి ఉన్నామన్నారు. 'రెవెన్యూలోటు పూడ్చాలని విభజనచట్టంలో ఉంది. అందుకు 2014 నుంచి 2016వరకు ఉన్న రెవెన్యూ లోటును గణించి, దానికి మరో 10నెలలు అదనంగా కలిపి లెక్కించాం. ఏపీకి ఇప్పటికే రూ.4వేల కోట్లు చెల్లించాం. రెవెన్యూ లోటుకింద ఇంకా రూ.138 కోట్లు మాత్రమే చెల్లించాల్సి ఉంది' అని జైట్లీ వివరించారు. ప్రత్యేకహోదాతో సమానంగా ఏపీకి 90:10 నిష్పత్తిలో నిధుల కేటాయింపునకు నిర్ణయించామన్నారు. ప్రపంచబ్యాం కు, ఆసియా అభివృద్ధి బ్యాంకు, ఇతర విదేశీ ద్రవ్యసంస్థల నుంచి రాష్ట్రం తీసుకునే రుణాల్లోనూ 90శాతం కేంద్రమే చెల్లిస్తుందని తెలిపారు. ఏపీకి తాము ఇస్తామన్నవాటితో పోల్చితే ప్రత్యేక హోదా కింద దక్కేవి చాలా తక్కువని ఆయన అన్నారు. 'ప్రత్యేక హోదా పేరు లేదు తప్ప.. దాంతో వచ్చే ప్రతీ ప్రయోజనాన్ని ఏపీకి అందిస్తున్నాం' అని జైట్లీ చెప్పారు. కేంద్రానికి 29 రాష్ట్రాల గురించీ బాధ్యత ఉందని, అన్ని రాష్ట్రాలూ తమకు సమానమేనని అన్నారు.

ఎన్డీయేతో టీడీపీ కటీఫ్

- నేడు టీడీపీ కేంద్ర మంత్రుల రాజీనామా
- కేంద్రం ఏపీకి సాయం చేసే ఉద్దేశంలో లేదు
- ఏ లక్ష్యంతో కేంద్ర క్యాబినెట్‌లో చేరామో, ఆ లక్ష్యం నెరవేరలేదు
- జైట్లీ అవమానకరంగా మాట్లాడారు
- ప్రధానికి చెప్పాలని ప్రయత్నిస్తే అందుబాటులోకి రాలేదు
- మీడియా సమావేశంలో ఏపీ సీఎం చంద్రబాబునాయుడు



హైదరాబాద్/అమరావతి, నమస్తే తెలంగాణ: ఎన్నికలకు మరో ఏడాది సమయం ఉన్న నేపథ్యంలో కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వంతో తెలుగుదేశం పార్టీ కటీఫ్ చెప్పింది. కేంద్ర క్యాబినెట్‌లో టీడీపీ తరపున మంత్రులుగా ఉన్న అశోక్‌గజపతిరాజు, సుజనాచౌదరి గురువారం రాజీనామా చేయనున్నట్టు ఏపీ సీఎం, టీడీపీ అధ్యక్షుడు ఎన్ చంద్రబాబునాయుడు ప్రకటించారు. ఏపీకి ప్యాకేజీ ఇస్తాం తప్ప ప్రత్యేక హోదా ఇవ్వలేమని బుధవారం కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ చేతులెత్తేసిన నేపథ్యంలో తన క్యాబినెట్ సహచరులతో చంద్రబాబు సుదీర్ఘ సంప్రదింపులు జరిపారు. అనంతరం బాగా పొద్దుపోయిన తర్వాత అమరావతిలోని సచివాలయంలో మీడియాతో మాట్లాడారు. ఎంపీలు, కేంద్రంలోని తమ మంత్రులు, నేతలందరినీ సంప్రదించే ఈ నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. ఏపీకి న్యాయం జరుగుతుందనే ఉద్దేశంతోనే కేంద్ర ప్రభుత్వంలో చేరామని, ఏ లక్ష్యంకోసం చేరామో ఆ లక్ష్యం నెరవేరలేదన్నారు. విభజన సమయంలో ఏపీకి అన్యా యం జరిగిందని, పునర్నిర్మాణంలో సాయం దొరుకుతుందని ఆశించామని తెలిపారు. సమస్య పరిష్కారంకోసం నాలుగేండ్లు ఎదురుచూశామని, కానీ, తమ సహనానికి ఎలాంటి ప్రయోజనం కనిపించలేదని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ పరిణామాల కారణంగానే తీవ్ర నిర్ణయం తీసుకున్నామ ని స్పష్టంచేశారు. రాజీనామాల తర్వాత కేంద్రం నుంచి ఎలాం టి స్పందన వస్తుందో చూస్తామన్నారు. దేశ రక్షణకు ఉపయోగించే నిధులను మేం అడిగనట్టు అరుణ్‌జైట్లీ అవమానకరంగా మాట్లాడారని అభ్యంతరం వ్యక్తంచేశారు. ఆయన మాటలు గమనిస్తే ఏపీకి సహాయం చేసే ఉద్దేశం కేంద్రానికి ఉన్నట్టు కనిపించడం లేదని అన్నారు. రాష్ట్ర ప్రయోజనాలకోసం విభజన చట్టంలో హామీలు ఇచ్చి, తర్వాత వాటిని పక్కనపడేశారని చంద్రబాబు ఆరోపించారు. ఏపీ ప్రజల సెంటిమెంట్‌ను కేంద్రం పట్టించుకోవడం లేదని విమర్శించారు. కేంద్ర రాష్ట్ర సంబంధాలను పరిగణనలోకి తీసుకోకుండా ఏకపక్షంగా వ్యవహరించడం సరి కాదని వ్యాఖ్యానించారు. ఓ సీనియర్ నాయకుడిగా మర్యాద పాటిస్తూ ఈ విషయాలను ప్రధానికి చెప్పాలని తాను ప్రయత్నించినా ఆయన అందుబాటులోకి రాలేదని తెలిపారు. ప్రజల ప్రయోజనాలు నెరవేరనప్పుడు బయటకు రావడమే మంచిదని భావించామని చెప్పా రు. ప్రతిదానిని రాజకీయాలతో ముడిపెట్టవద్దని ఆయన విజ్ఞప్తిచేశారు. ఎన్నో ఒడిదుడుకులు చూశామని, ఇది కూడా తట్టుకుని ముందుకు పోతామని చెప్పారు. వెనుకబడిన జిల్లాలకు కేటాయించే రూ.350 కోట్లు విడుదల చేసిన పీఎం కార్యాలయం, తర్వాత అనుమతి లేదంటూ తర్వాత వెనుకకు తీసుకున్నదని విమర్శించారు. రాష్ట్ర ప్రయోజనాలను కాంక్షించే ప్రతి ఒక్కరూ తమకు సహకరించాలని చంద్రబాబు విజ్ఞప్తి చేశారు. 'కొంతమంది రాజకీయ ప్రయోజనాలకోసం ప్రయత్నిస్తారు. నేను ఎవరికీ భయపడను. హక్కుల కోసం పోరాడుతూనే ఉంటాను' అని చెప్పారు.



భారతదేశం విభిన్న సంస్కృతులు, భావజాలాలకు నిలయమని, అవన్నీ పరస్పర గౌరవభావాలతో విలసిల్లాయని బీజేపీ భావిస్తున్నది. అలాంటి భావజాల వైవిధ్యమే భారత్ గొప్పతనం. విగ్రహాల కూల్చివేత చాలా దురదృష్టకరం. అలాంటి హింసాత్మక చర్యలపై కఠినంగా వ్యవహరిస్తాం.

అమిత్ షా, బీజేపీ అధ్యక్షుడు

పెరియార్ విగ్రహాన్ని ధ్వంసం చేయటం తమిళనాడు సంస్కృతిని, ప్రజలను కించపర్చటమేగాక, దేశం ఎదుర్కొంటున్న సవాళ్లను తెలుపుతున్నది. లెనిన్, పెరియార్‌లను అవమానపర్చటం మోదీ పాలనాతీరుకు నిదర్శనం. ఇది రాజ్యాంగ విలువలకు తిలోదకాలివ్వటం, హిందుత్వ రాజకీయాలకు పరాకాష్ట.

జిగ్నేష్ మేవానీ, దళిత నేత, గుజరాత్ ఎమ్మెల్యే



చరిత్రలో నేడు



1817
ది న్యూయార్క్ స్టాక్ ఎక్స్ఛేంజ్ స్థాపన.

1945
మొదటిసారిగా జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవం.





1979
వియెత్నాం నుంచి వెనక్కివచ్చిన చైనా ఆక్రమణ దళాలు.

ఉత్తర కొరియాతో వచ్చే ఏప్రిల్‌లో శిఖరాగ్ర సమావేశం జరుగుతుందని దక్షిణ కొరియా ప్రకటించింది. తమ దేశ భద్రతకు ముప్పు లేకపోతే అణు కార్యక్రమ అవసరం లేదని ఉత్తర కొరియా ప్రకటించింది. అణు కార్యక్రమాన్ని వదులుకుంటామని ఉత్తర కొరియా చెప్పడం ఇది తొలిసారి. ఈ నేపథ్యంలో ఉత్తర కొరియా తన ముందు మోకరిల్లాలనే భ్రమలను అమెరికా వీడాలి. తమ ఒత్తిడి వల్లనే ఈ మార్పు వచ్చిందని ట్రంప్ బృందం భావించవచ్చు. కానీ ఉత్తర కొరియా దగ్గర అమెరికాపై దాడి చేయగల ఖండాంతర క్షిపణులు ఉన్నాయి. ఎవరు ఎవరినీ వేధించలేరు. చర్చలే ఏకైక మార్గం.

గ్లోబల్ టైమ్స్

చైనా, పాకిస్థాన్‌తో తన సంబంధాలను పెంచుకోవాలని పాకిస్థాన్ భావిస్తున్నది. అయితే అమెరికాతో ఈ మధ్యకాలంలో సంబంధాలు దెబ్బతిన్నందు వల్ల, భారత్, అమెరికా కలిసికట్టుగా ఒత్తిడి తెస్తున్నందు వల్ల, పాకిస్థాన్ రష్యా, చైనా దేశాలకు దగ్గరవుతున్నదనే దురభిప్రాయం ఉన్నది. కానీ ఇది తప్పుడు అవగాహన. తాము పశ్చిమ దేశాలతో విడాకులు తీసుకోవడం లేదనీ, అన్ని దేశాల మధ్య సంబంధాల్లో సమతూకం పాటిస్తున్నామని పాకిస్థాన్ విదేశాంగ మంత్రి ఖ్వాజా అసిఫ్ చెప్పడం గమనార్హం. ఈ ప్రాంత దేశాలైన భారత్, అఫ్ఘానిస్థాన్‌తో కూడా వాణిజ్య సంబంధాలను పెంచుకోవాలి.

డాన్

ప్రతీకార సంస్కృతి

త్రిపురలో ఎన్నికల ఫలితాల తర్వాత జరిగిన ప్రతీకారదాడులు ప్రజాస్వామ్య ప్రేమికుల్లో ఆందోళన కలిగిస్తున్నది. పాతికేండ్ల తర్వాత అధికార సీపీఎంను ఓడించి బీజేపీ అధికారం హస్తగతం చేసుకున్న నేపథ్యంలో సాగుతున్న ఈ దాడులు, దహనకాండ భీతి గొలుపుతున్నాయి. దాడులు, దహనకాండతో త్రిపుర దద్దరిల్లుతున్నది. కమ్యూనిస్టు సిద్ధాంతకర్త లెనిన్ విగ్రహాన్ని ఆందోళనకారులు కూల్చేసిన తీరు అక్కడి స్థితికి అద్దంపడుతున్నది. 1539 ఇండ్లపై దాడులు జరిగాయనీ, 196 ఇండ్లను బీజేపీ కార్యకర్తలు తగులబెట్టారని సీపీఎం ఆరోపిస్తున్నది. అలాగే 134 సీపీఎం కార్యాలయాలపై దాడులుచేసి, 64 కార్యాలయాలను తగులబెట్టారని సీపీఎం నేతలు ఆరోపిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా సీపీఎం, బీజేపీ కార్యకర్తల మధ్య జరిగిన ఘర్షణల్లో వందలాదిమంది గాయపడ్డారని తెలుస్తున్నది. త్రిపురలో పాతికేండ్లుగా అధికారం నెరపిన సీపీఎం కొన్నివర్గాలపై అణచివేత ధోరణి ప్రదర్శించినందుకే ఈ ప్రతీకారదాడులు సాగుతున్నాయని చెప్పడం ప్రజాస్వామిక వాతావరణంలో వాంఛనీయం కాబోదు. ఇదే సందర్భంలో బీజేపీ సీనియర్ నేతలు, కొందరు మంత్రులు చేసిన వ్యాఖ్యలు మరింత ఆందోళనకరంగా ఉన్నాయి. 'లెనిన్ విదేశీయుడు, ఒకరకంగా ఉగ్రవాది కూడా. అలాంటి వ్యక్తి విగ్రహం మనదేశంలో ఉండకూడదు' అని బీజేపీ ఎంపీ సుబ్రమణ్యస్వామి అంటే, విదేశీ నేతల విగ్రహాలకు భారత్‌లో చోటు లేదని కేంద్రమంత్రి హన్స్‌రాజ్ గంగారామ్ అహిర్ అన్నారు. మరో నేత రామ్ మాధవ్–ప్రజలు విగ్రహాన్ని తొలిగించింది రష్యాలో కాదు, త్రిపురలోనే అంటూ 'చలో పాల్టాయ్' (మార్చేద్దాం పదండి) అంటూ పిలుపునిచ్చారు!

లెనిన్ విగ్రహ కూల్చివేతను విదేశీ వాదనతో సమర్థించుకున్న బీజేపీ నేతలు పెరియార్, అంబేద్కర్ విగ్రహాల విధ్వంసానికి ఏమి సమాధానం చెబుతారు? త్రిపురలోనూ అల్లర్లు, విగ్రహ విధ్వంసం మరిన్ని ప్రాంతాలకు విస్తరించినట్లు వార్తలొస్తున్నాయి. తమిళనాడు, కేరళలోనూ విగ్రహవిధ్వంసం కొనసాగుతున్నది. మనుషుల మధ్య సమానత్వాన్ని ప్రబోధించిన వారిని శత్రువులుగా చూడటం తగదు. ఇటువంటి మత రాజకీయాలకు అడ్డుకట్ట వేయడానికే లౌకిక ప్రజాస్వామిక శక్తుల పునరేకీకరణ అంశం ముందుకువచ్చినట్లుగా భావించాలి.

ఇక్కడ లెనిన్ విగ్రహం కూల్చివేత సమస్య కాదు, అంతకుమించిన సామాజిక తాత్వికత ఉన్నది. ఆ మాటకొస్తే జారిస్టు రష్యాలో విప్లవాన్ని విజయవంతం చేసిన రష్యాలోనే ఆయన విగ్రహాలు కూల్చివేయబడ్డాయి. సమా జగతిని, పరిణామక్రమాన్ని విప్పిచెప్పి మార్క్సిజాన్ని సమాజశాస్త్రంగా చెప్పి, శస్త్రంగా మార్చిన మార్క్స్, లెనిన్ విగ్రహాల కూల్చివేత గోర్బచెవ్ కాలం నుంచి మొదలై సోవియట్ యూనియన్ పతనందాకా కొనసాగింది. విగ్రహారాధన, వ్యక్తిపూజ వద్దన్న చైనాలో కూడా మావోకాలంలోనే వ్యక్తిపూజ పరాకాష్టకు చేరింది. చైనాలో సాంస్కృతిక విప్లవం సాగుతున్నప్పుడు మావో తన నిలువెత్తు విగ్రహం చూసి నిశ్చేష్టుడైన అనుభవాలున్నాయి. విషయాన్ని విగ్రహాల కూల్చివేతకు, వ్యక్తి ఆరాధనకు మాత్రమే పరిమితంచేసిచూస్తే, కూల్చివేతదారుల ప్రయోజనం నెరవేరినట్లే. ఒక విలువగా విగ్రహారాధన వాంఛనీయం కాదనే వెలుగులో చూసినా, త్రిపురలో నేలకూలుతున్న విగ్రహాలు, కాలుతున్న పార్టీ కార్యాలయాలు ఒక సిద్ధాంతంపై వారికున్న అసహనాన్ని చాటుతున్నాయి. మార్క్సిజం దేశీయం కాదనీ, లెనిన్ విదేశీయుడని అంటున్నవారు, ఇంగ్లండ్ మొదలు ఆఫ్రికా, అమెరికా దాకా ప్రపంచంలోని చాలా దేశాలు గాంధీ, అంబేద్కర్‌లను సమున్నతంగా గౌరవిస్తున్న తీరును మర్చిపోవద్దు. ఆయా దేశాల్లో పార్లమెంటు, అధ్యక్ష భవనాల ముందు గాంధీ, అంబేద్కర్ విగ్రహాలున్నాయి. ప్రధాన కూడళ్లకు గాంధీ, నెహ్రూ, అంబేద్కర్ లాంటి మన జాతీయ నేతల పేర్లున్నాయి. ఇతర దేశాలు గాంధీ, అంబేద్కర్‌లను ఎందుకు గౌరవిస్తున్నాయో ఆలోచించాలి. వ్యక్తులు ఎవరైనా, ఏ దేశం వారైనా తమదైన జీవితాచరణతో మానవాళికి చేసిన సేవలు, బోధలపై ఆధారపడేవారిని ప్రపంచం గౌరవిస్తుందన్నది మరువరాదు.

కొన్ని మతవాదశక్తులు మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత దూకుడుగా వ్యవహరిస్తున్నాయి. బాబ్రీమసీదు కూల్చివేత మొదలు గోద్రా అల్లర్ల దాకా అసహన రాజకీయాల పునాదుల మీద అధికారాన్ని చేజిక్కించుకుంటున్నాయి. ఈ మతవాదులకు ఫాసిజమే దీపకళికగా మార్గం చూపుతున్నది. డాక్టర్ బాలచంద్ర సదాశివరావు ముంజే 1931 మార్చి 19నుంచి తొమ్మిది రోజులు ఇటలీ పర్యటించి ముస్సోలినీ, ఫాసిజం అనుసరణీయంగా హిందూరాజ్యస్థాపనకు ఎలా ఆదర్శమో చెప్పి ఉన్నారు. అతని అడుగుజాడల్లోనే ఆరెస్సెస్ స్థాపకుడు హెడ్గేవార్, గోల్వాల్కర్, దేవరస్ నుంచి నేటిదాకా హిందుత్వవాదులు విభిన్న జాతి సంస్కృతులు కలిగిన దేశాన్ని ఏకశిలా సదృశంగా మార్చేందుకు ప్రయత్నిస్తున్నారు. కులవివక్ష, అణిచివేత వంటి సామాజిక రుగ్మతలను నిరసించడాన్ని కూడా సహించలేకపోతున్నారు. లెనిన్ విగ్రహ కూల్చివేతను విదేశీ వాదనతో సమర్థించుకున్న బీజేపీ నేతలు పెరియార్, అంబేద్కర్ విగ్రహాల విధ్వంసానికి ఏమి సమాధానం చెబుతారు? త్రిపురలోనూ అల్లర్లు, విగ్రహ విధ్వంసం మరిన్ని ప్రాంతాలకు విస్తరించినట్లు వార్తలొస్తున్నాయి. తమిళనాడు, కేరళ, యూపీలలోనూ విగ్రహ విధ్వంసం కొనసాగుతున్నది. మనుషుల మధ్య సమానత్వాన్ని ప్రబోధించిన వారిని శత్రువులుగా చూడటం తగదు. ఇటువంటి మత రాజకీయాలకు అడ్డుకట్ట వేయడానికే లౌకిక ప్రజాస్వామికశక్తుల పునరేకీకరణ అంశం ముందుకువచ్చినట్లుగా భావించాలి. హింసాత్మక పోకడలను ఎదుర్కోవడం చారిత్రక బాధ్యతగా ప్రజాస్వామికశక్తులు స్వీకరించాల్సిన సందర్భం ఇది.

సందర్భం

మహిళా నిదుర లే

లే.. లే.. నిద్దుర.. లే..
వాకిలి వదిలి వేకువ వైపు
అడుగులు వేయి
గేలి మాటలను గల్లీలో వదిలేసి
వెకిలి నవ్వులను శూన్యాన విసిరేసి
లే.. లే.. నిద్దుర.. లే..

అపజయాల చీకట్లకు చితి పేర్చి
వెలుగుల సూర్య కిరణమై లే..లే..
నీ ధైర్యానికి ధరణే దద్దరిల్లెగా
ఆ సంకల్పం ముందు కాలమే మోకరిల్లెగా
లే.. లే.. నిద్దుర.. లే..

గతాన్ని పాతాళంలో పాతేసి
వర్తమానాన్ని గుప్పెట్లో బంధించి
చరిత్రకే చరిత్రై నిలుచుటకు లే లే
అవరోధాల అవతల గెలుపుల నిధికై
లే.. లే.. నిద్దుర.. లే..

గతుకుల ప్రయాణమని
గమ్యం దూరమని
భారమెంతో ఉందని
భయపడి బాధపడకు నేస్తమా
కష్టాల కడలి దాటి విజయాల తీరంకై
లే.. లే.. నిద్దుర.. లే..

అంతులేని విజయాలకై
వేయి వేయి అడుగులు వేయి
దుఃఖాల వారధి దాటిన వారికి
ఆనందాల పంట ఉందని తెలుసుకో
తెలుసుకుంటే విజయముంది
దాని కొరకై లే.. లే.. నిద్దుర లే..!!

– విరాజిత (నిజాగ్ని), 97007 47280
(నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం..)

ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా: 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. editpage@namasthetelangaana.com Fax-040-23291118

ఆలోకన



టంకశాల అశోక్

ఆరోగ్యకరమైన పార్టీ అవసరమే

ఇతర విషయాలను పక్కన ఉంచితే, దేశానికి ఒక ఆరోగ్యకరమైన పార్టీ మాత్రం అవసరం. ఆ పార్టీ ప్రత్యేకంగా ఏదో చేయనక్కరలేదు. స్వాతంత్ర్యోద్యమ ఆకాంక్షలకు ప్రతిరూపమైన మన రాజ్యాంగాన్ని, చట్టాలను, న్యాయస్మృతులను సక్రమంగా అమలుపరుచటం, ప్రజాస్వామిక వ్యవస్థలను పరిరక్షించటం చేస్తే చాలు. నాయకత్వాలు ఆ దిశలో నడిస్తే ప్రజలకు ఆ స్ఫూర్తి కలిగి సహకరించగలరు. అపుడు దేశం గొప్పగా అభివృద్ధి చెందుతుంది. కాంగ్రెస్, బీజేపీలు విఫలమైన ఈ మార్గాన్ని కేసీఆర్ వేయబూనితే ఆహ్వానించవచ్చు.

టీఆర్ఎస్ అధినేత అయిన ముఖ్యమంత్రి కేసీఆర్‌కు పరిస్థితులు కలిసివస్తే ఏర్పడగల కొత్త జాతీయ పార్టీ, లేదా కూటమి కాంగ్రెస్, బీజేపీలకు రెండవ ప్రత్యామ్నాయం అవుతుందా లేక మూడవదా అన్న మీమాంస ఒక విధంగా అర్థం లేనిది. ఎందువల్ల? స్వాతంత్ర్యోద్యమ ఆకాంక్షలకు, ఈ దేశ ప్రజలు అందరి సమగ్ర అభివృద్ధి అవసరాలకు కాంగ్రెస్ పార్టీ తగినది కాదని స్వాతంత్ర్యానంతరపు తొలి దశలోనే తేలిపోయింది. ఆ పార్టీని తమ గుప్పిట పెట్టుకున్న ఆర్థిక–సామాజిక–రాజకీయశక్తులు మన రాజ్యాంగాన్ని, చట్టాలను, న్యాయస్మృతులను, ప్రజాస్వామిక వ్యవస్థలను తమ స్వార్థ ప్రయోజనాల కోసం భంగపరుస్తూపోయాయి. అందువల్లనే కాంగ్రెస్ కోటలకు 1957 నాటి రెండవ సార్వత్రిక ఎన్నికల నుంచే ప్రజల అసంతృప్తి కారణంగా బీటలు వారటం మొదలైంది. ఆ ఖాళీలను ఒకవైపు ప్రజల స్థాయిలో అనేక ఉద్యమాలు ఆక్రమించాయి. మరొకవైపు అదే ప్రజలకు రకరకాల హామీలు ఇస్తూ ప్రాంతీయంగా, జాతీయంగా, వేర్వేరు సిద్ధాంతాలు, వాదనల ప్రాతిపదికగా కొత్త రాజకీయశక్తులు పూరించబూనాయి. ఆ విధంగా సాగిన కొన్ని దశాబ్దాల చరిత్రనంతా ఇక్కడ రాసుకోలేము గాని, ఈ క్రమానికంతా చివరన ప్రస్తుతం కన్పిస్తున్న దృశ్యం కాంగ్రెస్ అనండి, బీజేపీ అనండి, మరొకటి అనండి ఈ దేశానికి ఒక ఆరోగ్యకరమైన పార్టీ లేకుండాపోయింది.

ఇది ఎన్నికలలో గెలుపు ఓటములు, బలాబలాల గురించిన చర్చ కాదు. పైన మొదటి పేరాగ్రాఫ్‌లో పేర్కొన్నవిధంగా కొలమానాల ప్రశ్న. వాటికి తగిన పార్టీ అన్నది ఈ మహత్తర దేశానికి లేదు. కాంగ్రెస్‌ను ఉద్దేశించి బీజేపీ ఒక దశలో దేశ ప్రజలను 'మీకు ప్రత్యామ్నాయం కావాలా లేక ప్రతిరూపమా?' అని ఆలోచనాత్మకమైన ప్రశ్న ఒకటి వేసింది. అపుడు ఇతరత్రా రంగంలో ఉండిన ఫ్రంట్‌లు, దళ్‌లు ప్రతిరూపం మాత్రమేనని, తాము ప్రత్యామ్నాయం కాగలమన్నది ఆ ప్రశ్నలోని హామీ. ఆ విధంగా మాట్లాడి అధికారానికి వచ్చిన బీజేపీ గురించి, అదే ప్రశ్న వేసిన అగ్రనాయకుడు తాము కాంగ్రెస్‌కు ప్రతిరూపంగానే మిగిలాము తప్ప ప్రత్యామ్నాయం కాలేకపోయామని తర్వాత బహిరంగంగా అంగీకరించారు. ఇక్కడ గుర్తించవలసింది ఒకటున్నది. ఒరిజినల్ పాలకులు, వారికి ప్రత్యామ్నాయాలు, వారు ఒకరికొకరు ప్రతిరూపమా, ప్రత్యామ్నాయమా, ఫ్రంట్‌లు–దళ్‌లు రెండవ కృష్ణుడా మూడవ కృష్ణుడా వంటి తర్కవితర్కాలన్నీ ఆ పార్టీల పరిధికి సంబంధించినవి. ప్రజల దృక్కోణం నుంచి, దేశ దృక్పథం నుంచి మాత్రం ఇవన్నీ నిరర్థకంగా మారాయి. ఏవో కొద్దిపాటి తేడాలను తప్పిస్తే కాంగ్రెస్, బీజేపీ వగైరాలన్నీ ఒకే గూటి పక్షులు, లేదా 'ప్రతిరూపా'లని తేలిపోయింది.

కాంగ్రెస్ ఒక ప్రత్యేక పార్టీ అనుకుంటే, బీజేపీ మరొకటి అనుకుంటే అపుడది సాంకేతిక నిర్వచనం అవుతుంది. అపుడవి ఒకదానికొకటి ప్రత్యామ్నాయం అవుతాయి. అది సాంకేతికంగా. కాని, పైన మొదటి పేరాగ్రాఫ్‌లో చెప్పుకున్న కొలమానాలు ఈ దేశానికి అవసరమైన తాత్వికత అనుకుంటే, అపుడు ఆ రెండు పార్టీలు కూడా అసలు ప్రజలకు కావలసిన పార్టీయే కాకుండా పోతాయి. దేశానికి తగిన పార్టీయే మనకు గత 70 సంవత్సరాలలో లేదన్నమాట. ప్రజలు ఎప్పటినుంచో 'దొందూ దొందే' అంటున్నా, అదే మాటను ఇపుడు కేసీఆర్ సోదాహరణంగా, శక్తివంతంగా చెప్పినా దాని తాత్విక అర్థం దేశానికి తగిన, ప్రజలు కోరుకుంటున్న, స్వాతంత్ర్యోద్యమ ఆకాంక్షలను నెరవేర్చే బాటలో నడుస్తున్న పార్టీ ఏదీ మనకు ఈ రోజున లేదన్నమాట. మరొక మాటలో చెప్పాలంటే ఇది ఒక శూన్యస్థితి. అందులోకి ప్రవేశించవలసింది ఒక ఆరోగ్యకరమైన కొత్త రాజకీయ శక్తి. అది పార్టీయా, కూటమా అంటే ఏదైనా కావచ్చు. కాని అది ఈ విధమైన తాత్వికత గల ఆరోగ్యకరమైన కొత్త శక్తి కావాలి. అటువంటిది అయినప్పుడు ప్రజలకు దానిపట్ల విశ్వాసం కలుగుతుంది, వెంట నిలుస్తారు. కేసీఆర్ అంటున్న ఫెడరలిజం కూడా ఆ రాజ్యాంగ తాత్వికతలో భాగమే.

ప్రజలకు లోగడ కొందరి పట్ల అటువంటి ఆశాభావాలు కలుగలేకపోలేదు. కాంగ్రెస్ వైఫల్యాల వల్ల శూన్యం ఏర్పడినాకొద్దీ 1960ల నుంచి మొదలుకొని వృత్తులు, కులాలు, ప్రాంతీయతలు, అసమాన అభివృద్ధుల అంశాలను ప్రాతిపదిక చేసుకుంటూ చిన్నవి, పెద్దవి అనేక ఉద్యమాలు జరిగాయి. పార్టీలు ఏర్పడ్డాయి. వాటి అజెండాలు పరిమితం అయినా, సమగ్రం అయినా సారాంశంలో మాత్రం అందరి ఆకాంక్షలు భారత రాజ్యాంగ ప్రతిఫలనాలే. చట్టాలను, న్యాయస్మృతులను గౌరవించకుండా పాలిస్తూ, రాజ్యాంగ వ్యవస్థలను భంగపరుచడం వల్ల నిరసనలుగా ముందుకు వచ్చినవే. ఆయా ఉద్యమాలకు, పార్టీలకు నాయకత్వం వహించినవారు ఎవరైనా, వారికి వ్యక్తిగత ప్రయోజనాలు ఏవైనా ఉండినప్పటికీ, వారిని నమ్మినడిచిన సాధారణ ప్రజల ఆకాంక్షలు మాత్రం స్వచ్ఛమైనవి. అవి అన్నీపైన చెప్పుకున్న తాత్వికతకు అనుగుణమైనవి. ఒకవేళ ఈ కొత్త నాయకత్వాలు కూడా చిత్తశుద్ధితో అందుకు కట్టుబడి వ్యవహరించినా, లేక ఈ పరిణామాల నుంచి కాంగ్రెస్ పాఠాలను నేర్చుకొని తన పద్ధతులను మార్చుకున్నా ఈ రోజున భారతదేశం మరొకవిధంగా ఉండేది. 71 సంవత్సరాల తర్వాత కేసీఆర్ గత శని–ఆదివారాల (మార్చి3, 4 తేదీలు) తరహా ప్రసంగాలు చేయవలసిన అవసరం వచ్చేది కాదు.

దురదృష్టవశాత్తు కాంగ్రెస్ మారలేదు. కొత్తగా వచ్చిన నాయకత్వాలు ఎటువంటి శూన్యత వల్లనైతే తాము నాయకులు అయ్యే అవకాశాలు ఏర్పడ్డాయో, ఏ కారణాల మూలంగా ప్రజలు తమను నమ్మి వెంట నడిచారో అందుకు అనుగుణంగా వ్యవహరించటంలో విఫలమయారు. కొత్త పరిస్థితుల ఒత్తిడి వల్ల కాంగ్రెస్ గాని, ఈ కొత్త నాయకత్వాలు గాని అరకొరగా ఏమైనా చేసి ఉండవచ్చు. కాని సారాంశంలో అందరూ ఒకే గూటి పక్షులుగా తయారయ్యారు. ఇదే జాబితాలోకి బీజేపీ కూడా వస్తుంది. కొద్ది అటుఇటుగా వామపక్షాలు సైతం అంతే అయాయి. అందరూ కట్టగట్టుకుని ఒకరికొకరు 'ప్రతిరూపా'లయారు. లేని పక్షంలో దేశంలో ఇంతటి నిరాశలు నెలకొనేవి కావు. పరిపాలనలు, అభివృద్ధిపరంగా ఈ స్థాయిలో అస్తవ్యస్తతలు ఉండేవి కావు. వీటన్నింటి పర్యవసానంగా రాజకీయం ఇంత అస్థిరంగా, గందరగోళంగా మారేది కాదు. ప్రపంచంలోనే ఒక గొప్ప ఉద్యమం ద్వారా స్వాతంత్ర్యాన్ని సాధించుకున్న ఈ దేశం ఒక్కొక్క దశాబ్దం గడిచినా కొద్దీ అద్భుతంగా పురోగమించటానికి బదులుగా ఇట్లా నిరాశాజనకంగా మారుతుండటాన్ని చూసి సామాన్యులకు అక్షరాలా దుఃఖం కలుగుతున్నది.

> ఈ దేశానికి సమగ్రాభివృద్ధిని, సామాజిక న్యాయాన్ని, ఫెడరలిజాన్ని, రాజ్యాంగతత్వాన్ని సాధించే ఒక ఆరోగ్యకరమైన పార్టీ లేదా కూటమి అవసరమనుకోవటం అందువల్లనే. అందుకు ఎవరు చొరవ తీసుకున్నా ఆహ్వానించవలసి ఉంటుంది. తాను ఆ పని చేయదలిచినట్లు కేసీఆర్ చెప్తున్నారు. ఎంతో అధ్యయనం, అనుభవం, వివేకం గల ఆయనకు ఈ లక్ష్యం ఎంత కష్టతరమైనదో ఎవరూ చెప్పనక్కరలేదు.

ఈ దేశానికి సమగ్రాభివృద్ధిని, సామాజిక న్యాయాన్ని, ఫెడరలిజాన్ని, రాజ్యాంగతత్వాన్ని సాధించే ఒక ఆరోగ్యకరమైన పార్టీ లేదా కూటమి అవసరమనుకోవటం అందువల్లనే. అందుకు ఎవరు చొరవ తీసుకున్నా ఆహ్వానించవలసి ఉంటుంది. తాను ఆ పని చేయదలిచినట్లు కేసీఆర్ చెప్తున్నారు. ఎంతో అధ్యయనం, అనుభవం, వివేకం గల ఆయనకు ఈ లక్ష్యం ఎంత కష్టతరమైనదో ఎవరూ చెప్పనక్కరలేదు. ఇటువంటి లక్ష్యాలకు అవరోధంగా నిలువగల శక్తులు చాలా బలమైనవి. ఇంతకాలపు వైఫల్యాల వెనుక వాటి ప్రమేయం ఉంది. అవి నేడు కూడా అదేవిధంగా క్రియాశీలంగా ఉన్నస్థితిలో, మార్పుకు ప్రధానమైన మద్దతు ప్రజల నుంచి మాత్రమే రాగలదని గుర్తించటం అవసరం. మార్పును చిత్తశుద్ధితో కోరుకుని సహకరించే రాజకీయ శ్రేణులు, కలిసిరాగల సామాజిక శిష్ట వర్గాలు, ఇతర క్రియాశీల బృందాల కోసం చాలా అన్వేషణలు కూడా జరుపవలసి ఉంటుంది. అదేవిధంగా, ఇనుమును కొలిమిలో కాల్చినపుడు అది పనిముట్టుగా మారటంతో పాటు, అందులోని దోషాలను అగ్ని పరిహరించి నికార్సుగా మార్చినట్లు, ఈ క్రమంలో ఎదురయ్యే సవాళ్ల మధ్య కేసీఆర్ కూడా నిగ్గుతేరే అవకాశం ఉంటుంది.

రాజకీయాల్లో మార్పు తప్పనిసరి

జాతీయం

సంకేపల్లి నాగేంద్ర శర్మ

కేంద్ర, రాష్ట్ర సంబంధాల్లో మార్పులు రావాలసి ఉన్నది. 1980 తర్వాత జాతీయ పార్టీల ప్రాతినిధ్యం పడిపోయి, ప్రాంతీయ పార్టీల హవానే నడుస్తున్నది. జాతీయ పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ, ఉభయ కమ్యూనిస్టు పార్టీల్లో అంతర్గత పోరు, కుంభకోణాల జోరు ఎక్కువయ్యాయి. దేశంలోని జాతీయ పార్టీల ప్రాబల్యం నానాటికీ తగ్గిపోతున్నది. ఈశాన్య రాష్ట్రాల్లో కూడా జాతీయపార్టీలు ప్రాంతీయపార్టీలతో పొత్తు వల్లే అధికారపీఠాలకు చేరువైపోతున్నాయన్నది సుస్పష్టం. తమిళనాడులోనైతే, గత యాభై ఏండ్ల నుంచి ద్రవిడ కజగం పార్టీల హవానే నడుస్తున్నది. కమల్‌హసన్, రజనీకాంత్ వంటి దిగ్గజ హీరోలు నూతన ప్రాంతీయపార్టీలకు తెరలేపుతున్నారు.

వందేండ్లు దాటిన కాంగ్రెస్‌పార్టీ గత ఎన్నికల్లో ఘోర పరాభవాన్నే చవిచూసి, చివరికి ప్రతిపక్ష హోదాను కూడా దక్కించుకోకుండాపోయింది. దీన్నిబట్టి చూస్తే, వివిధ రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీల హవానే ఉందని ఖాయమైపోతున్నది. మహారాష్ట్రలో సైతం శివసేన వంటి ప్రాంతీయ పార్టీ బలంగా ఉన్నది. సరైన స్థానీయ రాజకీయ విధానం, దీటైన నాయకత్వ పటిమ లేకుంటే ప్రాంతీయపార్టీలను కూడా ప్రజలు తిరస్కరిస్తున్నారు.

కేంద్ర ప్రభుత్వం వివిధ రాష్ట్రాలకు నిధుల కేటాయింపుల్లో సరైన విధంగా ప్రవర్తించకపోవడం పట్ల వివిధ రాష్ట్రాలు ధ్వజమెత్తుతున్నాయి. సమాఖ్య విధానంలో కేంద్రం పెద్దన్న వైఖరి విడనాడి, ఉదారంగా ప్రవర్తించాలని రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న ప్రాంతీయపార్టీలు మొత్తుకుంటున్నా వినేవారే కరువైపోయారు. ఆంధ్రాలో అధికారంలో ఉన్న టీడీపీ బీజేపీకి మిత్ర పక్షమైనప్పటికీ, ప్రత్యేక హోదా ఇవ్వడంలో నాన్చుడు వైఖరిని ప్రదర్శించింది. కేంద్ర ఆర్థికమంత్రి జైట్లీ చేసిన ప్రకటన విడ్డూరంగా ఉన్న ది. టీడీపీకి చెందిన ఒకరిద్దరు కేంద్ర క్యాబినెట్‌లో ఉన్నప్పటికీ, ఆంధ్రాకు ప్రత్యేక హోదా ఇవ్వడానికి కేంద్రం వెనకడుగు వేస్తూనే ఉన్నది. 2019లో జరిగే అసెంబ్లీ, లోకసభ ఎన్నికల్లో బీజేపీ ఇలానే మొండిగా వ్యవహరిస్తే, దీని ప్రభావం ఎన్నికల్లో కనబడకతప్పదు. కేంద్ర క్యాబినెట్‌లో ఉన్న సికింద్రాబాద్ బీజేపీ ఎంపీ బండారు దత్తాత్రేయను పదవినుంచి తొలిగించడం కూడా తెలంగాణ ప్రజలను, ఆ పార్టీ బీజేపీ శాఖను బాధిస్తున్నది.

ఎమర్జెన్సీ తర్వాత ప్రతిపక్ష పార్టీలన్నీ ఏకమై జయప్రకాశ్ నారాయణ్ నాయకత్వంలో జనతా పార్టీగా ఏర్పడి, కాంగ్రెస్‌ను మట్టికరిపించాయి. ఎంతో ప్రజాకర్షణగల నేత ఇందిరా గాంధీ ఓటమి పాలై, తాను చేసిన తప్పిదాలకు జైలుకెళ్ళాల్సి వచ్చింది. దేశంలోని జనాభాలో అధిక శాతం సంప్రదాయ వ్యవసాయ రంగంపైనే ఆధారపడి ఉన్నారు. ఇందులోనే 60 నుంచి 70 శాతం మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి లభిస్తున్నది. ఇటీవలి కాలంలో పర్యావరణ విద్రోహం జరిగిపోయి, పారిశ్రామికరంగం ఎడాపెడా విస్తరిస్తుండటంతో, కరువు కాటకాల జోరు పెరిగిపోయి, వ్యవసాయం కుదేలైపోతున్నది. ప్రాజెక్టుల్లో నీరు సరిగా రాకపోవడం, రిజర్వాయర్ల సామర్థ్యం తగ్గిపోవడం ఈ విధంగా నదీజలాలు సముద్రం పాలు కావడం చూస్తున్నదే. నదుల నీళ్లను గుప్పిట పెట్టుకున్న రాష్ట్రాలు ఏకపక్షంగా వ్యవహరించడం వల్ల ఆయా రాష్ట్రాల్లో నీటి పంపిణీ గొడవలు రాజకీయ సమస్యలుగా మారిపోతున్నాయి. రైతు సంక్షేమమే ప్రధాన ధ్యేయంగా పనిచేస్తున్న ప్రభుత్వాలకు కేంద్రం కర్ర పెత్తనం వల్ల, ఎటు చేయలేని పరిస్థితి దాపురిస్తున్నది. కేంద్రం వివిధ పంటలకు సరైన మద్దతు ధరలు ప్రకటించకుండా పోవడంవల్ల, పెట్టుబడి ఖర్చులు పెరిగిపోయి, గిట్టుబాటు ధరలు లభించక రైతు కుదేలైపోయి, ఆత్మహత్యలకు పాల్పడుతున్నాడు. దళారీలు పెరిగిపోయి, రైతు ఉత్పత్తులను కొనుగోలు చేసుకొని, నిల్వ ఉంచుకుని, కృత్రిమ కొరతను సృష్టిస్తూ, లాభపడుతున్నారు. ఇలాంటి క్లిష్ట తరుణంలో ముఖ్యమంత్రి కేసీఆర్ రైతాంగ లాభాదాయక విధానాలను అవలంబిస్తూ, కేంద్రానికి కండ్లు తెరిపించేలా కృషి చేస్తుండటం హర్షించదగిన పరిణామం. ఎకరానికి 8 వేలు పెట్టుబడి ఖర్చుగా ఇవ్వడానికి ముందుకురావడం సంతోషదాయకం. చట్టబద్ధమైన రైతు సంఘాలను, రైతు కార్పొరేషన్‌ను నెలకొల్పి, రైతు ఉత్పత్తులకు సరైన గిట్టుబాటు ధరను కల్పించే ఏర్పాటుచేయడం వంటివి ఆలోచించదగిన పరిణామాలే.

> సరైన కసరత్తు లేకుండా, నల్లధనం నిర్మూలన అంటూ, గత 2016 నవంబర్ 8న మోదీ పెద్దనోట్లను రద్దుచేయడం ఆర్థిక సంక్షోభాన్ని తెచ్చిన విషయం తెలిసిందే. జీఎస్టీ విధానం కూడా అనేక అపోహలకు తావిస్తున్నది. కేసీఆర్ తెలంగాణ ఉద్యమ పోరాటంలో అజేయుడై నిలిచారు. మిగులు బడ్జెట్, నీళ్ళు, నిధులు, నియామకాల వంటి అంశాల్లో ముందున్న కేసీఆర్ జాతీయ పథగామిగా దూసుకెళ్ళాల్సిందే. ప్రస్తుతం దేశానికి కావాల్సింది అవినీతిరహిత పాలనా విధానాలు. రైతాంగానికి గిట్టుబాటు ధరలు, సామాన్యులకు స్వచ్ఛమైన పాలన. ఈ దిశలో కేసీఆర్ విజయం సాధించాలని కోరుకుందాం.

కేంద్రం ఒంటెద్దు పోకడలతో, పారిశ్రామికవేత్తలకు వేల కోట్ల రుణాలు ఇస్తూ బ్యాంకులను దివాలా తీయిస్తున్న ఉదంతాలు గత రెండున్నర దశాబ్దాల నుంచి వింటున్నాం. ప్రభుత్వరంగ బ్యాంకులు పారిశ్రామికవేత్తలకు వేల కోట్లు అప్పులు ఇవ్వడం, వారు చేతులెత్తేసి విదేశాలకు చెక్కేస్తుండటం పత్రికల్లో పతాక శీర్షికలై కనిపిస్తున్నాయి. లిక్కర్ కింగ్ విజయ్ మాల్యా 9 వేల కోట్లు, ప్రముఖ వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీ 12 వేల కోట్లు, రోటోమాక్ పెన్నుల ఉత్పత్తుల అధినేత విక్రం కోఠారి 3,695 కోట్లు అప్పులు తీసుకొని, జాతీయ బ్యాంకులకు కుచ్చుటోపీలు పెట్టినట్లు వార్తలు వస్తున్నాయి.

ప్రపంచ దేశాల్లోని అవినీతి సూచిలో భారత్ 2016లో 79వ స్థానంలో, 2017లో 81 స్థానంలో ఉన్నది. మీడియా స్వేచ్ఛను హరించడం, స్వచ్ఛంద సంస్థలు, ఎన్జీవోలపై ఆంక్షలు విధించడం, ప్రతిపక్షనేతలు, న్యాయాధికారులు, నిఘా సంస్థలపై దాడులు చేయడం వంటివి పెరిగాయని ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ సంస్థ గత ఫిబ్రవరి 22న ఒక సర్వేను విడుదల చేసింది. భారత్, ఫిలిప్పీన్స్, మాల్దీవుల్లో ఈ అవినీతికర పరిస్థితి, నేర ప్రవృత్తి ఆందోళనకరంగా ఉందని పేర్కొంది. గత ఏడాది కిందట మీడియా రంగంలో ప్రముఖంగా ఉన్న ఇండియాటుడే ఛానల్‌పై కేంద్రం ఐటీ దాడులు చేయించింది.

గత ఫిబ్రవరి 17న జన్మదినం నుంచి కేసీఆర్ వరుసగా సమరోత్సాహంతో కేంద్ర ఆర్థిక, రాజకీయ విధానాలపై బాణాలను సంధిస్తున్నారు. విభజన చట్టం ఆధారంగా, తెలంగాణ రాష్ట్రానికి రావాల్సిన నిధులను ఇవ్వకుండా మెలికలు పెడుతున్న తీరును ఆయన పూసగుచ్చినట్లు ప్రజలకు వివరిస్తున్నారు. కేంద్ర విధానాలకు ప్రత్యామ్నాయంగా మూడో ఫ్రంట్ ఆవశ్యకతను పక్కాగా వివరిస్తున్నారు. అంతేగాక రైతుల గిట్టుబాటు ధరలపై, కేంద్రం మొండి వైఖరిపై, బడా పారిశ్రామికవేత్తలకు ఇస్తున్న రాయితీలపై ఆయన ధ్వజమెత్తుతున్నారు. రాష్ట్రాల ప్రయోజనాలు కాపాడేందుకు ఆయన సరైన వ్యూహరచన చేస్తున్నారు. ఈ రాజకీయ, వినూత్న పరిణామంపై దేశంలోని వివిధ రాష్ట్రాల రాజకీయ ప్రముఖులు తమ మద్దతును బాహాటంగా వెల్లడిస్తున్నారు.

సరైన కసరత్తులేకుండా, నల్లధనం నిర్మూలన అంటూ, గత 2016 నవంబర్ 8న మోదీ పెద్ద నోట్లను రద్దుచేయడం ఆర్థిక సంక్షోభాన్ని తెచ్చిన విషయం తెలిసిందే. జీఎస్టీ విధానం కూడా అనేక అపోహలకు తావిస్తున్నది. కేసీఆర్ తెలంగాణ ఉద్యమ పోరాటంలో అజేయుడై నిలిచారు. మిగులు బడ్జెట్, నీళ్ళు, నిధులు, నియామకాల వంటి అంశాల్లో ముందున్న కేసీఆర్ జాతీయ పథగామిగా దూసుకెళ్ళాల్సిందే. ప్రస్తుతం దేశానికి కావాల్సింది అవినీతిరహిత పాలనా విధానాలు. రైతాంగానికి గిట్టుబాటు ధరలు, సామాన్యులకు స్వచ్ఛమైన పాలన. ఈ దిశలో కేసీఆర్ విజయం సాధించాలని కోరుకుందాం.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.437, Near Velama Kalyana Mandapam, Devara Yamjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078, Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.



మహిళా రైల్వే, విమాన సేవలు

■ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక ఏర్పాట్లు



గువాహటిలో రైలు చక్రాలను తనిఖీ చేస్తున్న మహిళా సిబ్బంది

ముంబై, మార్చి 7: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని రైల్వే, విమానయాన శాఖలు ప్రత్యేక కార్యక్రమాలను చేపట్టాయి. ఇందులో భాగంగా సెంట్రల్ రైల్వే పరిధిలో దక్కన్ క్వీన్ ఎక్స్‌ప్రెస్ రైలులో మొత్తం మహిళా ఉద్యోగులతో సేవలందించనున్నారు. అలాగే కోయ్నా రైలు, దక్కన్ ఎక్స్‌ప్రెస్ రైలులో శాశ్వతంగా మహిళా టికెట్ తనిఖీ సిబ్బందిని నియమించనున్నారు. ఛత్రపతి టెర్మినల్ సబర్బన్ విభాగంలో మహిళా ఉద్యోగులు నడిపే ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేస్తున్నారు. ఇక సబర్బన్ మాతుంగా రోడ్ రైల్వే స్టేషన్‌లో రేపటి నుంచి అందరు మహిళా ఉద్యోగులతో సేవలందించేందుకు సిద్ధమయ్యారు. ఇలా ఉండగా, న్యూయార్క్, ఫ్రాంక్‌ఫర్ట్, సింగపూర్, శ్రీలంకలకు పైలట్, కో-పైలట్ సహా అందరూ మహిళా ఉద్యోగులతోనే సేవలందించాలని ఎయిర్ ఇండియా నిర్ణయించింది. బోయింగ్ 737, బాంబార్డియర్ క్యూ400 విమానాల్లో మహిళా పైలట్ల భర్తీకి స్పైస్‌జెట్ రెండు రోజుల పాటు డ్రైవ్ చేపడుతున్నది. అలాగే గురువారం మొత్తం మహిళా సిబ్బందితో మూడు విమాన సర్వీసులు నడుపనుంది.


జాతీయస్థాయి పరీక్షలకు ఆధార్ తప్పనిసరి కాదు

■ సీబీఎస్ఈని ఆదేశించిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, మార్చి 7: నీట్‌తో పాటు ఇతర అలిండియా పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఆధార్ నంబర్‌ను తప్పనిసరి చేయవద్దని సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్(సీబీఎస్ఈ)ను సుప్రీంకోర్టు బుధవారం ఆదేశించింది. ఈ మేరకు సీబీఎస్ఈ వెబ్‌సైట్‌లో సమాచారాన్ని అప్‌లోడ్ చేయాలని సూచించింది. నీట్ 2018కు హాజరయ్యే విద్యార్థులకు ఆధార్ నంబర్‌ను తప్పనిసరి అంటూ సీబీఎస్ఈ తీసుకున్న నిర్ణయాన్ని సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఆ పిటిషన్‌ను చీఫ్ జస్టిస్ దీపక్ మిశ్రా నేతృత్వంలోని ధర్మాసనం విచారించింది. ఈ సందర్భంగా అటార్నీ జనరల్ కేకే వేణుగోపాల్ వాదనలు వినిపిస్తూ జమ్ముకశ్మీర్, మేఘాలయ, అస్సాం రాష్ట్రాల్లోని విద్యార్థులు నీట్ వంటి జాతీయస్థాయి పరీక్షలకు పేరు నమోదు చేసుకోవడానికి గుర్తింపుధ్రువంగా ఓటరు కార్డు, పాస్‌పోర్టు, రేషన్‌కార్డులను వినియోగిస్తున్నారని తెలిపారు. దీంతో ధర్మాసనం స్పందిస్తూ జాతీయస్థాయిలో నిర్వహించే పరీక్షలన్నింటికీ ఆధార్ నంబర్‌ను తప్పనిసరి చేయవద్దని సీబీఎస్ఈని ఆదేశించింది. ప్రభుత్వ పథకాలు, సేవలను పొందడానికిగాను ఆధార్ నంబర్‌ను అనుసంధానించే గడువును పెంచే అవకాశముందని కేంద్రం తెలిపింది.

విగ్రహాల విధ్వంస కాండ!

- యూపీలో అంబేద్కర్, బెంగాల్‌లో శ్యామ ప్రసాద్ ముఖర్జీ ప్రతిమలకు అవమానం
- ఈశాన్యం నుంచి దక్షిణ భారతానికి పాకిన విగ్రహాల ధ్వంసం
- తమిళనాడులో బీజేపీ ఆఫీసుపై పెట్రోలు బాంబు దాడి
- విగ్రహాల కూల్చివేతను ఖండించిన ప్రధాని మోదీ
- అల్లరిమూకలపై కఠిన చర్య తీసుకుంటామని హెచ్చరిక
- ఎస్పీలు, కలెక్టర్లను బాధ్యులను చేస్తామన్న హోం శాఖ



మీరట్‌లో ధ్వంసమైన అంబేద్కర్ విగ్రహం



తమిళనాడులోని వెల్లూరులో ధ్వంసమైన పెరియార్ విగ్రహం



దక్షిణ కోల్‌కతాలో 'రాడికల్స్' ధ్వంసం చేసిన శ్యామ ప్రసాద్ ముఖర్జీ విగ్రహం

కోల్‌కతా/చెన్నై/న్యూఢిల్లీ, మార్చి 7: ఈశాన్యంలో మొదలైన విగ్రహాల కూల్చివేత ఘటనలు పశ్చిమ భారతం గుండా దక్షిణాదికి చేరాయి. త్రిపుర అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిన నేపథ్యంలో స్థానిక బీజేపీ శ్రేణులు అక్కడి లెనిన్ విగ్రహాలను కూల్చివేయడం, వాటిని రాష్ట్ర గవర్నర్, కేంద్ర మంత్రులు వత్తాసు పలుకడంతో రెచ్చిపోయిన ఆ పార్టీ కార్యకర్తలు తమిళనాడులో ద్రవిడ ఉద్యమ వ్యవస్థాపకుడు పెరియార్ విగ్రహాన్ని ధ్వంసం చేశారు. ఈ ఘటనలకు ప్రతీకారంగా వామపక్ష కార్యకర్తలు పశ్చిమ కోల్‌కతాలో జన సంఘ్ వ్యవస్థాపకుడు శ్యామ ప్రసాద్ ముఖర్జీ విగ్రహాన్ని ధ్వంసం చేశారు. తమిళనాడులోని కోయంబత్తూరులో బీజేపీ కార్యాలయంపై పెట్రోలు బాంబు దాడి జరిగింది. మరోవైపు ఉత్తర్‌ప్రదేశ్‌లోని మీరట్‌లో రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ విగ్రహాన్ని అగ్రకులాలకి చెందిన వారు ధ్వంసం చేశారు. వరుసగా చోటు చేసుకున్న ఈ ఘటనలు ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదని ప్రధాని నరేంద్రమోదీ పేర్కొన్నారు. విగ్రహాల విధ్వంసానికి పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కేంద్ర హోం శాఖ రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. మళ్లీ అటువంటి ఘటనలు జరిగితే స్థానిక కలెక్టర్, ఎస్పీలను బాధ్యులను చేస్తామని హెచ్చరించింది.

కోయంబత్తూరులో పెట్రోలు బాంబు దాడి

తమిళనాడులోని కోయంబత్తూరులో బీజేపీ కార్యాలయంపై బుధవారం ఉదయం గుర్తు తెలియని వ్యక్తులు పెట్రోలు బాంబులు విసిరారు. ఈ ఘటనలో ఎవరూ గాయపడలేదు. దాడికి పాల్పడిన వారిగా అనుమానిస్తున్న ముగ్గురు వ్యక్తులు లొంగిపోయారని, వారిని అరెస్టు చేశామని పోలీసులు చెప్పారు. వెల్లూరులోని మున్సిపల్ కార్యాలయంలోగల ద్రవిడ నాయకుడు పెరియార్ రామస్వామి విగ్రహాన్ని ఇద్దరు వ్యక్తులు మంగళవారం రాత్రి ధ్వంసం చేసిన నేపథ్యంలో ఈ దాడి జరిగినట్టు అనుమానిస్తున్నారు. లొంగిపోయిన ముగ్గురు తాంతాయి పెరియార్ ద్రవిడ కళగం (టీపీడీకే)కు చెందిన వారని పోలీసులు తెలిపారు. ద్రవిడార్ విడుతలై కళగం (డీవీకే)కు చెందిన నలుగురు కార్యకర్తలు మైలాపూర్‌లోని సత్సంగ్ రోడ్డుపై నడుచుకుంటూ వెళుతున్న ఎనిమిదిమంది బ్రాహ్మణుల జంధ్యాలను కోసివేశారు. ఆ తరువాత వారు స్వచ్ఛందంగా పోలీసుల ముందు లొంగిపోయారు. త్రిపురలో బీజేపీ కార్యకర్తలు రష్యా కమ్యూనిస్టు నాయకుడు లెనిన్ విగ్రహాన్ని కూల్చివేసిన నేపథ్యంలో బీజేపీ జాతీయ కార్యదర్శి హెచ్ రాజా ఫేస్‌బుక్‌లో చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో తమిళనాడులో ఈ చిచ్చు రగిలినట్టు తెలుస్తున్నది. కొద్దిసేపటి తరువాత ఆ వ్యాఖ్యలను తొలగించిన రాజా, తన ఫేస్‌బుక్ ఖాతాను నిర్వహిస్తున్న సిబ్బంది ఆ పోస్టును పెట్టారని బుధవారం వివరించారు. రాజాకు వ్యతిరేకంగా పలు పార్టీలు తమిళనాడులో రాస్తారోకోలు, ప్రదర్శనలు నిర్వహించాయి. కావేరి జల వివాదం అంశం నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకే పెరియార్ విగ్రహాన్ని ధ్వంసం చేశారని ఇటీవలే రాజకీయ పార్టీని స్థాపించిన సినీ నటుడు కమల్ హాసన్ వ్యాఖ్యానించారు.

ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదు : ప్రధాని

దేశంలోని పలు ప్రాంతాల్లో జరిగిన విగ్రహాల ధ్వంసం ఘటనలను ప్రధాని నరేంద్రమోదీ తీవ్రంగా ఖండించారు. విధ్వంసానికి పాల్పడిన వారి పట్ల కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ మేరకు ఆయన హోం మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌తో మాట్లాడారని బుధవారం ప్రధానమంత్రి ఒక అధికారిక ప్రకటనలో పేర్కొంది. విగ్రహాలను ధ్వంసం చేయడం ఆమోదయోగ్యం కాదని ప్రధాని పేర్కొన్నట్టు తెలిపింది. మరోవైపు విగ్రహాల ధ్వంసం ఘటనలను తాము తీవ్రంగా పరిగణిస్తున్నామని, నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని సంబంధిత రాష్ట్రాలను ఆదేశించామని కేంద్ర హోం శాఖ తెలిపింది. ఎక్కడైనా మళ్లీ అటువంటి ఘటనలు జరిగితే ఆ ప్రాంత కలెక్టర్, ఎస్పీలను బాధ్యులను చేస్తామని హెచ్చరించింది. ఈ మేరకు రెండుసార్లు ఆదేశాలు జారీ చేసింది.

తీరుమారని త్రిపుర గవర్నర్

విగ్రహాల విధ్వంసంపై విమర్శలు వెల్లువెత్తున్నా బీజేపీకి చెందిన త్రిపుర గవర్నర్ తథాగత రాయ్ మాత్రం తన వైఖరిని మార్చుకోలేదు. త్రిపురలో లెనిన్ విగ్రహాల కూల్చివేతను పరోక్షంగా సమర్థించిన గవర్నర్ బుధవారం మరో వివాదాస్పద వ్యాఖ్యలు ట్వీట్ చేశారు. 'న్యూఢిల్లీలోని ఇండియాగేట్ నుంచి కింగ్ జార్జ్ విగ్రహాన్ని తొలిగించారు. కోల్‌కతాలో విక్టోరియా రాణి ప్రతిమను ఆమె స్మారక కేంద్రం నుండి తీసివేశాం. ఔరంగజేబ్ రోడ్డు పేరు మార్చాం. అలాగే ప్రభుత్వం లెనిన్ విగ్రహాన్ని తొలిగించింది, ఆ ప్రాంతం పేరు మారిస్తే ఏమవుతుంది? సమాధానం ఉందా?' అంటూ తథాగత రాయ్ ట్వీట్ చేశారు.

శ్యామ ప్రసాద్ ముఖర్జీ ప్రతిమ ధ్వంసం

జనసంఘ్ వ్యవస్థాపకుడు శ్యామ ప్రసాద్ ముఖర్జీ ప్రతిమను దక్షిణ కోల్‌కతాలో వామపక్ష అనుకూలవాదులు ధ్వంసం చేశారు. ఈ ఘటనకు సంబంధించి ఓ మహిళ సహా ఏడుగురిని పోలీసులు అరెస్టు చేశారు. నిందితులు వచ్చి విగ్రహానికి నల్లరంగు పూసి ధ్వంసం చేయడం ప్రారంభించారని, స్థానికులు వారిని పట్టుకొని పోలీసులకు సమాచారం అందించారని నగర పోలీస్ కమిషనర్ తెలిపారు. ఆ ఏడుగురు 'రాడికల్' అనే వామపక్ష గ్రూపునకు చెందిన వారని చెప్పారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని మీరట్ జిల్లా మవానా ఖుర్ద్‌లో బుధవారం అంబేద్కర్ విగ్రహం ధ్వంసమైంది. ఆ ప్రాంతంలో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారకముందే ప్రభుత్వం పోలీసు బలగాలను అక్కడికి పంపించింది. విగ్రహం ధ్వంసం వెనుక ఎటువంటి రాజకీయ ప్రతీకారం లేదని, స్థానికంగా కులాల మధ్య ఉన్న వివాదాల కారణంగా ఈ ఘటన చోటుచేసుకుందని అధికారులు తెలిపారు.

కర్ణాటక లోకాయుక్తకు కత్తిపోట్లు



దవాఖానలో విశ్వనాథ శెట్టి, పోలీసుల అదుపులో నిందితుడు

- విశ్వనాథశెట్టిపై చాంబర్‌లోనే దాడి
- రక్తమోడుతున్న స్థితిలో దవాఖానకు తరలింపు
- ప్రాణం కాపాడిన 'త్రీపీస్ సూట్'
- దాడికి పాల్పడిన తేజ్‌రాజ్ అరెస్ట్
- భద్రతా వైఫల్యంపై చర్యలు తీసుకుంటాం : సీఎం సిద్దరామయ్య



బెంగళూరు, మార్చి 7: కర్ణాటక లోకాయుక్త జస్టిస్ విశ్వనాథ శెట్టిపై బుధవారం ఆయన కార్యాలయంలోనే హత్యాయత్నం జరిగింది. తేజ్‌రాజ్ శర్మ అనే యువకుడు లోకాయుక్తను కత్తితో మూడు నాలుగు సార్లు పొడిచాడు. వెంటనే భద్రతాసిబ్బంది నిందితుడిని అదుపులోకి తీసుకుని పోలీసులకు అప్పగించారు. ఈ ఘటనలో గాయపడిన శెట్టిని బెంగళూరులోని మాల్యా దవాఖానకు తరలించారు. ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. త్రీపీస్ (మూడుమడతల సూట్) ధరించడం వల్లే షెట్టికి కత్తిపోట్లు లోతుగా పడలేదని తెలుస్తున్నది. రక్తస్రావం తప్ప, ప్రాణాపాయమేదీ లేదని వైద్యులు చెప్పారు. రాష్ట్ర సెక్రటేరియట్‌లో జరిగిన ఈ ఘటనతో కర్ణాటక ఉలిక్కిపడింది. సీఎం సిద్దరామయ్య హుటాహుటిన దవాఖానకు వెళ్లి శెట్టి ఆరోగ్యపరిస్థితి గురించి వైద్యులతో చర్చించారు. కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తిగా పనిచేసిన విశ్వనాథ శెట్టి 2017 జనవరిలో రాష్ట్ర లోకాయుక్తగా నియమితులయ్యారు. పోలీసులు, ప్రత్యక్షసాక్షుల కథనం ప్రకారం.. తుముకూరు ప్రాంతానికి చెందిన తేజ్‌రాజ్ ఫర్నీచర్ వ్యాపారి. ఓ టెండర్‌కు సంబంధించిన వివాదంలో పది మంది అధికారులపై ఆయన లోకాయుక్తలో మూడుసార్లు ఫిర్యాదు చేశాడు. అయితే ఆ ఆరోపణల్లో నిజం లేదని నిర్ధారించిన లోకాయుక్త కార్యాలయం ఆ కేసుల్ని కొట్టివేసింది. దీంతో తీవ్ర అసంతృప్తితో ఉన్న తేజ్‌రాజ్ నాలుగోసారి ఫిర్యాదు చేసేందుకు బుధవారం వచ్చాడు. చాంబర్‌లోకి వెళ్లిన అనంతరం వెంట తెచ్చుకున్న కత్తితో లోకాయుక్తపై దాడికి పాల్పడ్డాడు. భద్రతాపర లోపాలపై విచారణ జరుపుతామని ముఖ్యమంత్రి సిద్దరామయ్య చెప్పారు.

సీసాలో లేఖ.. 132 ఏండ్ల కిందటిదట!

■ ఆస్ట్రేలియాలోని మారుమూల బీచ్‌లో లభ్యం



సిడ్నీ, మార్చి 7: నాగార్జున హీరోగా వచ్చిన శివమణి సినిమా గుర్తుందా.. అందులో హీరోయిన్ తన ప్రేమ గురించి ఒక లేఖ రాసి దానిని సీసాలో పెట్టి సముద్రంలో పారేస్తుంది.. అది ఓ రిపోర్టర్‌కు దొరుకుతుంది.. ఇలాగే ఆస్ట్రేలియాలోనూ ఓ సీసా దొరికింది. పెర్త్ నగరానికి 160 కిలోమీటర్ల దూరంలో ఉన్న వెడ్జ్ దీవుల్లోని బీచ్‌లో ప్రముఖ ఫార్ములా వన్ రేసర్ డానియల్ రిక్కియార్డో బృందానికి లేఖతో ఉన్న సీసా దొరికింది. ఆ లేఖ గురించి ఆరా తీయగా దాదాపు 132 ఏండ్ల కిందట రాసినట్టుగా గుర్తించారు. ఇలా సీసాల్లో దొరికిన లేఖల్లో ఇదే పురాతనమైనదని తేల్చారు. సీసాను తెరిచి లేఖను చదువగా జర్మన్ భాషలో రాసి ఉన్నట్టు గుర్తించారు. గూగుల్ ట్రాన్స్‌లేట్ ద్వారా దానిని చదువగా... ఈ లేఖను 1886 జూన్ 12న రాసినట్టు గుర్తించారు. ఆ తర్వాత పలు మ్యూజియంలను సంప్రదించి వివరాలు సేకరించగా.. 19వ శతాబ్దంలో ఆస్ట్రేలియా పడమటి తీరానికి 950 కిలోమీటర్ల దూరంలో జర్మనీకి చెందిన బార్క్ పౌలా అనే ఓడ నుంచి దీనిని జారవిడిచినట్టు గుర్తించారు.

ట్రంప్ ఆర్థిక సలహాదారు కోన్ రాజీనామా



వాషింగ్టన్, మార్చి 7: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సలహాదారుల జాబితా నుంచి మరో వ్యక్తి వైదొలిగారు. వైట్‌హౌస్ ఆర్థిక ముఖ్యసలహాదారు పదవి నుంచి గ్యారీ కోన్ తప్పుకున్నారు. ట్రంప్ చేపడుతున్న వివాదాస్పద వాణిజ్య విధానాలతో గత కొంతకాలంగా విభేదిస్తున్న కోన్ చివరకు రాజీనామా చేసి వైట్‌హౌస్ నుంచి వెళ్లిపోయారు. గ్యారీ కోన్... వైట్‌హౌస్ నేషనల్ ఎకనామిక్ కౌన్సిల్ డైరెక్టర్‌గా సేవలందించారు. దిగుమతి చేసుకునే స్టీలుపై 25 శాతం, అల్యూమినియంపై 10 శాతం పన్ను విధిస్తూ ట్రంప్ తీసుకున్న నిర్ణయాన్ని గ్యారీ కోన్ వ్యతిరేకించారు.

విదేశీ పర్యటనలో రాహుల్ గాంధీ

■ సింగపూర్, మలేషియాలో ఐదు రోజుల పర్యటన

న్యూఢిల్లీ: సింగపూర్, మలేషియాల్లో ఐదు రోజుల పర్యటకు కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ బుధవారం నాడు బయల్దేరి వెళ్లారు. కాంగ్రెస్ పార్టీ వర్గాలు తెలిపిన సమాచారం మేరకు, సింగపూర్ చేరుకున్న రాహుల్‌కు అక్కడి విమానాశ్రయంలో ఘనస్వాగతం లభించింది. ఈనెల 9 న సింగపూర్ ప్రధానితో మరుసటి రోజున సింగపూర్‌లోని ప్రవాస భారతీయ పారిశ్రామికవేత్తలతో భేటీకానున్నారు. ఈనెల 10న మలేషియా పారిశ్రామికవేత్తలు, వ్యాపారవేత్తలతో భేటీకానున్నారు.

హిందువుగా గర్విస్తున్నా.. ఈద్‌ను జరుపుకోను

■ యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్

లక్నో: ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్, ఫుల్పూర్ ఉపఎన్నికల నేపథ్యంలో యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ మరోసారి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. తానో హిందువునని, ఈద్‌ను జరుపుకొనేందుకు తనకు ఎటువంటి కారణం కనిపించడంలేదని ఆదిత్యనాథ్ మంగళవారం పేర్కొన్నారు. 'నేను వారిలా (సమాజ్‌వాదీ పార్టీ నేతల్లా) కాదు. ఎందుకంటే నేనో హిందువును. అందుకు నేను గర్విస్తున్నా. ఈద్‌ను జరుపుకొనేందుకు నాకు ఎలాంటి కారణం కనిపించడంలేదు. కానీ నా ప్రభుత్వం ఈద్‌ను శాంతియుతంగా జరుపుకొనేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తుంది' అని ఒక ప్రకటనలో చెప్పారు.

ఖైదీల విడుదలకు భారత్, పాక్ అంగీకారం

న్యూఢిల్లీ/ఇస్లామాబాద్: ఇరుదేశాల కస్టడీలో ఉన్న మహిళా ఖైదీలు, 70 ఏండ్లకు పైబడిన ఖైదీల విడుదలకు భారత్, పాకిస్థాన్ అంగీకరించాయి. అలాగే సంయుక్త జ్యుడీషియల్ కమిటీ పర్యటనలను పునరుద్ధరించాలని నిర్ణయించాయి. మహిళలు, చిన్నపిల్లలు, మానసిక స్థితి సరిగాలేని ఖైదీల విడుదలకు సహకరించాలని, ఈ విషయాన్ని మానవతా దృక్పథంలో చూడాలని ఇటీవల విదేశాంగశాఖ మంత్రి సుష్మాస్వరాజ్ పాకిస్థాన్‌ను కోరారు. ఇందుకు పాక్ సానుకూలంగా స్పందించిందని విదేశాంగశాఖ బుధవారం తెలిపింది.

రాజ్యసభ బరిలో కేంద్రమంత్రులు

■ యూపీ నుంచి జైట్లీ.. బీహార్ నుంచి ప్రధాన్

న్యూఢిల్లీ, మార్చి 7 : రాజ్యసభకు పలువురు కేంద్ర మంత్రులు వివిధ రాష్ట్రాల నుంచి పోటీ చేయనున్నారు. కేంద్ర ఆర్థికశాఖ మంత్రి అరుణ్ జైట్లీ యూపీ నుంచి, పెట్రోలియం శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ మధ్యప్రదేశ్ నుంచి రాజ్యసభ బరిలో నిలువనున్నారు. మానవవనరులశాఖ మంత్రి ప్రకాశ్ జావ్‌దేకర్ మహారాష్ట్ర నుంచి పోటీ పడనున్నారు. ప్రస్తుతం జైట్లీ గుజరాత్ నుంచి, ప్రధాన్ బీహార్ నుంచి, జావ్‌దేకర్ మధ్యప్రదేశ్ నుంచి రాజ్యసభకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు.మరో ఐదుగురు కేంద్రమంత్రులు.. తావర్‌చంద్ గెహ్లాట్ (మధ్యప్రదేశ్), న్యాయశాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ (బీహార్), జేపీ నడ్డా (హిమాచల్ ప్రదేశ్), పురుషోత్తం భూపాల (గుజరాత్), మన్‌సుఖ్ మాండవీయ (గుజరాత్), బీజేపీ ప్రధాన కార్యదర్శి భూపేందర్‌యాదవ్ (రాజస్థాన్).. ప్రస్తుతం వారు ప్రాతినిధ్యం వహిస్తున్న రాష్ట్రాల నుంచే రాజ్యసభ బరిలో నిలువనున్నారు. ఈమేరకు బీజేపీ కేంద్ర ఎన్నికల కమిటీ బుధవారం రాత్రి ఓ ప్రకటన విడుదల చేసింది.

ధ్వంసరచనపై అట్టుడికిన పార్లమెంట్

- విపక్షాల ఆందోళనకు తోడైన ఎన్డీయే భాగస్వామ్య పార్టీలు
- రిజర్వేషన్ కోటా పెంపు కోరుతూ టీఆర్ఎస్ ఎంపీల ఆందోళన
- ఉభయసభలు రేపటికి వాయిదా



పార్లమెంట్ ముందు ఏఐఏడీఎంకే సభ్యుల నిరసన

న్యూఢిల్లీ, మార్చి7: విగ్రహాలను ధ్వంసం చేసిన ఘటనలపై బుధవారం పార్లమెంట్ అట్టుడికింది. ఉభయసభల్లోనూ విపక్షాల ఆందోళనకు.. శివసేన, ఏఐఏడీఎంకే, టీడీపీ వంటి అధికారపక్ష భాగస్వామ్య పార్టీలు కూడా తోడవడంతో సభాకార్యక్రమాలు స్తంభించాయి. చివరకు ఆందోళనల మధ్యే ఉభయసభలు గురువారానికి వాయిదా పడ్డాయి. ఉదయం లోక్‌సభలో ప్రశ్నోత్తరాల సమయం ప్రారంభం కానుండగా, టీఆర్ఎస్, శివసేన, టీడీపీ, వైఎస్ఆర్ కాంగ్రెస్, ఏఐఏడీఎంకే , తృణమూల్ కాంగ్రెస్ సభ్యులు లేచి వేర్వేరు అంశాలపై నినాదాలు ప్రారంభించారు. దీంతో గందరగోళం మధ్యే లోక్‌సభ రెండుసార్లు వాయిదా పడింది. తిరిగి సమావేశమైన తర్వాత ఏఐఏడీఎంకే, ఆప్ సభ్యులు ప్లకార్డులతో వెల్‌లో నిలబడి నినాదాలు చేశారు. తెలంగాణలో రిజర్వేషన్ కోటా పెంపును డిమాండ్ చేస్తూ టీఆర్ఎస్ సభ్యులు నినాదాలు చేశారు. ఏపీకి ప్రత్యేక హోదాపై టీడీపీ, రాష్ట్ర పునర్విభజన చట్టాన్ని అమలు చేయాలని వైసీపీ, మరాఠీకి ప్రాచీన భాష హోదా కల్పించాలని శివసేన ఎంపీలు ఆందోళనకు దిగారు. మరోవైపు విపక్షాల ఆందోళన కారణంగా రాజ్యసభ పలుమార్లు వాయిదా పడింది. విగ్రహాల ధ్వంసంపై రాజ్యసభ చైర్మన్ వెంకయ్య కూడా ఆగ్రహం వ్యక్తంచేశారు. 'విగ్రహాలు ధ్వంసం చేయడం సిగ్గుచేటు. ఎక్కడ ఎవరు అలాంటి చర్యకు పాల్పడినా అది మూర్ఖత్వమే' అని ఆయన పేర్కొన్నారు. అన్ని అంశాలపై తాము చర్చకు సిద్ధమేనని కేంద్రమంత్రి విజయ్‌గోయల్ తెలిపినప్పటికీ సభ్యులు శాంతించలేదు. దీంతో చైర్మన్ మధ్యాహ్నం వరకు సభను వాయిదా వేశారు. అనంతరం కూడా ఆందోళనలు సద్దుమణుగకపోవడంతో సభను గురువారానికి వాయిదా వేస్తున్నట్లు డిప్యూటీ చైర్మన్ కురియన్ జోసెఫ్ ప్రకటించారు. కాగా, ఈ ఏడాది దేశంలో నిరుద్యోగుల సంఖ్య 1.86కోట్లకు (3.5 శాతానికి) చేరవచ్చని అంతర్జాతీయ కార్మిక సంస్థ అంచనా వేసినట్లు ప్రభుత్వం పార్లమెంట్‌కు తెలిపింది. అలాగే దేశ జనాభాలో 89.2శాతం మంది ఇప్పటివరకు విశిష్ట గుర్తింపు సంఖ్య ఆధార్‌ను పొందారని వేర్వేరు ప్రశ్నలకు ఇచ్చిన సమాధానంలో వెల్లడించింది.

శ్రీలంకలో ఆగని అల్లర్లు

■ రెండు మసీదులు, పలు దుకాణాలపై కొనసాగిన దాడులు

■ సామాజిక మాధ్యమాల నెట్‌వర్క్ నిలిపివేత.. ప్రభుత్వం ఆదేశాలు

కొలంబో: శ్రీలంకలో మతఘర్షణలు చల్లారలేదు. ముస్లిం వ్యతిరేక అల్లర్లు కొనసాగాయి. ఇప్పటికే దేశంలో ఎమర్జెన్సీ ప్రకటించినా.. బుధవారం కూడా పలు చోట్ల ఘర్షణలు చోటుచేసుకున్నాయి. హింసాత్మక ఘటనల సమాచారం వ్యాప్తి చెందకుండా సామాజిక మాధ్యమాల నెట్‌వర్క్‌లను అధికారులు నిలిపేశారు. పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చేందుకు వరుసగా మూడోరోజు కూడా చాలా ప్రాంతాల్లో పోలీసులు కర్ఫ్యూ విధించారు. ప్రతీకార దాడులు జరుగుతాయనే భయం నెలకొన్నదని, బుధవారం రెండపట్టణాల్లోని రెండు మసీదులు, ముస్లింలకు చెందిన పలు దుకాణాలపై బౌద్ధుల గ్రూపులు దాడులకు పాల్పడ్డాయని ఓ స్థానికుడు తెలిపారు. శ్రీలంకలో ఉన్న బౌద్ధులు, మైనారిటీలుగా ఉన్న ముస్లింల మధ్య ఉద్రిక్త పరిస్థితులు చోటుచేసుకుంటున్న విషయం తెలిసిందే.

ప్రధానిని కించపర్చినందుకు జవాన్ జీతం కట్

■ ఆదేశాలను ఉపసంహరించుకోవాలని మోదీ ఆదేశం

న్యూఢిల్లీ, మార్చి 7: ప్రధాని మోదీని కించపరిచేలా మాట్లాడిన ఓ జవాన్ జీతంలో కోత విధించాలని బీఎస్ఎఫ్ నిర్ణయించింది. ఈ విషయం తెలిసిన ప్రధాని వెంటనే ఆ ఆదేశాలను వెనక్కి తీసుకోవాలని సూచించారు. దీంతో బీఎస్ఎఫ్ ఆ ఆదేశాలను వెనక్కి తీసుకుంది. పశ్చిమబెంగాల్‌లోని బీఎస్ఎఫ్‌కు చెందిన 15వ బెటాలియన్‌లో సంజీవ్‌కుమార్ జవాన్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. గతనెల 21న ఉదయం రోల్ కాల్ టాస్క్‌కు హాజరై వస్తున్న ఆయనను ఎక్కడి వెళ్లివస్తున్నావు అని అధికారి ప్రశ్నించగా.. మోదీ ప్రోగ్రామ్‌కు వెళ్లివస్తున్నానని చెప్పాడు. దీంతో తీవ్ర ఆగ్రహానికి గురైన అధికారి జవాన్ ఏడురోజుల జీతం కట్ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రధానిని కించపర్చిమాట్లాడినందుకుగాను ఈ శిక్ష విధిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ విషయం ప్రధాని మోదీకి తెలువడంతో తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. వెంటనే ఆ ఆదేశాలను ఉపసంహరించుకోవాలని ఆదేశించారు.

కర్ణాటక నుంచి కన్నడిగులకే అవకాశం!

■ రాజ్యసభ అభ్యర్థుల విషయంలో రాహుల్‌తో సిద్దరామయ్య ప్రతిపాదన

బెంగళూరు, మార్చి 7: త్వరలో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో తిరిగి అధికారం చేజిక్కించుకునేందుకు రాజ్యసభ ఎన్నికల్ని ఉపయోగించుకోవాలని కర్ణాటక సీఎం సిద్దరామయ్య వ్యూహం రచించినట్లుగా కనిపిస్తున్నది. కన్నడిగులనే రాజ్యసభకు పంపాలన్న తన వాదనను పార్టీ అధిష్ఠానం ఎదుట వినిపించేందుకు సిద్ధమైనట్లుగా తెలుస్తున్నది. కాంగ్రెస్ అధిష్ఠానం ఎంపిక చేసిన గాంధీ కుటుంబానికి సన్నిహితుడైన శ్యామ్ పిట్రోడా, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి జనార్దన్ ద్వివేది పేర్లను నిరాకరించాలని కర్ణాటక కాంగ్రెస్ నిర్ణయించినట్లు సమాచారం. మంగళవారం నాడు రాహుల్‌గాంధీతో సమావేశమైన సందర్భంగా, అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించేందుకు గాను కన్నడిగులకు మాత్రమే రాజ్యసభ ఎన్నికల్లో ప్రాధాన్యం ఇవ్వాలని సిద్దరామయ్య కోరినట్లు తెలుస్తున్నది. ఈనెల 23 న జరుగనున్న రాజ్యసభ ఎన్నికల్లో కర్ణాటకలోని నాలుగు స్థానాల్లో రెండు అధికార కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకునే అవకాశముండగా, మరో స్థానం ప్రతిపక్ష బీజేపీకి దక్కనుంది. నాలుగో స్థానం కోసం కాంగ్రెస్-జేడీఎస్‌లు పోటీ పడనున్నాయి. కాగా, అభ్యర్థుల ఎంపికపై నిర్ణయం తీసుకునేందుకు కొంత సమయం ఇవ్వాలని రాహుల్ సూచించినట్లుగా సమాచారం.



బీజేడీ అభ్యర్థులు అచ్యుత సమంత, ప్రశాంత్ నందా, సౌమ్యరంజన్ పట్నాయక్

ఒడిశా నుంచి మీడియా దిగ్గజం, సంఘసేవకుడు...

రాజ్యసభ ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థులుగా కొత్త వ్యక్తులకు అవకాశమివ్వాలని ఒడిశా ముఖ్యమంత్రి, బీజేడీ అధినేత నవీన్ పట్నాయక్ నిర్ణయించారు. మీడియా దిగ్గజం సౌమ్య రంజన్ పట్నాయక్, ప్రముఖ సంఘసేవకుడు డాక్టర్ అచ్యుత సమంతలతో పాటు పార్టీ ఉపాధ్యక్షుడు, నటుడు ప్రశాంత నందాలను బీజేడీ అభ్యర్థులుగా ఎంపిక చేశారు. బుధవారం నవీన్ పట్నాయక్ సమక్షంలో సౌమ్య రంజన్, డాక్టర్ అచ్యుత సమంతలు బీజేడీలో చేరారు. సౌమ్యరంజన్ 11 వ లోక్‌సభకు ప్రాతినిధ్యం వహించగా, ప్రశాంత నందా బెగునియా నుంచి ఎమ్మెల్యేగా రెండు సార్లు గెలిచారు.

ఐటీబీపీ రక్షణ విభాగంలో తొలి మహిళా అధికారి

■ చరిత్ర సృష్టించిన 25ఏండ్ల ప్రకృతి



న్యూఢిల్లీ, మార్చి 7: ఇండో-టిబెట్ సరిహద్దు రక్షణ బాధ్యతల్లోకి తొలిసారిగా ఒక మహిళాఅధికారి ప్రవేశించారు. 25ఏండ్ల 'ప్రకృతి' ఆ ఘనత సాధించిన తొలి మహిళగా నిలిచారు. యూపీఎస్సీ నిర్వహించిన సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్స్ (సీఏపీఎఫ్) పరీక్షలో నెగ్గిన ప్రకృతి ఇండో-టిబెటన్ సరిహద్దు పోలీస్ (ఐటీబీపీ)లోరక్షణాధికారిగా నియమితులయ్యారు. ఐటీబీపీ రక్షణ, పోరాట విభాగాల్లో మహిళా అధికారుల నియామకానికి అనుమతిస్తూ 2016లో కేంద్రం ఉత్తర్వులిచ్చింది. 'యూనిఫాం సర్వీసెస్‌లోకి వెళ్లి దేశానికి సేవ చేయాలన్నది నా కల. వాయుసేనలో పనిచేస్తున్న మా నాన్నే నాకు స్ఫూర్తి' అని ప్రకృతి తెలిపారు. బీహార్‌లోని సమస్తిపూర్ జిల్లాకు చెందిన ప్రకృతి ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్‌లో పట్టభద్రురాలయ్యారు. ఉత్తరాఖండ్‌లోని పితోరాగఢ్‌లో ఉన్న ఐటీబీపీ యూనిట్‌లో విధుల్లో చేరిన ప్రకృతి త్వరలోనే డెహ్రాడూన్‌లో పూర్తిస్థాయి అధికారుల శిక్షణను తీసుకోనున్నారు. శిక్షణ తర్వాత వచ్చే ఏడాది ఆమె అసిస్టెంట్ కమాండెంట్‌గా బాధ్యతలు చేపడుతారని సీనియర్ అధికారి ఒకరు తెలిపారు.

'చెత్త బాంబు' పేలే వరకూ చూస్తారా?

■ రాష్ట్రాలను ప్రశ్నించిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, మార్చి 7: వ్యర్థాల నిర్వహణలో రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. జాతీయస్థాయి సమస్యను తేలికగా తీసుకోవడం విస్మయం కలిగిస్తున్నదని వ్యాఖ్యానించింది. 'చెత్త బాంబు' పేలేవరకూ ఇలాగే వేచిచూస్తుంటారా?' అని తీవ్ర స్వరంతో ప్రశ్నించింది. వ్యర్థాల నిర్వహణపై తీసుకుంటున్న చర్యలను వివరిస్తూ రాష్ట్రాలు, యూటీలు మార్చ్ మొదటివారంలోగా వేర్వేరుగా అఫిడవిట్లు దాఖలు చేయాలని గత నెల 6న జరిగిన విచారణ సందర్భంగా ధర్మాసనం ఆదేశించింది. అయితే బుధవారం జరిగిన విచారణకు ఢిల్లీ మినహా రాష్ట్రాల తరపు న్యాయవాదులెవరూ హాజరుకాకపోవడంపై న్యాయమూర్తులు జస్టిస్ మదన్ బీ లోకూర్, కురియన్ జోసెఫ్, దీపక్‌గుప్తాలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం ఆగ్రహం వ్యక్తంచేసింది.

నేరాన్ని అంగీకరించిన శ్రీనివాస్ కూచిభొట్ల హంతకుడు



వాషింగ్టన్ : అమెరికా కాన్సాస్‌లోని ఓ బార్‌లో గత ఏడాది భారతీయ ఇంజినీర్ శ్రీనివాస్ కూచిభొట్లను జాత్యహంకారంతో హత్య చేసిన నిందితుడు బుధవారం తన నేరాన్ని కోర్టు ఎదుట అంగీకరించాడు. అమెరికా నేవీ మాజీ ఉద్యోగి అయిన నిందితుడు ఆడమ్ ప్యూరింటన్ (52) తన నేరాన్ని అంగీకరిస్తూ కాన్సాస్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశాడు. శ్రీనివాస్ కూచిభొట్ల (32) హత్య కేసులో నిందితుడిపై ఉద్దేశపూర్వక హత్య (ఫస్ట్ డిగ్రీ మర్డర్) నేరారోపణలను పోలీసులు నమోదు చేశారు. శ్రీనివాస్ స్నేహితుడు అలోక్ మాడసానితోపాటు మరొకరిపై హత్యాయత్నానికి పాల్పడిన కేసులను కూడా నమోదుచేశారు. నిందితుడు నేరం అంగీకరించడాన్ని శ్రీనివాస్ కూచిభొట్ల భార్య సునయన స్వాగతించారు. 'ఈ రోజు నిందితుడు నేరాన్ని ఒప్పుకోవడం వల్ల నా శ్రీను తిరిగి రాకపోవచ్చు. కానీ జాత్యహంకారం, విద్వేషం అంగీకారయోగ్యం కాదనే గట్టి సందేశాన్ని ఈ ఘటన అందరికీ పంపుతుంది' అని పేర్కొన్నారు.

అసేంద్రియ ఉత్పత్తుల సరఫరాపై నిషేధం

■ సిక్కిం సీఎం పవన్‌కుమార్ చామ్లింగ్ ప్రకటన.. 31 నుంచి అమలు

గ్యాంగ్‌టక్ : ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే అసేంద్రియ ఉత్పత్తుల సరఫరాపై నిషేధం విధించాలని సిక్కిం ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నెల 31 నుంచి దీన్ని అమలు చేయనున్నట్టు సీఎం పవన్‌కుమార్ చామ్లింగ్ బుధవారం అసెంబ్లీలో తెలిపారు. ఇది సిక్కిం రైతులకు పెద్దఎత్తున లబ్ధి చేకూర్చడమే గాక ఇతర రాష్ట్రాలు సైతం సేంద్రియ మార్గాన్ని అనుసరించేలా ఉదాహరణగా నిలుస్తుందని సీఎం పేర్కొన్నారు. రెండేండ్ల కిందటే సిక్కిం తనను తాను తొలి సేంద్రియ రాష్ట్రంగా ప్రకటించుకున్నది.



చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్ కల్పిస్తేనే న్యాయం

మహిళాదినోత్సవ సభలో మాడ రజిత

హైదరాబాద్, నమస్తేతెలంగాణ: చట్ట సభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలైనప్పుడే సమాజంలో మహిళలకు పూర్తిస్థాయి న్యాయం జరుగుతుందని పంచాయతీరాజ్ ఉమెన్స్ వెల్ఫేర్ సొసైటీ సలహాదారు డాక్టర్ మాడ రజిత పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను బుధవారం హైదరాబాద్ ఎర్రమంజిల్‌లోని పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ ప్రధాన కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రజిత మాట్లాడుతూ సమాజంలో మహిళలను పూజించాలి, గౌరవించాలనే స్థాయి నుంచి గుర్తింపు కోసం పురుషులతో పోటీపడే స్థాయికి మహిళలు వచ్చారన్నారు. అన్నిరంగాల్లో మహిళలకు మరింతగా అవకాశాలు పెరుగాల్సిన అవసరం ఉన్నదని అభిప్రాయపడ్డారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా రెండురోజులుగా పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ మహిళా అధికారులు, ఉద్యోగినులకు వివిధ రకాల క్రీడలను నిర్వహించారు. క్రీడల్లో గెలుపొందినవారికి బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఇంజినీర్ వినోభాదేవి, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీర్స్ మహిళా వింగ్ అధ్యక్షురాలు అర్చన, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కవిత, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సుమేధ, సరిత, సురేఖ, పల్లవి, సత్యవతి, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.



అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో మాట్లాడుతున్న పంచాయతీరాజ్ ఉమెన్స్ వెల్ఫేర్ సొసైటీ సలహాదారు డాక్టర్ మాడ రజిత


శ్రీనివాస్ దంపతులకు చెక్కు అందజేస్తున్న మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ, టీయూడబ్ల్యూజే రాష్ట్ర ఉపాధ్యక్షుడు పల్లె రవికుమార్, కోశాధికారి మారుతీ సాగర్ తదితరులు

శేరిలింగంపల్లి జర్నలిస్టుల ఐక్యత ఆదర్శం

- మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ
- క్యాన్సర్‌తో పోరాడుతున్న నమస్తే తెలంగాణ రిపోర్టర్ శ్రీనివాస్‌కు రూ.15 లక్షల ఆర్థిక సాయం

శేరిలింగంపల్లి: జర్నలిస్టులు ఐక్యంగా ఉండి పరస్పరం సహకరించుకోవాలని, ఈ విషయంలో శేరిలింగంపల్లి ప్రెస్‌క్లబ్ ఇతరులకు ఆదర్శంగా నిలిచిందని మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ పేర్కొన్నారు. క్యాన్సర్‌తో పోరాడుతున్న 'నమస్తే తెలంగాణ' హఫీజ్‌పేట్ రిపోర్టర్ నక్కంటి శ్రీనివాసులుకు శేరిలింగంపల్లి ప్రెస్‌క్లబ్ (టీయూడబ్ల్యూజే-హెచ్143) అండగా నిలిచింది. ఆయనకు చికిత్స అందించే ఆర్థిక స్థోమత లేని నిస్సహాయ స్థితిలో ఉన్న కుటుంబానికి ఆర్థికంగా చేదోడు అందించింది. శ్రీనివాస్‌కు సాయం చేసేందుకు శేరిలింగంపల్లి జర్నలిస్టులు రూ.3.79 లక్షలు కూడబెట్టారు. వారికి స్థానిక ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ రూ.1.50 లక్షలు, మాదాపూర్ కార్పొరేటర్ జగదీశ్వర్‌గౌడ్ రూ.1.50 లక్షలు, శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ రూ.లక్ష, గచ్చిబౌలి కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా రూ.లక్ష, కొండాపూర్ కార్పొరేటర్ హమీద్ పటేల్ రూ.75 వేలు, మియాపూర్ కార్పొరేటర్ మేకా రమేశ్ రూ.10 వేలు, స్థానిక నాయకుడు పులిపాటి రాజేందర్ రూ.2 లక్షలు, వ్యాపారి మహేశ్ రూ.1.50 లక్షలు, పటాన్‌చెరు టీఆర్‌ఎస్ ఇంచార్జి గాలి అనిల్‌కుమార్ రూ.50 వేలు, వెస్ట్ జోన్ బిల్డర్స్ అసోసియేషన్ రూ.50వేలు, బీజేపీ నాయకుడు చింతకింది గోవర్ధన్‌గౌడ్ రూ.26 వేలు, బిల్డర్ రాఘవరావు రూ.25 వేలు, స్థానికుడు సుధాకర్‌గౌడ్ రూ.20 వేలు, టీఆర్‌ఎస్ నాయకుడు వీరేశంగౌడ్ రూ.10 వేలు, సీపీఎం నాయకుడు శోభన్ రూ.5 వేలు ఆర్థిక సాయం అందించారు. ఆ మొత్తం రూ.15 లక్షల సహాయనిధిని శేరిలింగంపల్లి ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఉప్పరి రమేశ్ సాగర్, పుట్ట వినయకుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో బుధవారం మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ పాల్గొని శ్రీనివాస్ కుటుంబసభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా అల్లం నారాయణ మాట్లాడుతూ శేరిలింగంపల్లి జర్నలిస్టులు తోటి పాత్రికేయుడు ఆపదలో ఉన్నప్పుడు పెద్ద మొత్తంలో సహాయనిధిని కూడగట్టడం అభినందనీయమన్నారు. టీయూడబ్ల్యూజే రాష్ట్ర ఉపాధ్యక్షుడు పల్లె రవికుమార్, కోశాధికారి మారుతీ సాగర్ మాట్లాడూతూ రాష్ట్ర కమిటీ తరపున శేరిలింగంపల్లి జర్నలిస్టులకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. నిస్సహాయ స్థితిలో ఉన్న తమను గుర్తించి ఇంత పెద్ద మొత్తంలో ఆర్థిక సాయం అందించిన ప్రతి ఒక్కరికీ రుణపడి ఉంటామని శ్రీనివాస్, శ్యామల దంపతులు పేర్కొన్నారు. కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పైళ్ల విట్టల్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఉప్పరి శేఖర్‌సాగర్, ఉపాధ్యక్షుడు గంట్ల రాజిరెడ్డి, యూనియన్ నాయకులు రాములుగౌడ్, సుధాకర్, లక్ష్మీనారాయణ, భిక్షపతి సాగర్, లక్ష్మీనారాయణ, నారాయణరావు, రాజేశ్‌గౌడ్, శంకర్, మల్లేశ్‌గౌడ్, దయాకర్, కిశోర్, శ్రీనివాస్, దేవేందర్, రవిసాగర్, ఎల్లేశ్, నగేశ్, మణికంఠ పాల్గొన్నారు.


మేడ్చల్ జిల్లాస్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్. చిత్రంలో ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, కలెక్టర్ ఎంవీ రెడ్డి తదితరులు

ఎస్సీ, ఎస్టీ లైంగికదాడి బాధితులకు భరోసా కల్పించండి

- పరిహారం చెల్లింపు, కేసుల పరిష్కారంలో మేడ్చల్‌కు ప్రథమస్థానం
- అర్హులకు సంక్షేమ పథకాలను అందించాలి
- ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్

మేడ్చల్ జిల్లా, నమస్తే తెలంగాణ ప్రతినిధి: ఎస్సీ, ఎస్టీలపై లైంగికదాడి కేసులను సత్వరం పరిష్కరించాలని ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ సూచించారు. లైంగికదాడి బాధితులకు ప్రభుత్వ యంత్రాంగం అండగా నిలువడంతోపాటు వారికి బతుకుపై భరోసా కల్పించాల్సిన అవసరం ఉన్నదన్నారు. బుధవారం మేడ్చల్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ ఎంవీ రెడ్డి అధ్యక్షతన జిల్లాస్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఎర్రోళ్ల శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కమిషన్ చైర్మన్‌గా బాధ్యతలు తీసుకున్న తర్వాత మొదటి సమావేశం మేడ్చల్ జిల్లాలో నిర్వహించడం సంతోషంగా ఉన్నదన్నారు. ఎస్సీ, ఎస్టీల జీవన ప్రమాణాలను పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నదని, వాటిని అర్హులైన పేదలకు అందించేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. పౌర హక్కుల దినోత్సవం, ఎస్సీ, ఎస్టీ లైంగికదాడి కేసుల పరిష్కారంలో, బాధితులకు పరిహారం అందించడంలో మేడ్చల్ జిల్లా రాష్ట్రంలోనే ప్రథమస్థానంలో ఉన్నదని అభినందించారు. ఇలాంటి ఘటనల్లో నిందితులకు పడిన శిక్షలపై విస్తృత ప్రచారం కల్పించాలని పోలీసులకు సూచించారు. జిల్లాలో ఎస్సీల సంక్షేమం కోసం రూ.14కోట్లతో 580 యూనిట్లను ఏర్పాటు చేశారని, మిగిలిన జిల్లాలు దీనిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ లైంగికదాడి బాధితులకు నష్టపరిహారం చెల్లింపులో జాప్యం లేకుండా చూడటంతోపాటు తప్పుడు కేసులను పరిశీలించాలన్నారు. కలెక్టర్ ఎంవీ రెడ్డి మాట్లాడుతూ జిల్లా పరిధిలో ఎస్సీ, ఎస్టీ లైంగికదాడి కేసులు 280 నమోదు కాగా, 232 కేసుల్లో బాధితులకు పరిహారం చెల్లించామని, మిగతా వారికి చెల్లించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎస్సీ, ఎస్టీ లైంగికదాడి కేసుల పరిష్కారానికి ప్రత్యేక కోర్టు ఏర్పాటు చేయాలని, జిల్లాలో స్టడీ సర్కిల్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామన్నారు. సమావేశంలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు దేవయ్య, రాంబాబు నాయక్, నర్సింహ, జేసీ ధర్మారెడ్డి, జాయింట్ సీపీ తరుణ్‌జోషి, సైబరాబాద్ క్రైం డీసీపీ జానకీ షర్మిల, అడిషనల్ సీపీ మంజుల, డీసీపీలు శివప్రసాద్, ఉమా మహేశ్వర్‌రావు, సాయిశేఖర్, ఎంపీపీ సుజాత, డీవీఎంసీ సభ్యులు వెంకటేశ్వర్లు, రాజ్, ధన్‌రాజ్‌నాయక్, వెన్నెల, జిల్లా ఎస్సీ సంక్షేమ అధికారి యూసుఫ్‌అలీ పాల్గొన్నారు.

ఇది ఉద్యోగ నామ సంవత్సరం

ఈ ఏడాది ప్రథమార్థంలో భారీగా ఉద్యోగావకాశాలు

మంచి జీతాలు లభిస్తున్నదీ ఇప్పుడే.. స్టార్టప్‌ల పోటీతో ఉద్యోగులను పెంచుకుంటున్న కంపెనీలు

40 శాతం మహిళలకే కేటాయింపు.. విస్‌డమ్ జాబ్స్ డాట్ కామ్ సర్వేలో వెల్లడి

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:

నిరుద్యోగ సమస్య పట్టి పీడిస్తుందన్న ఆందోళనలు, అంచనాలను పటాపంచలు చేస్తూ ఈ ఏడాది ఆశాజనకంగానే ఉన్నదని.. 2018 సంవత్సరం మొదటి మూడు నెలల్లోనే అధికంగా ఉద్యోగాలు లభించాయని 'విస్‌డమ్ జాబ్స్ డాట్ కామ్' సర్వేలో వెల్లడైంది. కంపెనీలు ఈ ఏడాది ప్రథమార్థంలోనే అధికంగా ఉద్యోగులను నియమించుకున్నాయని, ముఖ్యంగా ఐటీ రంగంలో అధికంగా ఉద్యోగులు రిక్రూట్ అయ్యారని పేర్కొన్నది. గతేడాదితో పోల్చితే మంచి జీతాలు లభిస్తున్నది సైతం ఈ ఏడాదిలోనేనని ప్రకటించింది. దేశంలో ఉద్యోగాల కల్పన, వేతనాల తీరుతెన్నులపై విస్‌డమ్ జాబ్స్ డాట్ కామ్ ప్రధాన నగరాలైన ముంబై, హైదరాబాద్, చెన్నై, పుణె, ఢిల్లీ, కోల్‌కతా, బెంగళూరులో సర్వే చేపట్టింది. ఐటీ, రిటైల్, హాస్పిటాలిటీ, ఫాస్ట్‌మూవింగ్ కన్జ్యూమర్ గూడ్స్, హెల్త్‌కేర్, ఆటోమొబైల్స్, ఐటీఈఎస్, బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఇన్సూరెన్స్, ఎడ్యుకేషన్, మౌలికవసతుల రంగాలకు చెందిన 140 కంపెనీల్లోని 350కి పైగా రిక్రూటర్ల నుంచి సంస్థ అభిప్రాయాలు సేకరించింది. సర్వే ఫలితాలను ఆ సంస్థ సీఈవో అజయ్ కొల్ల బుధవారం మీడియాకు విడుదల చేశారు.

సవాల్ విసురుతున్న స్టార్టప్స్

ఇప్పుడిప్పుడే ఊపిరిపోసుకుంటున్న స్టార్టప్‌లు పెద్దపెద్ద కంపెనీలకు సవాల్ విసురుతున్నాయి. స్టార్టప్ కంపెనీలు భారీగా ఉద్యోగులను నియమించుకుంటుండటంతో ఐటీ, ఐటీయేతర రంగాలన్నీ తీవ్రమైన పోటీని ఎదుర్కొంటున్నాయి. దీనిని తట్టుకుని నిలదొక్కుకునేందుకు కంపెనీలు ఉద్యోగుల సంఖ్యను పెంచుకుంటున్నాయి. 30 శాతం కంపెనీలు కావాలనే ఉద్యోగులను అధికంగా నియమించుకుంటున్నట్టు సర్వేలో వెల్లడైంది. మహిళలు బుద్ధిగా, బాధ్యతాయుతంగా పనిచేస్తారన్న భావనతో 40 శాతం అవకాశాలను వారికే ఇస్తున్నట్టు 60 శాతం కంపెనీలు ప్రకటించాయి. మరో ఆసక్తికర విషయం ఏమిటంటే.. నియామకాల్లో అనుభవం ఉన్న ఉద్యోగులను కంపెనీలు పక్కన పెట్టేస్తున్నాయి. పెద్దగా అనుభవం లేకపోయినా కనిష్ఠంగా రెండేండ్లు, గరిష్ఠంగా ఐదేండ్ల అనుభవం ఉన్నవారిని నియమించుకోవడానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నాయి. ముఖ్యంగా ఐటీ రంగంలోనే ఈ ఏడాది అధికంగా ఉద్యోగావకాశాలు లభించనున్నాయి. ఈ రంగంలో వేతనాల పెంపు ఉద్యోగులను ఊరిస్తున్నది. అయితే జూనియర్, మిడిల్ లెవల్‌లోనే జీతం పెరుగుతుందని 60 శాతం మంది రిక్రూటర్లు అంచనా వేస్తున్నారు. ఏడాది కాలంగా ఐటీ సెక్టార్ మినహా ఏ రంగంలోనూ ఉద్యోగావకాశాలు పెద్దగా లభించడం లేదని 30 శాతం మంది రిక్రూటర్లు అభిప్రాయపడ్డారు.

సేల్స్, మార్కెటింగ్‌కే డిమాండ్..

ప్రస్తుత పరిస్థితుల్లో సేల్స్, మార్కెటింగ్ రంగాల్లోనే అధిక శాతం డిమాండ్ ఉన్నది. సేల్స్ రంగంలో 28 శాతం, మార్కెటింగ్‌లో 24, మానవవనరుల విభాగంలో 19, అడ్మినిస్ట్రేషన్ రంగంలో 13, ఆర్థికరంగంలో 9 శాతం ఉద్యోగాలకు డిమాండ్ ఉన్నది.

ఇండస్ట్రీలవారీగా ట్రెండ్స్ ఇలా..

ఏడాది కాలంలో అధికంగా ఐటీరంగంలోనే ఎక్కువగా నియామకాలు జరిగాయని 30 శాతం రిక్రూటర్లు అభిప్రాయపడ్డారు. ఇంజినీరింగ్‌లో 22 శాతం, మౌలికవసతుల రంగంలో 19, హెల్త్‌కేర్ సెక్టార్‌లో 15, రిటైల్ సెక్టార్‌లో 12 శాతం ఉద్యోగాలు లభిస్తున్నాయి.

తక్కువ అనుభవం ఉన్నవారికే..

ఈ ఏడాది నియామకాల్లో కంపెనీలు 2-5 ఏండ్లలోపు అనుభవమున్నవారికే ప్రాధాన్యం ఇస్తున్నాయి. అధిక అనుభవం ఉన్న అభ్యర్థులను పక్కనబెడుతున్నామని దాదాపు 40 శాతం కంపెనీలు పేర్కొన్నాయి. కనిష్ఠంగా రెండేండ్ల అనుభవం ఉన్నవారు 18 శాతం రిక్రూట్ అవుతుండగా, 5 నుంచి 10 ఏండ్ల వరకు అనుభవమున్నవారు 29 శాతం, పదేండ్ల అనుభమున్నవారు 9 శాతం రిక్రూట్ అవుతున్నట్టు విస్‌డమ్ జాబ్స్ డాట్ కామ్ సర్వేలో తేలింది.

సర్వేలోని ముఖ్యాంశాలు

- గతంతో పోల్చితే ఈ ఏడాది ఎక్కువ మందిని రిక్రూట్ చేసుకోవడానికి ప్రయత్నించినట్టు 60 శాతం కంపెనీలు వెల్లడించాయి.
- తమ రంగంలో స్టార్టప్స్ ప్రభావాన్ని తట్టుకోవడానికి కావాలనే ఉద్యోగులను ఎక్కువగా నియమించుకున్నట్టు 30 శాతం కంపెనీలు అభిప్రాయపడ్డాయి.
- మెట్రో నగరాలు, ద్వితీయ శ్రేణి నగరాల్లోని వారినే ఉద్యోగులుగా ఎంచుకున్నట్టు 52 శాతం కంపెనీలు చెప్పాయి.
- తమ కంపెనీ బడ్జెట్‌లో 10 శాతాన్ని ఉద్యోగుల నైపుణ్యాలను అభివృద్ధిపరచడం, శిక్షణ ఇవ్వడం కోసం వెచ్చిస్తున్నట్టు 58 శాతం కంపెనీలు ప్రకటించుకున్నాయి.
- ఉద్యోగులను కాపాడుకోవడం కోసం జీతభత్యాలు సహ ఇతర సౌలభ్యాలను కల్పిస్తున్నట్టు 45 శాతం కంపెనీలు తెలుపగా, ఉద్యోగులను కాపాడుకోవడంపై దృష్టి పెడుతున్నామని 32 శాతం, పని ప్రాంతాల్లో సౌకర్యాల కల్పనపై దృష్టి పెడుతున్నామని 27 శాతం కంపెనీలు పేర్కొన్నాయి.
- మహిళలు బుద్ధిగా, బాధ్యతాయుతంగా పనిచేస్తారన్న భావనతో 40 శాతం అవకాశాలను వారికే ఇస్తున్నట్టు 60 శాతం కంపెనీలు ప్రకటించాయి.

స్త్రీ నిధిలో మేడ్చల్ టాప్

లక్ష్యానికి మించి గ్రౌండింగ్ • వరుసగా రెండోసారి రాష్ట్రంలోనే జిల్లాకు ప్రథమస్థానం

మేడ్చల్ జిల్లా, నమస్తే తెలంగాణ ప్రతినిధి: స్త్రీ నిధి రుణాల జారీలో మేడ్చల్ జిల్లా మళ్లీ ప్రథమ స్థానంలో నిలిచింది. 2017-18 ఆర్థిక సంవత్సరంలో సెర్ప్ ఇచ్చిన లక్ష్యాన్ని మించి 130.56 శాతం రుణాలను జారీ చేసి రాష్ట్రంలోనే ప్రథమస్థానంలో నిలిచింది. జిల్లాలో మొత్తం 8,326 స్వయం సహాయక మహిళా సంఘాలుండగా, వీటిలో సుమారు 91,586 మంది సభ్యులున్నారు. వీరికి 2017-18 ఆర్థిక సంవత్సరంలో 25.09 కోట్ల రుణాలను లక్ష్యంగా నిర్ధారించగా, అంతకుమించి రూ.32.77 కోట్ల (130.56శాతం) రుణాలను జారీ చేశారు. స్త్రీ నిధి రుణాలతో మహిళలు స్వయం ఉపాధి పొందడంతో మరికొందరికి ఉపాధి కల్పించేస్థాయికి ఎదుగుతున్నారని జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ అధికారులు పేర్కొంటున్నారు. గతంలో పురుషులు మాత్రమే నిర్వహించే సౌండ్స్ అండ్ లైటింగ్ సిస్టం, స్లాబు సెంట్రింగ్ బాక్సులతోపాటు జిరాక్స్ సెంటర్ల వంటి వ్యాపారాలను నిర్వహిస్తూ స్త్రీ నిధి రుణం పొందిన మహిళలు కుటుంబానికి చేదోడువాదోడుగా ఉంటున్నారు. వీటితో పాటు జిల్లాలో స్త్రీ నిధి రుణం పొందిన మహిళలు కిరాణాషాపులు, మినీ డెయిరీఫాం, టెంట్‌హౌస్, బొమ్మల తయారీ, మగ్గం వర్క్స్, ట్రీగార్డుల తయారీ, బట్టల దుకాణం వంటి యూనిట్లను నెలకొల్పి స్వయం ఉపాధి పొందుతున్నారు. స్త్రీనిధి రుణాలు పొందిన మహిళల జీవన ప్రమాణాలు పెరిగాయి.

జిల్లాలో స్త్రీ నిధి రుణాల లక్ష్యం, జారీ వివరాలు

రూరల్ మండలం	లక్ష్యం (రూ.లక్షల్లో)	జారీ (రూ.లక్షల్లో)
బాచుపల్లి	67.2	121.46
దుండిగల్-గండిమైసమ్మ	338.54	553.39
ఘట్‌కేసర్	369.93	478.24
కాప్రా	163	216.76
కీసర	517.97	649.96
మేడ్చల్	362.21	378.99
మేడిపల్లి	359.01	556.16
శామీర్‌పేట	332.13	322.04
మొత్తం	2,509.99	3,277



మహిళలు ఆర్థిక ప్రగతి సాధించాలి

మహిళలు ఆర్థిక ప్రగతి సాధించాలి. లేదంటే కుటుంబంలో చాలా ఇబ్బందులు వచ్చే అవకాశం ఉన్నది. ఈ క్రమంలోనే జిల్లా పరిధిలోని ప్రతి సెల్ఫ్‌హెల్ప్ గ్రూప్ సభ్యురాలికి అర్హతలను బట్టి రుణాలివ్వాలని జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ అధికారులకు సూచించా. స్త్రీ నిధి రుణాల జారీలో మేడ్చల్ జిల్లా అగ్రస్థానంలో నిలువడం అధికారుల పనితీరుకు నిదర్శనం.

– డాక్టర్ ఎంవీ రెడ్డి, మేడ్చల్ జిల్లా కలెక్టర్

ఇదేస్ఫూర్తిని కొనసాగిస్తాం

మున్ముందు కూడా ఇదే స్ఫూర్తితో పనిచేస్తాం. ప్రభుత్వ ఆదేశాలు, కలెక్టర్ ఎంవీ రెడ్డి సూచనలను పాటిస్తూ అర్హులైన మహిళందరికీ రుణాలను జారీ చేశాం. గత ఏడాది కూడా స్త్రీ నిధి రుణాల జారీలో ప్రథమస్థానంలో నిలువడంతో జిల్లాకు అవార్డు వచ్చింది.

– కౌటిల్య, మేడ్చల్ జిల్లా డీఆర్‌డీవో



న్యాక్‌కు ప్రతిష్ఠాత్మక విశ్వకర్మ అవార్డు

నిర్మాణ నైపుణ్యాభివృద్ధికి గుర్తింపు

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: హైదరాబాద్ మాదాపూర్‌లోని నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్(న్యాక్)కు మరో జాతీయస్థాయి అవార్డు లభించింది. నిర్మాణరంగంలో నైపుణ్యాభివృద్ధికి చేస్తున్న కృషికి విశ్వకర్మ అవార్డు వరించింది. ఈ అవార్డును బుధవారం ఢిల్లీలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో కన్‌స్ట్రక్షన్ ఇండస్ట్రీ డెవలప్‌మెంట్ కౌన్సిల్(సీఐడీసీ) చైర్మన్ డాక్టర్ పీఎస్ రానా అందజేశారు. న్యాక్ డైరెక్టర్ జనరల్ కే భిక్షపతి నాయకత్వంలో డైరెక్టర్లు గంగాధర్, శాంతిశ్రీ ఈ అవార్డును అందుకున్నారు. 2018కి గాను న్యాక్ ఈ అవార్డుకు ఎంపికైంది. నిర్మాణ రంగంలో దేశవ్యాప్తంగా కృషి చేస్తున్న పలు సంస్థలను పరిశీలించిన అనంతరం ఉత్తమమైనదిగా న్యాక్‌ను ఎంపికచేశారు. విశ్వకర్మ అవార్డుకు 2012, 2016లోనూ న్యాక్‌ను ఎంపికచేశారు. అవార్డు రావడం పట్ల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అనందం వ్యక్తంచేశారు. న్యాక్ టీచింగ్ స్టాఫ్, ఉద్యోగులు, డైరెక్టర్లు, డైరెక్టర్ జనరల్‌ను అభినందించారు.



ఢిల్లీలో అవార్డు అందుకుంటున్న న్యాక్ డీజీ భిక్షపతి, డైరెక్టర్లు

శామీర్‌పేటలో నాలుగు కార్లు ఢీ.. ఒకరి మృతి


శామీర్‌పేట ఔటర్ రింగ్ రోడ్ వద్ద ఢీకొన్న కార్లు, (ఇన్‌సెట్‌లో) లాల్‌జీయాదవ్(ఫైల్)

శామీర్‌పేట: శామీర్‌పేట ఔటర్ రింగ్ రోడ్ సమీపంలోని రాజీవ్ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఒకదానికొకటి నాలుగు కార్లు ఢీనడంతో ఒకరు మృతి చెందగా, మరో 12 మంది గాయపడ్డారు. మంగళవారం అర్ధరాత్రి మేడ్చల్ జిల్లా శామీర్‌పేట మండలంలోని ఔటర్ రింగ్ రోడ్ సమీపంలో ప్రమాదకర మూలమలుపు వద్ద ఓ కారు చెడిపోయింది. మరో కారులో వచ్చిన కొందరు చెడిపోయిన వాహనాన్ని రిపేర్ చేస్తున్నారు. అదే సమయంలో శామీర్‌పేట నుంచి తూంకుంటవైపు వేగంగా వెళ్తున్న మరో కారు ఈ రెండు కార్లను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మూడు కార్లు ధ్వసమయ్యాయి. అటుగా వెళ్లేవారు వాహనాలు నిలిపి ప్రమాద ఘటనను చూస్తున్నారు. ఓఆర్‌ఆర్ హైవే పెట్రోలింగ్ సిబ్బంది కే నవీన్‌రెడ్డి, మల్లారెడ్డి, జగదీశ్ ప్రమాద హెచ్చరికలు ఏర్పాటు చేస్తున్నారు. అదే సమయంలో మరో కారు అతివేగంగా, అజాగ్రతగా వస్తూ సడన్ బ్రేక్ వేయడంతో వంకలు తిరుగుతూ సహాయక చర్యలు చేపడుతున్న ప్రజలతోపాటు, హైవే సిబ్బందిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లాల్‌గడిమలక్‌పేట ఆనంద్‌నగర్‌కాలనీలో నివాసముంటున్న యూపీకి చెందిన లాల్‌జీయాదవ్(47)తోపాటు మరో ఇద్దరు తీవ్రంగా గాయపడగా, మరో 10 మందికి స్వల్పగాయాలయ్యాయి. వీరిని దవాఖానకు తరలిస్తుండగా, లాల్‌జీయాదవ్ మార్గమధ్యంలో మృతి చెందారు.

ఎయిర్‌పోర్ట్‌లో బుల్లెట్ల కలకలం

ఏపీ కాంగ్రెస్ నేత వద్ద ఐదు బుల్లెట్లు లభ్యం

శంషాబాద్ రూరల్: శంషాబాద్ విమానాశ్రయంలో బుల్లెట్లు కలకలం రేపాయి. మంగళవారం రాత్రి ప్రయాణికులను తనిఖీ చేస్తున్న అధికారులకు ఓ వ్యక్తి వద్ద బుల్లెట్లు లభించడంతో అతడిని అదుపులోకి తీసుకొని పోలీసులకు అప్పగించారు. బుల్లెట్లు దొరికిన వ్యక్తి ఏపీకి చెందిన కాంగ్రెస్ అధికార ప్రతినిధి ఏటూరి రామచంద్రారెడ్డిగా గుర్తించారు. విచారణలో బుల్లెట్లు లైసెన్స్ ఉన్నట్టు తేలడంతో వదిలేశారు.

హనీమూన్‌కు వెళ్తే నగలు మాయం!

పార్క్‌హయత్ హోటల్‌లో రూ.12 లక్షల ఆభరణాలు చోరీ

సిబ్బందికి టోకరా వేసి యాక్సెస్ కార్డు సంపాదించిన ఆగంతకుడు


సీసీ కెమెరాకు చిక్కిన నిందితుడు

బంజారాహిల్స్, నమస్తే తెలంగాణ: హనీమూన్ కోసం స్టార్ హోటల్‌లో దిగిన జంటకు చేదు అనుభవం ఎదురైంది. వారు బస చేసిన గదిలోకి ఓ ఆగంతకుడు దర్జాగా ప్రవేశించి నవ వధువుకు చెందిన రూ.12 లక్షల విలువైన ఆభరణాలను దోచుకెళ్లాడు. ఈ ఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం రాత్రి జరిగింది. హైదరాబాద్‌లోని హిమాయత్‌నగర్ ప్రాంతానికి చెందిన వ్యాపారి సీహెచ్ వెంకట్‌కోనారావుకు ఈ నెల 4న పెండ్లి జరిగింది. హనీమూన్ కోసం కొత్త జంట 5వ తేదీన పార్క్ హయత్ హోటల్ రూం నంబర్ 312లో దిగారు. వారు మంగళవారం రాత్రి 7:30 గంటలకు బయటకు వెళ్లారు. బుధవారం తెల్లవారుజామున 2 గంటలకు తిరిగివచ్చి చూడగా అల్మారాలోని బ్యాగ్, సూట్‌కేస్‌లోని వస్తువులు చిందరవందరగా పడి ఉండడాన్ని గుర్తించారు. బ్యాగ్‌ను పరిశీలించగా అందులోని రూ.12 లక్షల విలువైన ఆభరణాలు మాయమైనట్టు గుర్తించి బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

దర్జాగా వచ్చి దోపిడీ

పార్క్ హయత్‌కు చేరుకున్న పోలీసులు, టాస్క్‌ఫోర్స్, క్లూస్ టీం దర్యాప్తు చేపట్టాయి. సీసీ ఫుటేజీని పరిశీలించగా రాత్రి 7:45 గంటల ప్రాంతంలో గుర్తుతెలియని వ్యక్తి హోటల్ బయట ఆటో దిగి లోనికి వచ్చినట్టు గుర్తించారు. అతడు మూడోఫ్లోర్‌లోని 312 గది వద్దకు వెళ్లి హోటల్‌లోని రిసెప్షన్ కౌంటర్‌కు ఫోన్ చేశాడు. తాను 312లో దిగానని, యాక్సెస్ కార్డును గదిలో మర్చిపోయానని వెంటనే పంపించాలని కోరాడు. ఓ సూపర్ వైజర్ యాక్సెస్ కార్డును తీసుకొచ్చి ఆగంతకుడికి ఇచ్చాడు. అతడు యాక్సెస్ కార్డు సాయంతో గదిలోకి వెళ్లి ఆభరణాలను దోచుకెళ్లాడు. భద్రత పకడ్బందీగా ఉండే హోటల్‌లోకి బయటి వ్యక్తి అంత సులభంగా రావడాన్ని బట్టి ఇది తెలిసినవారి పనేనని, సిబ్బందిలో కొందరు సహకరించి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. పలు కోణాల్లో కేసు దర్యాప్తు చేస్తున్నారు.


యాదాద్రి ఆలయ అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయి. భారీ శిలలు అందమైన శిల్పాలుగా మారి ఆలయ నిర్మాణంలో ఒదిగిపోతున్నాయి. అధికారులు, సిబ్బంది, శిల్పులు, కార్మికులు నిరంతరం శ్రమిస్తుండటంతో నిర్దేశిత గడువులోగా పూర్తి చేసేదిశగా పనులు పరుగులు పెడుతున్నాయి. భారీ శిలలతో రూపొందించిన కాకతీయ పిల్లర్ల ప్రతిష్ఠాపన ముఖమండపంలో ఉత్తరం, దక్షిణం వైపు పూర్తయిన దృశ్యమిది.

నమస్తే తెలంగాణ

హైదరాబాద్
గురువారం 8 మార్చి 2018
WWW. NTNEWS.COM

జిందగీ పేజీ పై మీ అభిప్రాయాలు, సలహాలు తెలియజేయండి.
zindagi@ntdaily.news
www.ntzindagi.com
/nt.zindagi



సమాజం పట్ల బాధ్యత పెరిగింది..
– చక్రవర్తుల లక్ష్మీనర్సమ్మ (పద్య కవిత్వం, అభినవ మొల్ల, సాహిత్యం)

మహిళా దినోత్సవం సందర్భంగా నాకు అవార్డు రావడం చాలా సంతోషంగా ఉన్నది. మహాత్మాగాంధీ చనిపోయినప్పటి నుంచి నేను పద్య కవిత్వం రాయడం మొదలుపెట్టాను. ఈ క్రమంలో ఎన్నో పుస్తకాలు, పద్యకావ్యాలు, గేయాలు, కవితలు రాశాను. ప్రస్తుతం నాకు 76 యేండ్లు. ఇప్పటివరకు 25 పుస్తకాల వరకూ రాశాను. గోల్కొండ పత్రికలో నా కవితలు, పద్యాలు, గేయాలు ఎక్కువగా ప్రచురితమయ్యేవి. నా కృషిని గుర్తించిన ప్రభుత్వానికి ఎప్పటికీ రుణపడి ఉంటాను. నా వంతుగా స్త్రీల చైతన్యం కోసం కష్టపడుతాను. ఎందుకంటే నేను మూడో తరగతిలో ఉన్నప్పుడే నాకు పెండ్లి చేశారు. అత్తారింట్లో ఎన్నో కష్టాలు పడ్డాను. తర్వాత స్వశక్తితో చదువుకొని ఖమ్మం జిల్లా భద్రాచలంలో ఉపాధ్యాయినిగా, లెక్చరర్‌గా పనిచేశాను. ఎంతోమంది శిష్యులను సంపాదించుకున్నా. ఇలాంటి ప్రభుత్వం రావడం ఆనందంగా ఉన్నది.

జయహో మహిళ!



అవనిలో సగం.. హక్కుల్లో సగం అయిన మహిళలు అగ్రభాగాన మేము అని నిరూపించుకొని సత్కరించుకుంటున్న పురస్కారాల జాతర నేడే. సాధికారత అనే ఉమ్మడి లక్ష్యం కోసం కృషి చేస్తున్న స్త్రీశక్తిని సన్మానించుకొనే పండుగ ఇది. చిన్నప్పుడు చందమామ కథలతో స్ఫూర్తి పొంది అద్భుత సాహిత్యాన్ని అందిస్తున్న బాల సాహితీవేత్త సిరిబాల.. అస్తిత్వ పోరాటానికి అద్భుత కథనాలతో మద్దతునిచ్చి మహిళల్ని తెలంగాణ ఉద్యమంలో ఏకం చేయడంలో భాగస్వామి అయిన సౌమ్య నాగపురి.. మూడో తరగతిలోనే పెండ్లి చేస్తే.. అష్టకష్టాలు పడి విద్యావేత్తగా ఎదిగిన చక్రవర్తుల లక్ష్మీ నర్సమ్మ.. అందరికీ మెరుగైన వైద్యం అందించాలని న్యాచురోపతీ చదివి సామాజిక సేవలందిస్తున్న సత్య లక్ష్మీ.. మహిళలు కూడా ఫైన్ ఆర్ట్స్‌లో రాణిస్తారని నిరూపించిన కవితా దర్యానీరావ్.. ఉపాధిహామీ పథకంలో భాగంగా రాళ్లెత్తి మట్టితవ్వి పలుగుపార పట్టిన బొగ్గం జయమ్మ.. రైల్లో ప్రయాణించే అవకాశాలే లేకున్నా రైలును నడిపేదాకా వెళ్లిన సుప్రియ సనమ్.. వడ్డెర సామాజిక వర్గంలో పుట్టి కష్టపడి ఎంటర్‌ప్రెన్యూర్‌గా ఎదిగిన రాజ్యలక్ష్మీ.. దేశరాజధానిలో ఆర్టీసీ బస్సు నడుపుతూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్న సరిత.. ఫోన్ సిగ్నల్ కూడా లేని ఊళ్లో ఉంటూ సాధికారతా చైతన్యం తీసుకొస్తున్న యాప భద్రమ్మ సహా అవార్డులు అందుకుంటున్న మహిళామణులకు మహిళా దినోత్సవ శుభాకాంక్షలు.!



దశ తిరిగింది.. కాలం కలిసొచ్చింది
సుప్రియ సనమ్ (లోకో పైలెట్)

కష్టపడితే వచ్చిన ఫలితంతో పాటు సమాజంలో గుర్తింపు వస్తుంది. అందుకు ఉదాహరణ నేను. ఎక్కడో నిజామాబాద్‌లో పుట్టి పెరిగి ఎంటెక్ చదివి మెట్రో రైలు నియామకాల్లో లోకోపైలెట్‌గా ఎంపికయ్యాను. సిగ్నలింగ్, టెలికమ్యూనికేషన్ వంటి అంశాల్లో శిక్షణ పొంది మెట్రో రైలు నడుపడానికి అర్హత సాధించాను. అంతేకాదు.. ప్రధానమంత్రి మోడీ ప్రయాణించిన తొలి రైలును నడిపే అవకాశాన్ని దక్కించుకున్నాను. అప్పుడు పట్టరానంత ఆనందం వచ్చింది. జీవితంలో ప్రధాని కూర్చున్న మెట్రో రైలు నడుపడం ఒకింత సంతోషం అయితే నన్ను తెలంగాణ ప్రభుత్వం అవార్డుతో సన్మానించడం ఇంకింత సంతోషం. కష్టపడ్డప్పుడు గుర్తింపు వచ్చిన ఫలితం మజానిస్తున్నది. ఆ మజాను అనుభవించినప్పుడు వచ్చే అనుభూతిని మాటల్లో చెప్పలేం. అక్షరాల్లో రాయలేం. ఏది ఏమైనా కాలం కలిసొచ్చింది అనుకుంటున్నా. ఇప్పటి నుంచైనా నా దశ తిరుగుతదని భావిస్తున్నా.



బాధ్యత పెరిగింది..
సౌమ్య నాగపురి (జర్నలిస్ట్)

సృష్టికి మూలమైన స్త్రీని గౌరవించడంలో తెలంగాణ ప్రభుత్వం ముందు నుంచే ముందున్నది. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జర్నలిస్ట్ విభాగంలో అవార్డు నాకు ఇవ్వడం సంతోషంగా ఉన్నది. ఈ అవార్డు నా బాధ్యతను మరింత పెంచింది. 2008లో ఆంధ్రజ్యోతితో ప్రారంభమైన నా ప్రస్థానం ఇప్పటి వరకు ప్రత్యేక కథనాలు రాస్తూ సాగుతున్నది. 2011లో ఉద్యమ పత్రిక వచ్చిన నమస్తే తెలంగాణలో ఫీచర్స్ డెస్క్‌లో జాయినయ్యాను. ఈ ఆరున్నరేళ్ల ప్రయాణంలో కొన్ని వేల కథనాలు రాశాను. అప్పటి నుంచి నమస్తే తెలంగాణ యాజమాన్యం, కుటుంబ సభ్యులు ప్రోత్సహిస్తూ వస్తున్నారు. మహిళల అభ్యున్నతికి కేసీఆర్ చేస్తున్న ఎన్నో కార్యక్రమాలు ఉదాహరణగా నిలుస్తున్నాయి. ఈ అవార్డు నాలో బాధ్యతను పెంచడంతో పాటు మరిన్ని కథనాలను రాసేందుకు స్ఫూర్తినిచ్చే విధంగా ఉన్నది.

సరిహద్దులు దాటినా..
సరిత (బస్సు డ్రైవర్)



రాష్ట్ర రాజధాని సరిహద్దులు దాటి దేశ రాజధానిలో బస్సుల నడుపుతున్నాను. ఈ స్థాయికి చేరుకోవడానికి ఎదుర్కొన్న కష్టాలు ఈ సందర్భంలో చెప్పుకోవడం సరికాదేమో. తెలంగాణ నుంచి ఢిల్లీలో మొదటి ఆర్టీసీ మహిళా డ్రైవర్‌గా సేవలందిస్తున్న నన్ను గుర్తించి అవార్డు ఇవ్వడం ఈ ప్రభుత్వం గొప్పతనం. వివిధ రంగాల్లో రాణిస్తున్న మహిళలను గుర్తించి వాళ్లను ప్రోత్సహించడం అందరివల్ల కానిపని. అది చేయాలంటే గొప్ప మనసుండాలి. ఈ ప్రభుత్వానికి మనసుంది కాబట్టే ఇలాంటి కార్యక్రమాలు చేయగలుగుతున్నది. గతంలో తెలంగాణ ఆర్టీసీలో పనిచేయడానికి నేను సుముఖత చూపాను. ఆ విషయంలో ప్రభుత్వం మంతనాలు జరుపుతున్నది. సరిహద్దులు దాటి నా పని ఏదో నేను చేసుకుంటున్న క్రమంలో నాకు ఈ అవార్డు ఇవ్వడం కొండంత బలానిచ్చింది. అంతేకాదు.. కష్టానికి ప్రతిఫలం.. చేసిన పనికి గుర్తింపు ఎంత దూరం ఉన్నా మన దగ్గరికి వస్తుందనే నమ్మకం కలిగింది.




సిగ్నల్ రాని ఊరి నుంచి..
యాప భద్రమ్మ (మహిళా సాధికారత)

వందల మంది మహిళలను ఏకం చేసి వాళ్ల సాధికారత కోసం పనిచేస్తున్నాను. ఏమీ ఆశించకుండా ఎప్పటి నుంచో ఈ పని చేస్తున్న. నిజాయితీగా పనిచేస్తున్న నాకు జాతీయ, అంతర్జాతీయ వేదికలు ఎక్కే అవకాశం దక్కింది. ఇప్పుడు మరో ప్రశంస. అభినందన. సెల్‌ఫోన్ సిగ్నల్ కూడా సరిగ్గా రాని ఊర్లో నేను చేస్తున్న సేవను గుర్తించడం ప్రభుత్వం గొప్పతనాన్ని తెలుపుతుంది. నిరక్ష్యరాస్యురాలైన నా గురించి.. ఇప్పుడు పత్రికల్లో రాస్తున్నారంటే ఆనందంగా ఎందుకు ఉండదు. అదీ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఇచ్చే అవార్డుల్లో నేను ఉన్నానంటే.. ఉబ్బితబ్బిబైపోయాను. ఈరోజు రాష్ట్ర రాజధానిలో పెద్ద వేదికపై విశిష్ట అవార్డు అందుకోవడం గర్వంగా అనిపిస్తున్నది. ముందు నమ్మబుద్ధి కాలేదు. ఈ అవార్డు అందుకోవడం ఒక్కటే కాదు.. మరింత మంది మహిళల సాధికారత కోసం కృషి చేస్తా.



మా పనికి తగిన గుర్తింపు..
– బొగ్గం జయమ్మ, (ఉపాధిహామీ కూలీ, అగ్రికల్చర్ విభాగం)

మాది భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ముల్కలపల్లి మండలం జగన్నాథపురం. ప్రభుత్వం క్షేత్రస్థాయిలో పని చేసే మాలాంటి వాళ్లను గుర్తించడం చాలా సంతోషంగా ఉన్నది. ఉపాధి హామీ పనుల్లో మా శక్తికి తగ్గట్లుగా పని చేశాం. మా ఫీల్డ్ అసిస్టెంట్ చెప్పిన పనులన్నీ చేశాం. ఈ క్రమంలో చెరువులను బాగు చేసుకున్నాం. ఉపాధిహామీ పథకంతో కాల్వలు, చెరువుల్లో పూడిక తీశాం. చెరువులు బాగుపడ్డాయి. పంటలు మంచిగా పండుతున్నాయి. మా మెట్ట భూములను చదును చేసి, జామాయిల్, వరి పండిస్తున్నాం. మా గ్రామస్తులందరి సహకారంతో చెరువు నిర్మించుకున్నాం. పొలాల్లో మొద్దులు తొలిగించి, భూమి చదును చేసి పంటలు పండించుకున్నాం. మారుమూలల్లో ఉన్న మాలాంటి వారిని గుర్తించిన ప్రభుత్వానికి రుణపడి ఉంటాం.



విద్యలో నూతన పద్ధతులు..
– కవితా దర్యానిరావ్, జేఎన్‌టీయూ ఫైన్ ఆర్ట్స్ వీసీ (ఎడ్యుకేషన్)

నాకు అవార్డు రావడం చాలా సంతోషంగా ఉన్నది. ప్రభుత్వానికి నా కృతజ్ఞతలు. ఈ అవార్డు రావడం నా బాధ్యతను మరింత పెంచింది. గతంలో కొన్ని అవార్డులు వచ్చాయి. ప్రస్తుతం జేఎన్‌టీయూ ఫైన్ ఆర్ట్స్‌లో వైస్‌ఛాన్సలర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాను. ప్రస్తుతం విద్యార్థులకు అర్థమయ్యేరీతిలో చదువు చెప్పడం చాలా ముఖ్యం. ప్రాక్టికల్‌గా కూడా ఎంతో కష్టపడాలి. విద్యార్థులకు నాణ్యమైన, మెరుగైన విద్యను అందించేందుకు కొత్త పద్ధతులను కనుగొన్నాం. దీంతో ఫైన్‌ఆర్ట్స్ విద్యార్థులు కొత్త తరహా విద్యాబోధనలో మెరుగ్గా తయారయ్యారు. విద్యారంగంలో నా సేవలను గుర్తించిన ప్రభుత్వానికి నేను రుణపడి ఉంటాను. నా జీవిత ప్రయాణంలో కుటుంబం, సహ ఉద్యోగుల ప్రోత్సాహం మరువలేనిది.



అందరికీ మెరుగైన వైద్యం..
– డాక్టర్ సత్యలక్ష్మి, న్యాచురోపతి డైరెక్టర్, పుణె (వైద్య విభాగం)

అందరికీ మెరుగైన వైద్యం అందించాలనే లక్ష్యంతో చేస్తున్న కృషిని ప్రభుత్వం గుర్తించడం చాలా సంతోషంగా ఉన్నది. ఈ అవార్డు ద్వారా న్యాచురోపతికి మరింత వన్నె తెచ్చింది. నాకు చిన్నప్పటి నుంచి వైద్యం చేయాలని కోరికగా ఉండేది. ఆ లక్ష్యంతోనే న్యాచురోపతి చదివాను. ఆ తర్వాత నల్లగొండ టౌన్‌లో క్లినిక్‌ను ఏర్పాటు చేశాను. ప్రజల నుంచి మంచి స్పందన వచ్చింది. ఆ తర్వాత రెడ్‌క్రాస్ సంస్థ నుంచి పిలుపురావడంతో.. ఆ సంస్థకు సంబంధించిన హాస్పిటల్‌ను నిర్వహించాను. నల్లగొండలో ఉన్నప్పుడే మహిళలు, సామాజిక సమస్యలపై పోరాడాం. బాధిత మహిళలకు అవసరమైన న్యాయ సలహాలు కూడా ఇచ్చేవాళ్లం. మాది నల్లగొండ జిల్లా. 2015 నుంచి పుణెలోని జాతీయ న్యాచురోపతి సంస్థకు డైరెక్టర్‌గా ఉన్నాను. ప్రభుత్వం నా సేవలను గుర్తించడం ఆనందంగా ఉన్నది.



భావితరాలకు పునాది
– డాక్టర్ సిరి (బాలసాహిత్యం)

భావితరాలకు సాహిత్యాన్ని అందించడం కోసం నేను చేస్తున్న కృషికి ప్రభుత్వం నన్ను గుర్తించి అవార్డుతో గౌరవించడం చాలా సంతోషంగా ఉన్నది. ఇది బాలసాహిత్యానికి దక్కిన గౌరవం. చిన్నప్పుడు చందమామ కథలు చదివి నేను ఎంతో స్ఫూర్తి పొందాను. ఆ పంథాను ఎంచుకొని కొన్ని పాఠశాలలను సందర్శించి.. ప్రస్తుతం చిన్నారులు స్ఫూర్తిపొందే విధంగా కథలు, నవలలు, పద్యాలు రాయడం మొదలు పెట్టాను. ప్రస్తుతం 13 పుస్తకాలు రాశాను. మరి కొన్ని ప్రింటింగ్‌లో ఉన్నాయి. 200లకు పైగా ఈ-బుక్స్‌ను 'లాలీపాప్' అనే యాప్‌కు రాశాను. గేయాలు కూడా రాస్తుంటాను. మాది నల్లగొండ జిల్లా మిర్యాలగూడ. నేను చేసే ప్రతి పనినీ నా కుటుంబసభ్యులు ప్రోత్సహిస్తుంటారు. ప్రభుత్వం మాలాంటి వాళ్లను వెలికితీయడం మరింత ఆనందాన్ని ఇస్తున్నది.



ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా
రాజ్యలక్ష్మి (ఎంట్రప్రెన్యూర్)

వడ్డెర సామాజిక వర్గంలో పుట్టి పెరిగిన నేను ఈ రోజు ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా ఉన్నాను. ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరేలా, సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు అందేలా నా వంతుగా ప్రయత్నిస్తున్నాను. గత ప్రభుత్వాలు గుర్తించని ఎన్నో కష్టాలను, సమస్యలను ఈ ప్రభుత్వం గుర్తించి పరిష్కరిస్తున్నది. కనీస అవసరాలుంటే పట్టించుకోని ప్రభుత్వాల కన్నా ఈ ప్రభుత్వం వెయ్యి పాళ్లు నయ్యం. వడ్డెర కులంలో పుట్టిన ఆడబిడ్డలకు కేసీఆర్ ప్రభుత్వం చేస్తున్నదానికి ఎంత చెప్పినా తక్కువే. కబడ్డీ క్రీడాకారిణిగా మొదలైన నా కెరీర్, కాంట్రాక్టర్‌గా ఎన్నో మలుపులు తీసుకున్నది. స్వశక్తితో ఎదుగుతున్న నాలాంటి మహిళలకు అవార్డు ఇవ్వడం వల్ల ఎంతో మందికి ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. దీనివల్ల మరింత మంది నాలుగు గోడల మధ్యనే ఉండకుండా వేదికలపై మాట్లాడే స్థాయికి ఎదుగుతారు.

ఎందుకిలా...?



నా వయసు 24 సంవత్సరాలు. ఉద్యోగం చేస్తున్నాను. ఇతరత్రా ఎలాంటి అనారోగ్యం లేదు. నెలసరి కూడా ఎప్పుడు క్రమం తప్పడం జరుగలేదు. కానీ ఈ మధ్య వైట్ డిస్చార్జ్ అవుతున్నది. ఇలా ఎందుకు జరుగుతున్నది. ఇదేమన్న అనారోగ్యానికి సంకేతమా? పూర్తి వివరాలను తెలుపగలరు?
స్వేతా పూర్ణిమ, హైదరాబాద్

అడుగండి చెబుతా



డాక్టర్ సుధ పి. ఎస్.
సీనియర్ కన్సల్టెంట్ ఆబ్‌స్ట్రిక్స్ అండ్ గైనకాలజీ, లాపరోస్కోపిక్ సర్జన్ అండ్ ఇన్‌ఫెర్టిలిటి స్పెషలిస్ట్, విరించి హాస్పిటల్స్
హైదరాబాద్

సాధారణంగా నెలసరికి ముందు తర్వాత 1,2 రోజుల పాటు వైట్ డిస్చార్జ్ కనిపిస్తుంది. అంతేకాదు అండం ఏర్పడే సమయంలో కూడా కొద్దిపాటి డిస్చార్జ్ ఉంటుంది. ఇది రెండు నెలసరుల మధ్య కాలం అన్న మాట. ఈ సమయంలో ఉండే డిస్చార్జ్ కొంచెం చిక్కగా, తీగసాగినట్టు ఉంటుంది. ఇలాంటివన్నీ కూడా ఎలాంటి అనారోగ్యానికి సంకేతం కాదు. అయితే వైట్ డిస్చార్జ్‌తో పాటు కొంచెం చెడు వాసన, దురద ఉంటుంది. లేదా డిస్చార్జ్ లేత పసుపు లేదా ఆకు పచ్చ రంగులో ఉన్నపుడు ఇన్‌ఫెక్షన్ ఉన్నట్టుగా భావించాల్సి ఉంటుంది. అప్పుడు పరీక్షలు చేసి ఎలాంటి ఇన్‌ఫెక్షన్ అనేది నిర్ధారించి చికిత్స అందించాల్సి ఉంటుంది. గర్భవతుల్లో హార్మోన్ల తేడా వల్ల కొంత వైట్ డిస్చార్జ్ ఉంటుంది. వ్యక్తిగత శుభ్రత పాటించడం చాలా అవసరం.

కలుపు మొక్కలతో కళాకృతులు!





కలుపు మొక్కల్ని ఏం చేస్తాం? పారేయడమో.. కాల్చివేయడమో చేసేస్తాం. కానీ కలుపు మొక్కలతో కూడా కళాకృతులు చేయొచ్చు.. డబ్బులు సంపాదించొచ్చు అని నిరూపించింది ఓ మహిళ. తాను ఉపాధి పొందడమే కాకుండా మరి కొందరు మహిళలకు ఈ కళ నేర్పిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నదామె.

అస్సాంలోని శివసాగర్ జిల్లా నిమైజాన్ గ్రామానికి చెందిన 38 సంవత్సరాల బర్నాలీ గగోయ్‌కు కుట్లు.. అల్లికలు అంటే ఇష్టం. ఇంట్లో ఊరికే కూర్చునే బదులు అల్లికలు చేస్తూ స్వయం ఉపాధి పొందొచ్చనేది ఆమె ఆలోచన. ఆ అలవాటును క్రమంగా వృత్తిగా మార్చుకున్నది. అల్లికల దగ్గరే ఆగిపోకుండా రకరకాల వెరైటీలు ప్రయత్నిస్తూ సృజనాత్మక రీతిలో కళాకృతులను రూపొందించింది బర్నాలీ. నీటిలో పెరిగే సువాసనల మొక్కల ఆవాసంలో ఉండే కలుపుమొక్కల్ని సేకరించి వాటి ద్వారా బుట్టలు.. యోగా మ్యాట్లు.. బ్యాగులు వంటివి తయారు చేయడం ప్రారంభించింది. నారను సేకరించడం అంత సులువైన పనేం కాదు. అయినప్పటికీ ఏమాత్రం వెనుకడుగు వేయకుండా రెగ్యులర్‌గా కలుపు నారను సేకరిస్తూ రకరకాల ఐటమ్స్ తయారు చేస్తున్నది. మొదటగా మొక్కలను సేకరించి వాటి నుంచి కాండాలను వేరు చేసి దానిని నారగా మార్చి క్రియేటివ్ హ్యాండ్‌మేడ్ ప్రొడక్ట్స్ రూపొందిస్తున్నది. తన భర్త ఇచ్చిన సహకారంతోనే ఈ రంగంలో రాణిస్తూ ఆర్థిక స్వావలంబన సాధించానంటున్నది బర్నోలి. నార్త్ ఈస్టర్న్ డెవలప్‌మెంట్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో కలుపునార ఉత్పత్తులను ప్రదర్శనకు కూడా పెట్టింది. ప్రస్తుతం బర్నోలీ తాను ఉపాధి పొందడమే కాదు.. తనతో మరి కొంతమందికి ఉపాధి కల్పిస్తున్నది. సృజనాత్మకమైన బర్నోలీ ఉత్పత్తులను ప్రమోట్ చేసేందుకు రెగ్యులర్‌గా ప్రదర్శనలు ఇస్తున్నది బర్నోలీ గగోయ్.



ఆరోగ్యాన్నిచ్చే ద్రాక్ష

ద్రాక్షలు వేర్వేరు రంగుల్లో, రూపాల్లోనూ ఉంటాయి. ముఖ్యంగా ఎరుపు, ఆకుపచ్చ, ఊదా రంగుల్లో ఉండి గింజల్లేని ద్రాక్ష, రసం ఉండే ద్రాక్ష, ఎండు ద్రాక్ష ఇలా అనేకం.

- ద్రాక్షలు చర్మానికి అమృతం వంటివి. క్రమం తప్పకుండా వినియోగించడం, శరీరానికి పట్టించడం చేస్తే చర్మం మృదువుగా ఉంటుంది.
- ద్రాక్ష అనామ్లజనకాలకు పవర్‌హౌజ్ వంటిది. ఇవి ఎక్కువ మొత్తంలో కెరోటినాయిడ్స్, పాలీఫెనోల్స్‌తో పాటు విస్తృతస్థాయిలో ఫైటో న్యూట్రియంట్స్‌ను కలిగి ఉంటాయి. కొన్ని రకాల క్యాన్సర్లను నివారించడంలో ఈ ఫైటో న్యూట్రియంట్స్ సహాయపడుతాయి. గుండె ఆరోగ్యాన్ని కాపాడడంలో సహాయ పడుతాయని పలు అధ్యయనాలు వెల్లడించాయి. ద్రాక్ష గింజల్లో, దాని చర్మంలో యాంటీ ఆక్సిడెంట్ పాలు ఎక్కువగా ఉంటుంది కనుక ద్రాక్ష తినడం చాలా మంచిది.
- ప్రతి వంద గ్రాముల ద్రాక్షలో 191మి.గ్రా పోటాషియం ఉంటుంది. అధిక పోటాషియం ఉన్న ఆహారం తీసుకోవడం వల్ల అధిక రక్తపోటు, అధిక కొలెస్ట్రాల్‌ను అదుపు చేయడంతో పాటు గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది.
- ఆరోగ్యప్రయోజనాలు అందించే ద్రాక్షలో రెస్వేట్రాల్ అనేది అతి ముఖ్యమైన పోషకపదార్థం.
- ద్రాక్షలు ఫైబర్, పోటాషియం, పెద్ద మొత్తంలో పోటాషియం, పెద్ద ఎత్తున విటమిన్స్, మినరల్స్ కలిగి ఉంటాయి.
- ద్రాక్షలు డయాబెటీస్‌తో బాధపడే వారికి మంచి ఆహారం, అదే సమయంలో డైట్‌కు ద్రాక్ష సరైన ఎంపిక.
- ద్రాక్ష ఎక్కువ మొత్తంలో నీరు, ఫైబర్ కలిగి ఉంటుంది. కనుక ద్రాక్ష తీసుకోవడం వల్ల ప్రజలు రీ హైడ్రేషన్ కాకుండా కాపాడుకోవచ్చు. ద్రాక్ష సాధారణ ప్రేగు సమస్యలను అదుపులో ఉంచడానికి మలబద్ధకాన్ని నివారించడానికి ఎంతో చక్కగా పనిచేస్తుంది.
- ద్రాక్షలో ఉండే అనామ్లజనకాలైన లూటీన్, జీకాజాంటిన్‌లు కంటి ఆరోగ్యాన్ని కాపడడానికి సహాయపడుతాయి. స్వేచ్ఛారాశులుగా పిలువబడే అస్థిర అణువులను తటస్థం చేయడానికి ఉపకరిస్తుంది.
- ఇంకా పోటాషియం, విటమిన్ సి అందించే మంచి పండు. అలాగే కాల్షియానికి అద్భుతమైన మూలం. దంతాలు, ఎముకలు పెరుగడానికి కాల్షియం ఎంతో తోడ్పడుతుంది.



డాక్టర్
మయూరి ఆవుల
న్యూట్రిషియనిస్ట్
mayuri.trudiet
@gmail.com



అసలే ఎండాకాలం.. ఎండలు మండేకాలం.. గడ్డ పెరుగు ఉంటే ఎండల్లో కూడా చల్లదనం వస్తుంది.. మసాలాలతో విసిగిపోయిన జిహ్వకు.. ఇక చల్లని రైతాలు పట్టించండి.. కొద్ది రైతా మీకు ఈ ఎండాకాలం ఎంతో చలువ చేస్తుంది.. అందుకే డిఫరెంట్ రైతాలను మీ ముందుంచుతున్నాం..

రైతా.. అనే నేను

పాలక్ రైతా

కావాల్సినవి :

పెరుగు : ఒక కప్పు
ఆవనూనె : ఒక టేబుల్‌స్పూన్
అల్లం : చిన్న ముక్క
వెల్లుల్లి పాయలు : 4
పచ్చిమిరపకాయలు : 4
పాలకూర : ఒక కప్పు
ఉప్పు : తగినంత



తయారీ :

స్టెప్ 1 : కడాయిలో ఆవనూనె పోసి వేడి చేయాలి. ఇందులో అల్లం, వెల్లుల్లి, పచ్చిమిర్చి వేసి బాగా వేయించాలి.
స్టెప్ 2 : దీంట్లో పాలకూర, కాస్త ఉప్పు వేసి ఉడికించాలి. పాలకూర మెత్తగా, కాస్త క్రిస్పీగా అయ్యేంత వరకు కలుపుతుండాలి.
స్టెప్ 3 : ఈలోపు పెరుగును కాస్త గిలక్కొట్టాలి. ఇప్పుడు ఇందులో పెరుగు వేసి ఒకసారి కలిపి దించేయాలి. పాలక్ రైతా రెడీ!

ఖర్జూర రైతా

కావాల్సినవి :

పెరుగు : ఒక కప్పు
ఉల్లిగడ్డ : 1
పచ్చిమిరపకాయలు : 4
జీలకర్ర పొడి : అర టీస్పూన్
ఖర్జూరాలు : 50 గ్రా.
దానిమ్మ గింజలు : ఒక టేబుల్‌స్పూన్
కొత్తిమీర : చిన్న కట్ట



తయారీ :

స్టెప్ 1 : ముందుగా ఖర్జూరాలు తీసుకొని గింజలు వేరు చేయాలి. ఆ తర్వాత చిన్న ముక్కలుగా కట్ చేయాలి.
స్టెప్ 2 : దీంట్లో ఉప్పు, జీలకర్ర పొడి, పచ్చిమిర్చి, ఉల్లి పాయ ముక్కలు వేసి కలుపాలి.
స్టెప్ 3 : ఆ తర్వాత పెరుగుని గిలక్కొట్టి కలుపాలి. ఇందులో కొత్తిమీర, దానిమ్మ గింజలతో గార్నిష్ చేసుకోవాలి. దీన్ని అలాగే జుర్రుకుంటే యమ టేస్టీగా ఉంటుంది.



సంజయ్ తుమ్మ
సెలబ్రిటీ చెఫ్

ఫ్రెష్ ఫ్రూట్ రైతా

కావాల్సినవి :

దానిమ్మ గింజలు : 2 టేబుల్‌స్పూన్స్
మామిడి పండు ముక్కలు : 2 టేబుల్‌స్పూన్స్
సోంపు పొడి : అర టీస్పూన్
జీలకర్రపొడి : పావు టీస్పూన్
చక్కెర : ఒక టీస్పూన్
పెరుగు : ఒక కప్పు
చెర్రీ ముక్కలు : ఒక టేబుల్‌స్పూన్
పైనాపిల్ ముక్కలు : 2 టేబుల్‌స్పూన్స్
పుదీనా : చిన్న కట్ట
ఉప్పు : తగినంత



తయారీ :

స్టెప్ 1 : ఒక గిన్నెలో పెరుగు, ఉప్పు, చక్కెర వేసి కలుపుకోవాలి.
స్టెప్ 2 : దీంట్లో పుదీనా, సోంపు పొడి, జీలకర్ర పొడి, మామిడి ముక్కలు వేయాలి.
స్టెప్ 3 : అంతేకాదు.. దానిమ్మ గింజలు, చెర్రీ, పైనాపిల్ ముక్కలు వేసి బాగా మిక్స్ చేయాలి. దీన్ని ఫ్రిజ్‌లో పెట్టుకొని చల్లగా ఆరగించేయొచ్చు.

చిక్కుడు రైతా

కావాల్సినవి :

పెరుగు : ఒక కప్పు
చిక్కుడు కాయలు : అర కప్పు
కొబ్బరి తురుము : అర కప్పు
పచ్చిమిర్చి : 2
ఆవాలు : అర టీస్పూన్
జీలకర్ర : అర టీస్పూన్
కరివేపాకు : ఒక రెమ్మ
పసుపు : పావు టీస్పూన్
ఉప్పు : తగినంత



తయారీ :

స్టెప్ 1 : చిక్కుడు కాయలను నీళ్లు పోసి, ఉప్పు వేసి ఉడికించుకోవాలి.
స్టెప్ 2 : ఒక గిన్నెలో పెరుగు, ఉడికించిన బీన్స్, కొబ్బరి తురుము, పచ్చిమిర్చి వేసి కలుపుకోవాలి.
స్టెప్ 3 : కడాయిలో నూనె పోసి ఆవాలు, జీలకర్ర, కరివేపాకు, పసుపు వేసి పోపు వేసి రైతాలో వేయాలి. రుచికరమైన చిక్కుడు రైతా మీ ముందుంటుంది.

పేదలకు ఉచిత భోజనం!



ఒక్కపూట కూడా భోజనం దొరుకని వాళ్లున్నారు. ఇతడు కూడా ఆ కష్టాన్ని అనుభవించినవాడే. అందుకే ఆకలి బాధ తెలిసినవాడు కాబట్టే పేదలకు ఉచిత భోజన సదుపాయం కల్పిస్తున్నాడు.

ఈ ఫొటోలో వ్యక్తి పేరు ప్రకాష్ చిబర్. ఒక యాక్సిడెంట్‌లో గాయపడి రెండున్నర ఏళ్లపాటు మంచానికే పరిమితమయ్యాడు. దీంతో ఇల్లు గడవడమే కష్టంగా మారింది. తిండి కోసం చాలా తిప్పలు పడ్డాడు. మెల్ల మెల్లగా కోలుకొని ఏదో ఒక పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకున్నాడు. ఇక్కడ ఉపాధి కష్టమే అని గ్రహించి 2005లో కెనడా వలస వెళ్లాడు. అక్కడ హోటల్స్‌లో పనిచేస్తూ జీవనం సాగించాడు. పైసాపైసా కూడబెట్టి 2009లో అక్కడే ఇండియన్ ఫ్యూషన్ పేరిట సొంత రెస్టారెంట్ ఏర్పాటు చేశాడు. కానీ అతడు ఇంకా ఏదో చేయాలనుకున్నాడు. 2014లో అదే హోటల్‌లో పేదలకు ఉచిత భోజనం ప్రారంభించాలనుకున్నాడు. దాన్ని అలాంటి వారికి ఎలా తెలియజేయాలో అర్థం కాలేదు. తన రెస్టారెంట్ వెనుక డోర్ మీద ఒక బోర్డును తగిలించాడు. దీంట్లో ఎవరైనా ఆకలిగా ఉన్నవాళ్లు ఈ హోటల్‌కి వచ్చి వెజ్ లేదా నాన్‌వెజ్ ఏదైనా భోజనం చేయవచ్చు. అందుకు డబ్బులు ఏమీ చెల్లించాల్సిన అవసరం లేదు. ఆహారం తినేవారు ముందుగానే ఏవైనా ఫుడ్ అలర్జీలు ఉంటే తెలియజేయాల్సిందిగా ఈ నోట్‌లో ఉంటుంది. దీన్ని ఒకతను ఫొటో తీసి సోషల్ మీడియాలో పెట్టడం వల్ల ప్రచారం మరింత పెరిగింది. దేశం కానీ దేశంలో ఆకలి కోసం అలమటిస్తున్న ఎంతోమంది అక్కడ భోజనం చేస్తున్నారట. రోజుకు కనీసం పది మంది అయినా ఈ హోటల్‌లో భోజనం చేస్తారంటున్నాడు ప్రకాష్ చిబర్.

వెల్లుల్లి వెరీగుడ్!

వెల్లుల్లి లేకుండా వంటలు చేయడం అసంపూర్తిగా ఉంటుంది. మనిషి ఆరోగ్యానికి వెల్లుల్లి సంజీవని లాంటిది. దీనివల్ల ఎన్నో లాభాలు కూడా ఉన్నాయి.

- వెల్లుల్లి జీర్ణాశయంలోని ఎంజైములను ఉత్తేజపరచడం వల్ల బరువు తగ్గుతారు.
- జీర్ణమైన ఆహారంలోని కొవ్వును వెల్లుల్లి ప్రాసెస్ చేయడమే కాదు.. అనవసరమైన ఫ్యాట్‌ని తగ్గిస్తుంది.
- శరీరంలోని ఎర్రరక్త కణాలు వెల్లుల్లిలో ఉండే సల్ఫైడ్స్‌ను హైడ్రోజన్ సల్ఫైడ్ గ్యాస్‌గా మారుస్తుంది. ఈ గ్యాస్ రక్తపోటును నియంత్రిస్తుంది.
- వారానికి ఐదు వెల్లుల్లిపాయలు పచ్చివి తింటే క్యాన్సర్ వ్యాధి నుంచి 50 శాతం వరకూ నిర్మూలించవచ్చు. ఇంకా చెప్పాలంటే సర్వ రోగనివారిణి అని చెప్పవచ్చు.



- మొటిమలు, యాక్నే, నల్లమచ్చల వంటివి బాధిస్తున్నా, చర్మం మెరువాలన్నా పచ్చి వెల్లుల్లి రెబ్బలను తీసుకొని నూరి గోరువెచ్చని నీటితో కలిపి ఉదయాన్నే తాగితే మంచిది.
- రోజూ పచ్చి వెల్లుల్లి తినడం వల్ల గుండె సంబంధిత జబ్బులు రావు. వెల్లుల్లిలో ఉన్న యాంటీ క్లాటింగ్ ప్రాపర్టీస్ వల్ల రక్తం గడ్డకట్టుకు పోవడం లాంటివి సంభవించవు.
- యాంటీ ఇన్ఫ్లమేటర్ లక్షణాలు పుష్కలంగా ఉన్నాయి. ఈ లక్షణాలు వివిధ రకాల అలర్జీల బారినపడకుండా మన శరీరాన్ని రక్షిస్తుంది.

సుడోకు

డైలీ సుడోకు 141 సమాధానం

1	6	2	7	5	4	3	9	8
8	4	3	6	9	2	7	1	5
9	5	7	3	8	1	2	4	6
2	1	6	9	4	7	8	5	3
4	7	9	8	3	5	6	2	1
5	3	8	2	1	6	9	7	4
6	8	1	4	7	9	5	3	2
3	9	4	5	2	8	1	6	7
7	2	5	1	6	3	4	8	9


1. నిలువుగా, అడ్డంగా ప్రతివరుసలోనూ 1 నుంచి 9 వరకు అంకెలను నింపాలి.
2. ఒకసారి రాసిన అంకెను మరోసారి నింపకూడదు.
3. ప్రతి గడిలోనూ నింపిన అంకెను మళ్లీ నింపకూడదు.

సమాధానం రేపటి సంచికలో


డైలీ సుడోకు -142

			9					6
5								9
	4					1		
		6		3	1	9		8
2			5		9			7
8		3	7	4		2		
		8					5	
9								4
6					5			

ట్వీట్



నా కన్ను ఎప్పుడూ బాల్ మీదే ఉంటుంది. నా దృష్టి ఎప్పుడూ లక్ష్యం మీదే ఉంటుంది.



పంకజ్ అద్వానీ
@PankajAdvani247

పంకజ్ అద్వానీని ట్విట్టర్‌లో ఫాలో అవుతున్న వారి సంఖ్య

1,044,768

కామన్‌మ్యాన్ వాయిస్

ఆధిపత్య అహంకారవాదులు నిగ్రహం కోల్పోయి విగ్రహాలను కూల్చినంత మాత్రాన.. ఆదర్శమూర్తుల ఆలోచనలని, ఆశయాలని చేరిపేయగలరా?
–Mahabub Pasha

వాళ్ల పార్టీకి సమాధి కట్టమని దేశానికి సందేశం ఇవ్వడానికి వాళ్లు విగ్రహాలు కూలగొడుతున్నరట! మనమే అర్థం చేసుకోవడం లేదు.
–Mitta Saidireddy

చాయ్‌వాలానే దేశ ప్రధాని అయినప్పుడు? స్వయంగా రైతు, ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించిన కార్య సాధకుడు.. ఈ దేశానికి ప్రధాని కాలేడా? కచ్చితంగా, వంద శాతం అయితడు.
– E Ravi Kanth

వైరల్ వీడియో



భరత్ అనే నేను సినిమా టీజర్ 'ద విజన్ ఆఫ్ భరత్'గా విడుదల చేశారు. ఈ వీడియో యూట్యూబ్‌లో హల్‌చల్ చేస్తున్నది.

The Vision of Bharat | Mahesh Babu | Siva Koratala | DVV Entertainment | Bharat Ane Nenu Teaser

Total views : 7,388,948+
Published on Mar 6, 2018

హరితగృహాల్లో పూల సాగులో
చీడపీడల యాజమాన్యం



రాష్ట్రంలో హరితగృహాల్లో సాగు చేయబడుతున్న పూల పంటల్లో కార్నేషన్, అంథూరియం, జెర్బరా ముఖ్యమైనవి. వీటిలో చీడ, పీడలను సకాలంలో గుర్తించి నివారిస్తే దిగుబడులు, నాణ్యత పెరుగుతాయి. రైతులు అధిక లాభాలు పొందవచ్చు .

కార్నేషన్:

పురుగులు

తామర పురుగులు: లీటరు నీటిలో 2 మి.లీ డైమిథోయేట్ లేదా 1.5 మి.లీ ఫిప్రొనిల్ కలిపి పిచికారీ చేయాలి.

ఎర్ర సాలీడు నల్లి: మొక్కకు పది చొప్పున బదనిక నల్లి అంబ్లిషియస్ లేదా స్పెతోకస్ పాపేర్‌కులస్‌ను పొలంలో వదలాలి లేదా లీటరు నీటికి 0.5 మి.లీ అబామెక్టిన్ లేదా 0.8 మి.లీ స్పైరోమెసిఫిన్ లేదా హెక్సాథయాజాక్స్‌ను 1.5 మి.లీ చొప్పున పిచికారీ చేయాలి.

తెగుళ్లు:

ఫ్యూజేరియం ఎండు తెగులు: 0.1 శాతం కార్బండిజం లేదా ఫ్రాఫినోకోనజోల్ 0.5 శాతం లేదా చదరపు మీటరుకు 25 గ్రాముల చొప్పున సూడోమోనాస్ ఫ్లోరసెన్స్‌ను నేలలో వేయాలి లేదా 0.5 శాతం చొప్పున దీనినే నెల రోజుల వ్యవధిలో పిచికారీ చేయాలి.

అంథూరియం:

పురుగులు:

పేనుబంక: లీటరు నీటిలో 3 మి.లీ డైమిథోయేట్ కలిపి పిచికారీ చేయాలి.

పొలుసు పురుగులు: లీటరు నీటికి ఒక మి.లీ మలాథియాన్ పిచికారీ చేసి నివారించవచ్చు.

సాలీడు నల్లి: లీటరు నీటికి రెండు మి.లీ ప్రాపర్గైట్ పిచికారీ చేయాలి లేదా 3 గ్రాముల తడి గంధకం పిచికారీ చేయాలి.

తామర పురుగులు: లీటరు నీటికి 1.5 మి.లీ ఫిప్రొనిల్ పిచికారీ చేయాలి.

తెగుళ్లు:

ఆంత్రాక్నోజ్: లీటరు నీటిలో 1 గ్రా కార్బండిజం కలిపి పిచికారీ చేయాలి.

ఆకుమచ్చ: ఒక గ్రాము కార్బండిజం లేదా రెండు గ్రాముల మాంకోజెబ్ ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

వేరుకుళ్లు: లీటరు నీటిలో రెండు గ్రాముల క్యాప్టాన్ కలిపి నేల తడిసేలా పిచికారీ చేయాలి.

బ్యాక్టీరియా ఎండు తెగులు: లీటరు నీటిలో 0.1 గ్రా చొప్పున స్ట్రెప్టోమైసిన్ సల్ఫేట్ పిచికారీ చేయాలి.

జెర్బరా:

పురుగులు:

పేనుబంక, తెల్లపేను: లీటరు నీటిలో ఒక మి.లీ ఇమిడాక్లోప్రిడ్ లేదా రెండు మి.లీ డైమిథోయేట్ పిచికారీ చేయాలి.

తామర పురుగులు: లీటరు నీటిలో 2 మి.లీ ఫిప్రోనిల్ లేదా 2 మి.లీ డైమిథోయేట్ పిచికారీ చేయాలి.

నులిపురుగులు: మొక్కలు నాటే సమయంలో హెక్టారుకు 2.5 కిలోల చొప్పున బాసిల్లస్ సబ్‌టిలిస్ అనే జీవ శిలీంధ్ర నాశనిని లేదా సూడోమోనాస్ ఫ్లోరిసెన్స్ పిచికారీ చేయాలి.

తెగుళ్లు:

పూత మాడు తెగులు: లీటరు నీటిలో రెండు గ్రాముల కాఫర్ ఆక్సిక్లోరైడ్ పిచికారీ చేయాలి.

బూడిద తెగులు: తడి గంధకం రెండు గ్రాములు లేదా అజోస్ట్రాబిన్ ఒక గ్రాము చొప్పున లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

–డాక్టర్ రావి చంద్రశేఖర్
విస్తరణ సంచాలకులు,
రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం

– సూరం సింధూజ
పీహెచ్‌డీ స్కాలర్
రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం

తీగజాతి కూరగాయ పంటలు కుకుర్బిటేసి కుటుంబానికి చెందినవి. వీటిలో తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాల్లో సొర, బీర, కాకర, దొండ, పొట్ల, పచ్చిదోస, కూరదోస, బూడిద గుమ్మడి, మంచి గుమ్మడి రకాలు సాగవుతున్నాయి. రైతులు తర్వాత పంటగా వేసుకోవడానికి లేదా ట్రూత్‌ఫుల్లీ లేబెల్డ్ విత్తనాలుగా అమ్మేందుకు సొంతంగా విత్తనోత్పత్తి చేపట్టవచ్చు. విత్తనాలను అవసరం మేరకు ఉత్పత్తి చేసి నిల్వ చేసుకోవచ్చు. బీర, కాకర, పొట్ల, సొర విత్తనాలు మూడేండ్ల వరకు, ఖర్బూజా, తర్బూజా విత్తనాలను నాలుగైదేండ్ల వరకు నిల్వ చేసుకోవచ్చు.



తీగజాతి కూరగాయల్లో విత్తనోత్పత్తి

రాష్ట్రంలో వీటి విత్తనోత్పత్తికి అనుకూల పరిస్థితులు ఉన్నాయి. వానకాలం, యాసంగి కాలాల్లో వీటిలో విత్తనోత్పత్తి చేపట్టవచ్చు. అయితే ప్రధానంగా ఉష్ణమండల పంటలు కావడం, గాలిలో తేమ శాతం తక్కువగా ఉండటం, చీడపీడల సమస్య తక్కువగా ఉండ టం వల్ల ఎండాకాలంలో వీటిలో విత్తనోత్పత్తి చేపడితే విత్తనాల నాణ్యత మెరుగ్గా ఉంటుంది. అయితే రైతు లు అన్నిరకాలతో విత్తనోత్పత్తి చేపట్టడానికి వీలు లేదు. ప్రభుత్వ సంస్థల నుంచి విడుదల చేయబడిన రకాల్లో విత్తనోత్పత్తి చేపట్టాలి. సంకర రకాలు ఉత్పత్తి కి ఆడ, మగ జనకాలు కావాలి. వీటిని ఉపయోగించి సంకర రకం విత్తనోత్పత్తి కొంచెం కష్టం కూడా. కాబట్టి రైతులు సూటి రకాల్లోనే విత్తనోత్పత్తి చేపట్టాలి. రాష్ట్రంలో సాగుకు సిఫార్సు చేసిన రకాల్లో విత్తనోత్పత్తి చేపట్టడం మంచిది. సొరలో అర్కబహార్, పీఎస్ఎల్, కాకరలో పూసాదా మౌసామి, కోయంబత్తూర్ లాంగ్ గ్రీన్, కోయంబత్తూర్ లాంగ్ వైట్, అర్క హరిత, బీరలో జగిత్యాల లాంగ్, జైపూర్ లాంగ్, పూసా నస్‌దర్, కూరదోసలో ఆర్ఎన్ఎస్‌యం1, 2; పచ్చిదోసలో కో-1, జపనీస్ లాంగ్ గ్రీన్, స్ట్రెయిట్ ఎయిట్, పూసా కీర, పాయిన్‌సెట్టి, బూడిద గుమ్మడిలో కో-1, 2, శక్తి, మంచిగుమ్మడిలో అర్క సూర్యముఖి, అర్క చందన, పూసా అలంకార్, పూసా విశ్వాస్, కో-1,2, సూటి రకాలు విత్తనోత్పత్తికి సాగుకు అనుకూలం. అలాగే పొట్లలో శ్వేతా కో-1, 2, తర్బూజలో హరమధు, దుర్గాపూర్ మధు, పూసా షర్బతి, పంజాబ్ సన్‌హరి సూటి రకాలు విత్తనోత్పత్తికి అనువైనవి.

విత్తనోత్పతిలో కీలకాంశం పూత స్వభావం, పుష్పించే విధానంపై అవగాహన పెంచుకోవాలి.

పూత స్వభావం: మొక్కల్లో ఆకు కాండం, మధ్యలో పూలు వస్తాయి. ఒకే మొక్కలో వేర్వేరుగా ఆడ, మగ పుష్పాలు ఏర్పడుతాయి. దీనివల్ల పరపరాగ సంపర్కం ఎక్కువగా జరుగుతుంది. స్వతహాగానే 60-80 శాతం వరకు పరపరాగ సంపర్కమే. నాటిన తర్వాత నలభై ఐదు రోజుల నుంచి పూత మొదలవుతుంది. మొక్క కాండంపై మొదటి నాలుగైదు పూత కణుపుల లో మగ పువ్వులు వస్తాయి. ఆ తర్వాత మిగతా కొన్ని కణుపులలో రెండో తరం కొమ్మల్లో ఆడ పూలు వస్తాయి. సాధారణంగా ప్రతి 15 మగ పూలకు తర్వాత ఒకే ఆడపువ్వు వస్తుంది. పూలు విచ్చుకోవడం పుప్పొడి రేణువుల విడుదల కాయలు కట్టుకోవడం వాతావరణ పరిస్థితులపై ఆధారపడి ఉంటుంది. మార్చి, ఏప్రిల్ నెలల్లో దోస, ఖర్జూజ, తర్బూజ, గుమ్మడిలలో ఉదయం 6-8 గంటల మధ్య పూలు విచ్చుకుంటా యి. ఇందుకు 13 డిగ్రీల నుంచి 18 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రత అవసరం. సోర,కాకరలలో పూత ఆలస్యంగా వస్తుంది. మధ్యాహ్నం తర్వాత అధిక ఉష్ణోగ్రతల్లోనే కాయ కడుతుంది. స్వతహాగా స్వపరాగ సంపర్కం, పరపరాగ సంపర్కం తేనెటీగలు ఇతర కీటకాల ద్వారానే జరుగుతుంది. కాబట్టి అధిక కాయల దిగుబడికి విత్తనోత్పత్తికి సంపర్క కారకాలైన తేనెటీగలు ముఖ్యం. వీటి యాజమాన్యానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి.

అధిక దిగుబడికి తేనెటీగల యాజమాన్యం: ఎకరాకు రెండు మూడు తేనెటీగల తెట్టెలు ఉంచాలి. వీటి చర్యలు ఉదయం నుంచి మిట్టమధ్యాహ్నం వరకు ఎక్కువగా ఉంటాయి. పంట పొలంలో ఒకచోట నీటివనరు ఉంటే వీటి కదలిక బాగుంటుంది. చలి ఆర్ద్రతతో కూడిన వాతావరణంలో తేనెటీగల చర్యలు మందకొడిగా ఉంటాయి. పూత మొదలై 5,6 రోజుల తర్వాత మాత్రమే తేనె టీగలను వదలాలి. మరీ ముందుగా వదిలితే పొలం నుంచి తప్పించుకునే ఉన్నది. అలాగే తీపి మొక్కజొన్న పరాగ రేణువులకు తేనెటీగలు బాగా ఆకర్షితమవుతాయి. కాబట్టి ఎకరానికి పది మొక్కలు ఉంటే మంచిది. తేనెటీగలు పురుగు మందులకు తట్టుకోలేవు. అందువల్ల పగలు ఆలస్యంగా, రాత్రి పూత త్వరగా పురుగు మందులు పిచికారీ చేస్తే తేనెటీగలపై ప్రభావం ఉండదు.

ఎరువులు:

హెక్టారుకు 15 టన్నులు బాగా చివికిన పశువుల ఎరువు, 50-55 కిలోల నత్రజని, 20-30 కిలలో భాస్వరం, 25-30 కిలోల పొటాష్‌నిచ్చే ఎరువులను పంటకు వాడాలి. పంట పొలం తయారీకి మూడు వారాల ముందు పశువుల పెంట వేయాలి. మొత్తం భాస్వరం పొటాష్ ఎరువు, 30 శాతం నత్రజని ఎరువులను దుక్కి తయారీలో, మూడింతల నత్రజని ఎరువును రెండు సమభాగాలుగా చేసి మొక్కలు బాగా ఎన్నుకున్న తర్వాత 15 రోజుల వ్యవధిలో వేయాలి. పైపాటుగా ఎరువులు వేసేటప్పుడు తప్పనిసరిగా నేలలో తేమ ఉండేలా చూసుకోవాలి. కాయలు ఏర్పడటానికి ముందే నత్రజని అందించడం పూర్తి చేయాలి. అధిక నత్రజని, అధిక ఉష్ణోగ్రత, దీర్ఘకాలిక సూర్యరశ్మి పరిస్థితుల్లో మగ పూలు ఎక్కువగా వస్తాయి. ఆడపూల సంఖ్య తగ్గి దిగుబడి తగ్గిపోతుంది. అలాగే ఆడపూల సంఖ్య పెరిగేందుకు మొక్కలు 2,4 ఆకుల దశలో ఉన్నప్పుడు లీటరు నీటికి మూడు గ్రాముల బోరాక్స్ లేదా 250 మి.గ్రాముల సిసిసి లేదా 50 మి.గ్రాముల మాలిక్ హైడ్రజైడ్ కలిపి పిచికారీ చేయాలి.

వేర్పాటు దూరం: దోస జాతి పంటలన్నీ పరపరాగ సంపర్కం చెందేవి. కాబట్టి వేర్పాటు దూరం కీలకం. ఒకే పంటలో ఇతర రకాల నుంచి, అదే రకంలో విత్తన స్వచ్ఛత ప్రమాణాలకు అనుగుణంగా లేని పొలాల నుంచి ఫౌండేషన్ విత్తనోత్పత్తికి 1000 మీటర్లు, ధృవీకరణ విత్తనోత్పత్తికి 500మీటర్ల వేర్పాటు దూరం పాటించాలి.

నేలలు: మురుగు నీరు పోయే సౌకర్యం ఉన్న లోతైన, సారవంతమైన నేలలు అనుకూలం. ఉదజని సూచిక 6 నుంచి 7 మధ్య ఉండాలి. ఆమ్ల నేలలు, క్షార నేల లు పనికిరావు. విత్తనం త్వరగా మొలకెత్తడానికి తొలిదశలో అభివృద్ధికి నేల ఉష్ణోగ్రత పది నుంచి 25 డిగ్రీ ల సెంటిగ్రేడ్‌ల మధ్య ఉండాలి. నేలలో తేమ కూడా మరీ ఎక్కువగా, మరీ తక్కువగా ఉండరాదు.

విత్తే సమయం: బీర, బూడిద గుమ్మడి ఎండాకాలం లో మార్చివరకు , పొట్ల, గుమ్మడి మార్చి మొదటి వరకు, దోస, కాకర, సొర, మార్చి వరకు నాటుకోవచ్చు.

విత్తే పద్ధతి: రెండు పద్ధతులు అందుబాటులో ఉన్నాయి. బోదెలు-కాలువల పద్ధతి. దీనిలో పంటకు సిఫార్సు చేసిన దూరాన్ని బట్టి బోదెలు-కాలువలు తయారు చేయాలి. కాలువల చివర్లలో విత్తుకోవాలి. మొక్కలు పక్కనే ఉన్న బోదెలపై వస్తాయి. అదే వర్షాకాలంలో అయితే ఎత్తైన మడులు తయారు చేసి మధ్యలో కాలువలు వదలా లి. మొక్కలను కాలువలలో నాటి బోదెలపై ఇరువైపులా పాకించాలి.

నీటి యాజమాన్యం: కాకర, సొరలో విత్తన కవచం గట్టిగా ఉంటుంది. మొలకెత్తడానికి తగినంత తేమ అవసరం. ప్రతి నాలుగైదు రోజుల వ్యవధిలో తేలికపాటి నీటి తడులివ్వడం ద్వారా నేలలో తేమలో తేమను కాపాడవచ్చు. మట్టి తట్టు ఏర్పడకుండా చూడవచ్చు. వేరు వ్యవస్థ చుట్టూ మాత్రమే సాగు నీటిని అందించాలి. మొత్తం మొక్కను తడుపకూడదు.

విత్తన మోతాదు, విత్తే దూరం (ఎండాకాలం పంటకు)

పంట	విత్తన మోతాదు (ఎకరాకు)	రెండు వరుసల మధ్యదూరం	వరుసలలో రెండు పాదుల మధ్య దూరం
కాకర	1.8-2.4	1.5మీటర్లు	0.6 మీటర్లు
బీర	1.4-2.0	1.5 మీటర్లు	0.6 మీటర్లు
సొర	1.2-2.4	2.0 మీటర్లు	0.6 మీటర్లు
బూడిద గుమ్మడి	2.0-2.8	3.0 మీటర్లు	0.75 మీటర్లు
మంచి గుమ్మడి	2.4-3.2	3.0 మీటర్లు	0.75 మీటర్లు
పొట్ల	2.0-2.4	2.0 మీటర్లు	0.75 మీటర్లు
పచ్చిదోస	1.4-1.6	1.5 మీటర్లు	0.5 మీటర్లు
కూర దోస	1.0-1.4	1.0-1.5 మీటర్లు	0.5 మీటర్లు

కల్తీల ఏరివేత: పరపరాగ సంపర్కం స్వభావం వల్ల ఒకే రకంలో కూడా వైవిధ్యం ఉండే అవకాశం ఉన్నది. పూతకు ముందు పూత అపరిపక్వ కాయ దశ, కాయలు ముదిరిన దశలో మూడుసార్లు కచ్చితంగా విత్తన క్షేత్రాల తనిఖీ చేపట్టాలి. కండ, రంగు, మందం, మొత్తం కరిగే ఘనపదార్థాల ఆధారంగా ఖర్బూజా, తర్బూజాలో కండపైచారలు, సెట్టింగ్ ఆధారంగా కర్బూజాలో కండపై చారలు కండ స్వభావం ఆధారంగా తర్బూజాలో కల్తీలను గుర్తించి ఏరివేయాలి. అన్ని అటవీజాతి మొక్కలు కల్తీలను పూతకు ముందే తీసివేయాలి. ధృవీకరణ విత్తనోత్పత్తికి విత్తనక్షేత్రంలో కల్తీలు విత్తనం ఆశించే తెగుళ్లు 0.20 శాతం మించకూడదు. వైరస్ తెగుళ్లు ఆశించిన కల్తీలు ఒక్క శాతం మించకూడదు. కలుపు గింజలు ఉండకూడదు.



భారత కనీస విత్తన ధృవీకరణ ప్రమాణాలు

కనీస భౌతిక స్వచ్ఛత	-	99శాతం
గరిష్ఠ జడపదార్థం	-	1 శాతం
ఇతర పంట విత్తనాలు	-	(గరిష్ఠంగా)-0.1 శాతం
మొత్తం కలుపు విత్తనాలు	-	(గరిష్ఠంగా)-0.1 శాతం
కనీస మొలక శాతం	-	60 శాతం
గరిష్ఠ తేమ శాతం	-	సాధారణ నిల్వలలో 7 శాతం, తేమ చేరని సంచులలో నిల్వకు 6 శాతం

కోత, విత్తన సేకరణ: కోతకు బాగా పండిన పండ్లను మాత్రమే సేకరించాలి. వర్షాకాలం కంటే వేసవిలో త్వరగా పక్వానికి వస్తాయి. విత్తనం కట్టేందుకు పట్టే సమయం పంటను బట్టి మారుతుంది. కాకర, పొట్ల, దోసకు 65 రోజులు, సొరలో 75-80 రోజులు గుమ్మడి వంద రోజులు, బూడిద గుమ్మడి 90 రోజులు, తర్బూజ, ఖర్బూజాలో 80-85 రోజులు పడుతుంది. దోసలో పండ్లు పాలిపోయిన పసుపు నుంచి బంగారు రంగులోకి మారినప్పుడు పండ్లను సేకరించాలి. గుమ్మడిలో గుజ్జు నుంచి గింజలు బైటికి వచ్చినప్పుడు, ఖర్బూజలో ఫుల్ స్లిప్ దశ, తర్బూజలో కాయ కింద రంగు ఆకుపచ్చ తెలుపు నుంచి పసుపు రంగులోకి మారినప్పుడు, కాకర, పొట్లలో పండ్ల రంగు పసుపులోకి మారినప్పుడు వాటిని సేకరించాలి. విత్తన సేకరణకు ముందుగా తయారైన పూర్తిగా పండ్లనే పరిగణించాలి. బీర, సొర, పొట్లలో కాయలలోపల గింజలశబ్దం గమనించినప్పుడు వాటిని పగులగొట్టి విత్తనాలు సేకరించాలి. మిగతా వాటిలో గుజ్జు విత్తనం కలిసి ఉంటుంది. కాబట్టి ప్రత్యేకంగా సేకరించాలి. రెండు పద్ధతులు అందుబాటులో ఉన్నాయి.

పొడి పద్ధతి: సేకరించిన పండ్లను ఎండబెట్టాలి. ఆ తర్వాత ఒకవైపు రంధ్రం చేయాలి. విత్తనాలు సేకరించాలి. పొట్ల బీరలలో విత్తనం సేకరించవచ్చు.

తడి పద్ధతి: దోస, తర్బూజా, ఖర్బూజా, కాకర, బూడిద గుమ్మడిలో విత్తన సేకరణకు ఈ పద్ధతి వాడరాదు. దోస, కాకరలలో కాయలను నిలువుగా చీల్చాలి. విత్తనాలు తీయాలి. మంచి గుమ్మడి, ఖర్బూజాలలో కాయలను రెండుగా కోసి విత్తనం, గుజ్జును సేకరించాలి. బూడిద గుమ్మడి, తర్బూజాలలో మొత్తం లోపలి గుజ్జును బైటికి తీయాలి. ఆ తర్వాత గుజ్జు నుంచి విత్తనాలు సేకరించాలి. అందుకు మూడు పద్ధతులు అందుబాటులో ఉన్నాయి.

యాంత్రిక సేకరణ పద్ధతి: దీనిలో యంత్రం పండ్లను ముక్కలుగా కోసి గుజ్జును ఇస్తుంది. ఆ తర్వాత గుజ్జు నుంచి విత్తనాలు వేరు చేస్తుంది. సొర, తర్బూజ, బూడిద గుమ్మడిలో ఈ పద్ధతిలో విత్తన సేకరణ చేయవచ్చు. తక్కువ కాలంలో తక్కువ ఖర్చుతో ఈ పద్ధతిలో విత్తనం సేకరించవచ్చు. ఈ పద్ధతిలో సేకరించిన విత్తనం ప్రకాశవంతంగా ఉంటుంది. అయితే ఎక్కువ నీరు అవసరం ఉంటుంది.

సహజంగా పులియబెట్టే పద్ధతి: ఈ పద్ధతిలో పండ్ల నుంచి తీసిన గుజ్జును ఇనుప, ప్లాస్టిక్, చెక్క బకెట్లలో 25 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత వద్ద 48 గంటల పాటు నిల్వ ఉంచాలి. రెండుమూడు సార్లు బాగా కలిపి నీటితో రెండుమూడుసార్లు కడుగాలి. అయితే ఈ పద్ధతిలో సేకరించిన గింజలు రంగు కోల్పోతాయి.

రసాయనాలతో విత్తన సేకరణ: 25-30 మి.లీ హైడ్రోక్లోరిక్ ఆమ్లం లేదా 8-10 మి.లీ వాణిజ్య హైడ్రోజన్ సల్ఫైడ్ ఆమ్లాన్ని ఐదు కిలోల పండ్ల గుజ్జుకు కలిపి కొంతనీటిని చేర్చి బాగా కలియబెట్టాలి. 30 నిమిషాల తర్వాత చూస్తే గింజలు నీటిలో అడుగుకు చేరుతాయి. గుజ్జు పైకి వస్తుంది. శుభ్రమైన నీటిలో కడిగి విత్తనాలు నిల్వ చేసుకోవాలి. తక్కువ కాలంలో విత్తన సేకరణ ఈ పద్ధతిలో సాధ్యమౌతుంది.

విత్తన దిగుబడి: హెక్టారుకు దోసలో 1-2 క్వింటాళ్లు, బీర, కాకర 4-5 క్వింటాళ్లు, సొర 5-6 క్వింటాళ్లు, తర్బూజ, ఖర్బూజలలో 2-3 క్వింటాళ్లు విత్తన దిగుబడి వస్తుంది.



డాక్టర్ పిడిగెం సైదయ్య
శాస్త్రవేత్త, రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం
7780509322

ఎండాకాలంలో కొత్తిమీర సాగు



కొత్తిమీర.. మనం ఆహారంలో తరచూ వాడే ఆకుకూర. విటమిన్ కె, విటమిన్ ఎ, విటమిన్ సి అధిక పాళ్లలో ఉండే కొత్తిమీరను మనం తినే ప్రతి కూరలో వేసుకుంటాం. కొత్తిమీరను మన రాష్ట్రంలో అన్ని కాలాల్లో సాగు చేసుకోవచ్చు. అయితే మిగతా కాలాల కన్నా.. ఎండా కాలంలో అధిక ధర పలుకుతుంది. అధిక వేడిమికి మొక్క సరిగ్గా ఎదుగక పోవడం.. మాడు తెగులు వంటివి ఇందుకు కారణాలు. కాబట్టి ఎండాకాలంలో పందిరి కింద.. షెడ్ నెట్‌లలో సాగు చేస్తే మంచి లాభాలు పొందవచ్చు.

సాగుకు అనువైన శాస్త్రీయ పద్ధతులు :

ఎండాకాలంలో పండించే పంటల్లో కొత్తిమీర మంచి లాభదాయకమైనది. అయితే అధిక ఉష్ణోగ్రతలు తట్టుకునేందుకు.. ఉద్యాన విశ్వవిద్యాలయం పరిశోధనా ఫలితానను సరించి వేసవిలో నీడ అవసరం. ఇందుకోసం చెట్లనీడ లేదా.. పందిళ్లు, షేడ్ నెట్ల కింద సాగు చేపట్టాలి. ఈ మూడు పద్ధతులు అనుకూలమైనప్పటికీ, షేడ్‌నెట్ల కింద సాగుతో అధిక దిగుబడి వస్తుంది.

విత్తన మోతాదు:

ఎకరానికి దేశీ రకమైతే.. 35 నుంచి 40 కిలోలు, హైబ్రిడ్ రకాలైతే 25 నుంచి 30 కిలోల వరకు విత్తనం అవసరం ఉంటుంది. పొలాన్ని చదును చేసి దుక్కిమందు వేసి.. మడులుగా తయారు చేసుకొని విత్తనాలు వెదజల్లాలి. ఎండాకాలంలో అధిక ఉష్ణాగ్రత వల్ల మొలక శాతం తక్కువగా ఉంటుంది. అందువల్ల విత్తనం ఇతర కాలాల కన్నా 5 నుంచి 10 కిలోలు అధిక మోతాదులో వాడాలి.

విత్తనశుద్ధి తప్పనిసరి:


కొత్తిమీర సాగుకు అధిక సాంద్రతలో విత్తనం వేసుకుంటాం. కాబట్టి తెగులు ఆశించి పంటనష్టపోయే అవకాశం అధికంగా ఉంటుంది. దీని నివారణకు విత్తనశుద్ధి తప్పనిసరిగా చేసుకోవాలి. ఒక కిలో విత్తనానికి 1గ్రా. కార్బండిజం లేదా.. ట్రైకోడెర్మావిరిడితో విత్తనశుద్ధి చేసుకోవాలి. విత్తనశుద్ధి చేయలేని పరిస్థితుల్లో మడుల తయారీ సమయంలో లేదా విత్తనాన్ని విత్తుకున్న తరువాత ఒక ఎకరాకు 25కిలోల ట్రైకోడెర్మావిరిడి లేదా సుడోమోనాస్‌లను పశువుల ఎరువు /వానపాముల ఎరువుతో కలిపి చల్లుకోవచ్చు.

నీటియాజమాన్యం : ఎండాకాలంలో కొత్తిమీర సాగులో నీటియాజమాన్యం చాలా ముఖ్యమైంది. సరైన నీటి యాజమాన్య వల్ల నేల ఉష్ణోగ్రతలు తగ్గడమే కాకుండా మొక్కల మధ్య సూక్ష్మ వాతావరణం మొక్కలు వాడిపోకుండా కాపాడుతుంది. అంతేగాక మొక్కల పెరుగుదల కూడా నీటి తడుల మీద ఆధారపడి ఉంటుంది. నల్లరేగడి భూముల్లో అయితే 3-4 రోజులకు ఒకసారి.. ఇతర భూముల్లో రెండు రోజులకు ఒకసారి నీళ్లు పెట్టాలి. వీలైనంత వరకు తడులను ఉదయం, సాయంత్రం పూట మాత్రమే ఇవ్వాలి.

ఎరువుల యాజమాన్యం

వేసవిలో కొత్తిమీర సాగుకు ఎకరానికి 10టన్నుల చొప్పున పశువుల ఎరువు వేసుకోవాలి. వానపాముల ఎరువు కూడా విరివిగా వాడవచ్చు. ముఖ్యంగా నత్రజని, భాస్వరం, పోటాష్‌లను అందించే ఎరువులను అఖిరిసారి మళ్లను దంతితో తిరగదోలేటప్పుడు వేసుకోవాలి. ఇందుకు సెంటు మడికి 350గ్రా. యూరియా, 1కిలో సింగిల్ సూపర్ ఫాస్ఫేట్, 150గ్రా. మ్యూరేట్ ఆఫ్ పొటాష్ ఎరువులను వేసుకోవాలి. విత్తిన 20రోజులకు జిబ్బరిల్లిక్ యాసిడ్ 0.1గ్రా. 10లీ.నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి.

విత్తే విధానం



ఎత్తైన నారుమళ్లలో (3అడుగుల వెడల్పు, 6 అంగళాల ఎత్తు, తగినంత పొడవున్న) విత్తుకోవాలి. విత్తనం వేసవిలో విత్తేటప్పుడు లోతులో పెడితే ఎట్టి పరిస్థితుల్లోనూ మొలకెత్తదు. అందువల్ల విత్తనాన్ని ఒక సెం.మీ లోతులో సూచించిన మోతాదులో విత్తుకోవాలి. బద్ద చేసిన విత్తనాన్ని నారుమడిపై వరుసల్లో గాని లేదా చల్లుకునే పద్ధతిలో కాని విత్తుకోవాలి. తరువాత బాగా చివికిన పశువుల ఎరువుగాని ఒక భాగానికి 5 భాగాలు మట్టి కలిపి పైన ఒక సెంటీమీటరు మందం మించకుండా విత్తనం మునిగేలా చల్లుకోవాలి. ఇలా విత్తిన మడులపైన వారం రోజులపాటు లేదా విత్తనం మొలక ప్రారంభమయ్యే వరకు వరిగడ్డితో కప్పాలి.

కోత - జాగ్రత్తలు: సాధారణంగా వేసవిలో కొత్తిమీర కోతకు 45-50 రోజుల కాలవ్యవధిలో కోతకు వస్తుంది. దేశీ రకాలైనే వేర్లతో సహా తొలిగించి కట్టలు కట్టి అమ్ముకోవచ్చు. హైబ్రిడ్ రకాలు వేర్లతో సహా తొలిగించవచ్చు.. లేదా కోయవచ్చు. మళ్లీ యూరియా, డీఏపీ వేసుకుని నీళ్లు పెట్టుకుంటే మళ్లీ 45 రోజులకు కోతకు వస్తుంది. ఇలా రెండు మూడు సార్లకు మించి కోయరాదు. మొక్కలను కట్టలు కట్టి ట్రేలలో ఉంచుతే తాజాగా ఉంటాయి. డిమాండ్‌ను బట్టి పెద్ద కట్టలు (15-20 మొక్కల కట్ట) చిన్న కట్టలు (5-10 మొక్కలు కట్ట) కట్టి మార్కెట్ చేసుకోవాలి. దూరపు మార్కెట్లకు తరిలించేటప్పుడు కొత్తిమీర వాడిపోకుండా వెదురు బుట్టల్లో, తడిగోనే సంచుల్లో చుట్టి పంపించాలి.

తెగుళ్ల - ఇతర సమస్యలు: మాగుడు తెగులు : ఈ పద్ధతిలో సాగు చేసినప్పుడు మొక్కల సాంద్రత ఎక్కువగా ఉంటుంది. అందువల్ల మాగు డు తెగులు ఆశించే అవకాశం ఎక్కువ. తెగులు ఆశించకుండా విత్తనశుద్ధి తప్పనిసరిగా చేయాలి. మొక్కలు మొలిచిన వెంటనే కాపర్ ఆక్సీక్లోరైడ్ లీటరు నీటికి 3గ్రా. చొప్పున కలిపి పిచికారీ చేయాలి.

ఆకుమచ్చ(ఆల్టర్నేరియా ఆకు ఎండు తెగలు):

ఈ తెగలు ఆశించినప్పుడు, మొదట కింద ఆకులపై కాలినట్లు మచ్చలు ఏర్పడతాయి. ఒకటి రెండు రోజుల్లోనే ఆకుల్ని మాడినట్లు కనిపిస్తాయి. దీని నివారణకు 1గ్రా. కార్బండిజమ్ + 2.5గ్రా. మాంకోజెబ్ మందులను లీటరు నీటికి కలిపి వారంరోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేసుకోవాలి.

- గుండెల రాజు, మహబూబాబాద్ వ్యవసాయం
72889 85757

తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు



కొత్తిమీరలో అవసరమైన విటమిన్లు ఉన్నాయి. వేసవిలో కొత్తిమీర సాగుపై పై రైతులు దృష్టి సారిస్తే మంచి ఫలితాలు వస్తాయి. తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులను పొందవచ్చు.

- బి.వెంకట రాజ్‌కుమార్,
శాస్త్రవేత్త(ఉద్యాన వనం) కృషి విజ్ఞాన్ కేంద్రం, రుద్రూర్
98662 40346

నమస్తే తెలంగాణ
చిత్రం
[హైదరాబాద్]
గురువారం 8 మార్చి 2018

లాస్ ఏంజెల్స్‌లో ఫొటో షూట్..?


రాజమౌళి

'బాహుబలి' సిరీస్‌లు ప్రపంచ వ్యాప్తంగా సృష్టించిన హంగామా అంతా ఇంతా కాదు. యావత్ ప్రపంచ సినీ వర్గాలన్నీ తెలుగు సినిమా వైపు తిరిగి చూసేలా చేసింది. ఈ చిత్రంతో దర్శకుడిగా ప్రపంచ సినీ ప్రియుల దృష్టిని ఆకర్షిం చిన రాజమౌళి త్వరలో ఎన్టీ ఆర్, రామ్‌చరణ్‌ల కలయికలో ఓ భారీ మల్టీస్టారర్ చిత్రానికి శ్రీకారం చుడుతున్న విషయం తెలిసిందే. ఈ చిత్రంలో బాలీవుడ్, కోలీవుడ్, శాండల్‌వుడ్‌కు ఎందిన ప్రముఖ నటీనటులు కీలక పాత్రల్లో నటించను న్నారట. దాదాపు రెండువందల కోట్ల బడ్జెట్‌తో రెండు వందల రోజులకు పైగా సినిమా చిత్రీకరణ జరగనున్నట్లు సమా చారం. ట్విట్టర్‌లో ఇద్దరు హీరోలతో కలిసి పోజిచ్చిన ఓ ఫొటోను పోస్ట్ చేసిన రాజమౌళి ఈ సినిమాపై గత కొన్ని రోజులుగా వస్తున్న ఊహాగానాలపై ఎలాంటి వివరణ ఇవ్వ కుండా సైలెంట్‌గా తన పని తాను చేసుకుంటూ పోతున్నారు. తాజాగా ఈ చిత్రంపై మరో వార్తతో పాటు రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఎన్టీఆర్, రామ్‌చరణ్‌లు కలసి వున్న ఫొటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఈ చిత్రానికి సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ కార్యక్ర మాల్ని ఇప్పటికే మొదలుపెట్టిన రాజమౌళి తాజాగా ఎన్టీఆర్, రామ్‌చరణ్‌లతో అమెరికాలో ప్రత్యే కమైన ఫొటోషూట్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిసింది. 'రంగస్థలం' పూర్తి కావడంతో రామ్‌చ రణ్ ఫ్రీ అయ్యాడు. త్రివిక్రమ్‌తో చేస్తున్న సినిమా రెగ్యులర్ షూటింగ్ ఏప్రిల్ నుంచి మొదలు కానుంది. దీంతో ఎన్టీఆర్ కూడా ఫ్రీగానే వున్నాడు. ఈ సమయాన్ని వినియోగిం చుకోవాలనుకున్న రాజమౌళి లాస్ ఏంజెల్స్‌లో ఎన్టీఆర్, రామ్‌చరణ్‌తో వన్ డే ఫొటోషూ ట్‌ను ప్లాన్ చేశారట. ఆ కారణంగానే మంగళవారం రాత్రి ఇద్దరు హీరోలు రాజమౌళి కుమా రుడు కార్తికేయతో కలిసి అమెరికాలోని లాస్ ఏంజెల్స్‌కు వెళ్లినట్లు చెబుతున్నారు. ఈ ఏడా దిలోనే సెట్స్‌పైకి రానున్న ఈ చిత్రాన్ని 2020 సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకు తీసుకురా వాలని రాజమౌళి సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం.


ఎన్టీఆర్


'రంగస్థలం' చిత్రంలో రామ్‌చరణ్, సమంత

'కథానాయికగా ఇదే నా తొలి సినిమా. రెగ్యులర్ సినిమాలకు భిన్నంగా వైవిధ్యంగా నా పాత్ర సాగుతుంది' అని చెప్పింది శివానీసింగ్. ఆమె కథానాయికగా నటిస్తున్న తాజా చిత్రం 'ఏ మంత్రం వేసావే'. గోలిసోడా ఫిల్మ్ పతాకంపై సురక్ష్ ఎంటర్‌టైన్‌మెంట్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ పతాకంపై మల్కాపురం శివకుమార్ సమర్పణలో శ్రీధర్ మర్రి స్వీయ దర్శకత్వంలో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ఈ నెల 9న ప్రేక్షకుల ముందుకురానున్నది. ఈ సందర్భంగా బుధవారం హైదరాబాద్‌లో శివానీ సింగ్ పాత్రికేయులతో ముచ్చటించింది. ఆ విశేషాలివి...

నా కల నెరవేరింది!

నా స్వస్థలం ఢిల్లీ. అమ్మ టీచర్, నాన్న ఎరో నాటికల్ ఇంజనీర్. చాలా సింపుల్ ఫ్యామిలీ మాది. అమ్మనాన్నల సలహా మేరకు డిగ్రీ పూర్తిచేసి మోడలింగ్‌లో అడుగుపెట్టాను. రంగస్థల కళాకారిణిగా పనిచేసిన అనుభవ ముంది. వెండితెరపై నన్ను నేను చూసుకో వాలనే కల ఈ సినిమాతో నెరవేరింది.

నవతరం అమ్మాయిలకు ప్రతీకగా..

తెలివితేటలున్న ధైర్యవంతురాలైన అమ్మాయిగా ఈ సినిమాలో కనిపి స్తాను. నిజాయితీ, మంచితనం కలగ లసిన నవతరం అమ్మాయిలకు ప్రతీ కగా నా పాత్ర ఉంటుంది. నా పాత్ర లోని భావోద్వేగాలతో ప్రతి ఒక్కరూ కనెక్ట్ అవుతా రనే నమ్మక ముంది. వీడియోగేమ్, సోషల్‌మీడియా లకు అలవాటుపడిన యువకుడిగా విజయ్‌దేవరకొండ కనిపిస్తారు. దానివల్ల అతడికి ఎదురయ్యే సమస్యల నేపథ్యంలో సినిమా సాగుతుంది. విజయ్ దేవరకొండతో పనిచేయడం చాలా ఆనందంగా ఉంది. హిందీ, ఇంగ్లీష్‌లలో నా డైలాగ్స్ రాసుకొని ప్రాక్టీస్ చేసుకున్నాను. అలా మెల్లిగా నా పాత్ర తాలూకు సంభాషణల్ని అర్థం చేసు కొని నటించాను.

సోషల్ మీడియా లేకపోయినా..

ఇప్పుడున్న ఆధునిక జీవన శైలిలో సామాజిక మాధ్యమాలు వాడటం అవస రమే. అలాగని వాటికి బానిసకాకూడదు. నిజజీవితంలో అవసరం మేరకు సాంకే తిక పరిజ్ఞానంపై ఆధారపడతాను. సోష ల్ మీడియా లేకున్నా ఉండగలను. ఇప్పటికీ త్రీజీ ఫోన్‌నే వాడుతున్నాను. సాంకేతికత వల్ల నా వృత్తికి ఎలాంటి ఇబ్బంది ఉండకూడ దని కోరుకుంటాను.

మహేష్‌బాబు అంటే ఇష్టం...

చిత్ర పరిశ్రమలోనే కాకుండా అన్ని రంగాల్లో మహిళలపై అన్యాయాలు, అఘా యిత్యాలు జరుగుతున్నాయి. వాటిని ఎదు రించే ధైర్యం మహిళల్లో రావాలి. అందరూ సమానమేననే భావనను పెంపొందించాలి. ఈ అఘాయిత్యాలకు సంబంధించి అంద రిలో అవగాహన పెరగాలి. అప్పుడే వాటిలో మార్పు వచ్చే అవకాశముంది. మహేష్ బాబు, అక్షయ్‌కుమార్, హృతిక్‌రోషన్ అంటే ఇష్టం. రాజ్‌కుమార్‌రావ్ నటన నచ్చుతుంది.


శివానీ సింగ్


అనిల్ సుంకర, సంయుక్త హెగ్డే, నిఖిల్, సిమ్రన్, శరన్

నా హృదయానికి దగ్గరైన సినిమా!

'ఇప్పటి వరకు నేను 15 చిత్రాల్లో నటించాను. 'కిరాక్ పార్టీ' నా హృదయానికి దగ్గరైన సినిమా ఇది. పెద్ద నోట్ల రద్దు అనంతరం విడుదలైన 'ఎక్కడికి పోతావు చిన్నవాడా' సూపర్‌హిట్‌గా నిలిచింది. ఆ సెంటిమెంట్ పునరా వృతమై థియేటర్‌ల బంద్ తరువాత రీలీజ్ అవుతున్న 'కిరాక్ పార్టీ' కూడా హిట్‌గా నిలుస్తుందనే నమ్మకంతో వున్నాను' అన్నారు హీరో నిఖిల్. ఆయన కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'కిరాక్ పార్టీ'. శరన్ కొప్పి శెట్టి దర్శకుడిగా పరిచయమవుతున్నారు. సంయుక్త హెగ్డే, సిమ్రాన్ పరీన్జా కథానాయికలు. సుంకర రామబ్రహ్మం నిర్మిస్తున్న ఈ చిత్రం ఈ నెల 16న విడుదల కానుంది. ఈ సందర్భంగా నిర్వహిస్తున్న ఈ చిత్ర కార్ కాంటెస్ట్‌కు సంబంధించిన పోస్టర్‌ను సీనియర్ జర్నలిస్ట్‌లు శ్రీనివాస్, ఆనంద్‌లు బుధవారం హైదరాబాద్‌లో విడుదల చేశారు. అనంతరం నిర్మాత మాట్లాడుతూ 'ప్రపంచ వ్యాప్తంగా ఈ చిత్రాన్ని ఈ నెల 16న విడుదల చేస్తున్నాం. ఈ చిత్రంలో వాడిన కారును ఓ కాంటెస్ట్ నిర్వహించి అందులో విజేతగా నిలిచిన వారికి అందజేయనున్నాం. దీని కోసం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ప్రత్యేక యాత్రను నిర్వహించనున్నాం. ఈ నెల 10న పాటల్ని విడుదల చేసి 13న విజయవాడలో ప్రీరిలీజ్ వేడుకను జరుపనున్నాం. 'శివ' సినిమా చూసిన తరువాత ఈ తరహా చిత్రాన్ని నేను తీయగలనా? అనిపించింది. ఆ సినిమాకు దగ్గరగా 'కిరాక్ పార్టీ' వుంటుంది. కాలేజీ నేప థ్యంలో సినిమా వచ్చి చాలా కాలం అవుతున్నది. ఈ చిత్రం చూసిన వారికి తమ కాలేజీ రోజులు గుర్తొస్తాయి' అన్నారు. నా హృదయానికి చాలా దగ్గరైన సినిమా ఇదని సిమ్రాన్ పరీన్జా తెలిపింది. నన్ను నమ్మి ఇంత మంచి సినిమాలో అవకాశం ఇచ్చిన దర్శకనిర్మాతలకు కృతజ్ఞతలు' అని సంయుక్త హెగ్డే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాకేందుమౌళి, అప్పు, జాన్, మౌర్య తదితరులు పాల్గొన్నారు.


రకుల్‌ప్రీత్‌సింగ్

పారితోషికాన్ని తగ్గించింది?

గత కొన్నేళ్లుగా తెలుగులో ఏడాదికి నాలుగైదు సినిమాలు చేస్తూ వచ్చింది రకుల్‌ప్రీత్ సింగ్. జయాపజయాలతో సంబంధం లేకుండా అగ్రకథానాయకుందరితో జోడీకట్టిన ఆమె నెంబర్‌వన్ హీరోయిన్‌గా చెలామణి అయింది. నవతరం తారల పోటీ కారణంగా ప్రస్తుతం అవకాశాల రేసులో వెనుకబడిపోయింది. ఆమె చేతిలో ఒక్క సినిమా లేదు. టాలీ వుడ్ సినిమాలకు దూరమైన ఆమె తమిళ, హిందీ సినిమాలపై దృష్టిసారిస్తున్నది. అయితే అక్కడ కూడా రకుల్‌ప్రీత్‌సింగ్‌కు అదృష్టం అంతగా కలిసిరావడం లేదు. దాంతో తెలు గులో రీఎంట్రీ ఇచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నది. ఓ విజయంతో పూర్వవైభవాన్ని దక్కించుకోవాలని ఆరాటపడుతున్నట్లు తెలిసింది. మంచి కథ లభిస్తే అవసరమైతే తన పారితోషికాన్ని సగానికి పైగా తగ్గించుకోవడానికి సిద్ధంగా ఉన్నట్లు ఆమె సన్నిహిత వర్గాల సమాచారం. నవతరం తారల దూకుడును తట్టుకొని నిలబడాలంటే అది ఒక్కటే సరైన మార్గమనే నిర్ణయానికి రకుల్‌ప్రీత్‌సింగ్ వచ్చినట్లు తెలిసింది. ప్రస్తుతం తమిళంలో సూర్య, కార్తీలతో సినిమాలు చేస్తున్నది రకుల్‌ప్రీత్‌సింగ్.

సైనికుల త్యాగాలతో..


మేజర్ రవి, మోహన్‌లాల్, బాలాజీ

మోహన్‌లాల్, అల్లుశిరీష్ ప్రధాన పాత్రల్లో నటించిన మలయాళ చిత్రం '1971 బియాండ్ బోర్డర్స్'. మేజర్ రవి దర్శకత్వం వహించారు. ఈ చిత్రాన్ని జాస్ రాజ్ ప్రొడక్షన్స్, శ్రీలక్ష్మీజ్యోతి క్రియేషన్స్ పతాకాలపై ఏ.ఎన్ బాలాజీ 'యుద్ధ భూమి' పేరుతో తెలుగు ప్రేక్షకులకు అంది స్తున్నారు. ఈ చిత్ర ట్రైలర్‌ను కేరళలో మోహన్‌లాల్ విడుదలచేశారు. ఆయన మాట్లాడుతూ 'దర్శకుడు మేజర్ రవి ఆర్మీలో పనిచేశారు. దేశభక్తి ఇతివృత్తాలతో ఇప్పటివరకు ఆయన పది సినిమాలు చేస్తే అందులో ఐదిం టిలో నేనే కథానాయకుడిగా నటించాను. ఈ సినిమా ఆర్మీ బ్యాక్‌డ్రాప్‌లో సాగుతుంది' అని తెలిపారు. దర్శకుడు మాట్లాడుతూ '1971 ఇండియా, పాకిస్థాన్ యుద్ధ నేపథ్యంలో యదార్థ సంఘటనల ఆధా రంగా సినిమాను రూపొందించాం. సైనికుల త్యాగాలు, భావోద్వేగాలు, బాధ్యతలతో ముడిపడిన కథ ఇది. ఆర్మీ మేజర్‌గా మోహన్‌లాల్, సైనికుడిగా అల్లు శిరీష్ పాత్రలు సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలు స్తాయి' అని తెలిపారు. అనువాద కార్యక్రమాలు తుదిదశకు చేరుకున్నాయని, త్వరలో హైదరాబాద్‌లో ప్రీరిలీజ్ వేడుకను నిర్వహిస్తామని నిర్మాత పేర్కొన్నారు.

నీతోనే హాయ్ హాయ్...


ఛరిష్మా శ్రీకర్

అరుణ్‌తేజ్, ఛరిష్మా శ్రీకర్ జంటగా నటిస్తున్న 'నీతోనే హాయ్ హాయ్' చిత్రం బుధవారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. బీఎన్‌రెడ్డి అభినయ దర్శకత్వం వహిస్తున్నారు. కె.ఎస్.ప్రొడక్షన్స్ పతాకంపై డా.ఎస్.కీర్తి, డా.జి. పార్థసారథిరెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తు న్నారు. పూజాకార్యక్రమాల అనంతరం చిత్రీకరించిన ముహూర్తపు సన్నివేశానికి హీరో శ్రీకాంత్ క్లాప్ నివ్వగా, 'మా' అధ్యక్షులు శివాజీరాజా కెమెరా స్విఛాన్ చేశారు. ప్రముఖ దర్శకుడు రేలంగి నర సింహారావు గౌరవ దర్శకత్వం వహించారు. దర్శ కుడు మాట్లాడుతూ 'డబ్బున్న వ్యక్తి వ్యక్తిత్వం ఎలా వుంటుంది? మధ్య తరగతికి చెందిన వాడి మనస్తత్వం ఎలా వుంటుంది? అన్నదే మా చిత్ర ప్రధాన ఇతివృత్తం. ఓ క్యూట్ లవ్‌స్టోరీకి కమర్షియల్ అంశాల్ని జోడించి ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాం. మూడు షెడ్యూళ్లల్లో చిత్రాన్ని పూర్తి చేస్తాం' అన్నారు. నిర్మాతలుగా మాకు మంచి గుర్తింపును తెచ్చే సినిమా అవుతుందని, రవి కల్యాణ్ ఐదు పాటలకు అద్భుతమైన సంగీతాన్ని అందిం చాడని చిత్ర నిర్మాతలు తెలిపారు. ఆనంద్, బెనర్జీ, ఏడిద శ్రీరామ్ తదితరులు నటిస్తున్నారు.

స్వార్థ ప్రయోజనాల కోసమే..


నట్టికుమార్

'ఓ చిన్న సమస్య కోసం గత ఆరు రోజు లుగా థియేటర్లను మూసివేయడం విడ్డూ రంగా వుంది. దీని వల్ల చిన్న నిర్మాతలు, ఎగ్జిబి టర్లు వందల కోట్లు నష్ట పోయారు. నిర్మాతలు, ఎగ్జిబిటర్లు, డిస్ట్రిబ్యూటర్‌ల కోసం కాకుండా కొందరు వ్యక్తుల స్వార్థ ప్రయోజనాల కోసమే థియేటర్‌ల బంద్ జరుగుతున్నది' అన్నారు నట్టికుమార్. థియేట ర్‌ల బంద్ నేపథ్యంలో బుధవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ' క్యూబ్, యుఎఫ్ఓ, పిఎక్స్‌డి వారు థియేటర్లకు మిషన్‌లు అమర్చి తొమ్మిదేళ్లు అవుతు న్నది. ఆ సంస్థలు ఇప్పుడు లాభాల్లో వున్నాయి. అయినా అధిక ఛార్జీలు వసూలు చేస్తున్నారు. డి.సురే ష్‌బాబు, అల్లు అరవింద్ లాంటి పెద్దమనుషులు ఈ సంస్థల వెనకాల వుండటం వల్లే ఇలాంటి పరిస్థితులు ఎదురవుతున్నాయి' అన్నారు. తన రాజకీయ అరం గేట్రం గురించి మాట్లాడుతూ '2019లో జరగనున్న ఎన్నికల్లో విశాఖపట్నం నుంచి శాసన సభ్యుడిగా పోటీ చేయబోతున్నాను. అయితే ఏ పార్టీలో చేరేది త్వర లోనే తెలియజేస్తాను. తెలంగాణ ముఖ్యమంత్రి కేసీ ఆర్ పేరు ఇప్పుడు జాతీయ స్థాయిలో మారుమోగు తున్నది. థర్డ్‌ఫ్రంట్ ఏర్పాటుకు ఆయన ప్రయత్ని స్తున్న నేపథ్యంలో టీఆర్ఎస్ పార్టీ తరుపున ఆంధ్రప్ర దేశ్‌లో కూడా అభ్యర్థుల్ని నిలిపితే ఎక్కువ స్థానాల్ని గెలుచుకోవడం ఖాయం' అన్నారు.



ఆబ్కారీశాఖలో 25 మందికి అవార్డులు

■ నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రదానం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఆబ్కారీ విధినిర్వహణలో ప్రతిభాసామర్థ్యాలు కనబర్చిన మహిళా సిబ్బందిలో 25 మందిని అవార్డులకు ఎంపిక చేశారు. వీరికి గురువారం మహిళా దినోత్సవం సందర్భంగా నాంపల్లిలోని ఆబ్కారీభవన్‌లో మెమెంటోలు, సర్టిఫికెట్లను అందించనున్నట్టు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ అకున్ సబర్వాల్ తెలిపారు.

ఎంపికైనవారి వివరాలు..

గాయత్రి (ఏఈఎస్)-మెదక్, ఉజ్వలారెడ్డి (ఏఈఎస్)-డిస్టిల్లరీ వింగ్, రాగవీణ (సీఐ)-నల్లగొండ, టీ దీపిక (సీఐ)-నిజామాబాద్, విజయలక్ష్మి (సీఐ)-సిద్దిపేట, కరుణశ్రీ (సీఐ)-వరంగల్, కరుణ (సీఐ)-హైదరాబాద్, శ్రావంతి (ఎస్ఐ)-నిజామాబాద్, ఏ లక్ష్మి (ఎస్ఐ)-రంగారెడ్డి, సీ భాగ్యలక్ష్మి (కానిస్టేబుల్)-హైదరాబాద్, బీ శోభ (కానిస్టేబుల్)-రంగారెడ్డి, సీ అనిత (కానిస్టేబుల్)-ఎంటీఎన్ఆర్, పీ రమాదేవి (కానిస్టేబుల్)-ఖమ్మం, జే శ్రీలత (కానిస్టేబుల్)-కరీంనగర్, జే ప్రణీత (కానిస్టేబుల్)-ఆదిలాబాద్, కే రమాదేవి (కానిస్టేబుల్)-నల్లగొండ, నిర్మల (ఎపీపీ)-రంగారెడ్డి, అనూరాధ (ఏపీపీ)-హైదరాబాద్, కీర్తన (జేపీ)-ఎంటీఎన్ఆర్, ఎస్ విజయలక్ష్మి (డీపీవో)-హైదరాబాద్, డీఎస్ నృత్య (ఏఎస్‌వో)-హైదరాబాద్, గీతాంజలి (స్టోర్ ఆఫీసర్)-హైదరాబాద్, సావిత్రి సొజన్య (టీవో)-డిస్టిల్లరీ వింగ్, మమత (ఏబీడీ)-డిస్టిల్లరీ వింగ్



బుధవారం టీఆర్‌ఎస్‌ఎల్పీలో మీడియాతో మాట్లాడుతున్న మంత్రి జోగు రామన్న. చిత్రంలో ఎమ్మెల్సీ గంగాధర్‌గౌడ్, ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ తాడూరి శ్రీనివాస్

కేసీఆర్‌తోనే బీసీలకు న్యాయం

■ జాతీయ పార్టీలు బీసీలకు చేసిందేమీలేదు: మంత్రి జోగు రామన్న

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఏండ్ల తరబడి దేశాన్ని ఏలిన కాంగ్రెస్, బీజేపీలు దేశంలోని 60 కోట్ల మంది బీసీల అభివృద్ధికి చేసిందేమీలేదని రాష్ట్ర అటవీ, బీసీ సంక్షేమశాఖల మంత్రి జోగు రామన్న విమర్శించారు. జాతీయ పార్టీలకు బీసీల అభివృద్ధి పట్ల చిత్తశుద్ధి లేదన్నారు. ప్రధాని మోదీ ఓబీసీ వర్గానికి చెందినప్పటికీ బీసీల సంక్షేమం కోసం ఒక్క పనికూడా చేయలేదని బుధవారం టీఆర్‌ఎస్‌ఎల్పీలో మీడియాతో పేర్కొన్నారు. దేశం దశ మార్చేందుకు టీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ మూడో రాజకీయ ఫ్రంట్ ఆలోచనను తెరపైకి తెచ్చారని, కేసీఆర్ నాయకత్వంలో దేశంలోని బీసీలకు సామాజిక న్యాయం జరుగుతుందని తెలిపారు. కేసీఆర్ కేంద్ర మంత్రిగా ఉన్నపుడే ఓబీసీ మంత్రిత్వశాఖ ప్రతిపాదన తెచ్చారని, కేంద్ర మంత్రి, ఎంపీగా ఉండి కేసీఆర్ బీసీల సంక్షేమం కోసం ఎన్నో ఆలోచనలు చేశారని చెప్పారు. సమావేశంలో ఎమ్మెల్సీ వీ గంగాధర్‌గౌడ్, ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ తాడూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

షీటీమ్స్‌తో ఆమెకు భరోసా!

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

రోడ్డుమీద పోతూ ఉంటే పోకిరీల వెకిలిచేష్టలు! బస్టాప్‌లో నిలబడి ఉంటే చిల్లరగాళ్ల అభ్యంతరకర సైగలు! ఫోన్‌లో వేధింపులు.. ఫేస్‌బుక్, వాట్సప్‌లలో భరించలేని అసభ్య సందేశాలు! మహిళలు, యువతులు, విద్యార్థినులు.. ఆఖరుకు చిన్నపిల్లలను విచక్షణ కూడా లేకుండా కమ్మేసిన కండకావరం! యువతుల మానసిక స్థైర్యాన్ని దెబ్బతీసేలా పెరుగుతున్న ఆకతాయిల వికృత చేష్టలు! వీటికి అడ్డుకట్ట వేసేదెలా? అలాంటి బాధితులకు అండగా మేమున్నామంటున్నది తెలంగాణ పోలీసుల ప్రత్యేక విభాగం 'షీ టీమ్స్'! మహిళలను వేధిస్తున్నవారిని గుర్తించి.. కటకటాల వెనక్కు పంపి.. బాధితులకు అభయం ఇస్తున్నది! సింగపూర్ స్ఫూర్తిగా ముఖ్యమంత్రి కేసీఆర్ ఆలోచనలతో పురుడుపోసుకున్న షీటీమ్స్.. మహిళల భద్రతకు భరోసానిస్తున్నాయి!

ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా షీ టీమ్స్ పనితీరుపై.. 'నమస్తే తెలంగాణ' ప్రత్యేక కథనం.

మహిళల్లో పెరిగిన భద్రతాభావం

■ హైదరాబాద్‌సహా రాష్ట్రవ్యాప్తంగా షీ టీమ్స్ సక్సెస్
■ రాష్ట్రవ్యాప్తంగా 2,374 మంది పోకిరీలపై కేసులు
■ కౌన్సెలింగ్, నిరంతర నిఘాతో రాష్ట్రవ్యాప్తంగా గణనీయంగా తగ్గిన వేధింపుల కేసులు
■ ఆదర్శంగా తీసుకుంటున్న ఇతర రాష్ట్రాల పోలీసులు

దేశంలోనే మొట్టమొదటిసారి తెలంగాణలో

దేశంలోనే మరేరాష్ట్రంలో లేనివిధంగా తొలిసారిగా తెలంగాణ ప్రభుత్వం మహిళల భద్రతకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తూ 'షీ టీమ్స్'కు ఆలోచన చేసింది. 2014 అక్టోబర్ 24న హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో అప్పటి హైదరాబాద్ సీపీ మహేందర్‌రెడ్డి నేతృత్వంలో షీ టీమ్స్‌ను ఏర్పాటుచేశారు. హైదరాబాద్‌లో అద్భుత ఫలితాలు సాధించి, విజయవంతమైన షీ టీమ్స్‌ను సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్‌తో పాటు రాష్ట్రంలోని అన్ని కమిషనరేట్లు, అన్ని జిల్లాలకు విస్తరించారు. రాష్ట్రవ్యాప్తంగా వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా వివిధ చట్టాల కింద 2,374 మందిపై కేసులు నమోదుచేశారు. వందలమంది యువకులకు కౌన్సెలింగ్ నిర్వహించి వారిలో పరివర్తన తీసుకువచ్చారు. హైదరాబాద్‌లో 100 షీ టీమ్స్ పనిచేస్తున్నాయి. ఈ బృందాల్లోని సభ్యులు ప్రతిరోజూ బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, రద్దీగా ఉండే మార్కెట్లు, పాఠశాలలు, కళాశాలల వద్ద మఫ్టీలో ఉంటున్నారు. మహిళలపట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నవారు కనిపిస్తే అదుపులోకి తీసుకుంటున్నారు. షీ టీమ్స్ ఏర్పాటుచేసిన తర్వాత రాష్ట్రంలో మహిళలపై వేధింపులు 20% వరకు తగ్గినట్టు పోలీసు ఉన్నతాధికారులు తెలిపారు. షీ టీమ్స్ గురించి ప్రభుత్వం విస్తృతంగా ప్రచారం చేస్తున్నది. షీ టీమ్స్ పేరిట ఫేస్‌బుక్, ట్విట్టర్ ఖాతాలు, వాట్సప్ నంబర్లను అందుబాటులో ఉంచారు. వేధింపులకు పాల్పడుతున్నవారిలో మైనర్లు, 18-20 ఏండ్ల మధ్య వయస్కులే అధికంగా ఉంటున్నారు. మైనర్లు, యువకులపై ప్రత్యేక దృష్టిపెట్టిన షీటీమ్స్ అధికారులు.. వేధింపులకు దిగినవారికి, వారి తల్లిదండ్రులను కూడా కౌన్సిలింగ్ ఇవ్వడం ద్వారా వారిలో పరివర్తన తెస్తున్నారు.

ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా..ఆరు రాష్ట్రాల్లో అమలు దిశగా

రాష్ట్రంలో షీ టీమ్స్ సక్సెస్ కావడంతో ఇతర రాష్ట్రాల పోలీసులు ఈ వ్యవస్థపై ఆరా తీస్తున్నాయి. ఇప్పటికే ఏపీ, కర్ణాటక, మహారాష్ట్ర, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, ఉత్తరప్రదేశ్ నుంచి అడిషనల్ డీజీ, అడిషనల్ ఎస్పీ స్థాయి అధికారులు హైదరాబాద్‌లో షీటీమ్స్ పనితీరుపై పరిశీలనకు వచ్చారు. తమ వద్ద కూడా షీటీమ్స్ తరహాలో ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేసుకున్నారు.

రాష్ట్రవ్యాప్తంగా షీ టీమ్స్ పనితీరు (మార్చి 7, 2018 వరకు)

జిల్లా/కమిషనరేట్	షీ టీమ్స్ సంఖ్య	నమోదైన కేసులు
సైబరాబాద్	04	500
రాచకొండ	07	649
వరంగల్	01	176
ఆదిలాబాద్	03	23
మహబూబాబాద్	01	00
సంగారెడ్డి	04	03
వనపర్తి	01	00
నిజామాబాద్	06	08
నిర్మల్	01	00
నాగర్‌కర్నూల్	01	00
సిద్దిపేట	02	00
జోగుళాంబ గద్వాల	01	05
ఖమ్మం	04	12
కుమ్రంభీం ఆసిఫాబాద్	02	06
నల్లగొండ	03	09
రామగుండం	18	10

హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో షీ టీమ్స్ పనితీరు (ఫిబ్రవరి 2 వరకు)

అదుపులోకి తీసుకుని కౌన్సిలింగ్ ఇచ్చిన కేసులు	:	1706
పీటీ యాక్ట్ కింద కేసులు	:	3
నిర్భయ చట్టం కింద కేసులు	:	96
ఐటీ యాక్ట్ కింద కేసులు	:	62
పోక్సో చట్టం కింద కేసులు	:	5
నమోదైన పిటీ కేసులు	:	397
జైలు శిక్షపడిన వారి సంఖ్య	:	100
జరిమానాలకు గురైనవారు	:	310

హైదరాబాద్ షీటీమ్స్‌కు వివిధ మార్గాల ద్వారా అందిన ఫిర్యాదులు (ఫిబ్రవరి 2 వరకు, 2018 వరకు)

రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడినవారు	:	230
డయల్ 100 ద్వారా	:	1510
షీటీమ్స్ కార్యాలయంలో ఫిర్యాదులతో	:	950
ఈ మెయిల్ ద్వారా ఫిర్యాదులతో	:	529
వాట్సప్ ద్వారా ఫిర్యాదులతో	:	253
హాక్ఐ ద్వారా ఫిర్యాదులతో	:	153
ట్విట్టర్ ద్వారా ఫిర్యాదులతో	:	3
మొత్తం ఫిర్యాదులు	:	3911

షీ టీమ్స్‌పై అవగాహన పెరిగింది



మహిళలను వేధించేవారిలో భయం పెరిగింది. బాధితులు ధైర్యంగా ఫిర్యాదు చేస్తున్నారు. షీ టీమ్స్ అందుబాటులో ఉంటాయని బాధిత మహిళల్లో భరోసా పెంచగలిగాం. షీ టీమ్స్ ఒకసారి ఫిర్యాదు నమోదైతే వాళ్లు తిరిగి అదే తప్పు చేయకుండా యువకులకు తగిన కౌన్సెలింగ్ ఇస్తున్నాం.

- స్వాతిలక్రా, అడిషనల్ సీపీ (క్రైం), హైదరాబాద్


భయం తగ్గింది:



షీటీమ్స్ ఏర్పాటుతో మాలో భయం తగ్గింది. సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో పనిచేసే అమ్మాయిలం భరోసాగా ఆఫీస్‌కు వచ్చి వెళ్లగలుగుతున్నాం. సమస్య వస్తే షీ టీమ్స్‌కు ఫేస్‌బుక్, వాట్సప్, ట్విట్టర్‌ద్వారా ఫిర్యాదుచేసే అవకాశం కల్గింది.

-పఠాన్ నజ్మా పాషా, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్, వెరిజన్ డాటా సర్వీసెస్ ఇండియా

సమస్య ఉంటే వెంటనే స్పందిస్తున్నారు



ఏదైనా ఇబ్బంది ఉంటే వెంటనే మా చేతిలోని స్మార్ట్‌ఫోన్‌తోనే ఫిర్యాదు చేసే వ్యవస్థ పోలీసులు తెచ్చారు. షీ టీమ్స్‌కు ఫిర్యాదు చేస్తే వెంటనే స్పందిస్తున్నారు. మాలో ఎంతో భరోసా పెంచారు.

- స్వప్న, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్, ఇన్ఫోసిస్

షీ టీమ్స్ ఏర్పాటు చాలా బాగుంది:



హైదరాబాద్‌లోని మహిళా ఐటీ ఉద్యోగులు షీ టీమ్స్ పనితీరుపై సంతోషంగా ఉన్నారు. ధైర్యంగా బయటికి వెళ్లగలుగుతున్నారు. మాకు అండగా షీ టీమ్స్ ఉంటాయన్న భరోసా పెరిగింది.

- లక్ష్మి, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్, ఎరిసెట్ టెక్నాలజీస్

ఒకే వేదికపైకి దేశంలోని బీసీలు

■ మూడో ఫ్రంట్‌తో సరికొత్త మార్పులు: జూలూరు గౌరీశంకర్



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: దేశవ్యాప్తంగా బీసీలకు మంచి రోజులు రానున్నాయని.. భవిష్యత్‌లో దేశంలోని బీసీలందరూ ఒకే వేదికపైకి వస్తారని రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యుడు జూలూరు గౌరీశంకర్ పేర్కొన్నారు. జనాభాలో సగభాగంగా ఉన్న బీసీలకు అందాల్సిన వాటా అందటం లేదని, అన్ని రంగాల్లో బీసీలకు తగిన ప్రాతినిధ్యం ఇవ్వాలన్న డిమాండ్ ముందుకు వస్తున్నదని తెలిపారు. బుధవారం ఏపీలోని కృష్ణాజిల్లా జగ్గయ్యపేటలో ఆ రాష్ట్ర బీసీ సంఘాల ప్రతినిధులతో గౌరీశంకర్ సమావేశమయ్యారు. జనాభా దామాషా ప్రకారం తమ వాటా ఇవ్వాలని, జనాభా నిష్పత్తి ప్రకారం విద్య, ఉద్యోగ రంగాల్లో రిజర్వేషన్లు కల్పించాలని బీసీలు కమిషన్‌ను కోరుతున్నారని తెలిపారు.

కేసీఆర్‌కు మద్దతిస్తే తప్పేంటి?

■ మీడియాతో జనసేన అధినేత పవన్‌కల్యాణ్
■ 14న భవిష్యత్తు కార్యాచరణ ప్రకటన



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: టీఆర్‌ఎస్ అధినేత, తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు మద్దతిస్తే తప్పేంటని జనసేన అధినేత, ప్రముఖ సినీనటుడు పవన్‌కల్యాణ్ ప్రశ్నించారు. దేశంలోని ఉత్తర, దక్షిణ రాష్ట్రాల మధ్య అంతరం రోజురోజుకూ పెరిగిపోతున్నదని, ఇది దేశ సమగ్రతకు ముప్పేనని ఆయన పేర్కొన్నారు. ఈ నెల 14న తమ పార్టీ భవిష్యత్తు కార్యాచరణను ప్రకటిస్తామని ఆయన స్పష్టం చేశారు. బుధవారం మాదాపూర్‌లో మీడియాతో ఆయన మాట్లాడుతూ.. కేంద్రంతో స్నేహభావంతో ఉండాలని అంటున్నారని, థర్డ్‌ఫ్రంట్ విషయంలో పక్కనే ఉన్న రాష్ట్రంతో స్నేహంగా ఉంటే తప్పేంటని అన్నారు. 'ఎక్కడో ఢిల్లీలో ఉన్న బీజేపీకి మద్దతు ఇస్తున్నప్పుడు పక్కనే ఉన్న టీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌కు మద్దతిస్తే తప్పేంటి' అని పవన్ ప్రశ్నించారు. 2019లో జరిగే ఎన్నికలకు స్పష్టమైన విధానంతో ప్రజల ముందుకువస్తున్నామని, తమ పార్టీ ఎప్పటికీ ప్రజలపక్షానే ఉంటుందని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకహోదా విషయంలో ప్రధాని మోదీ స్పష్టత ఇవ్వాలని పవన్ కోరారు.

సీఎం నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం

■ జాతీయ మాలల ఐక్య వేదిక

సుల్తాన్‌బజార్: దేశ రాజకీయాల వైపు సీఎం కేసీఆర్ దృష్టి సారించడాన్ని తాము స్వాగతిస్తున్నామని జాతీయ మాలల ఐక్య వేదిక జాతీయ అధ్యక్షుడు ఆవుల బాలనాథం, రాష్ట్ర అధ్యక్షుడు బేరా బాలకిషన్ చెప్పారు. తెలంగాణ రాష్ట్రాన్ని నాలుగేండ్లలో అభివృద్ధి చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కు దక్కిందన్నారు. బుధవారం కోఠి బ్యాంక్‌స్ట్రీట్‌లోని సంఘం కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. కేసీఆర్ జాతీయ రాజకీయాల్లో చురుకైన పాత్ర పోషించడం ద్వారా రాష్ట్రానికి ప్రత్యేక గుర్తింపు వస్తుందని చెప్పారు. సమావేశంలో సంఘం జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ గడ్డం సత్యనారాయణ, యువత విభాగం కార్యదర్శి వివేక్, కిషన్, మొగిల్ల మల్లేశ్, గడ్డం సుశీల, లక్ష్మిదేవి, లకుమల్ల మనోజ్‌కుమార్, కిశోర్, చింతలపూడి కిరణ్, ఆదర్శ్, మనిదీప్ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్‌కు మద్దతు పలికేందుకు హైదరాబాద్ చేరిన ఎన్నారైలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ : జాతీయస్థాయిలో రాజకీయంగా ప్రజలకు సేవలందిస్తానని సీఎం కేసీఆర్ పేర్కొన్న నేపథ్యంలో సీఎంకు మద్దతు పలికేందుకు పలువురు ఎన్నారైలు బుధవారం హైదరాబాద్‌కు చేరుకున్నారు. సీఎం కేసీఆర్‌ను కలిసేందుకు అమెరికా, ఆస్ట్రేలియా, కెనడా నుంచి 40 మందికి పైగా వచ్చినట్లు ఎన్నారై డాక్టర్ మోహన్ తెలిపారు.

మిషన్ కాకతీయ పరిశీలనకు ఇథియోపియా ప్రతినిధులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: మిషన్ కాకతీయ కార్యక్రమాన్ని పరిశీలించేందుకు ఇథియోపియా ప్రతినిధులు శుక్రవారం హైదరాబాద్ రానున్నారు. శుక్రవారం ఉదయం ప్రతినిధులు రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావును కలుస్తారని నీటిపారుదలశాఖ ప్రకటన విడుదలచేసింది. అనంతరం పటాన్‌చెరు ఇక్రిశాట్‌కు చేరుకొని.. ఆపై నర్సాపూర్ చెరువును పరిశీలిస్తారు.

ఆకాశవాణిలో ఉద్యోగావకాశాలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం ప్రాంతీయ వార్తావిభాగంలో తాత్కాలిక ప్రాతిపదికన పనిచేయడానికి జర్నలిస్టుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. ఈ నెల 23వ తేదీలోగా దరఖాస్తులను సమర్పించాలని న్యూస్ అసిస్టెంట్ డైరెక్టర్ డీ సుప్రశాంతిదేవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

టీహబ్ సందర్శనకు విద్యార్థులకు అవకాశం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: టీహబ్ భవనం 'క్యాటలిస్ట్' నమూనాను తమ పాఠశాల సైన్స్‌ఫేర్‌లో ప్రదర్శించిన విద్యార్థులకు చక్కటి అవకాశం దక్కింది. వారు టీహబ్ భవనాన్ని సందర్శించేందుకు అవకాశం పొందారు. హైదరాబాద్‌లోని విద్యానికేతన్ పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు తమ పాఠశాలలో ఏర్పాటుచేసిన వైజ్ఞానిక ప్రదర్శనలో టీహబ్ భవన నమూనాను ప్రదర్శించారు. విద్యార్థుల ఆసక్తిని గమనించిన టీహబ్ సీఓఓ శ్రీనివాస్ కొల్లిపార వారికి టీహబ్‌లో పర్యటించే అవకాశం కల్పించనున్నట్టు ఓ ట్వీట్‌లో తెలిపారు.

రైతు ఆదాయం రెట్టింపు చేసేందుకు కృషి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: వాతావరణ మార్పులకు అనుగుణంగా రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేసేందుకు ఇక్రిశాట్, జాతీయ మెట్ట పంటల పరిశోధనా సంస్థ (సీఆర్ఐడీఏ-క్రిడ) వంటి వ్యవసాయ పరిశోధన సంస్థలు పెద్ద ఎత్తున కృషి చేస్తున్నాయని ఇక్రిశాట్ మెట్ట వ్యవసాయ ఆవిష్కరణల పరిశోధన విభాగం సంచాలకులు డాక్టర్ ఆంథోనీ విట్‌బ్రెడ్ తెలిపారు. హైదరాబాద్ సంతోష్‌నగర్‌లోని జాతీయ మెట్టపంటల పరిశోధన కేంద్రంలో 'వాతావరణ మార్పులు-వాననీటి సంరక్షణ, నిర్వహణ'పై మూడువారాలపాటు జరిగిన అంతర్జాతీయ శిక్షణా కార్యక్రమం ముగింపు సదస్సు కార్యక్రమానికి డాక్టర్ ఆంథోనీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. క్రిడ సంచాలకులు డాక్టర్ సమ్మిరెడ్డి, కార్యక్రమం సమన్వయకర్త డాక్టర్ బట్టు కృష్ణారావు, ఇతర శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

బీటెక్ కాలేజీల్లో బయోమెట్రిక్ అటెండెన్స్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని బీటెక్ కాలేజీల్లోనూ బయోమెట్రిక్ అటెండెన్స్ విధానాన్ని తప్పనిసరిగా అమలుచేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. 2018-19 విద్యాసంవత్సరం నుంచే అమలుచేయాలని ఆదేశించింది. గత ఏడాది నుంచే బయోమెట్రిక్ అటెండెన్స్ నమోదుచేయాలని ఉన్నతవిద్యాశాఖ నిర్ణయం తీసుకున్నప్పటికీ అది జరుగలేదు. కాలేజీల విజ్ఞప్తి మేరకు గత ఏడాదిలో బీటెక్ కళాశాలల్లో అమలుచేయలేదు. కేవలం ఫ్యాకల్టీకి మాత్రమే బయోమెట్రిక్ ద్వారా హాజరు నమోదుచేశారు.

చెక్‌పోస్టుల ఎత్తివేతకు కేంద్రం కుట్ర

■ కొనసాగించాలని తెలంగాణ సర్కారు డిమాండ్
■ చెక్‌పోస్టులతో ఏడాదికి రూ. 84 కోట్ల ఆదాయం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో కొనసాగుతున్న రవాణాశాఖ చెక్‌పోస్టులను ఎత్తివేయకుండా యథాతథంగా కొనసాగించాలని ఉన్నతాధికారులు రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదించినట్టు సమాచారం. ఇటీవల గుజరాత్‌లో జరిగిన గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్ (జీవోఎం) సదస్సులో కేంద్ర ఉపరితల రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీ దేశవ్యాప్తంగా ఉన్న అన్ని చెక్‌పోస్టులను ఎత్తివేయాలని ప్రతిపాదించారు. దేశవ్యాప్తంగా ఒకే పన్ను విధానం అమలులోకి వచ్చిన నేపథ్యంలో పలురాష్ట్రాల్లోని రవాణాశాఖ చెక్‌పోస్టులను ఎత్తివేసి, టూరిస్టు బస్సులకు లారీల మాదిరిగా నేషనల్ పర్మిట్లు జారీచేయడంపై ప్రాథమిక నిర్ణయం తీసుకున్న విషయం విదితమే. కేంద్రం నుంచి చెక్‌పోస్టుల రద్దుపై అధికారిక ప్రతిపాదన వస్తే అడ్డుచెప్పేందుకు కౌంటర్ ప్రతిపాదనలు సిద్ధం చేసి పెట్టుకున్నట్టు తెలుస్తున్నది. ఒకే పన్నువిధానం అమలులోకి వచ్చాక రాష్ట్రంలో ఇప్పటికే వాణిజ్య పన్నులు, అటవీశాఖల చెక్‌పోస్టులను ఎత్తివేసింది. ప్రస్తుతం రాష్ట్రంలోని రవాణాశాఖ చెక్‌పోస్టుల ద్వారా ఏడాదికి రూ.84 కోట్లు ఆదాయంగా వస్తున్నది. చెక్‌పోస్టుల రద్దు వల్ల ఈ ఆదాయాన్ని కోల్పోయే అవకాశం ఉన్నది. చెక్‌పోస్టుల ఎత్తివేతకు వ్యతిరేకంగా ఉద్యమించడానికి ఎన్డీయేతర రాష్ట్ర ప్రభుత్వాలు సిద్ధమవుతున్నాయి. రాష్ట్రంలో 2017-18 ఏడాదికి ఏప్రిల్ 1 నుంచి 2018 ఫిబ్రవరి 28 వరకు చెక్‌పోస్టుల ద్వారా రవాణాశాఖకు రూ. 66.24 కోట్ల ఆదాయం వచ్చింది. లక్ష్యం రూ.84 కోట్లను నెలరోజుల్లో చేరుకోవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు.

సీఎం కేసీఆర్‌కు ఘనంగా కృతజ్ఞతలు చెప్తాం

■ 10 లక్షల మందితో ఏప్రిల్ 29న భారీసభ నిర్వహిస్తాం
■ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ వెల్లడి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: చరిత్రలో కనీవినీ ఎరుగనివిధంగా ఏప్రిల్ 29న సికింద్రాబాద్‌లోని జింఖానా మైదానంలో పది లక్షల మంది గొల్ల, కురుమలతో భారీ బహిరంగసభ నిర్వహించనున్నట్లు పశుసంవర్ధకశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ చెప్పారు. గొల్ల, కురుమల సంక్షేమం కోసం ఏ ప్రభుత్వమూ చేపట్టనివిధంగా టీఆర్‌ఎస్ సర్కార్ అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలుచేస్తునందుకు సీఎం కేసీఆర్‌కు, ప్రభుత్వానికి ఈ సభ ద్వారా కృతజ్ఞతలు తెలియజేస్తామని అన్నారు. బుధవారం సచివాలయంలోని తన చాంబర్‌లో యాదవ, కురుమ ముఖ్యనాయకులతో సమావేశం నిర్వహించిన అనంతరం మంత్రి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రతిగ్రామం నుంచి గొల్ల, కురుమలు సభకు తరలివచ్చేలా ఉమ్మడి జిల్లాస్థాయిలో సమన్వయ కమిటీలు ఏర్పాటుచేసినట్లు తెలిపారు.



బుధవారం సచివాలయంలోని తన చాంబర్‌లో యాదవ, కురుమ నాయకులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

ఈ నెల 11 నుంచి కమిటీసభ్యులు సమావేశాలు నిర్వహించి సభకు అధికసంఖ్యలో తరలివచ్చేలా చూస్తారని వివరించారు. సీఎం కేసీఆర్ ఈ సభకు ముఖ్యఅతిథిగా హాజరవుతారని చెప్పారు. సమావేశంలో షాద్‌నగర్ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్, గొర్రెల అభివృద్ధి సమాఖ్య చైర్మన్ రాజయ్య యాదవ్, అఖిలభారత యాదవ మహాసభ మహిళా రాష్ట్ర అధ్యక్షురాలు, సాంఘిక సంక్షేమబోర్డు చైర్మన్ రాగం సుజాతయాదవ్, కార్పొరేటర్ శంకర్‌యాదవ్, తాండూరు గోపినాథ్ కురుమ, టీఆర్‌ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్, ప్రమోద్ కురుమ పాల్గొన్నారు.

460 రైల్వే క్రాసింగులకు ఆర్వోబీలు

■ పరిశీలనలో మియాపూర్-పటాన్‌చెరు రైల్వేలైను: మంత్రి తుమ్మల
■ భద్రాచలంరోడ్డు- కొవ్వూరు రైల్వేలైన్ అలైన్‌మెంట్ ప్లాన్ పరిశీలన



భద్రాచలం రోడ్డు నుంచి కొవ్వూరు వరకు కొత్త బ్రాడ్‌గేజ్ రైల్వేలైను అలైన్‌మెంట్ ప్లాన్‌ను పరిశీలిస్తున్న మంత్రి తుమ్మల

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో 460 రైల్వే లెవెల్ క్రాసింగులపై ఆర్వోబీల నిర్మాణానికి రైల్వేశాఖ ఆధ్వర్యంలో ప్రతిపాదనలు రూపొందించి, దశలవారీగా నిర్మాణంచేపట్టాలని అధికారులను రోడ్లు, భవనాలశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. బుధవారం హైదరాబాద్‌లో ఆర్‌అండ్‌బీ ఈఎన్‌సీ కార్యాలయంలో అధికారులతో మంత్రి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది 52 ఆర్వోబీలను నిర్మించడానికి ప్రతిపాదనలను ఆమోదించామని, రూ.2,700 కోట్లతో అంచనాలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. భద్రాచలం రోడ్డు నుంచి కొవ్వూరు దాకా కొత్త బ్రాడ్‌గేజ్ రైల్వే అలైన్‌మెంట్ ప్లాన్‌ను పరిశీలించారు. సమావేశంలో రహదారులు, భవనాలశాఖ ముఖ్య ఇంజినీర్ పింగళి సతీశ్, రైల్వే చీఫ్ ఇంజినీర్ జీవీ రమణారెడ్డి పాల్గొన్నారు.

ప్రమాదరహితంగా 'కుంటాల'

■ సహజ సౌందర్యం దెబ్బతినకుండా అభివృద్ధికి ప్రణాళికలు
■ అటవీశాఖ ఉన్నతాధికారులతో మంత్రి జోగురామన్న సమీక్ష



బుధవారం అరణ్యభవన్‌లో కుంటాల జలపాతం అభివృద్ధిపై అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి జోగురామన్న

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఆదిలాబాద్ జిల్లాలోని కుంటాల జలపాతాన్ని ప్రమాదరహితంగా మార్చేందుకు చర్యలు చేపడుతున్నట్లు అటవీ, పర్యావరణశాఖ మంత్రి జోగు రామన్న పేర్కొన్నారు. జలపాతం అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధంచేస్తున్నామని చెప్పారు. కుంటాల జలపాతం అభివృద్ధిపై బుధవారం అరణ్యభవన్‌లో అటవీశాఖ ఉన్నతాధికారులతో మంత్రి సమీక్షించారు. జలపాతంలోపడి ఇప్పటివరకు 136 మంది చనిపోయినట్లు చెప్పారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కుంటాల సహజ సౌందర్యం, అటవీ ప్రాంతం దెబ్బతినకుండా అభివృద్ధి పనులుచేపట్టాలని అధికారులకు సూచించారు. సమీక్షలో పీసీసీఎఫ్ పీకే ఝాతో సహా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

10న సీపీఎస్ ఉద్యోగుల జనజాతర

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం (సీపీఎస్) ఉద్యోగులు హైదరాబాద్‌లోని తెలంగాణ కళాభారతి మైదానంలో ఈ నెల 10న జనజాతరను నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. రాష్ట్ర కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం యూనియన్ (టీఎస్‌పీఎస్‌యూ) సారథ్యంలో ఉద్యోగుల సమీకరణకు ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా పర్యటించారు.

'తమిళ' విద్యాశాఖ అధికారులతో సిధారెడ్డి బృందం చర్చలు

■ మాతృభాష అమలు, సమస్యలపై చర్చించిన రాష్ట్ర నిపుణులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తమిళనాడులో మాతృభాష అమలుతీరుపై అధ్యయనం చేసేందుకు వెళ్లిన రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్మన్ నందిని సిధారెడ్డి సారథ్యంలోని బృందం బుధవారం చెన్నైలో పర్యటించింది. ఈ మేరకు తమిళనాడు విద్యాశాఖ, తమిళభాషా అభివృద్ధిశాఖ, తమిళ మాతృభాష అమలుకేంద్రం తదితర విభాగాల అధికారులతో చర్చలు జరిపింది. ఈ చర్చల్లో సాహిత్య అకాడమీ చైర్మన్‌తోపాటు తెలుగు విశ్వవిద్యాలయం ఉప కులపతి ఎస్వీ సత్యనారాయణ, తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం, సాహిత్య అకాడమీ కార్యదర్శి ఏనుగు నరసింహారెడ్డి పాల్గొన్నారు. తమిళభాషలో పరిశోధనల కోసం చేస్తున్న కృషిని అక్కడి అధికారులను బృందం సభ్యులు అడిగి తెలుసుకున్నారు. పదో తరగతివరకు తమిళభాషను తప్పనిసరి అంశంగా 2011 నుంచి అమలుచేస్తున్న విధానాలపై అధ్యయనంచేశారు.

రెండో కేసులో పురుషోత్తంరెడ్డి అరెస్ట్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఆదాయానికి మించి ఆస్తుల కేసులో అరెస్టయి, జైలులో ఉన్న హెచ్ఎండీఏ డైరెక్టర్ (సస్పెన్షన్) పురుషోత్తంరెడ్డి, అతడి బినామీ శ్రీనివాస్‌రెడ్డిపై నమోదైన మరో కేసులో వారిని అరెస్టు చేసేందుకు ఏసీబీ అధికారులు కోర్టులో పిటిషన్ దాఖలుచేశారు. అరెస్టుకు కోర్టు అనుమతివ్వడంతో పురుషోత్తంరెడ్డిని పీటీ వారెంట్‌పై బుధవారం కోర్టులో హాజరు పర్చి తిరిగి జైలుకు తరలించారు. శ్రీనివాస్‌రెడ్డిని గురువారం కోర్టులో హాజరుపర్చనున్నారు. హోదాను అడ్డుపెట్టుకొని రూ.రెండున్నర కోట్ల విలువచేసే ఫ్లాట్‌ను కేవలం రూ.కోటి లోపు ధరకు తీసుకున్నాడని పేర్కొంటూ ఓ బిల్డర్ చేసిన ఫిర్యాదు మేరకు పురుషోత్తంరెడ్డి, అతడి బినామీ శ్రీనివాస్‌రెడ్డిపై ఏసీబీ అధికారులు శనివారం కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే.

తాగునీటిలో తెలంగాణ వాటా 69%

ఆంధ్రప్రదేశ్‌కు 31 శాతం • శ్రీశైలం, సాగర్ ఎండీడీఎల్ దిగువన వాటా స్పష్టం
బచావత్ అవార్డు సారాంశమిదే..నెలాఖరుదాకా కనీస మట్టాన్ని నిర్వహించాల్సిందే
త్రిసభ్య కమిటీ భేటీలో ఇండెంట్లను అంగీకరించలేదు.. కృష్ణాబోర్డుకు తెలంగాణ లేఖ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాల్లో హడావుడిగా కనీస నీటి సేకరణ స్థాయి (ఎండీడీఎల్) దిగువన నీటిని వాడుకునేందుకు అత్యుత్సాహం చూపుతున్న ఆంధ్రప్రదేశ్ దూకుడుకు తెలంగాణ నీటిపారుదలశాఖ మరోసారి కళ్లెం వేసేందుకు సిద్ధమైంది. వాస్తవిక లెక్కలు, ప్రస్తుతం అమలులో ఉన్న బచావత్ అవార్డు ప్రకారం నీటి పంపిణీ ఉంటుందే తప్ప.. ఇష్టానుసారంగా సమర్పించే ఇండెంట్ల ప్రకారం ఉండదనే స్పష్టమైన సంకేతాలు ఇస్తూ కృష్ణాబోర్డుకు లేఖ రాసినట్లు తెలిసింది. బచావత్ అవార్డు ప్రకారం తాగునీటి అవసరాలకు ఎండీడీఎల్ దిగువన తెలంగాణ వాటా 69 శాతం, ఏపీ వాటా 31 శాతంగా ఉంటుందని ఈ లేఖలో స్పష్టంచేసింది. 2న జరిగిన బోర్డు త్రిసభ్య కమిటీ సమావేశ మినిట్స్ నమోదులో జరిగిన తప్పిదాలను సైతం ఉదహరించుకొంటూ రాసిన ఈ లేఖలో రెండు రిజర్వాయర్లలో ఎండీడీఎల్ దిగువన ఉన్న నీటి నిల్వలను కేవలం తాగునీటి అవసరాలకు మాత్రమే వాడుకోవాలని స్పష్టంచేసింది. నెలాఖరు వరకు నాగార్జునసాగర్‌లో 515 అడుగుల నీటిమట్టం నిర్వహించాలని ఇప్పటికే కృష్ణానదీ యాజమాన్యబోర్డు ఉత్తర్వులు ఇచ్చింది. అంటే ఈ నెలాఖరుదాకా శ్రీశైలం, సాగర్ జలాశయాల్లో ఎండీడీఎల్ ఎగువన మాత్రమే నీటిని వాడుకొనేందుకు రెండు రాష్ట్రాలకు అనుమతి ఉన్నది. ఆ తరువాతే ఎండీడీఎల్ దిగువన నీటిని వాడుకోవాలని ఈనెల 2న జరిగిన బోర్డు త్రిసభ్య కమిటీ భేటీలో నిర్ణయించారు. ఎండీడీఎల్ ఎగువన ఆంధ్రప్రదేశ్ వాటా (9.3 టీఎంసీలు)లో సుమారు ఒకటిన్నర, రెండు టీఎంసీల వాటాను వాడుకొన్నది. దీంతో ఎండీడీఎల్ దిగువన నీటి కోసం ఆంధ్రప్రదేశ్ పదేపదే బోర్డుపై ఒత్తిడి తెస్తున్నది. ఈ నేపథ్యంలోనే రెండు జలాశయాల్లో ఎండీడీఎల్ దిగువన నీటిని వాడుకోవడమంటే కేవలం తాగునీటి అవసరాలకు మాత్రమే అనే విషయాన్ని తాజాగా బోర్డుకు రాసిన లేఖలో స్పష్టం చేసినట్టు సమాచారం.

ఆ నిర్ణయం జరుగలేదు..

ఈనెల 2న జరిగిన త్రిసభ్య కమిటీ భేటీ మినిట్స్‌ను.. కృష్ణాబోర్డు రెండు రోజుల కిందట రెండు రాష్ట్రాలకు పంపింది. అందులో సమావేశంలో జరగని నిర్ణయాలను జరిగినట్లుగా పొందుపరిచారని బోర్డుకు రాసిన లేఖలో తెలంగాణ అభ్యంతరాన్ని వ్యక్తంచేసినట్టు తెలిసింది.మార్చి నెలకు తెలంగాణ 19 టీఎంసీలు, ఆంధ్రప్రదేశ్ 26.38 టీఎంసీల ఇండెంట్లు ఉంచాయనే చర్చ జరిగిందే తప్ప, ఆ మేరకు నీటిని విడుదల చేయాలనే నిర్ణయం జరుగలేదని స్పష్టంచేసింది. సమావేశంలో ఎండీడీఎల్ ఎగువ నీటి నిల్వలను వాడుకునేందుకే నిర్ణయం జరిగిందని, దిగువన వాడకంపై తదుపరి సమావేశంలో చర్చిద్దామని రెండు రాష్ట్రాల ఈఎన్సీలు ఏకాభిప్రాయానికి వచ్చారనే విషయాన్ని కూడా లేఖలో తెలంగాణ గుర్తుచేసింది.

మారనున్న దామాషా..

రెండు తెలుగు రాష్ట్రాల మధ్య కృష్ణాజలాల పంపిణీకిగాను, ప్రస్తుతం అమలులో ఉన్న బచావత్ అవార్డును ప్రామాణికంగా తీసుకుంటున్నారు. రెండు రాష్ట్రాల మధ్య తాత్కాలిక ఒప్పందం మేరకు ప్రస్తుతం ఏపీ-66 శాతం, తెలంగాణ-34 శాతం దామాషాను అమలు చేస్తున్నారు. తాగునీటి అవసరాల విషయానికొస్తే దామాషా మారుతుందని తెలంగాణ నీటిపారుదల శాఖ బోర్డుకు తెలిపింది. బచావత్ అవార్డులో తాగునీటి అవసరాలకుగాను జరిగిన కేటాయింపులలో.. చెన్నై, హైదరాబాద్ మహా నగర తాగునీటి అవసరాలను పొందుపరిచారు. ఇందులో చెన్నై తాగునీటికి కావాల్సిన 15 టీఎంసీల్లో మహారాష్ట్ర, కర్ణాటక, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ల మధ్య ఐదు టీఎంసీల చొప్పున వాటా కేటాయించారు. ఈ ఐదు టీఎంసీల్లో ఆంధ్ర, రాయలసీమ, తెలంగాణ ప్రాంతీయ వాటాలుగానూ విభజించారు. దీని ప్రకారం ఒక్కో ప్రాంతానికి సుమారుగా 1.7 టీఎంసీల వాటా వచ్చింది. హైదరాబాద్ తాగునీటికి 16.5 టీఎంసీలను కేటాయించారు. వీటన్నింటినీ పరిగణలోనికి తీసుకొని లెక్కిస్తే..ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ (సీమాంధ్ర) కు తాగునీటిపరంగా 31 శాతం, తెలంగాణకు 69 శాతంగా వాటా తేలుతుంది. ఇదే విషయాన్ని తెలంగాణ నీటిపారుదలశాఖ కృష్ణా నదీ యాజమాన్య బోర్డు దృష్టికి తీసుకువెళ్లింది.

రేపట్నుంచి సినిమాల ప్రదర్శన

డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్లతో చర్చలు సఫలం

సినిమాడెస్క్, హైదరాబాద్: డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్లతో తలెత్తిన సమస్యల కారణంగా ఈ నెల 2 నుంచి మూతపడిన థియేటర్లు శుక్రవారం నుంచి తిరిగి సినిమాలను ప్రదర్శించనున్నాయి. డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్లు, తెలుగు సినిమా పరిశ్రమకు మధ్య బుధవారం జరిగిన చర్చలు సఫలం కావడంతో యథావిధిగా సినిమా ప్రదర్శనలు కొనసాగించాలని నిర్ణయం తీసుకొన్నారు. ఈ ఒప్పందంపై తెలుగు ఫిలించాంబర్ ఆఫ్ కామర్స్, తెలంగాణ ఫిలించాంబర్ ఆఫ్ కామర్స్ సంతకాలు చేశాయని ఐక్యకార్యాచరణ సమితి చైర్మన్ డీ సురేశ్‌బాబు మీడియాకు తెలిపారు. క్యూబ్, యూఎఫ్‌వో కంపెనీలు కలిసి మూడు నెలల్లో కొత్త కంపెనీగా ఏర్పడబోతున్నాయని, మిగతా సమస్యలు ఆ తర్వాత చర్చిస్తామని పేర్కొన్నారు.



హైదరాబాద్ ఫిలించాంబర్‌లో ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతున్న ఫిలించాంబర్ ఆఫ్ కామర్స్ జేఏసీ చైర్మన్ సురేశ్‌బాబు. చిత్రంలో జెమిని కిరణ్, శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి తదితరులు కూడా ఉన్నారు.

వర్చ్యువల్ ప్రింట్ ఫీజ్‌ను 19 నుంచి 21శాతం తగ్గించాలనన్న డిమాండ్‌కు ప్రొవైడర్లు సానుకూలంగా అంగీకరించారని చెప్పారు. కొత్త సాంకేతిక పరిజ్ఞానంతో వచ్చే ప్రొవైడర్లను సినిమా పరిశ్రమ ఎప్పటికీ ప్రోత్సహిస్తుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో తెలంగాణ ఫిలించాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కే మురళీమోహన్, తెలుగు ఫిలిం చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు పీ కిరణ్, నిర్మాతలు కేఎల్ దామోదరప్రసాద్, ముత్యాల రాందాస్, ఎం శ్యాంప్రసాదరెడ్డి పాల్గొన్నారు.

కార్మికులకు అధికారులు అందుబాటులో ఉండాలి

■ సమీక్షలో మంత్రి నాయిని

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: అధికారులు ఎల్లప్పుడూ కార్మికులకు అందుబాటులో ఉండాలని రాష్ట్ర హోం, కార్మికశాఖల మంత్రి నాయిని నర్సింహారెడ్డి సూచించారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో కార్మికశాఖ ప్రథమస్థానం సంపాదించడంపై అధికారులను ప్రశంసించారు. ఇదే స్ఫూర్తితో పనితీరును మరింత మెరుగు పర్చుకోవాలని బుధవారం సచివాలయంలో సమీక్ష సందర్భంగా కోరారు. కార్మికశాఖకు చెందిన బాయిలర్స్, ఫ్యాక్టరీలు తదితర విభాగాలకు చెందిన అధికారులతో సమావేశమైన మంత్రి.. పదోన్నతులు, ఇతర అంశాల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో కార్మికశాఖ ముఖ్య కార్యదర్శి శశాంక్ గోయల్, కార్మికశాఖ కమిషనర్ అహ్మద్ నదీం, ఫ్యాక్టరీల డైరెక్టర్ చంద్రమోహన్, బాయిలర్స్ డిపార్ట్‌మెంట్ డైరెక్టర్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీకి భారీ కసరత్తు

● గ్రామాలవారీగా చెక్కుల ముద్రణ.. ఒక్కో మండలానికి ఒక్కో బ్యాంకుకు బాధ్యత

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రైతులకు వానకాలం పంట పెట్టుబడికి ఇచ్చే చెక్కులన్నీ బ్యాంకర్ల డిజిటల్ సంతకాలతో అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. పట్టాదార్ పాస్‌పుస్తకాల ముద్రణ మాదిరిగానే గ్రామాలవారీగా చెక్కులు ముద్రించి, కట్టలు కట్టి, గ్రామాలకు పంపిస్తారు. రైతులకు ఇచ్చే చెక్కులన్నీ క్యాష్ చెక్కులుగానే ఉంటాయి. వీటిని నేరుగా బ్యాంకుకు వెళ్లి అకౌంట్‌లో వేయకుండా నగదుగా మార్చుకునే అవకాశం ఇచ్చారు. మే 15నుంచి మొదలయ్యే రైతులకు పంటసాయం కార్యక్రమం రెండు నెలలపాటు నిరంతరాయంగా కొనసాగనున్నది. చెక్కుల పంపిణీ కోసం ఎస్బీఐ, ఆంధ్రాబ్యాంక్, కెనెరా బ్యాంక్, కార్పొరేషన్ బ్యాంక్, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, సిండికేట్ బ్యాంక్, తెలంగాణ గ్రామీణ బ్యాంక్, ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ లను ఎంపికచేశారు. ఒక్కో మండలానికి ఒక్కో బ్యాంకుకు చెక్కుల పంపిణీ బాధ్యత అప్పగించినట్టు తెలిసింది. వ్యవసాయం చేసే భూములకే ప్రభుత్వం పెట్టుబడి ఇస్తుందని, వ్యవసాయ, వ్యవసాయేతర భూములను గుర్తించి వివరాలు అందించాలని జిల్లా కలెక్టర్లకు అధికారులు స్పష్టంచేశారు. పంటసాయంపై సచివాలయంలో బుధవారం సమీక్ష జరిగింది. పంటసాయం కార్యక్రమానికి అవసరమయ్యే డాటాను ఈ నెల 10 లోపు అందజేయాలని జిల్లాల కలెక్టర్లను ఉన్నతాధికారులు ఆదేశించారు. 9 లోపు భూ రికార్డుల డాటాను అందించాలని వ్యవసాయశాఖ ముఖ్యకార్యదర్శి పార్థసారథి, రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ తివారీని కోరుతూ లేఖ రాశారు. ఇప్పటివరకు కోటి 62 లక్షల ఎకరాలకు.. అంటే 72 లక్షల మంది రైతులకు పంటసాయం అందించాల్సి ఉంటుంది. రైతులకు పంపిణీ చేసే చెక్కులపై పాస్‌పుస్తకం యూనిక్ ఐడీ నంబర్ విధిగా ముద్రించనున్నారు.

రాజధాని నుంచి గ్రామాలకు..: జిల్లాలు, మండలాలు, గ్రామాల వారిగా చెక్కుల బండిళ్లను తయారు చేసేందుకు అధికారులు హైదరాబాద్‌లోని ఓ స్టేడియంను వేదికగా వినియోగించనున్నారు. అక్కడి నుంచి మండలాల్లో, గ్రామాల్లో ఏఈవో, ఏడీఏల భాగస్వామ్యంతో చెక్కుల పంపిణీ కొనసాగుతుంది. ఈ వ్యవహారాన్ని వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు ఆన్‌లైన్లో మానిటర్ చేస్తారు. చెక్కులు చినిగిపోతే స్థానికంగా ముద్రించుకునే అవకాశాన్ని కలెక్టర్లకు కల్పిస్తున్నారు.

డిజిటల్ సంతకాలు రేపటికల్లా పూర్తి!

పాస్‌పుస్తకాల పంపిణీకి సిద్ధంగా ఉండాలి • అసైన్డ్, సాదాబైనామా సమస్యలు పరిష్కరించాలి

వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్లకు రెవెన్యూ, ఆర్థిక శాఖ అధికారుల ఆదేశం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రైతులకు భూయజమాన్య హక్కులతో కూడిన పట్టాదార్ పాస్‌పుస్తకాలు ముద్రించి ఇవ్వడానికి భూముల సర్వే నంబర్లు, రైతుల ఖాతాల వారీగా తహసీల్దార్లు ఈ నెల 9వ తేదీలోగా డిజిటల్ సంతకాలు పూర్తిచేసి, అకౌంట్లను ఫ్రీజ్ చేయాలని కలెక్టర్లను అధికారులు ఆదేశించారు. బుధవారం అన్ని జిల్లాల కలెక్టర్లతో రెవెన్యూ, ఆర్థికశాఖ ఉన్నతాధికారులు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అన్ని జిల్లాల కలెక్టర్లతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఇప్పటివరకు 16 లక్షల రైతు ఖాతాలకు డిజిటల్ సంతకాలు పూర్తయ్యాయని కలెక్టర్లు వివరించారు. మిగతా అకౌంట్లన్నీ దాదాపుగా పూర్తికావచ్చాయని, రెండ్రోజుల్లో అన్నింటికీ డిజిటల్ సంతకాలు పూర్తవుతాయని తెలిపినట్లు సమాచారం. ఈ నెల 9వ తేదీనాటికి 72 లక్షల రైతుల ఖాతాలకు చెందిన భూములన్నింటికీ డిజిటల్ సంతకాలు పూర్తిచేయాలని ఆదేశించారు. సాదాబైనామా భూముల క్రమబద్ధీకరణ, అసైన్డ్ భూములను కొనుగోలు చేసిన పేదలకు రీ అసైన్‌ను నిబంధనల ప్రకారం పూర్తిచేయాలని కూడా ఆదేశించారు. ప్రభుత్వ భూము ల్లో సాగు చేస్తున్న 1,62,394 ఎకరాలను అసైన్ చేయాలని నిర్ణయించినట్లు తెలిసింది. అసైన్డ్ రైతుల నుంచి ఇతరులు కొనుగోలుచేసిన 2,41,127 ఎకరాలను రీఅసైన్‌కు చట్ట ప్రకా రం అర్హులైన వారిని గుర్తించి, అప్పగించాలని ఆదేశించినట్లు సమాచారం. సాదాబైనామాలకు సంబంధించి 2,45,668 ఎకరాల భూమినికూడా పరిశీలించి క్రమబద్ధీకరణ పూర్తిచేయాలని నిర్దేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ తివారీ, సీఎంవో ముఖ్య కార్యదర్శి నర్సింగ్‌రావు, ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శి రామకృష్ణారావు, సీఎంవో కార్యదర్శి స్మితాసభర్వాల్, సీసీఎల్‌ఏ డైరెక్టర్ వాకాటి కరుణ పాల్గొన్నారు.

వర్సిటీ పోస్టులకు త్వరలో నోటిఫికేషన్లు

మొదటిపేజీ తరువాయి...

గరిష్ఠంగా ఐదేండ్లలోనే ముగించేవిధంగా నిబంధనలు రూపొందిస్తున్నామని స్పష్టంచేశారు.

భూములను కాపాడండి: యూనివర్సిటీలకు ఉన్న వందలాది ఎకరాల భూములను అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలని వీసీలకు డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి దిశానిర్దేశం చేశారు. యూనివర్సిటీ చుట్టూ ప్రహరీలు నిర్మించాలని పేర్కొన్నారు. అన్ని వర్సిటీలు, అటానమస్, అఫిలియేటెడ్ కాలేజీలలో చదువుతున్న విద్యార్థులు, సిబ్బందికి బయోమెట్రిక్ అటెండెన్స్ తప్పనిసరిగా అమలుచేయాలని నిర్ణయం తీసుకొన్నట్టు చెప్పారు. అన్నివర్సిటీల్లో ఇంక్యుబేషన్ సెంటర్లను ఏర్పాటుచేసి విద్యార్థుల స్టార్టప్‌లను ప్రోత్సహించాలని ఆదేశించారు. ప్రైవేట్ వర్సిటీల ఏర్పాటు ప్రతిపాదనలు ఇప్పట్లో లేవని స్పష్టంచేశారు. సకాలంలో పోస్టులను భర్తీ చేయకపోవడంపై ఉస్మానియా వీసీపై ఉప ముఖ్యమంత్రి ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇంటర్వ్యూలలో మార్కులు వేసే క్రమంలో పక్షపాతం చూపుతున్నారని.. ఇది మంచిపద్ధతి కాదని హెచ్చరించారు. విద్యాసంవత్సరం ప్రారంభానికి ముందే ప్రైవేట్ కాలేజీల అఫిలియేషన్ ప్రక్రియ పూర్తికావాలన్నారు. సమావేశంలో విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రంజీవ్ ఆర్ ఆచార్య, రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ తుమ్మల పాపిరెడ్డి, ఇంటర్మీడియట్ విద్యా మండలి సెక్రెటరీ ఏ అశోక్, వివిధ యూనివర్సిటీలకు చెందిన వీసీలు, రిజిస్ట్రార్లు పాల్గొన్నారు. ఓయూలో మైనింగ్ ఇంజినీరింగ్ విభాగాన్ని తిరిగి ప్రారంభించాలని డిప్యూటీ సీఎం కడియం శ్రీహరిని ఆ కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధులు బుధవారం సచివాలయంలో కలిసి విజ్ఞప్తి చేశారు.

అతిపెద్ద ఐటీ కారిడార్!

మొదటిపేజీ తరువాయి...

సంబంధిత శాఖల అధికారులతో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఐటీ, పరిశ్రమలశాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్‌రంజన్, హెచ్‌ఎండీఏ కమిషనర్ చిరంజీవులు, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ ఎం రఘునందన్‌రావు, టీఎస్‌ఐఐసీ ఎండీ ఈ వెంకట నర్సింహారెడ్డి, సంగారెడ్డి జిల్లా జాయింట్ కలెక్టర్ పాల్గొన్నారు. నగర శివార్లలో ప్రతిపాదిత ఐటీ క్లస్టర్ల ఏర్పాటుకు గుర్తించిన భూములను వెంటనే టీఎస్‌ఐఐసీకి స్వాధీనపర్చే చర్యలను వేగవంతం చేయాలని కలెక్టర్లను మంత్రి కేటీఆర్ ఆదేశించారు. పుప్పాల్‌గూడలో ఐటీ క్లస్టర్ ఏర్పాటుకు ప్రతిపాదించిన 196 ఎకరాల అవాక్యూ ప్రాపర్టీస్ భూములపై సుప్రీంకోర్టులో ఉన్న కేసు త్వరగా పరిష్కారమయ్యేలా చూడాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు సూచించారు. బుద్వేల్‌లో ఐటీ పార్కు కోసం ఎంపికచేసిన 300 ఎకరాల భూములను సత్వరమే టీఎస్‌ఐఐసీకి బదలాయించాలని ఆదేశించారు. కోకాపేటలోని 250 ఎకరాల హెచ్‌ఎండీఏ భూములపై సుప్రీంకోర్టులో ఉన్న కేసు పరిష్కారమైనందున ఆ భూములను ఐటీ క్లస్టర్‌కు వినియోగించుకోవాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలిసింది.

కార్యాచరణ తయారీలో అధికారులు: ప్రభుత్వ ప్రతిపాదనలమేరకు నగరశివార్లలో ఐటీ క్లస్టర్ల అభివృద్ధిపై సంబంధితశాఖల ఉన్నతాధికారులు కార్యాచరణ ప్రణాళికలు సిద్ధంచేస్తున్నారు. భారీ పెట్టుబడులతో ముందుకొస్తున్న ఐటీ కంపెనీలకు అనువైన భూముల సేకరణపై దృష్టిపెట్టారు. రాజేంద్రనగర్ మండలం బుద్వేల్, పుప్పాల్‌గూడ, గండిపేట మండలం కోకాపేట, సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురం మండలం ఉస్మాన్‌నగర్, కొల్లూరులో ఐటీ క్లస్టర్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు తయారవుతున్నాయి. ఈ మధ్యలో ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ దగ్గర్లో ఉన్న సంగారెడ్డిజిల్లా తెల్లాపూర్‌లో ఉన్న ప్రభుత్వ భూములను కూడా పరిశీలిస్తున్నారు. బుద్వేల్‌లో ఐటీ పార్కు ఏర్పాటుకు ప్రభుత్వం ఇప్పటికే పచ్చజెండా ఊపింది. ఇక్కడ 300 ఎకరాల ప్రభుత్వ భూములు అందుబాటులో ఉన్నందున వాటిని టీఎస్‌ఐఐసీకి బదలాయించే పనులు కూడా ఊపందుకున్నాయి. ఇక్కడ సైబరాబాద్ ఐటీ హబ్‌కు దీటుగా అన్ని హంగులతో ఐటీ పార్కును అభివృద్ధి చేస్తామని మంత్రి కేటీఆర్ ప్రకటించడం గమనార్హం. పుప్పాల్‌గూడలో 196 ఎకరాలు, కోకాపేటలో 250, కొల్లూరులో 270, ఉస్మాన్‌నగర్‌లో 80 ఎకరాలను ఐటీ క్లస్టర్ల ఏర్పాటుకు రెవెన్యూ అధికారులు గుర్తించారు. ప్రతిపాదిత భూములను త్వరితగతిన టీఎస్‌ఐఐసీ స్వాధీనం చేసుకొని లేఅవుట్‌తో పాటు ఐటీ కంపెనీల ఏర్పాటుకు అనువైన అప్రోచ్ రోడ్లు, డ్రైనేజ్ కాల్వలు, విద్యుత్, నీరు తదితర మౌలిక సదుపాయాలను కల్పించనుంది.

భూములకు పెరుగుతున్న డిమాండ్

ముఖ్యమంత్రి కేసీఆర్ దిశానిర్దేశం, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ కృషి ఫలితంగా ఐటీ రంగంలో రాష్ట్రంలో పెద్ద ఎత్తున పెట్టుబడులు పెట్టడానికి అనేక కంపెనీలు ముందుకొస్తున్నాయి. ఐటీ రంగంలో హైదరాబాద్‌కు ఇప్పటికే ఉన్న బ్రాండ్ ఇమేజ్‌కు తోడు టీఎస్‌ఐపాస్ ద్వారా అనుమతుల ప్రక్రియను ప్రభుత్వం సులభతరం చేసింది. అంతేకాదు.. ఇతర ప్రోత్సాహకాలనూ అందిస్తున్నది. ఈ కారణంగా అంతర్జాతీయ, జాతీయ స్థాయిలో పేరెన్నికగల ఐటీ కంపెనీలు హైదరాబాద్ కేంద్రంగా తమ యూనిట్లను స్థాపించేందుకు పోటీపడుతున్నాయి. దీంతో హైదరాబాద్ చుట్టుపక్కల భూములకు విపరీతమైన డిమాండ్ ఏర్పడుతున్నది.

సెన్సెక్స్	నిఫ్టీ
33,033	10,154
↓ 284	↓ 95

ముడి చమురు (బ్రెంట్) ↓ 65.13 డాలర్లు

బంగారం ధరలు

ముంబై (రూ.లలో)	
24 క్యారెట్లు	30,705
22 క్యారెట్లు	30,555
వెండి (కిలో)	38,735

విదేశీ మారకం

కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
అమెరికా డాలర్	59.04	68.46
బహ్రెయిన్ దినార్	159.90	183.24
కువైట్ దినార్	179.03	222.87
సౌదీ రియాల్	15.70	18.60
యూఏఈ దిర్హామ్	16.07	18.78

చికెన్ ధరలు

ఫారం ధర	68.00
రిటైల్ లైవ్	90.00
డ్రెస్డ్	131.00
స్కిన్‌లెస్	149.00

నెక్ (వంద గుడ్లకు) (రూ.లలో)

హైదరాబాద్	345-00
రంగారెడ్డి	345-00
మెదక్	345-00
కరీంనగర్	347-00
వరంగల్	347-00
రిటైల్ ప్రైస్	4-05

ఐపీవోకి భారత్ డైనమిక్స్

రూ.960 కోట్లు సేకరించనున్న సంస్థ

ముంబై, మార్చి 7: ప్రభుత్వరంగ రక్షణ పరికరాల తయారీ సంస్థ భారత్ డైనమిక్స్ లిమిటెడ్(బీడీఎల్) స్టాక్ మార్కెట్లో లిస్టింగ్‌కు వస్తున్నది. ఈ నెల 13న ప్రారంభమవుతున్న ఇష్యూ 15న ముగియనున్నదని కంపెనీ వర్గాలు వెల్లడించాయి. ఇష్యూ షేరు ధరను రూ.413 నుంచి రూ.428 మధ్యలో నిర్ణయించింది. 12 శాతానికి సమానమైన 22,451,953 షేర్లను విక్రయించడంతో రూ.960 కోట్ల నిధులు రావచ్చునని సంస్థ అంచనా వేస్తున్నది. ఈ పబ్లిక్ ఇష్యూకి సంబంధించి సంస్థ..ఎస్‌బీఐ క్యాపిటల్ మార్కెట్స్, ఐడీబీఐ క్యాపిటల్ మార్కెట్స్, సెక్యూరిటీస్, యెస్ సెక్యూరిటీలను నియమించుకున్నది. భద్రత దళాల అవసరాల కోసం ఆయుధాలను తయారు చేస్తున్నట్లు, ముఖ్యంగా దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లో ఉన్న అవకాశాలను అందిపుచ్చుకోవాలనే ఉద్దేశంతో తెలంగాణలోని ఇబ్రహీంపట్నం, ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేయతలపెట్టిన నూతన ప్లాంట్లకోసం ఈ నిధులను ఖర్చు చేయనున్నట్లు బీడీఎల్ సీఎండీ వీ ఉదయ భాస్కర్ తెలిపారు. అలాగే రాష్ట్రంలోని రాచకొండ వద్ద టెస్ట్ ఫైర్ రేంజ్‌ను ఏర్పాటు చేసే అవకాశాన్ని పరిశీలిస్తున్నట్లు ఆయన సంకేతాలిచ్చారు.

టెల్కోలకు రిలీఫ్ ప్యాకేజీ

ప్రకటించిన కేంద్ర క్యాబినెట్



న్యూఢిల్లీ, మార్చి 7: రుణాలతో సతమతమవుతున్న టెలికం రంగ సంస్థలను ఆదుకోవడానికి కేంద్ర ప్రభుత్వం సిద్ధమైంది. అప్పులను తీర్చడానికి, టెలికం సేవలు అందించడానికి కొనుగోలు చేసిన స్పెక్ట్రం కోసం చెల్లింపులను మరింత సమయం ఇవ్వడానికి కేంద్ర క్యాబినెట్ అనుమతినిచ్చింది. ఈ నిర్ణయం టెలికం రంగ సంస్థలకు భారీ ఊరటనివ్వనున్నదని ప్రభుత్వ ప్రతినిధి ఒకరు తెలిపారు. అంతర్గత మంత్రుల బృందం ప్రతిపాదించిన ఈ భారీ ప్యాకేజీకి కేంద్ర క్యాబినెట్ బుధవారం పచ్చ జెండా ఊపింది. ప్రస్తుతం పదేండ్లలో స్పెక్ట్రం కొనుగోలుకు చెల్లింపులు జరిపాల్సి ఉండగా, ఈ కాల పరిమితిని 16 ఏండ్లకు పెంచగా, అలాగే పది విడతలుగా చెల్లించేందుకు ఐఎంజీ అనుమతినిచ్చిన విషయం తెలిసిందే. రూ.4.6 లక్షల కోట్ల అప్పుతో ఉన్న ఈ రంగాన్ని ఆదుకోవడానికి కేంద్రం..పెట్టుబడులు, ఏకీకరణకు సంబంధించిన విషయంలో సహాయం చేయడానికి ముందుకొచ్చింది. రిలయన్స్ జియో టెలికం రంగంలోకి అడుగుపెట్టినే నాటి నుంచి టెల్కోల నష్టాలు మరింత తీవ్రతరమయ్యాయి.

681 మంది డిపాజిట్లపై ఐటీ కన్ను

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పాత నోట్ల రద్దు సమయంలో అధిక మొత్తంలో బ్యాంకుల వద్ద నగదు డిపాజిట్ చేసి, వాటికి సంబంధించిన ఐటీ రిటర్న్‌లు దాఖలు చేయని ఖాతాదారులపై ఆదాయం పన్ను (ఐటీ) విభాగం దృష్టి పెట్టింది. రూ.కోటికి పైగా నగదును బ్యాంక్ ఖాతాల్లో డిపాజిట్ చేసిన వారి జాబితాను విడుదల చేశారు. దేశవ్యాప్తంగా 10,238 మంది ఖాతాదారులు ఈ జాబితాలో ఉండగా... అదే తెలుగు రాష్ర్టాల విషయానికి వస్తే 681 మంది ఉన్నట్లు ఏపీ, తెలంగాణ ఆదాయం పన్ను విభాగం ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ బుధవారం విడుదల చేసిన ప్రకటనలో వెల్లడించారు. వీరు ప్రస్తుతం సరైన ఆదాయాన్ని ప్రకటించి, ఐటీ రిటర్నులను దాఖలు చేయాలని సూచించారు. ఒకవేళ ఐటీ రిటర్నులు దాఖలు చేయకపోతే ఐటీ చట్టం ప్రకారం తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని ఆయన హెచ్చరించారు. ఐటీ రిటర్న్ దాఖలు చేసేందుకు ఈ నెల 31 వరకు గడువు ఇస్తున్నట్లు ఆయన ప్రకటించారు. వీరిలో 79 కంపెనీలు ఉండగా.. 177 భాగస్వామ్య సంస్థలతోపాటు 425 మంది వ్యక్తులున్నారని ప్రకటించారు.

ప్రపంచంలో మేటి..

జీఎంఆర్ ఢిల్లీ ఎయిర్‌పోర్టు



హైదరాబాద్, మార్చి 7: జీఎంఆర్ నేతృత్వంలోని ఢిల్లీ అంతర్జాతీయ విమానాశ్రయం లిమిటెడ్ (డీఐఏఎల్).. ప్రపంచంలోనే మేటిగా నిలిచింది. ఎయిర్‌పోర్ట్ సర్వీస్ క్వాలిటీ (ఏఎస్క్యూ) అవార్డ్స్-2017 అత్యున్నత విభాగంలో ప్రపంచ స్థాయిలో అగ్రస్థానాన నిలబడింది. గతేడాది 60 మిలియన్ల క్లబ్‌లో ఢిల్లీ విమానాశ్రయం చేరగా, ఈ క్రమంలోనే వరల్డ్ నంబర్ 1 పొజిషన్‌ను అందుకుంది. ఎయిర్‌పోర్ట్స్ కౌన్సిల్ ఇంటర్నేషనల్ (ఏసీఐ)-ఏఎస్క్యూ 2017 ర్యాంకింగ్స్ ప్రకారం యేటా 40 మిలియన్లకుపైగా ప్రయాణికుల విభాగంలో ఢిల్లీ ఇందిరాగాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు ప్రపంచంలోనే మొదటి స్థానాన్ని పొందింది. ఈ మేరకు ఎయిర్‌పోర్టు వర్గాలు తెలిపాయి. ఏఎస్క్యూ రేటింగ్స్‌ల్లోనూ డీఐఏఎల్‌కు వరల్డ్ నంబర్ 1 హోదాను ఏసీఐ ఇచ్చినట్లు తెలిపింది. కాగా, 2016లో రెండో స్థానంలో ఉన్న డీఐఏఎల్.. 2014, 2015 సంవత్సరాల్లో వార్షిక ప్రాతిపదికన 25-40 మిలియన్ ప్యాసింజర్ల విభాగంలో అగ్రస్థానాన్ని పొందిన విషయం తెలిసిందే. ఇక తాజా ఈ ఘనతపట్ల జీఎంఆర్ గ్రూప్ ఎయిర్‌పోర్ట్స్ చైర్మన్ శ్రీనివాస్ బొమ్మిడాల ఆనందం వ్యక్తం చేశారు. సమష్ఠి కృషితోనే ఇది సాధ్యమైందన్నారు. ఏసీఐ-ఏఎస్క్యూ అవార్డు రావడం సంతోషంగా ఉందని డీఐఏఎల్ సీఈవో ప్రభాకర రావు అన్నారు.

పుంజుకుంటున్న దేశ ఆర్థిక వ్యవస్థ

నీతి ఆయోగ్ ఉపాధ్యక్షుడు రాజీవ్ కుమార్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: దేశ ఆర్థిక వ్యవస్థ పుంజుకుంటున్నదని నీతి ఆయోగ్ ఉపాధ్యక్షుడు రాజీవ్‌కుమార్ పేర్కొన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో వృద్ధి ఆశాజనంగా ఉన్నట్టు ఆయన పేర్కొన్నారు. బుధవారం మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీలో జరిగిన సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. విద్యార్థులు కేవలం ఉద్యోగ అవకాశాల కోసం కాకుండా ఉద్యోగాలు కల్పించే వారిగా ఎదిగేందుకు ఉన్న అవకాశాలపై దృష్టి సారించాలని ఆయన సూచించారు. స్వయం ఉపాధి పొందే వారిలో ఎక్కువ మంది ఉన్నత విద్యావంతులు, టెక్నాలజీ వినియోగంపై మంచి అవగాహన కల్గినవారే ఉండబోతున్నారని, తద్వారా దేశ జీడీపీ పెరుగుదలకు ఎంతో సహకరిస్తుందన్నారు.

మహిళలు.. మహారాణులు

ఫోర్బ్స్ ప్రపంచ బిలియనీర్ల జాబితాలో 256 మంది

ఎనిమిది మంది భారతీయులకూ చోటు



అలీస్ వాల్టన్



సావిత్రి జిందాల్

న్యూయార్క్/న్యూఢిల్లీ, మార్చి 7: ప్రపంచ సంపన్నులలో మహిళలు సత్తా చాటారు. తాజాగా విడుదలైన ఈ ఏడాది ఫోర్బ్స్ ప్రపంచ కుబేరుల జాబితాలో మునుపెన్నడూ లేనివిధంగా అత్యధిక స్థాయిలో 256 మంది మహిళలు చోటు దక్కించుకున్నారు. ఇందులో ఎనిమిది మంది భారతీయ మహిళలకూ చోటు దక్కింది. ఈ టాప్-2,208 బిలియనీర్ల జాబితాలోని మొత్తం మహిళల సంపద గతేడాదితో పోల్చితే 20 శాతం పెరిగి లక్ష కోట్ల డాలర్లను చేరింది. భారతీయుల్లో సావిత్రి జిందాల్, కుటుంబం 8.8 బిలియన్ డాలర్లతో ముందుండగా, 3.6 బిలియన్ డాలర్లతో ఆ తర్వాతి స్థానంలో కిరణ్ మజుందార్ షా ఉన్నారు. కాగా, యెస్ బ్యాంకుకు చెందిన మధు కపూర్ ఈసారి ఫోర్బ్స్ బిలియనీర్ల జాబితాలోకి కొత్తగా రాగా, ఇంజినీరింగ్ సంస్థ థర్మాక్స్‌కు చెందిన అను అగా రెండేండ్ల తర్వాత మళ్లీ చోటు దక్కించుకున్నది. ఇక ప్రపంచ స్థాయిలో 46 బిలియన్ డాలర్లతో వాల్‌మార్ట్ వ్యవస్థాపకుడు సామ్ వాల్టన్ ఏకైక కూతురు అలీస్ వాల్టన్.. మహిళా ధనవంతులలో అగ్రస్థానంలో ఉన్నారు. మొత్తం జాబితాలో ఈమెది 16వ స్థానం. అలాగే లోరియల్ సంస్థకు చెందిన ఫ్రాంకోయిస్ బెట్టన్‌కోర్ట్ మేయర్స్ కుటుంబం 42.2 బిలియన్ డాలర్లతో రెండో స్థానంలో, 25 బిలియన్ డాలర్లతో బీఎండబ్ల్యూకు చెందిన సుసన్నే క్లట్టెన్ మూడో స్థానంలో ఉన్నారు. మొత్తం జాబితాలో వీరు 18, 32వ స్థానాల్లో నిలిచారు. కాగా, ఈసారి స్వశక్తితో ఒంటరిగా ఎదిగి ఫోర్బ్స్ జాబితాలో స్థానం దక్కించుకున్న మహిళామణుల సంఖ్య చెప్పుకోదగ్గ స్థాయిలో ఎగబాకడం విశేషం. నిరుడు 56గా ఉంటే.. ఈ యేడు 72గా ఉన్నారు. ఈ శ్రేణిలో భారత్‌లో అగ్రగామి మహిళా సంపన్నురాలిగా కిరణ్ మజుందార్ షా ఉన్నారు.

ఫోర్బ్స్ జాబితాలో నీరవ్ మోదీ ఔట్




వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీకి ఈసారి ఫోర్బ్స్ ప్రపంచ కుబేరుల జాబితాలో చోటు లభించలేదు. పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) రూ.12,700 కోట్ల కుంభకోణంలో నీరవ్ మోదీ ప్రధాన నిందితుడిగా ఉన్న విషయం తెలిసిందే. అయితే గతేడాది 1.8 బిలియన్ డాలర్ల (రూ.11,700 కోట్లు)తో ఫోర్బ్స్ సంపన్నుల జాబితాలో చోటు దక్కించుకున్న నీరవ్‌కు.. ఈ ఏడాదికిగాను విడుదలైన తాజా బిలియనీర్ల జాబితాలో స్థానం లేకుండా పోయింది. అమెరికాలో ఇటీవల నీరవ్‌కి చెందిన ఫైర్ స్టార్ డైమండ్ తదితర సంస్థలు దివాలాకు దరఖాస్తు చేసుకున్న విషయం తెలిసిందే.

యువ భారతీయ బిలియనీర్.. విజయ్ శేఖర్



పేటీఎం వ్యవస్థాపకుడు విజయ్ శేఖర్ శర్మ.. ఫోర్బ్స్ తాజా జాబితాలో స్థానం సంపాదించిన యువ భారత బిలియనీర్. 39 ఏండ్ల విజయ్ శేఖర్.. 1.7 బిలియన్ డాలర్లతో 1,394వ స్థానంలో నిలిచారు. భారతీయ బిలియనీర్లలో 40 ఏండ్లలోపు వయసున్నది విజయ్ శేఖర్ ఒక్కరే కావడం గమనార్హం. 2011లో పేటీఎంను శర్మ స్థాపించారు. పెద్ద నోట్ల రద్దుతో పేటీఎంకు డిమాండ్ భారీగా పెరుగగా, సంస్థ విలువ ఒక్కసారిగా వేల కోట్లలోకి చేరుకున్నది. పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ కూడా వచ్చిన విషయం తెలిసిందే. ఇక ఈ బిలియనీర్ల జాబితాలో చోటు దక్కిన అతిపెద్ద వయస్కుడు ఆల్కెమ్ లాబొరేటరీస్‌కు చైర్మన్ ఎమిరేట్స్‌గా వ్యవహరిస్తున్న 92 ఏండ్ల సంప్రదా సింగ్. 1.2 బిలియన్ డాలర్లతో 1,867వ స్థానంలో ఉన్నారీయన.



ఫోర్బ్స్ జాబితాలో భారతీయ మహిళలు

స్థానం	పేరు	సంపద (డాలర్లలో)	సంస్థ
176	సావిత్రి జిందాల్	8.8 బిలియన్లు	జెఎస్‌డబ్ల్యూ గ్రూప్
629	కిరణ్ మజుందార్ షా	3.6 బిలియన్లు	బయోకాన్
822	స్మితా కృష్ణా-గోద్రేజ్	2.9 బిలియన్లు	గోద్రేజ్ గ్రూప్
1,020	లీనా తివారీ	2.4 బిలియన్లు	యూఎస్‌వీ ఇండియా
1,103	వినోద్-అనిల్ రాయ్ గుప్తా	2.2 బిలియన్లు	హావెల్స్ ఇండియా
1,650	అను అగా	1.4 బిలియన్లు	థర్మాక్స్
1,999	షీలా గౌతమ్	1.1 బిలియన్లు	స్లీప్‌వెల్ మాట్రెస్
1,999	మధు కపూర్	1.1 బిలియన్లు	యెస్ బ్యాంక్

మళ్లీ ముకేశ్ అంబానీయే టాప్

- ఫోర్బ్స్ ధనవంతుల జాబితాలో వరుసగా 11వసారి భారతీయ కుబేరుడిగా ఘనత
- ప్రపంచ స్థాయిలో జెఫ్ బెజోస్ అగ్రస్థానం

ఫోర్బ్స్ ధనవంతుల జాబితాలో దేశీయంగా మళ్లీ ముకేశ్ అంబానీనే అగ్రస్థానంలో నిలిచారు. ప్రపంచ స్థాయిలో మాత్రం అమెజాన్ అధినేత జెఫ్ బెజోస్ అగ్రగామిగా ఉన్నారు. ఫోర్బ్స్ 2018 'వరల్డ్స్ బిలియనీర్స్' లిస్ట్‌లో 40.1 బిలియన్ డాలర్ల (రూ.2,60,622 కోట్లు)తో రిలయన్స్ ఇండస్ట్రీస్ అధిపతి ముకేశ్ అంబానీ 19వ స్థానాన్ని పొందారు. పోయినసారి 33వ స్థానంలోనే ఉండగా, సంపద 72.84 శాతం వృద్ధి చెందడంతో ఈ ఏడాది 14 స్థానాలు ఎగబాకారు. అంతేగాక వరుసగా 11వసారి భారతీయ కుబేరుడి ఘనతను దక్కించుకున్నారు ముకేశ్ అంబానీ. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న మొత్తం 2,208 బిలియనీర్లతో ఈ జాబితాను ఫోర్బ్స్ తాజాగా విడుదల చేయగా, ఇందులో 119 మంది భారతీయులకు స్థానం దక్కింది. గతంతో పోల్చితే ఈసారి 18 మంది అధికంగా ఉన్నారు. ఇక వీరి సంపద కూడా నిరుడుతో చూస్తే 114.6 బిలియన్ డాలర్లు పెరిగి 440.1 బిలియన్ డాలర్లుగా నమోదైంది. ఇదిలావుంటే 112 బిలియన్ డాలర్లతో జెఫ్ బెజోస్ మొదటి స్థానంలో నిలిచారు. 91.2 బిలియన్ డాలర్లతో బిల్‌గేట్స్ రెండో స్థానంలో ఉండగా, 87.7 బిలియన్ డాలర్లతో మూడో స్థానంలో వారెన్ బఫెట్ ఉన్నారు. తర్వాతి రెండు స్థానాల్లో వరుసగా బెర్నార్డ్ ఆర్నాల్ట్ కుటుంబం (74.7 బిలియన్ డాలర్లు), మార్క్ జూకర్‌బర్గ్ (72.4 బిలియన్ డాలర్లు) ఉన్నారు.

మూడు నెలల కనిష్ఠానికి సెన్సెక్స్

మరో 284 పాయింట్లు కోల్పోయిన సూచీ



ముంబై, మార్చి 7: బ్యాంకింగ్ రంగంలో జరిగిన కుంభకోణాల ప్రకంపనలు ఇంకా స్టాక్ మార్కెట్లపై వీస్తున్నాయి. అంతర్జాతీయ వాణిజ్యంలో యుద్ధమేఘాలు కమ్ముకున్నాయన్న అమెరికా వైట్‌హౌజ్ ప్రధాన ఆర్థిక సలహాదారు వ్యాఖ్యలు మదుపరులలో ఆందోళనలు తీవ్రతరం చేసింది. దీంతో గడిచిన ఆరు సెషన్లుగా దిగువముఖం పట్టిన సూచీలు మూడు నెలల కనిష్ఠ స్థాయికి జారుకున్నాయి. బీఎస్‌ఈ సెన్సెక్స్ 284.11 పాయింట్లు తగ్గి 33,033కి చేరుకోగా, నిఫ్టీ 10,200 పాయింట్ల దిగువకు పడిపోయింది. డిసెంబర్ 7న ముగిసిన 32,949 స్థాయికి సెన్సెక్స్ పడిపోయింది. గడిచిన ఆరు సెషన్లలో సూచీ 1,412.66 పాయింట్లు కోల్పోయింది. 95.05 పాయింట్లు తగ్గిన నిఫ్టీ 10,154.20 వద్ద స్థిరపడింది. వాణిజ్యంపై అగ్రరాజ్యం అమెరికా వ్యాఖ్యలు ఆసియా, యూరప్ మార్కెట్లలో ప్రకంపనాలు సృష్టించాయి. ఉదయం సానుకూలంగా ప్రారంభమైన సూచీలకు మధ్యాహ్నం తర్వాత ప్రారంభమైన ఆసియా, యూరప్ మార్కెట్ల నుంచి వచ్చిన ప్రతికూల సంకేతాలు పతనానికి పరోక్షంగా కారణమయ్యాయని మార్కెట్ పండితులు అంచనావేస్తున్నారు. బ్యాంకింగ్ రంగ సూచీ అత్యధికంగా నష్టపోయింది. ఎస్‌బీఐ, పీఎన్‌బీ, ఐసీఐసీఐ బ్యాంక్, ఫెడరల్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా, యెస్ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఇండస్‌ఇండ్ బ్యాంక్‌ల షేర్లు నాలుగు శాతం వరకు పతనం చెందాయి. అలాగే గీతాంజలి జెమ్స్ షేరు ధర 5 శాతం తగ్గి 52 వారాల కనిష్ఠ స్థాయికి పడిపోయింది. వీటితోపాటు అదానీ పోర్ట్స్, భారతీ ఎయిర్‌టెల్, ఓఎన్‌జీసీ, ఆర్‌ఐఎల్, టాటా స్టీల్, ఎల్ అండ్ టీ, మహీంద్రా, సన్‌ఫార్మా, డాక్టర్ రెడ్డీస్, టీసీఎస్, ఇన్ఫోసిస్, విప్రో, హీరో మోటోకార్ప్, పవర్‌గ్రిడ్‌లు ఆరు శాతానికి పైగా తమ మార్కెట్ వాటాను కోల్పోయాయి. కానీ ఐటీసీ, మారుతి, బజాజ్, కోటక్ బ్యాంక్, ఎన్‌టీపీసీలు లాభపడ్డాయి. రంగాలవారీగా చూస్తే ఎఫ్‌ఎంసీజీ, కన్స్యూమర్ డ్యూరబుల్ నష్టాల్లో ముగిశాయి.

ఎస్‌ఎఫ్‌ఐవో ముందు హాజరైన పీఎన్‌బీ చీఫ్

ఐదు గంటలపాటు ప్రశ్నించిన దర్యాప్తు సంస్థ



ముంబై, మార్చి 7: నీరవ్ మోదీ మోసం కేసులో సీరియస్ ఫ్రాడ్ ఇన్వెస్ట్‌గేషన్ ఆఫీస్(ఎస్‌ఎఫ్‌ఐవో) బుధవారం పంజాబ్ నేషనల్ బ్యాంక్ ఎండీ సునీల్ మెహతాను ప్రశ్నించింది. ఉదయం 11 గంటలకు నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు అంటే ఐదు గంటలపాటు మెహతాను ప్రశ్నించినట్లు తెలుస్తున్నది. రూ.12,700 కోట్ల పీఎన్‌బీ మోసం కేసులో ఇప్పటికే యాక్సిస్ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్ ఉన్నతాధికారులను ప్రశ్నించిన ఎస్‌ఎఫ్‌ఐవో..తాజాగా పీఎన్‌బీ ఎండీని ప్రశ్నించడం ప్రాధాన్యతను సంతరించుకున్నది. ఇదే కేసులో మెహతాతోపాటు పీఎన్‌బీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కేవీ బ్రహ్మాజీ రావులను సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్ట్‌గేషన్(సీబీఐ) గత నెలలో ప్రశ్నించింది. ఈ కేసులో వీరిద్దరు ముద్దాయిలు కాకపోయినప్పటికీ బ్యాంకులో జరిగిన ఈ భారీ మోసం ఎలా జరిగిందో దానిపై కీలక సమాచారం రాబట్టినట్లు తెలుస్తున్నది. నీరవ్ మోదీ, మెహుల్ చోక్సీలకు రుణాలు ఇచ్చిన మరో 31 మంది బ్యాంకు అధికారులకు నోటీసులు జారీ చేసేందుకు ఎస్‌ఎఫ్‌ఐవో సిద్ధమైనట్లు తెలుస్తున్నది. ఇప్పటికే ఈ కేసులో 12 మందిని సీబీఐ అరెస్ట్ చేసింది. వీరిలో పంజాబ్ నేషనల్ బ్యాంక్ మాజీ అధికారులు, నీరవ్, మెహుల్ సంస్థలకు చెందిన సిబ్బంది కూడా ఉన్నారు.

నీరవ్ మోదీపై తాజా ఎఫ్‌ఐఆర్

ప్రముఖ వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీపై సీబీఐ తాజాగా ఎఫ్‌ఐఆర్‌ను దాఖలు చేసింది. పీఎన్‌బీకి రూ.321 కోట్ల నష్టం వాటిల్లిన కేసులో ఈ ఎఫ్‌ఐఆర్‌ను దాఖలు చేసినట్లు సీబీఐ వర్గాలు బుధవారం వెల్లడించాయి. కాగా, నీరవ్ మోదీ సోదరుడు..బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నుంచి రూ.2.27 కోట్ల మేర రుణం పొందారట.

విమానయాన వృద్ధికి కేంద్రం సహకారం

కేంద్ర పౌరవిమానయాన శాఖ సంయుక్త కార్యదర్శి ఉషా



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పౌరవిమానయాన రంగంలో ఇటీవలి కాలంలో విశేష వృద్ధి నమోదు అవుతున్నదని దీన్ని కొనసాగించేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని కేంద్ర పౌరవిమానయాన శాఖ సంయుక్త కార్యదర్శి ఉషా పదీ హామీ ఇచ్చారు. ఉడాన్ (ఉడే దేశ్ కా ఆమ్ నాగరిక్) పథకం ద్వారా సామాన్యులకు విమానయానం చేరువ చేయడంతో పాటుగా ఈ పరిశ్రమకు సైతం మేలు కల్పించేలా నిర్ణయం తీసుకున్నామన్నారు. 'బిజినెస్ ఎయిర్‌క్రాఫ్ట్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా' ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్‌లో జరిగిన సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. దేశ ప్రయోజనాలు పరిరక్షించడంతో పాటుగా విమానయాన పరిశ్రమను ముందుకు తీసుకువెళ్లేందుకు సైతం కేంద్రం నిర్ణయాలు తీసుకుంటుందన్నారు. ఈ సందర్భంగా విమానయాన రంగంపై జీఎస్టీ ప్రభావంపట్ల రూపొందించిన నివేదికను ఆమె విడుదల చేశారు. ఈ నివేదికను తాము అధ్యయనం చేస్తామని వెల్లడించారు. బిజినెస్ ఎయిర్‌క్రాఫ్ట్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు రోహిత్ కపూర్ మాట్లాడుతూ.. ఇప్పుడిప్పుడే కోలుకోవడంతోపాటుగా ఉపాధి అవకాశాలకు వేదికగా మారుతున్న విమానయాన రంగాన్ని దెబ్బతీసే నిర్ణయాలు సమీక్షించుకోవాలన్నారు.

మూడు విమాన సంస్థలపై సీసీఐ కొరడా

మూడు ప్రైవేట్ విమానయాన సంస్థలపై సీసీఐ కొరడా ఝులిపించింది. సరుకు రవాణా చార్జీలపై ఇష్టం వచ్చినట్లు వ్యవహరించినందుకుగాను జెట్ ఎయిర్‌వేస్, ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్, స్పైస్‌జెట్ విమానయాన సంస్థలపై దాదాపు రూ.55 కోట్ల జరిమానా విధించింది. వీటిలో జెట్ ఎయిర్‌వేస్‌పై రూ.39.81 కోట్లు, ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్‌పై రూ.9.45 కోట్లు, స్పైస్‌జెట్‌పై రూ.5.10 కోట్ల మేర విధించినట్లు అధికారికంగా విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది.

అవాంఛిత కాల్స్ నియంత్రణకు యాప్



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: అవాంఛిత ఫోన్ కాల్స్ నుంచి ఇబ్బందులు తొలగించేందుకు మ్యూచువల్ కాలర్ పేరుతో కొత్త సౌలభ్యాన్ని తీసుకువచ్చినట్లు హైదరాబాద్‌కు చెందిన ఎంటైర్ యాప్ సంస్థ తెలిపింది. అవాంఛిత కాల్స్ వల్ల మహిళలు, ఉద్యోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో తాము ఈ ఆవిష్కరణ తీసుకువచ్చినట్లు సంస్థ వ్యవస్థాపకుడు సాంబశివరావు తెలిపారు. తమ సన్నిహితుల ఫోన్లలో నిక్షిప్తం అయిన ఫోన్ నంబర్లను ఆకుపచ్చ రంగులో, అపరిచితుల నంబర్లను ముదురు గోధుమవర్ణంలో ప్రదర్శిస్తుందని తద్వారా సంబంధిత కాల్స్‌కు స్పందించడం వినియోగదారుడి స్వేచ్ఛ అని పేర్కొన్నారు.

బీఎస్‌ఈలో తెలంగాణ షేర్లు

షేర్ల ప్రస్తుత, క్రితం ముగింపు, వాణిజ్య పరిణామం వరుసగా..

A P Paper 299.5(301.15)5473
Ace Software Exports 24.75(22.5)10
Aci Infocom 4.16(4.37)206
Aditya Ispat 6.06(6.06)3851
Aditya Spin 8.4(8.0)160
Agro Tech Foods 649.95(652.95)523
Aishwarya Telcom 5.41(5.67)10643
Alphageo 791.6(797.55)1585
Alufluoride 110.95(114.55)3745
Amara Raja 798.75(804.5)9924
Andhra Bank 42.65(44.2)423253
Andhra Cements 10.81(10.75)10899
Andhra Petroch 55.1(57.25)76880
Andhra Sugars 477.3(501.05)1655
Anjani Portl 182.5(188.0)2346
Astra Micro 89.95(90.3)38386
Aurobindo Phar 606.2(600.8)272282
Avantel 555.95(575.5)3306
Avanti Feeds 2421.4(2433.6)11966
Avon Organics 10.55(11.0)11360
B N Rathi Secur39.35(42.5)6237
Balaji Amines 613.3(624.4)8391
Bambino Agro 238.95(241.1)2127
Bartronics India 12.84(13.39)11715

Bgr Energy Sys 113.5(116.5)10927
Bhagiradha Chem 295.85(304.45)1849
Bhagyaind 53.75(46.25)367750
Bhagyanagar W. 25.4(25.75)1000
Bnr Udyog 28.65(29.0)2337
Brilliant Secur10.12(10.65)138981
Cambridge Tech 76.85(76.5)1300
Cat Tech 1.14(1.2)216
Ccl Products 294.95(297.5)1109
Celestial Labs 16.1(16.3)5909
Cil Securities 28.6(30.35)522
Color Chips 37.8(38.75)14946
Combat Drugs 27.4(27.4)2930
Coromandel Fert 569.2(554.55)15358
Country Club 13.91(13.94)18377
Cubex Tubings 26.0(25.6)1595
Cybermate Inf. 2.96(3.09)86612
Danlaw Tech. 68.95(68.65)10321
Deccan Cements 561.05(568.0)234
Denisons Hyd 991.0(1002.6)51
Dhan Roto Sp 55.35(54.95)1432
Diamond Power 12.84(11.78)239672
Divi's Lab 1012.0(1010.2)160307
Divyashakti Gr 93.0(93.95)1272

Dolphin Med 1.15(1.18)200
Dr Reddy`s 2175.0(2182.45)20646
Empee Sugars 3.93(3.91)1059
Everest Org 138.1(137.6)3938
Facor Alloys 2.91(2.93)61645
Firstobj 16.0(16.5)1793
Fortune Info 75.5(77.45)117908
Four Soft 83.55(86.3)109
Gati 107.1(108.95)74516
Gayatri 9.93(10.44)90967
Gayatri Proj205.4(210.7)269709
Gayatribi 7.17(7.96)990
Gennex 4.04(4.18)167300
Gmr Infra 18.05(18.5)2192977
Godavari Drugs 34.9(34.0)1234
Goldinfra 204.8(216.95)84195
Goldstone Tech 14.13(14.76)3796
Gowra Leasing & Fin 24.0(23.2)305
Granules Ind 110.45(113.8)98852
Gss America Info52.7(43.95)747694
Gulf Oil Corp 549.45(559.85)2407
Gvk Pwr 14.95(15.7)1030765
Hbl Power 54.3(56.65)59624
Heritage Food 691.55(690.25)2464

Hind Fluro 11.47(11.47)499
Hyderabad Ind 1665.7(1673.35)334
I V R Cons 4.15(4.36)239064
I.c.s.a. 3.1(3.15)5516
Ikf Technologies 0.65(0.66)94261
Incap 86.15(88.0)854
Infotech Ent 623.4(627.8)9953
Invinex Lab 119.7(119.9)1
Ivrcl Infrastruc 4.15(4.36)239064
K C P 120.95(122.8)6729
Kakatiya Cem289.5(290.05)1688
Kallam Spinning 31.85(31.3)60346
Kaveri Seed 477.7(487.6)17481
Kernex Mic. 40.65(42.25)20074
Knr Constr296.9(302.05)10572
Krebsbio 181.1(172.5)2208

Lanco Ind 329.1(338.0)29347
Lanco Infratech 1.2(1.25)771823
Livewell Home Fin 64.0(65.4)2687
Lokesh Mach 60.7(63.05)23267
Lotus Chocolate 50.5(49.5)2426
Madhucon Projects 26.6(26.75)9097
Maytas Infra 40.5(41.65)9677
Mhril 291.65(294.8)6637
Mic Electronics 6.55(6.86)81056
Moldtek 57.5(59.9)117021
Moschip Semi 31.8(32.2)105429
Msr India Ltd 48.5(48.4)9030
N C L Ind 217.6(223.25)15601
Nagarjuna Agri 41.4(42.2)13595
Nagarjuna Con 122.4(126.8)269863
Natco Pharma 729.85(757.5)36124

National Min 123.05(123.05)368109
Nbventure 147.35(149.85)11782
Neha International 7.27(7.24)24667
Neha Int Ltd. 7.27(7.24)24667
Neocure Thera 3.8(3.98)2000
Nettlinx 76.3(76.8)4739
Neuland Lab 690.4(703.3)521
Niharinf 13.89(13.33)750
Nile 795.7(822.1)1850
Oil Country 40.0(41.1)3970
P L Enterprise 2.36(2.36)5
Padmalaya Tel 4.4(4.58)13656
Pankaj Polymers 9.22(9.69)1200
Panyam Cem 45.6(46.85)11121
Peeti Securities 7.34(7.2)1274
Pennar Ind 56.35(57.5)60794

Pflinfotc 7.63(8.0)1268
Phaarmasia 39.85(40.65)151
Phyto Chem 64.4(63.35)4421
Pitti Lamin 89.95(90.55)16583
Pokarna 202.6(206.25)8315
Prajay Eng 12.4(11.81)34180
Premier Expl 377.15(379.65)895
Prism Cement 121.95(123.6)121244
Rain 366.9(369.15)552721
Raj Packaging 35.85(36.6)4069
Ram Informatics 40.25(42.35)3730
Regency Ceramic 5.42(5.61)5307
Restile Ceramics 6.69(6.6)5634
Roopa Industries 14.89(14.05)1480
Rubra Medicaments 4.28(4.5)500
Sagar Cements 908.35(939.85)757
Sai Wires India 1.04(1.04)500
Samkrg Pistons 294.45(297.9)5704
Sampre Nutritions 56.6(53.95)863
Sanghi Ind 115.55(114.4)14951
Sanjeevni Indust24.0(24.65)49938
Sark Sys 53.5(54.15)9789
Sathavahana Ispat 21.8(22.35)5750
Saven Tech26.45(25.95)16559

Sks Microfin 1038.15(1028.15)59414
Sms Pharma 85.6(86.1)2188
Southern Mg & Chem 24.95(26.25)100
Southern Online Bio 3.06(3.22)7270
Sr Ray Alkalies 53.8(55.35)114703
Sree Rayalaseema 162.6(166.15)1868
Srinivasa Shipp 59.0(59.9)290
Srivajra 2.59(2.63)100
Steel Exchange Ind28.0(29.1)13534
Sujana 0.85(0.86)53962
Sujana Towers 3.9(3.8)7402
Sujanametal 1.39(1.39)459
Surana Telecom 5.3(5.5)6318
Suryaamba 72.7(75.9)150
Suryachakra Power 0.91(0.9)36350
Suryalak Cott 76.25(77.95)674
Suryalata Spin 142.65(149.6)1437
Suryavanshi Spin 6.09(5.8)1368
Suvarna Cem 125.6(129.0)3476
Suven 184.95(187.2)37419
Taj Gvk 160.8(164.7)5821
Tanla Solutions 33.95(33.45)150664
Tci Fin 27.8(28.65)21518
Tirumala Seu 1.05(1.1)200

Transcorp Int 31.9(33.4)20765
Transgene Biotek 2.67(2.69)22408
Transport Co 276.35(275.75)2369
Trendy Knitwear 0.27(0.27)7500
Tyche 102.2(105.05)6930
Unisocks 2.98(3.1)8600
Usher 5.9(6.0)12786
V B C Ferro 40.65(42.6)1
V S T Ind 3012.65(3135.35)146
Vamshi Rubber 50.45(51.5)200
Viceroy Hotels 14.95(14.95)42356
Vijay Textiles 52.5(50.45)4113
Vimta Labs 205.2(203.05)4108
Virat Crane 55.05(55.05)31076
Virnichiq 114.2(116.85)43385
Visaka Ind 678.95(693.0)10788
Vista Pharma 45.95(48.35)285709
Vivmed Labs 73.15(75.6)99411
Vivo Bio Tech 65.35(62.25)22652
Vmf Softech 114.8(117.3)13202
Waterbase 297.45(307.3)102349
Xl Energy Ltd 2.55(2.64)7555
Ybrant Digital 5.29(5.56)102833
Zen TechLtd 130.7(130.8)158800
Zenotech 42.25(40.85)41389



ఆడపిల్ల అంటే ఆదిశక్తి రూపం

- డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్‌రెడ్డి
- మహిళలకు ప్రభుత్వ అండ: మంత్రి ఈటల

తిమ్మాపూర్ రూరల్: మరో ప్రాణానికి జన్మనిచ్చే స్త్రీ మూర్తిని ఎంత పొగిడినా తక్కువేనని డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆడపిల్ల అంటే ఆదిశక్తి రూపమని, కడుపులో ఆడపిల్ల అని తెలియగానే భ్రూణహత్యలు చేయవద్దని కోరారు. తెలంగాణ ప్రభుత్వం ఆడపిల్ల పుడితే రూ.13వేలు, మగబిడ్డ పుడితే రూ.12వేలు అందిస్తున్నదని చెప్పారు. బుధవారం కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం ఎల్‌ఎండీ కాలనీలో రాంలీలా మైదానంలో రాష్ట్ర సాంస్కృతిక సారథి చైర్మన్, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'మహిళా ఆత్మగౌరవ సభ'కు ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్, మహిళా కార్పొరేషన్ చైర్మన్ గుండు సుధారాణి, జెడ్పీ అధ్యక్షురాలు తుల ఉమ, ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావుతో కలిసి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు ప్రవేశపెట్టడంతోనే ఈరోజు మహిళలు ఎమ్మెల్యేలు, ఎంపీలుగా ఉంటున్నారని తెలిపారు. మంత్రి ఈటల మాట్లాడుతూ ఆడపిల్లల రక్షణ కోసం సర్కారు అనేక పథకాలను తెచ్చిందన్నారు. రాష్ట్రంలో తప్ప కేసీఆర్ కిట్ దేశంలో ఎక్కడా లేదని, షీటీం ద్వారా ఆడబిడ్డలకు భరోసా కల్పించామని పేర్కొన్నారు. వేదికపై కళాకారులతోపాటు పద్మాదేవేందర్‌రెడ్డి, సాంస్కృతిక సారథి చైర్మన్ రసమయి ఆటాపాటలతో అలరించారు.


కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్‌లో మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్‌రెడ్డి. చిత్రంలో మంత్రి ఈటల రాజేందర్, ఎంపీ వినోద్‌కుమార్, జెడ్పీ అధ్యక్షురాలు తుల ఉమ, ఎమ్మెల్సీ నారదాసు, ఎమ్మెల్యే రసమయి బాలకృష్ణ

కాళేశ్వరం ఫలితం మిడ్‌మానేరు

గోదావరి జలాలతో కరువు ప్రాంతాలు సస్యశ్యామలం.. శనిగరం ప్రాజెక్టును కాళేశ్వరంతో అనుసంధానం చేస్తాం

కాంగ్రెస్, టీడీపీ 30ఏండ్లలో చేయని పని మూడేండ్లలో చేశాం.. ఇది సీఎం కేసీఆర్ సంకల్పానికి నిదర్శనం.. రాష్ట్ర భారీ నీటి పారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు

సిద్దిపేట ప్రతినిధి, నమస్తే తెలంగాణ: కాళేశ్వరం తొలి ఫలితం మిడ్‌మానేరు అని, కాంగ్రెస్, టీడీపీ 30 ఏండ్లలో చేయని పనిని టీఆర్‌ఎస్ ప్రభుత్వం మూడేండ్లలో చేసి చూపిందని రాష్ట్ర భారీ నీటి పారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. ఇది కేసీఆర్ సంకల్పానికి నిదర్శమని చెప్పారు. బుధవారం సిద్దిపేట జిల్లాలోని శనిగరం మధ్యతరహా ప్రాజెక్టు, తోటపల్లి ఆన్‌లైన్ రిజర్వాయర్, లిఫ్టు పథకం, మోయతుమ్మెద వాగుపై అక్విడెక్టులు, గౌరవెల్లి రిజర్వాయర్ పంపుహౌస్, టన్నెల్, సర్జిపుల్ కెనాల్స్ పనులను కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు వినోద్‌కుమార్, హుస్నాబాద్ శాసన సభ్యులు ఒడితెల సతీశ్ కుమార్‌తో కలిసి మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరులతో మంత్రి హరీశ్‌రావు మాట్లాడారు. గత ప్రభుత్వాలు ఎన్నికల హామీలే ఇచ్చాయి గానీ, ఏ ఒక్క సాగునీటి ప్రాజెక్టు పనులను పూర్తి చేయలేదు. ఈ ఖరీఫ్‌లో మిడ్‌మానేరు ద్వారా 75 వేల ఎకరాలకు, గౌరవెల్లి రిజర్వాయర్ ద్వారా వచ్చే యాసంగికి 75 వేల ఎకరాల సాగునీటిని అందించనున్నట్లు తెలిపారు. హుస్నాబాద్‌లాంటి దుర్భిక్ష ప్రాంతాలకు కాళేశ్వరం తొలిఫలితం అందనున్నట్లు చెప్పారు. ఉమ్మడి రాష్ట్రంలో ఆంధ్రా పాలకులు ప్రాజెక్టులు నిజంగా నీళ్లిచ్చే ఉద్దేశంతో కట్టలేదని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టును యుద్ధ ప్రాతిపదికన నిర్మిస్తున్నామని, ఇప్పటికే 75 శాతం పూర్తయిందని వెల్లడించారు. ఒకప్పుడు ప్రాజెక్టు అంటే కల అని నేడు టీఆర్‌ఎస్ ప్రభుత్వంలో ప్రాజెక్టు అంటే నిజమని.. ఎవరు అడ్డుపడ్డా వచ్చే వానాకాలానికి కాళేశ్వరం నీళ్లు హుస్నాబాద్‌కు వస్తాయని స్పష్టం చేశారు. నిర్వాసిత కుటుంబాలకు ప్రభుత్వం తరపున పూర్తి సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు. మిడ్‌మానేరు ప్రాజెక్టు నిర్మాణం 95 శాతం పూర్తయిందని తెలిపారు. మిడ్‌మానేరులో 25 టీఎంసీలు నింపేలా నిర్మాణం పూర్తయినందనీ, నెలాఖరులోగా మిడ్‌మానేరు రెడీ అవుతుందన్నారు. ఇప్పటికే 5 టీఎంసీల నీటిని నిల్వ ఉంచగలిగామన్నారు. గత ప్రభుత్వాలు రైతుల బాగు కోసం పాటుపడలేదన్నారు. ఆ ప్రభుత్వాల నిర్లక్ష్యానికి నిదర్శనం శనిగరం మధ్యతరహా ప్రాజెక్టు అన్నారు. 128 ఏండ్ల చరిత్ర కలిగిన శనిగరం ప్రాజెక్టును రూ.22 కోట్లతో టీఆర్‌ఎస్ ప్రభుత్వం ఆధునీకరిస్తుందన్నారు. శనిగరం ప్రాజెక్టును కాళేశ్వరం ప్రాజెక్టుతో అనుసంధానం చేస్తామన్నారు.


రేగొండ వద్ద సర్జిపుల్‌ను పరిశీలిస్తున్న మంత్రి హరీశ్‌రావు. చిత్రంలో ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ ఉన్నారు.

తగిన వేతనం ఇవ్వాలి సార్

'మా చేతులు పొక్కులొస్తున్నాయి సార్.. మాకు తగినంత వేతనం ఉండేలా ఏదైన పరిష్కారం చెయ్యండి సార్' అని ఉపాధి హామీ కూలీలు మంత్రి హరీశ్‌రావును కోరారు. పక్కనే ఉన్న కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు వినోద్‌కుమార్ స్పందిస్తూ రేపు పార్లమెంట్ సభలో ఉపాధి హామీపై చర్చిస్తానని చెప్పారు.

24 గంటల కరెంట్ వద్దు..

వ్యవసాయానికి 24 గంటల కరెంట్ వద్దనీ, 12 గంటలు మాత్రమే చాలని సిద్దిపేట నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, సర్పంచులు, ఎంపీటీసీలు ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఈ మేరకు బుధవారం భారీ నీటి పారుదల శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావును కలిసి వినతి పత్రం అందజేశారు. సర్కారు 24 గంటల కరెంట్ ఇవ్వడం అభినందనీయమనీ, అయినా, నిరంతరం కరెంట్ ఉండడంతో బోరు మోటర్లు బంద్ చేయకపోవడంతో భూగర్భ జలాలు అడుగంటుతున్నాయన్నారు. వేసవి కాలం ముగిసే దాకా 12 గంటలే ఇవ్వాలని వినతిపత్రంలో కోరారు.


ధర్మపురిలో స్వామివారల రథోత్సవం, పాల్గొన్న భక్తులు

కనులపండువలా రథోత్సవం

ధర్మపురి టౌన్: ధర్మపురి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం యోగానంద లక్ష్మీ నృసింహస్వామి, వేంకటేశ్వర స్వామి, రామలింగేశ్వర స్వామివారల రథోత్సవాన్ని కనుల పండువులా నిర్వహించారు. మధ్యాహ్నం 3గంటలకు ప్రధాన ఆలయాల నుంచి స్వామివార్ల ఉత్సవ మూర్తులకు పూజలు చేశారు. అనంతరం ఆలయం నుంచి వరాహ తీర్థం (చింతామణి చెరువు) దాకా రథోత్సవం నిర్వహించగా భక్తులు గోవిందనామ స్మరణలతో వెంట తరలివచ్చారు. మహిళలు మంగళ హారతులు పట్టారు.



శ్రీశైలంలో శృంగేరి పీఠాధిపతి

అచ్చంపేట, నమస్తే తెలంగాణ: శ్రీశైలం మల్లికార్జున స్వామిని జగద్గురు శంకరాచార్య శృంగేరి శారదాపీఠాధిపతి శ్రీ జగద్గురు విధుశేఖర భారతీస్వామి గురువారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ రాజగోపురం వద్ద సంప్రదాయాన్ని అనుసరించి అర్చక స్వాములు, వేద పండితులు, అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.

దేశం చూపు.. తెలంగాణ వైపు

- వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి లక్ష్మారెడ్డి

జడ్చర్ల, నమస్తే తెలంగాణ: దేశం చూపు.. తెలంగాణ అభివృద్ధి వైపే ఉందని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి డాక్టర్ లక్ష్మారెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలంలో బుధవారం నిర్వహించిన పలు కార్యక్రమాలకు మంత్రి హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో కుల వృత్తుల సంక్షేమానికి తగిన ప్రాధాన్యం కల్పిస్తూనే సర్కారు సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారు. విద్యా, వైద్య రంగం అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు అమోఘమని కొనియాడారు. సీఎం కేసీఆర్ పనితీరుకు దేశంలోని అన్ని రాజకీయ పార్టీలు జేజేలు పలుకుతున్నాయని అన్నారు. అంతకుముందు 77 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి చెక్కులను అందజేశారు.


మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో మాట్లాడుతున్న మంత్రి లక్ష్మారెడ్డి

సబ్బండ వర్ణాల అభివృద్ధికి కృషి

- మంత్రి జూపల్లి కృష్ణారావు


కొల్లాపూర్‌లో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

కొల్లాపూర్‌టౌన్: చాలా ఏళ్లుగా పట్టణాల్లో అభివృద్ధి పనులు నిర్మాణానికి నోచుకోలేదని, తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటయ్యాక సబ్బండ వర్ణాల అభివృద్ధి పనులను చేస్తున్నదని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ పట్టణంలో రూ.10.50కోట్ల వ్యయంతో చేపట్టనున్న అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణ పనులకు మంత్రి భూమిపూజ చేశారు. అభివృద్ధి నిర్మాణ పనులను వేగవంతంగా చేపట్టాలని ఆదేశించారు. మిషన్ భగీరథ పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు.

గణపసముద్రం నింపిన చరిత్ర మాదే

- ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు నిరంజన్‌రెడ్డి

వనపర్తి, నమస్తే తెలంగాణ ప్రధాన ప్రతినిధి: ఖిల్లాఘణపూర్ బ్రాంచ్ కెనాల్ పనులను కేవలం 11 నెలల 3 రోజుల్లోనే పూర్తిచేసి.. వేసవిలో గణపసముద్రాన్ని నింపిన చరిత్ర తమదేనని, ఈ వాస్తవాన్ని ఎవరూ కాదనలేరని ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి చెప్పారు. దశాబ్దాల తరబడి చేపడితేనే ప్రాజెక్టులన్నట్టుగా సమైక్యపాలకులు వ్యవహరించారని విమర్శించారు. 36 ఏండ్ల తర్వాత గణపసముద్రం అలుగుపారిన సందర్భంగా గ్రామస్థులు బుధవారం సాగునీటి సంబురం జరుపుకొన్నారు. అంతకుముందు ఖిల్లాఘణపురం వచ్చిన నిరంజన్‌రెడ్డికి మహిళలు బోనాలతో ఘనస్వాగతం పలికారు. గణపసముద్రం అలుగు వద్ద గంగమ్మకు పూజలుచేసిన నిరంజన్‌రెడ్డి.. అనంతరం మాట్లాడారు. టీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏర్పాటుచేస్తున్న సాగునీటి వనరులకు చెందిన నదుల నీటిలో కాంగ్రెస్ గల్లంతుకావడం ఖాయమని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీలు కృష్ణానాయక్, శంకర్ నాయక్, జడ్పీటీసీ రమేశ్ గౌడ్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు నిరంజన్‌రెడ్డి

యాదాద్రి జిల్లా సైదాపూర్ గుట్టల్లో రాములోరి ఆలయం..!

- దేశంలోనే రెండో విగ్రహం
- సీతారామునికి నిత్య పూజలు ప్రారంభం
- చరిత్ర పరిశోధకులకు ఆశ్చర్యం కలిగిస్తున్న నిర్మాణం
- భద్రాచలం కన్నా పురాతనమని నిర్ధారణ

యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి, నమస్తేతెలంగాణ: యాదాద్రి భువనగిరి జిల్లా సైదాపురం గ్రామ శివారులో మల్లన్నబోడులు గుట్టల్లో రెండు రోజుల కిందట రామాలయం బయటపడింది. రాతిగుండుపై సీతారాముల అర్ధశిల్పం చెక్కి ఉండగా, ఇది దేశంలోనే రెండో అరుదైనదిగా పురావస్తు పరిశీలకులు చెబుతున్నారు. మల్లన్నబోడులు పక్కనే వ్యవసాయం చేస్తున్న పల్లె పాటి మల్లేశ్ పశువులు తప్పిపోగా, వాటిని వెతుక్కుంటూ గుట్టపైకి వెళ్లిన ఆయనకు ఈ ఆలయం కనిపించింది. ఇది ప్రచారం కావడంతో ఆలయానికి భక్తుల తాకిడి పెరిగింది. యాదాద్రి దేవస్థానం ప్రధానార్చకులు నల్లందీగల్ లక్ష్మీనరసింహాచార్యులు, కారంపూడి నర్సింహాచార్యులు తదితర అర్చక బృందం ఆలయాన్ని సందర్శించి, విగ్రహాలు రాములవారివని తేల్చడంతో చుట్టుపక్కల గ్రామాల్లో సందడి నెలకొంది. కేసీఆర్ చొరవతో యాదాద్రి ఇప్పుడిప్పుడే తెలంగాణకు తలమాణికంగా రూపుదిద్దుకుంటూ ఆధ్యాత్మిక నగరిగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో మరో రామాలయం వెలుగులోకి రావడంతో దీనికి ప్రాధాన్యం సంతరించుకుంది. దీనికి కారంపూడి ప్రసాదాచార్యులును అర్చకులుగా నియమించి, నిత్యపూజలు చేయిస్తున్నారు. ఈ ఆలయాన్ని బుధవారం కొత్త తెలంగాణ చరిత్ర బృందం సభ్యులు హరగోపాల్ సారథ్యంలో శిల్పాల ప్రతిమలను పరిశీలించారు.



సైదాపురంలో వెలుగులోకి వచ్చిన రాములోరి ఆలయం, (ఇన్‌సెట్) శ్రీరాముని పాదాలు


శాసనాలను చూపిస్తున్న అర్చకులు ప్రసాదాచార్యులు

భద్రాచలం కన్నా పురాతనమైనది

భద్రాచల రాముని శిల్పం 17వ శతాబ్దం నాటిది కాగా, ఇక్కడి శాసనాల్లో కన్పిస్తున్న లిపిని బట్టి ఇవి 16వ శతాబ్దకాలం నాటిదని తెలుస్తున్నది. ఈ రాములోరి విగ్రహానికి నాలుగు చేతులు, ముందరి కుడి చేయి అభయహస్తంగా, బొటనవేలు, చూపుడు వేళ్ల మధ్య బాణంతో వుంది. ముందరి ఎడమ చేయి ఎడమ భుజం మీద ఉన్న విల్లును పట్టుకున్నట్టుగా చెక్కి ఉంది. వెనక కుడిచేతిలో శంఖం, వెనక ఎడమ చేతిలో చక్రం ఉన్నాయి. ఫలంభాసనంలో కూర్చున్న రాముని ఎడమ తొడపై సీతాదేవి కూర్చుని ఉండగా, ఇటువంటి శిల్పం ఒక్క భద్రాచలంలోనే ఉంది. గుడి లోపల కూడా పానవట్టం ఉంది. ఈ దేవాలయానికి రక్షణగా ప్రకృతి సహజంగా ఉన్న రాతిగుండ్లే కాక చిన్న ద్వారం, ఒక రాతిగోడ కట్టి ఉన్నాయి. గుడికి ఉత్తరాన ఉన్న చిన్న రాతిగుండు మీద చెక్కిన రెండు వరుసల లేఖనం ఉంది. 5 అడుగుల ఎత్తున్న సైదాపురం సీతారాముని శిల్పం అర్ధశిల్పంగా చెక్కి ఉండడంతో, పూర్తిగా విగ్రహంగా చెక్కబడి భద్రాచల రాముని శిల్పం కన్నా ఈ విగ్రహమే ముందుదని తెలుస్తున్నది.

టీఆర్‌ఎస్‌లో భారీగా చేరికలు


రంగారెడ్డి జిల్లా కడ్తాల్‌లో టీఆర్‌ఎస్‌లో చేరిన వారికి పార్టీ కండవాలు కప్పుతున్న ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి


నిజామాబాద్ జిల్లా బోధన్‌లో ఎమ్మెల్యే షకీల్ సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరుతున్న కాంగ్రెస్ నాయకులు

నమస్తే తెలంగాణ, నెట్‌వర్క్ : టీఆర్‌ఎస్‌లో చేరికలు కొనసాగుతున్నాయి. బుధవారం మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం గొల్లపల్లి పంచాయతీలోని స్టేషన్ తండాకు చెందిన 50 మంది లంబాడీలు టీఆర్‌ఎస్‌లో చేరగా, మంత్రి లక్ష్మారెడ్డి వారికి కండువాలు పార్టీలోకి ఆహ్వానించారు. రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండల కేంద్రానికి చెందిన స్వర్ణకారుల సంఘం అధ్యక్షుడు రాఘవచారితోపాటు, వివిధ పార్టీలకు చెందిన పలువురు యువకులు ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి సమక్షంలో, అలాగే తిమ్మాపూరు గ్రామానికి చెందిన ఆయా పార్టీల నాయకులు ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరారు. నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణంలో ఎమ్మెల్యే మహ్మద్ షకీల్ సమక్షంలో నియోజవర్గంలోని ఎడపల్లి, నవీపేట్, కెంజల్ మండలాలకు చెందిన కాంగ్రెస్,టీడీపీ నాయకులు, కార్యకర్తలు సుమారు 300మంది టీఆర్‌ఎస్‌లో చేరారు. హైదరాబాద్‌లోని యూసుఫ్‌గూడ డివిజన్‌కు చెందిన వందలాది మంది మహిళలు ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ సమక్షంలో టీఆర్‌ఎస్ పార్టీలో చేరారు.

టీఆర్‌ఎస్ నేత దారుణ హత్య

- భోజనం చేస్తుండగానే కత్తిపోట్లు
- మృతుడు ఎంపీటీసీ భర్త .. పాతకక్షలే కారణం?


బీనవేని దేవయ్య(ఫైల్)

గంభీరావుపేట: టీఆర్‌ఎస్ నేత, రాజన్న సిరిసిల్ల జిల్లా కొత్తపల్లి గ్రామ ఎంపీటీసీ చంద్రకళ భర్త బీనవేని దేవయ్య(42) దారుణ హత్య బుధవారం జిల్లాలో సంచలనం సృష్టించింది. ప్రత్యక్ష సాక్షులు, పోలీసుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన తార్క శ్రీనివాస్ తన కూతురు పుట్టు వెంట్రుకల శుభకార్యానికి దేవయ్యను ఆహ్వానించాడు. సాయంత్రం 4గంటల ప్రాంతంలో మొదటి అంతస్తులో సామూహిక భోజనం చేస్తున్న సమయంలో అదే గ్రామానికి చెందిన వంగ సందీప్‌రెడ్డి అనే యువకుడు దేవయ్యను పలకరిస్తూనే అకస్మాత్తుగా కత్తితో దాడి చేశాడు. భీతావహుడైన దేవయ్య 'రక్షించండి'.. అంటూ మెట్లు దిగుతుండగా వెంటాడి మరోసారి ఛాతిలో పొడవగా, దేవయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ హఠాత్పరిణామానికి అక్కడే ఉన్న గ్రామస్థులు నిశ్చేష్టులయ్యారు. విషయం తెలుసుకున్న డీఎస్పీ వెంకటరమణ, సీఐలు రవీందర్, శ్రీనివాసరావులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. హత్య జరిగిన తీరు తెలుసుకున్నారు. ప్రస్తుతం నిందితుడు పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం. మృతునికి భార్య చంద్రకళ, కుమారులు అన్వేష్, ప్రఫుల్ ఉన్నారు. విషయం తెలుసుకున్న వివిధ మండలాల టీఆర్‌ఎస్ నేతలు, ప్రజాప్రతినిధులు భారీగా అక్కడకు చేరుకున్నారు.

ఎంపీటీసీపై హత్యాయత్నం

మేళ్లచెర్వు : సూర్యాపేట జిల్లా చింతలపాలెం మండలం తమ్మారం ఎంపీటీసీ సభ్యురాలు లకావత్ సుభద్రపై బుధవారం హత్యాయత్నం జరిగింది. సుభద్ర భర్త లకావత్ రామారావు కూడా చింతలపాలెం ఎంపీటీసీ సభ్యుడిగా, టీఆర్‌ఎస్ చింతలపాలెం మండలాధ్యక్షుడుగా పని చేస్తున్నాడు. వీరి స్వగ్రామం పీక్యానాయక్ తండాకు చెందిన భూక్యా గోపి అనే యువకుడు మేళ్లచెర్వులో నివసిస్తున్న ఎంపీటీసీ దంపతుల ఇంటికి వచ్చి, రామారావుతో పని ఉందని పలుమార్లు తలుపుతట్టాడు. ఈక్రమంలో అతనిపై అనుమానమొచ్చిన సుభద్ర కొంత సేపటి తర్వాత తలుపు తీయగా, ఆమెపై గోపి కత్తితో దాడి చేశాడు. సుభద్రకు గాయాలయ్యాయి. దాడికి పాతకక్షలే కారణంగా తెలుస్తున్నది. బాధితురాలి ఫిర్యాదు మేరకు నిందితుణ్ని పోలీసులు అదుపులోకి తీసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రైలు ప్రమాదాల్లో నలుగురి దుర్మరణం

హసన్‌పర్తి(వరంగల్): వరంగల్ అర్బన్ జిల్లా హసన్‌పర్తి మండలం ఎల్లాపూర్ శివారు హసన్‌పర్తి రైల్వేస్టేషన్‌లో బుధవారం తెల్లవారుజామున జరిగిన రైలు ప్రమాదంలో మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన సురేశ్ సహారి(21), వికాస్(20) మృతి చెందినట్టు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపారు. రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. మధ్యప్రదేశ్‌లోని శివుని జిల్లా కుర్రై మండలం మేటవానికి చెందిన సురేశ్‌సహారి, వికాస్ తన స్నేహితులైన సప్నిల్‌చంద్ర, సుధీర్, సాసి, సూపర్‌వైజర్ కార్తీక్ విశ్వకర్మ, మరోవ్యక్తితో కలిసి వరంగల్‌లో ఎన్‌హెచ్ మార్కింగ్ పనుల కోసం బుధవారం తెల్లవారుజామున నాగ్‌పూర్ నుంచి రైలులో బయలుదేరారు. మార్గమధ్యలో ఎల్లాపూర్ శివారు హసన్‌పర్తి రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫాంకు రైలు చేరుకుంది. వికాస్ స్టేషన్ పేరు చూసేందుకు రైలు ఫుట్‌పాత్ మీదకు వచ్చి తొంగిచూస్తుండగా రైలు జట్కా కొట్టింది. ప్రమాదవశాత్తు కిందపడుతున్న వికాస్‌ను కాపాడే ప్రయత్నంచేసిన సురేశ్‌సహారి ప్లాట్‌ఫాం సందులో ఇరుక్కొని అక్కడికక్కడే ప్రాణాలు విడిచాడు. తీవ్రంగా గాయపడ్డ వికాస్‌ను ఎంజీఎంకు తీసుకెళ్లగా చికిత్సపొందుతూ మృతిచెందాడు.

రైళ్ల కిందపడి ఇద్దరి మృతి

వికారాబాద్ టౌన్: వికారాబాద్ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం గుర్తు తెలియని రైళ్ల కింద పడి యువకుడు, మహిళ మృతిచెందారు. వివరాల్లోకి వెళితే.. వికారాబాద్ మెయిన్ లైన్ వద్ద గుర్తు తెలియని యువకుడు(30), సదాశివపేట రోడ్డు సమీపంలో 40ఏండ్ల మహిళ రైలు కింద పడి మృతి చెందారు. రెండు మృతదేహాలు వికారాబాద్ దవాఖాన మార్చురీలో భద్రపరిచారు.

గిరిజన యువతిపై లైంగికదాడి

ఇచ్చోడ: ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలం గుండివాగులో పంట చేనులో ఒంటరిగా పని చేస్తున్న గిరిజన యువతి(20)పై కలప స్మగ్లర్ లైంగికదాడి చేశాడు. ఎ స్సై రాజు కథనం మేరకు.. ఇచ్చోడ మండలం గుండివాగు గ్రామానికి చెందిన గిరిజన యువతి తమ చేనులో పత్తి ఏరడానికి వెళ్తున్నానని తల్లిదండ్రులకు చెప్పి ఒంటరిగా వెళ్లింది. చేల్లో పత్తి ఏరుతున్న సమయంలో అటుగా వెళ్తున్న కేశవపట్నం గ్రామానికి చెందిన ఈస అనే కలప స్మగ్లర్ ఆమెపై లైంగికదాడి చేశాడు. బాధితురాలు మంగళవారం రాత్రి స్థానిక ఠాణాలో ఫిర్యాదు చేసింది. నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు ఎస్సై వివరించారు.

ఈ అమ్మాయిలు బంగారం

ముస్కాన్, ప్రమీలాకు స్వర్ణం.. ఆసియాకప్ ఆర్చరీ

న్యూఢిల్లీ: ఆసియాకప్ ఆర్చరీలో భారత ఆర్చర్లు ముస్కాన్ కిరార్, ప్రమీలా దైమరీ పసిడి పతకాలతో అదురగొట్టారు. బుధవారం జరిగిన మహిళల కాంపౌండ్ ఈవెంట్ ఫైనల్లో ముస్కాన్ 139-136తో జకారియా నదీరా(మలేసియా)ను ఓడించి స్వర్ణ పతకాన్ని దక్కించుకుంది. రికర్వ్ ఈవెంట్ ఫైనల్లో ప్రమీలా 7-3తో ఎడ్రినీవా నటాలియా(రష్యా)ను ఓడించి పసిడి పతకాన్ని ఒడిసిపట్టుకుంది. మిగతా విభాగాల్లో మధు విద్వాన్, గౌరవ్ త్రాంబక్ లాంబె కాంస్య పతకాలు సొంతం చేసుకున్నారు. యశ్వి ఉపాధ్యాయ్, దివ్య దయాల్, హిరవాలే మ్రినాల్ వేర్వేరు విభాగాల్లో క్వార్టర్స్‌లోనే నిష్క్రమించారు.


ముస్కాన్


ప్రమీలా

బంపర్ బొనాంజ

ఆడినోడికి ఆడినంత

ఏ ప్లస్ ఆటగాళ్లకు రూ.7కోట్లు.. ఏ గ్రేడ్ ఆటగాళ్లకు రూ.5 కోట్లు

క్రికెటర్లకు భారీగా వేతనాల పెంపు.. జాబితా ప్రకటించిన సీవోఏ


బుమ్రా


భువనేశ్వర్

ముంబై: భారత క్రికెటర్లకు బీసీసీఐ బంపర్ బొనాంజ. భారత కెప్టెన్ విరాట్ కోహ్లీ, కోచ్ రవిశాస్త్రి గతంలో చేసిన డిమాండ్లకు అనుగుణంగా, క్రికెట్ పాలక మండలి ప్రతిపాదనల మేరకు..బోర్డు క్రికెటర్ల వార్షిక వేతనాలను భారీగా పెంచింది. ఈ మేరకు అక్టోబర్ 2017 నుంచి సెప్టెంబర్ 2018 వరకు కాంట్రాక్టు జాబితాను బుధవారం ప్రకటించింది. గతంలో ఏ కేటగిరీ ఆటగాళ్లకు ఇచ్చే రూ.2కోట్ల ఒప్పంద వేతనాన్ని అమాంతం 350శాతం పెంచి దాన్ని రూ.7కోట్లు చేసింది. కొత్తగా ఏ ప్లస్ కేటగిరీని తీసుకొచ్చి అందులో ఐదుగురు ప్రధాన ఆటగాళ్లకు పై మొత్తాన్ని చెల్లించనున్నది. విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ, శిఖర్ ధవన్, భువనేశ్వర్‌కుమార్, జస్ప్రిత్ బుమ్రా ఏ ప్లస్ జాబితాలో ఉన్నారు. ఇక మాజీ కెప్టెన్ మహేంద్రసింగ్‌ధోనీ టెస్టుల నుంచి రిటైర్ అవడంతో, రవిచంద్రన్ అశ్విన్ టెస్ట్ ఫార్మాట్‌కే పరిమితమవడంతో ఈసారి టాప్ జాబితా నుంచి తొలగించి ఏ గ్రేడ్‌లో చేర్చారు. వీరికి రూ. 5కోట్లు దక్కనున్నాయి. బీ కేటగిరీకి రూ. 3కోట్లు, సీ కేటగిరీలోని క్రికెటర్లకు రూ.1 కోటి చొప్పున బోర్డు చెల్లించనున్నది. తాజాగా అమ్మాయిలతో వివాహేతర సంబంధం కలిగి ఉన్నాడన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న మహ్మద్ షమీ పేరును హోల్డ్‌లో పెట్టిన బోర్డు, యువరాజ్, రిషబ్ పంత్‌ను పక్కనపెట్టింది. క్రికెటర్లను వివిధ కేటగిరీల్లో పెట్టడానికి గల కారణాలను కూడా బోర్డు వెల్లడించింది. మూడు ఫార్మాట్లు ఆడిన వారిని ఏ ప్లస్ కేటగిరీలో చేర్చామని, ఒక్క ఫార్మాటైనా ఆడిన క్రికెటర్లను ఏలో , మూడు ఫార్మాట్లలోకి వస్తూ పోతూ ఉన్న క్రికెటర్లను బీ, గత ఏడాది కాలంగా ఒక్క మ్యాచ్ అయినా ఆడిన వారిని సీ కేటగిరీలో చేర్చినట్లు బీసీసీఐ ప్రతినిధి ఒకరు తెలిపారు.


కోహ్లీ

మహిళా క్రికెటర్లకూ కాసుల వర్షం

భారత మహిళా క్రికెటర్లనూ ఏ, బీ తో పాటు ఈసారి కొత్తగా సీ గ్రేడ్‌ను చేర్చారు. మూడు గ్రేడ్లకు వరుసగా రూ.50లక్షలు, రూ.30లక్షలు, రూ.10లక్షలు వార్షిక ఒప్పంద వేతనం చెల్లిస్తుంది. మిథాలీరాజ్, హర్మన్, జులన్ గోస్వామి, స్మృతి మంధనను ఏ గ్రేడ్‌లో చేర్చారు.

ఏ+	(రూ.7కోట్లు)	:	కోహ్లీ, రోహిత్, ధవన్, భువనేశ్వర్, బుమ్రా
ఏ	(రూ.5కోట్లు)	:	ధోనీ, అశ్విన్, విజయ్, రహానే, పుజారా, జడేజా, సాహా
బీ	(రూ.3కోట్లు)	:	రాహుల్, ఉమేశ్, కుల్దీప్, చహల్, పాండ్య, ఇషాంత్, దినేశ్
సీ	(రూ.1కోటి)	:	జాదవ్, మనీశ్, అక్షర్, కరుణ్, రైనా, పార్థివ్, జయంత్

షమీకి బీసీసీఐ షాక్

ఒకవైపు భార్య ఆరోపణలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న షమీకి బీసీసీఐ షాకిచ్చింది. హసిన్ జహా ఆరోపణలు రోజంతా మీడియాలో రావడం.. వివాహేతర సంబంధాలు, అమ్మాయిలతో అసభ్య సందేశాలు సామాజిక మాధ్యమాల్లో వెల్లడి కావడంతో ముందు జాగ్రత్తగా బీసీసీఐ అతన్ని కాంట్రాక్టు జాబితా నుంచి తప్పించింది. దక్షిణాఫ్రికాలో ముగిసిన జొహన్నెస్‌బర్గ్ టెస్టులో కీలక వికెట్లు పడగొట్టి జట్టుకు విజయాన్నందించాడు. గాయాలతోనే వన్డే జట్టులోకి వస్తు పోతూ స్వింగ్ బౌలింగ్‌తో టీమ్ ఇండియాలో కీలక బౌలర్‌గా మారాడు. ఈసారి కాంట్రాక్టుల్లో అతనికి కూడా భారీగానే దక్కొచ్చన్న అంచనాల నేపథ్యంలో భార్య ఇచ్చిన షాక్‌కు అతనికి దిమ్మ తిరిగింది.

గెలిచి.. నిలుస్తారా?

నేడు బంగ్లాదేశ్‌తో భారత్ టీ20 మ్యాచ్.. ఒత్తిడిలో టీమ్‌ఇండియా

సంచలనం కోసం బంగ్లా ఆరాటం

రాత్రి 7 గంటల నుంచి డీ-స్పోర్ట్, డీడీ స్పోర్ట్స్‌లో


ధవన్
రోహిత్

ముక్కోణపు టోర్నీలో భారత యువ జట్టుకు మరో పరీక్ష.. తమకంటే తక్కువస్థాయి ప్రత్యర్థులతో పోరాటం.. టీమ్‌ఇండియాలో చోటు కోసం ఎదురుచూస్తున్న కుర్రాళ్లకు మరో అద్భుత అవకాశం.. తప్పులను సరిదిద్దుకుని సత్తా చాటితే టార్గెట్ ప్రపంచకప్ జట్టు లక్ష్యం నెరవేరుతుంది.. లేదంటే మళ్లీ రిజర్వ్ బెంచ్‌కే పరిమితం.. ఈ నేపథ్యంలో నేడు జరిగే రెండో టీ20 లీగ్ మ్యాచ్‌లో భారత్.. బంగ్లాదేశ్‌తో అమీతుమీ తేల్చుకోనుంది. ప్రస్తుతం రెండు జట్లది ఒకే పరిస్థితి. స్వదేశంలో వరుసగా మూడు సిరీస్‌లు చేజార్చుకున్న ఒత్తిడిలో బంగ్లా.. తొలి మ్యాచ్ ఓటమితో ఆత్మవిశ్వాసలేమితో రోహిత్‌సేన.. మరి ఈ మ్యాచ్‌లో పుంజుకునేదెవరు? మ్యాచ్ గెలిచేదెవరు? వేచి చూడాలి..!

కొలంబో:

ఓవైపు బౌలర్ల అనుభవలేమి.. మరోవైపు ఇద్దరు కీలక ఆటగాళ్ల ఫామ్‌లేమి.. వచ్చిన అవకాశాలను ఒడిసిపట్టుకోలేకపోతున్న కుర్రాళ్లు.. వెరసి ముక్కోణపు టీ20 టోర్నీలో భారత్ రెండో లీగ్ మ్యాచ్‌కు సిద్ధమైంది. గురువారం ప్రేమదాస స్టేడియంలో జరిగే ఈ మ్యాచ్‌లో సంచలనాలకు మారుపేరైన బంగ్లాదేశ్‌తో ఢీకొననుంది. అరడజను మంది కీలక ఆటగాళ్లకు విశ్రాంతి ఇవ్వడంతో జట్టులోకి యువరక్తం వచ్చి చేరినా.. అంచనాలను అందుకోవడంలో అందరూ విఫలమయ్యారు. దీంతో వన్డే ప్రపంచకప్ సన్నాహకాల్లో ఉన్న టీమ్‌ఇండియా మేనేజ్‌మెంట్ ముందు ఇప్పుడు కొత్త సవాళ్లు వచ్చి చేరాయి. తొలి మ్యాచ్ ఓటమితో పాయింట్ల పట్టికలో ఖాతా తెరువలేకపోయిన టీమ్‌ఇండియా ఫైనల్ ఆశలు క్లిష్టం కాకుండా ఉండాలంటే ఈ మ్యాచ్‌లో కచ్చితంగా గెలిచి తీరాలి. లేదంటే చివరి రెండు మ్యాచ్‌ల్లో కచ్చితంగా గెలిచి తీరాల్సిన పరిస్థితులు తలెత్తుతాయి. ఈ ఫార్మాట్‌లో గతంలో బంగ్లాతో తలపడిన 5 మ్యాచ్‌ల్లో భారతే గెలిచింది.

మార్పులు చేస్తారా!

ఈ మ్యాచ్ కోసం తుది జట్టులో మార్పులు చేస్తారా? లేదా? అన్నది ఆసక్తికరంగా మారింది. పొట్టి ఫార్మాట్‌లో స్టార్ ప్లేయర్ అయినా లోకేశ్ రాహుల్‌కు అవకాశం ఇవ్వకపోవడం తప్పుగా కనిపిస్తున్నది. దీంతో రిషబ్ స్థానంలో అతనికి అవకాశం ఇస్తారా లేదా చూడాలి. రెగ్యులర్ ఓపెనర్లలో ధవన్ దంచుతున్నా.. రోహిత్ నిరాశజనక ఫామ్ ఆందోళన కలిగిస్తున్నది. ఆరంభం నుంచే దూకుడుగా ఆడాలన్న ఉద్దేశంతో ఈ ముంబైకర్ అనవసరంగా వికెట్ పారేసుకుంటున్నాడు. ఇక భారీ అంచనాలు పెట్టుకున్న రైనా తన బలహీనతలను బహిర్గతం చేసుకుంటున్నాడు. తొలి మ్యాచ్‌లో వికెట్లను విడిచి ఆడటమే ఇందుకు నిదర్శనం. మనీష్ పాండే ఫర్వాలేదనిపిస్తున్నా.. భారీ ఇన్నింగ్స్ ఆడే సత్తా అతనిలో కొరవడింది. టీ20లకు సరిపోయే పవర్ హిట్టింగ్ షాట్లు అతని బ్యాట్ నుంచి రావడం లేదు. టాప్ ఆర్డర్‌లో ఒక్క ధవన్ మినహా అందరూ చెత్త షాట్లకు ఔట్‌కావడం మేనేజ్‌మెంట్‌కు తలనొప్పిగా మారింది. దినేశ్ కార్తీక్‌కు మరో అవకాశం దక్కొచ్చు. బౌలింగ్‌లో ముగ్గురు పేసర్లు, ఇద్దరు స్పిన్నర్లతోనే దిగే అవకాశాలున్నాయి. ఫ్రంట్‌లైన్ స్పిన్నర్ చాహల్ కన్నా వాషింగ్టన్ సుందర్ మంచిమార్కులు కొట్టేశాడు. అయినప్పటికీ అక్షర్ పటేల్‌కు ఓ అవకాశం ఇస్తే బాగుంటుందన్నది విశ్లేషకుల వాదన. పేసర్లలో శార్దూల్ ఠాకూర్, విజయ్ శంకర్ వైఫల్యం జట్టును చివరి వరకు వెంటాడింది. పవర్‌ప్లేలో కుశాల్ ధాటికి వీళ్లు బెంబేలెత్తిపోయారు. కాబట్టి హైదరాబాదీ మహ్మద్ సిరాజ్ తుది జట్టులోకి వచ్చే అవకాశాలు కాస్త మెరుగైనట్లే.

బంగ్లా కూడా ఒత్తిడిలోనే..

మరోవైపు ఈ టోర్నీలో మూడో జట్టుగా దిగుతున్న బంగ్లాదేశ్.. ఇటీవలి ట్రాక్ రికార్డు ఏమాత్రం బాగాలేదు. గత నెలలో తమ దేశంలో లంక చేతిలో టెస్టు, వన్డే, టీ20 సిరీస్‌లను చేజార్చుకుని ఒత్తిడిలో పడింది. అయితే పొట్టి ఫార్మాట్‌లో బంగ్లాను తక్కువగా అంచనా వేయడానికి ఏమాత్రం వీల్లేదు. తనదైన రోజున మేటి జట్లను సైతం కంగుతినిపించిన చరిత్ర వాళ్లది. కాబట్టి భారత్ అలసత్వం ప్రదర్శిస్తే మొదటికే మోసం వస్తుంది. వేలి గాయంతో ఆల్‌రౌండర్ షకీబ్ అందుబాటులో లేకపోవడం ప్రతికూలాంశం. తాత్కాలిక కెప్టెన్ మహ్మదుల్లా, సీనియర్ ఆటగాడు తమీమ్ ఇక్బాల్, ముష్ఫికర్ రహీమ్, సౌమ్య సర్కార్, ఇమ్రూల్ కైస్‌లపై బ్యాటింగ్ బలం ఆధారపడి ఉంది. బౌలింగ్‌లో ముస్తాఫిజుర్ అత్యంత కీలకం. టీమ్‌ఇండియా కుర్రాళ్లకు ఇతని నుంచి ముప్పు తప్పదు. రూబెల్ హొస్సేన్, టస్కిన్ అహ్మద్, నజ్ముల్ ఇస్లామ్, హసన్.. ముస్తాఫిజుర్‌కు సహకారం అందిస్తే భారత్‌కు కష్టాలు తప్పవు.

జట్లు (అంచనా)

భారత్: రోహిత్ (కెప్టెన్), ధవన్, రైనా, మనీష్, రిషబ్ / కేఎల్ రాహుల్, కార్తీక్, సుందర్ / అక్షర్ పటేల్, శంకర్, శార్దూల్ / సిరాజ్, ఉనాద్కట్, చాహల్.

బంగ్లాదేశ్: మహ్మదుల్లా (కెప్టెన్), తమీమ్ ఇక్బాల్, సౌమ్య సర్కార్, కైస్, ముష్ఫికర్, షబ్బీర్, ముస్తాఫిజుర్, రొబెల్ హుస్సేన్, టస్కిన్ అహ్మద్, హసన్, లిట్టన్ దాస్ / నజ్ముల్ ఇస్లామ్.

పిచ్, వాతావరణం

మందకొడి వికెట్, లో బౌన్స్. ఆరంభంలో పేసర్లకు అనుకూలం.

ఫైనల్ ఆశలు సజీవం

మలేసియాపై భారత్ గెలుపు



ఇఫో (మలేసియా): అజ్లాన్ షా కప్ హాకీ టోర్నీలో భారత్ ఫైనల్ ఆశలు సజీవంగా నిలిచాయి. బుధవారం జరిగిన లీగ్ మ్యాచ్‌లో 5-1తో మలేసియాపై గెలిచింది. దీంతో ఈ టోర్నీలో తొలిసారి మూడు పాయింట్లను ఖాతాలో వేసుకుంది. టీమ్‌ఇండియా తరపున శీలానంద్ లక్రా (10వ ని.), గుర్జాంత్ సింగ్ (42, 57వ ని.), సుమిత్ కుమార్ (48వ ని.), రమన్‌దీప్ సింగ్ (51వ ని.) గోల్స్ చేశారు. ఫైజల్ సారీ (33వ ని.) మలేసియాకు ఏకైక గోల్ అందించాడు. మ్యాచ్ ఆద్యంతం ఆధిపత్యం చూపెట్టిన భారత్ వచ్చిన అవకాశాలను చక్కగా సద్వినియోగం చేసుకుంది. పాయింట్ల పట్టికలో ఆస్ట్రేలియా (12) టాప్‌లో కొనసాగుతుండగా, అర్జెంటీనా (7), మలేసియా (6), ఇంగ్లండ్ (5), భారత్ (4) వరుసగా రెండు నుంచి ఐదు స్థానాల్లో ఉన్నాయి. భారత్ ఫైనల్‌కు చేరాలంటే శుక్రవారం ఐర్లాండ్‌తో జరిగే మ్యాచ్‌లో భారీ ఆధిక్యంతో గెలువాలి. అదే సమయంలో ఆస్ట్రేలియా.. అర్జెంటీనాను ఓడించడంతో పాటు మలేసియా, ఇంగ్లండ్ మ్యాచ్ డ్రాగా ముగియాలి. అప్పుడు భారత్ ఫైనల్ ఆశలు నెరవేరుతాయి. నాలుగు వరుస పరాజయాలతో ఉన్న ఐర్లాండ్ ఇప్పటికే నాకౌట్ బెర్తుకు దూరమైంది.

భారత షూటర్లకు నిరాశ

న్యూఢిల్లీ: మెక్సికో వేదికగా జరుగుతున్న ఐఎస్ఎస్ఎఫ్ షూటింగ్ ప్రపంచకప్‌లో బుధవారం భారత షూటర్లకు నిరాశ ఎదురైంది. పురుషుల ట్రాప్ ఈవెంట్‌లో భారత షూటర్లు జొరావర్‌సింగ్ సంధు(114), కైనాన్ చినాయ్(107) వరుసగా 32, 44 స్థానాల్లో నిలువగా, మానవ్‌జీత్‌సింగ్ కనీసం అర్హత రౌండ్‌ను అధిగమించలేకపోయాడు. మరోవైపు ట్రాప్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో మానవ్‌జీత్‌సింగ్, శ్రేయాసి సింగ్ జోడీతో పాటు కైనాన్ చినాయ్, సీమా తోమర్ ద్వయం ఫైనల్ పోరులో నిలిచింది. ఇప్పటి వరకు మూడు స్వర్ణాలు, నాలుగు కాంస్యాలతో భారత్ టాప్‌లో కొనసాగుతున్నది.

శతక్కొట్టిన టేలర్

నాలుగో వన్డేలో ఇంగ్లండ్‌పై కివీస్ గెలుపు

డునెడిన్: మిడిల్ ఆర్డర్ బ్యాట్స్‌మన్ రాస్ టేలర్ రికార్డు శతకం (181 నాటౌట్)తో దుమ్మురేపగా..ఇంగ్లండ్‌తో జరిగిన నాలుగో వన్డేలో న్యూజిలాండ్ 5 వికెట్ల తేడాతో విజయం సాధించింది. వన్డేల్లో అత్యధిక వ్యక్తిగత స్కోరు సాధించిన న్యూజిలాండ్ బ్యాట్స్‌మన్ జాబితాలో రెండో స్థానంలో నిలిచాడు. బుధవారం ఇక్కడ జరిగిన నాలుగో వన్డేలో ఇంగ్లండ్ విసిరిన 336 పరుగుల లక్ష్యాన్ని కివీస్ మరో మూడు బంతులు మిగిలి ఉండగానే (49.3 ఓవర్లలో 339/5) ఛేదించి ఐదు మ్యాచ్‌ల సిరీస్‌ను 2-2తో సమం చేసింది. ఐదో వన్డే మార్చి 10న క్రైస్ట్ చర్చ్‌లో జరుగుతుంది. భారీ టార్గెట్‌ను ఛేదించేందుకు బరిలోకి దిగిన న్యూజిలాండ్‌ను ఇంగ్లండ్ బౌలర్లు ఆదిలోనే దెబ్బతీశారు. ఓపెనర్లు గుప్టిల్ (0), మున్రో (0)ను డకౌట్ చేసి కివీస్ శిబిరంలో ఆందోళన రేకెత్తించారు. ఈ దశలో కెప్టెన్ విలియమ్సన్ (45)కు జతకలిసిన రాస్ టేలర్ (147 బంతుల్లో 181 నాటౌట్; 17 ఫోర్లు , 6సిక్స్‌లు) ఇన్నింగ్స్‌ను చక్కదిద్దాడు. కెరీర్‌లో తొలిసారిగా 150 పరుగుల మైలురాయిని చేరుకున్నాడు. గ్రాండ్ హోమ్ (23), నికోలస్ (13 నాటౌట్) సహకారంతో కివీస్‌కు అద్భుతమైన విజయాన్ని అందించాడు. ఇంగ్లండ్ బౌలర్లలో కుర్రన్‌కు 2 వికెట్లు దక్కాయి. అంతకు ముందు టాస్ ఓడి బ్యాటింగ్ చేసిన ఇంగ్లండ్..బెయిర్ స్టో (138), రూట్ (102) శతకాలు సాధించడంతో నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 335 పరుగులు చేసింది. ఓపెనర్ రాయ్ (42) శుభారంభం అందించడంలో తనవంతు పాత్ర పోషించాడు. నిజానికి బెయిర్ స్టో, రూట్ శతకాలు సాధించిన దశలో ఇంగ్లండ్ 400 స్కోరును చేరుతుందని అంతా అనుకున్నారు. కానీ మిడిల్ ఆర్డర్‌లో బట్లర్ (0), మోర్గాన్ (5), స్టోక్స్ (1), అలీ (3), వోక్స్ (3) పెవిన్‌కు క్యూ కట్టడంతో స్కోరు వేగం తగ్గింది. న్యూజిలాండ్ బౌలర్లలో సోధీకి 4, బౌల్ట్, మున్రోలకు చెరో రెండు వికెట్లు దక్కాయి.


(రాస్ టేలర్ 181★)

షమీ.. స్త్రీలోలుడు

చాలామంది అమ్మాయిలతో వివాహేతర సంబంధం

టీమ్ ఇండియా పేసర్‌పై భార్య సంచలన ఆరోపణ

న్యూఢిల్లీ: భారత స్పీడ్‌స్టర్ మహ్మద్ షమీపై అతని భార్య హసిన్ జహా తీవ్ర ఆరోపణలు చేసింది. గత రెండేండ్లుగా షమీతోపాటు అతని కుటుంబసభ్యులు తనను హింసిస్తూ వేధింపులకు పాల్పడుతున్నారని హసిన్ ఆరోపించడంతో దేశవ్యాప్తంగా సంచలనం కలిగించింది. 2014లో టీమ్ ఇండియా పేసర్ మహ్మద్ షమీ(27) .. రెండేండ్ల డేటింగ్ అనంతరం హసిన్ జహాను ప్రేమ వివాహం చేసుకున్నాడు. వీరిద్దరికీ ఓ పాప. కాగా, షమీ వివాహేతర సంబంధాలు గురించి నిలదీయడంతో విడాకుల కోసం అతనితోపాటు అతని సోదరుడు, తల్లి తనను శారీరకంగా మానసికంగా హింసిస్తున్నారంటూ హసిన్ బుధవారం మీడియాకు వెల్లడించడంతోపాటు ఫేస్‌బుక్, ట్విట్టర్లలో అతను అమ్మాయిలతో కొనసాగించిన అసభ్యకర సంభాషణలను.. మెసేజ్‌లను బహిర్గతం చేసింది. షమీ స్త్రీలోలుడని, ఈ విషయాలు తాను తెలుసుకున్నందుకే అతనితోపాటు అతని కుటుంబ సభ్యులు తీవ్రంగా వేధిస్తున్నారని హసిన్ స్పష్టం చేసింది. నన్ను అడ్డుతొలిగించేందుకు చంపడానికి కూడా ప్రయత్నం చేసినట్లు చెప్పడం షాక్ కలిగిస్తున్నది. 'కారులో షమీ మొబైల్ ఫోన్ నాకు దొరికింది. అది ఓపెన్ చేసి చూస్తే నాకు షాక్ తగిలినంతపనైంది. చాలా మంది అమ్మాయిల ఫోటోలతోపాటు అసభ్యకర మెసేజ్‌లు వందలుగా కనిపించాయి. ఈ సందేశాలు చదువడానికి నాకు రాత్రంతా సరిపోలేదు. అప్పుడే నాకు అర్థమైంది. షమీకి ఎంతో మంది అమ్మాయిలతో సంబంధం ఉందని. ఇంతేకాదు..అతనికి పాకిస్థాన్‌కు చెందిన ఓ అమ్మాయితో పెళ్లైంది. దక్షిణాఫ్రికా సిరీస్ ముగిసిన అనంతరం ఆ అమ్మాయి కోసం షమీ పాకిస్థాన్ వెళ్లాడు. అందరు క్రికెటర్ల భార్యలలాగానే నేను కూడా నా భర్త వెంట దక్షిణాఫ్రికా పర్యటనకు వస్తానని చెప్పాను. కానీ నన్ను తీసుకెళ్లేందుకు షమీ నిరాకరించాడు. పర్యటనలలో అతనికి కుల్దీప్ అనే వ్యక్తి అమ్మాయిలను సరఫరా చేస్తాడు. ఈ విషయం బీసీసీఐకి తెలిసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదు' అని హసిన్ తీవ్రంగా మండిపడింది.

న్యాయపరమైన చర్యలు తీసుకుంటా

షమీకి సంబంధించిన అన్ని వివాహేతర సంబంధాలు, అనైతికచర్యలను నిలదీసినందుకే నన్ను వదిలించుకోవాలని షమీ సహా కుటుంబసభ్యులు వేధింపులకు పాల్పడుతున్నట్లు హసిన్ వివరించింది. గతంలో ధర్మశాలలో టీమ్ ఇండియా వన్డే మ్యాచ్ ఆడుతున్న సందర్భంగా నన్ను తీసుకెళ్లమని కోరాను. అందుకు నన్ను తీవ్రంగా దూషించడమే కాకుండా ధర్మశాలకు నుంచి కూడా ఫోన్ చేసి అసభ్యపదజాలంతో తిట్టాడని చెప్పింది. మానసికంగానే కాదు.. శారీరక హింసకూడా ఇటీవలి కాలంలో ఎక్కువైందని.. పాప కోసం ఇవన్నీ భరించినా.. నా సహనం చచ్చిపోయిందని తెలిపింది. విడాకులకు ఒప్పుకోవాలంటూ షమీ సోదరుడు, అతని తల్లి తనను తీవ్రంగా వేధిస్తున్న కారణంతో వారి కుటుంబంపై న్యాయపరమైన చర్యలు తీసుకుంటానని తెలిపింది. అతనికి విడాకులు ఎప్పటికీ ఇవ్వనని..జీవితాంతం విడాకులకు అంగీకరించనని హసిన్ స్పష్టం చేయడం గమనార్హం.


భర్త మహ్మద్ షమీతో హసీన్ జహా

> హాయ్..నేను మహ్మద్ షమీని. నా వ్యక్తిగత జీవితంపై ప్రసార మాధ్యమాలలో నాపై చక్కర్లు కొడుతున్న వార్తలు అబద్ధం. నాపై ఏదో కుట్ర జరుగుతున్నది. ఇదంతా నిజం కాదు. నా క్రికెట్ జీవితాన్ని నాశనం చేసేందుకు ఎవరో ఇదంతా చేస్తున్నారు.
> - మహమ్మద్ షమీ


గంభీర్

ఢిల్లీ డేర్‌డెవిల్స్ కెప్టెన్‌గా గంభీర్

న్యూఢిల్లీ: రానున్న సీజన్ కోసం ఐపీఎల్ జట్ల కెప్టెన్ల నియామకం కొనసాగుతున్నది. ఇప్పటికే పలు జట్లు తమ కెప్టెన్లను ఎంపిక చేసుకోగా, తాజాగా ఢిల్లీ డేర్‌డెవిల్స్ గౌతం గంభీర్‌కు తమ పగ్గాలు అప్పగించింది. బుధవారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఢిల్లీ డేర్‌డెవిల్స్ యాజమాన్యం గంభీర్‌కు కెప్టెన్సీతో పాటు జట్టు అధికారిక జెర్సీని ఆవిష్కరించింది. ఇందులో ఢిల్లీ క్రికెటర్లు నమన్ ఓఝా, మన్‌జ్యోత్ కల్రా పాల్గొన్నారు. 'ఢిల్లీకి కెప్టెన్‌గా వ్యవహరించడాన్ని గౌరవంగా భావిస్తున్నాను. నాపై ఉంచిన బాధ్యతను సక్రమంగా నిర్వర్తిస్తాను. యువకులు, అనుభవజ్ఞులతో జట్టు సమతూకంగా కనిపిస్తున్నది. రికీ పాంటింగ్‌తో కలిసి పనిచేయడానికి ఆసక్తితో ఎదురుచూస్తున్నాను. అంతర్జాతీయ క్రికెట్‌లో అపార అనుభవమున్న పాంటింగ్ సలహాలు, సూచనలు జట్టుకు ఎంతగానో ఉపయోగపడుతాయి' అని గంభీర్ అన్నాడు. గత ఎనిమిది సీజన్లు కోల్‌కతా నైట్‌రైడర్స్‌కు ప్రాతినిథ్యం వహించిన గంభీర్..తిరిగి సొంతగూటికి చేరుకున్నాడు. కోల్‌కతాతో ఇకపై కొనసాగనని ప్రకటన చేయడంతో ఐపీఎల్ వేలంలో రూ.2.8కోట్లకు గౌతీని ఢిల్లీ దక్కించుకున్న సంగతి తెలిసిందే.

'దేవధర్' దక్కేదెవరికో?

కర్ణాటక, భారత్ 'బి' మధ్య ఫైనల్ నేడు

ధర్మశాల: దేవధర్ ట్రోఫీలో ఆఖరి సమరానికి రంగం సిద్ధమైంది. గురువారం జరిగే ఫైనల్లో విజయ్ హజారే చాంపియన్ కర్ణాటక, భారత్ 'బి'తో తలపడుతుంది. కరుణ్ నాయర్ కెప్టెన్సీలోని కర్ణాటక టోర్నీలో వరుస విజయాలతో జోరు మీదున్నది. బ్యాటింగ్‌లో మయాంక్ అగర్వాల్, రవికుమార్ సమర్థ్ మంచి ఫామ్‌మీదుండగా, శ్రేయాస్ గోపాల్..ప్రత్యర్థి పతనాన్ని శాసించడంలో కీలకమవుతున్నాడు. మొత్తంగా అటు బ్యాటింగ్‌తో పాటు బౌలింగ్‌లోనూ అదురగొడుతున్న కర్ణాటక..ఫైనల్లోనూ అదే రీతిలో విజృంభించాలన్న పట్టుదలతో ఉన్నది. మరోవైపు శ్రేయాస్ అయ్యర్ సారథ్యంలోని భారత్ 'బి' టోర్నీలో ఓ గెలుపు, ఓటమి ఎదుర్కొంది. హనుమ విహారి, మనోజ్ తివారీ మంచి ఫామ్‌మీదున్నారు.



వార్నర్‌కు జరిమానా

దుబాయ్: క్రీడా స్ఫూర్తిని మరిచి దక్షిణాఫ్రికా క్రికెటర్ డీకాక్‌తో వ్యక్తిగత దూషణలకు దిగిన ఆస్ట్రేలియా వైస్ కెప్టెన్ డేవిడ్ వార్నర్‌కు జరిమానా పడింది. ఓవైపు సహచరులు వద్దని వారిస్తున్నా..వినకుండా డీకాక్‌ను లక్ష్యంగా చేసుకుంటూ భౌతిక దాడికి ప్రయత్నించిన వార్నర్‌పై ఐసీసీ 75శాతం జరిమానా విధించింది. దీంతో పాటు మూడు డీమెరిట్ పాయింట్లు వార్నర్ ఖాతాలో వేసింది. ఆటగాళ్ల ప్రవర్తన నియామవళి ఆర్టికల్ 2.2.2 ఉల్లంఘిస్తూ లెవల్-2 తప్పిదానికి అతను పాల్పడినట్లు ఐసీసీ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొంది. ఫీల్డ్ అంపైర్లు కుమార ధర్మసేన, సుందర్ రవి, క్రిస్ గాఫెనీ(థర్డ్ అంపైర్), అల్లావుద్దీన్ పాలేకర్(ఫోర్త్ అంపైర్) నివేదికను అనుసరించి మ్యాచ్ రిఫరీ జెఫ్ క్రో ఈ నిర్ణయం తీసుకున్నారు. తనపై విధించిన జరిమానాకు వార్నర్ సమ్మతి తెలిపాడు. మరోవైపు డీకాక్‌పై లెవల్-1 తప్పిదం కింద ఐసీసీ చర్యలకు పూనుకుంది.

విద్య, ఉద్యోగ సమాచారం

ఐఐటీ పాలక్కడ్‌లో ఖాళీలు

పాలక్కడ్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ) నాన్ అకడమిక్ విభాగంలో ఖాళీగా ఉన్న వివిధ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

వివరాలు:

- మొత్తం ఖాళీల సంఖ్య: 34
- డిప్యూటీ రిజిస్ట్రార్-1, అసిస్టెంట్ రిజిస్ట్రార్-3, టెక్నికల్ ఆఫీసర్/కంప్యూటర్ సిస్టమ్ అడ్మినిస్ట్రేటర్-1, జూనియర్ సూపరింటెండ్-6, జూనియర్ టెక్నికల్ సూపరింటెండెంట్/సీనియర్ ప్రొఫెషనల్ అసిస్టెంట్ (లైబ్రరీ)-2, జూనియర్ టెక్నికల్ సూపరింటెండెంట్-6, జూనియర్ టెక్నీషియన్-7, జూనియర్ అసిస్టెంట్-8
- **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ/ బోర్డు నుంచి మాస్టర్ డిగ్రీ, బీఈ/బీటెక్, డిగ్రీ, డిప్లొమా, ఎంసీఏలో ఉత్తీర్ణత. కంప్యూటర్ పరిజ్ఞానంతోపాటు సంబంధిత రంగంలో అనుభవం ఉండాలి.
- **వయస్సు:** 27 ఏండ్లకు మించరాదు. (పోస్టులను బట్టి వేర్వేరు అర్హతలు, వయోపరిమితిలో సడలింపులు ఉన్నాయి)
- **ఎంపిక:** రాతపరీక్ష /ఇంటర్వ్యూ
- **దరఖాస్తు:** ఆన్‌లైన్
- **చివరితేదీ:** ఏప్రిల్ 11
- **వెబ్‌సైట్:** https://iitpkd.ac.in

ఐఎఫ్‌జీటీబీలో

కోయంబత్తూర్‌లోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారెస్ట్ జెనెటిక్స్ అండ్ ట్రీ బ్రీడింగ్ వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

వివరాలు:

ఐఎఫ్‌జీటీబీ అనేది ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ ఫారెస్ట్రీ రిసెర్చ్ అండ్ ఎడ్యుకేషన్ పరిధిలో పనిచేస్తున్న సంస్థ.

- మొత్తం పోస్టుల సంఖ్య: 5
- లోయర్ డివిజన్ క్లర్క్-2, డ్రైవర్-3, ఫారెస్ట్ గార్డ్-1
- **అర్హత:** గుర్తింపు పొందిన బోర్డు/ సంస్థ నుంచి పదోతరగతి, ఇంటర్‌లో ఉత్తీర్ణత.
- పే స్కేల్: రూ. 19,000/-, ఫారెస్ట్ గార్డ్‌కు రూ. 18,000/-
- **ఎంపిక:** రాతపరీక్ష/ ఇంటర్వ్యూ ద్వారా
- **దరఖాస్తు:** ఆఫ్‌లైన్ ద్వారా
- **చివరితేదీ:** మార్చి 28
- **వెబ్‌సైట్:** http://ifgtb.icfre.gov.in

ఎన్‌పీసీఐఎల్‌లో మెడికల్ ఆఫీసర్లు

న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఎన్‌పీసీఐఎల్) మెడికల్ విభాగాల్లో ఖాళీగా ఉన్న మెడికల్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

వివరాలు:

డిపార్ట్‌మెంట్ ఆఫ్ అటామిక్ ఎనర్జీ పరిధిలో పని చేస్తున్న ఎన్‌పీసీఐఎల్‌ను 1987, సెప్టెంబర్ 17న స్థాపించారు.

- మొత్తం పోస్టుల సంఖ్య: 16
- పోస్టు పేరు: మెడికల్ ఆఫీసర్ (స్పెషలిస్ట్-7, జీడీఎంవో-9)
- **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ లేదా సంస్థ నుంచి ఎంబీబీఎస్‌లో ఉత్తీర్ణత.
- ఎంపిక: రాతపరీక్ష/ ఇంటర్వ్యూ
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
- దరఖాస్తులు ప్రారంభం: మార్చి 21
- దరఖాస్తులకు చివరితేదీ: ఏప్రిల్ 19
- వెబ్‌సైట్: www.npcilcareers.co.in

ఎయిమ్స్‌లో కొలువులు

భోపాల్‌లోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్)లో నాన్ ఫ్యాకల్టీ (గ్రూప్ ఏ) పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది.



వివరాలు:

ఎయిమ్స్ అనేది కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ పరిధిలోని స్వతంత్ర సంస్థ. డైరెక్ట్ రిక్రూట్‌మెంట్‌లో భాగంగా కింది ఖాళీలను భర్తీచేస్తున్నారు.

- డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ - 6
- **అర్హతలు:** ఎంసీఐ గుర్తించిన ఎండీ (హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్)/ ఎంహెచ్‌ఏతోపాటు ఎండీ/ఎంఎస్‌లో ఏదైనా క్లినికల్ స్పెషాలిటీ, 200 పడకల వైద్యశాలలో కనీసం మూడేండ్ల అనుభవం ఉండాలి.
- పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ - 1
- **అర్హతలు:** పీజీ/డిప్లొమా ఇన్ పబ్లిక్ రిలేషన్స్ లేదా కార్పొరేట్ కమ్యూనికేషన్ లేదా జర్నలిజం/ఎంసీజేలో ఉత్తీర్ణత.
- అకౌంట్స్ ఆఫీసర్ - 2
- **అర్హతలు:** కనీసం 55 శాతం మార్కులతో కామర్స్‌లో డిగ్రీ ఉత్తీర్ణత. కనీసం మూడేండ్ల అనుభవం ఉండాలి. సీఏ/కాస్ట్ అకౌంటెంట్ / ఎంబీఏ (ఫైనాన్స్) వారికి ప్రాధాన్యం ఇస్తారు.
- లా ఆఫీసర్ - 1
- **అర్హతలు:** డిగ్రీలో లా కోర్సు ఉత్తీర్ణత.
- సీనియర్ డైటీషియన్ (అసిస్టెంట్ ఫుడ్ మేనేజర్) - 1
- **అర్హతలు:** ఎమ్మెస్సీ (హోం సైన్స్ - ఫుడ్ అండ్ న్యూట్రిషన్)లేదా తత్సమాన కోర్సు ఉత్తీర్ణత.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** ఏప్రిల్ 1
- హార్డ్‌కాపీలను పంపడానికి చివరితేదీ: ఏప్రిల్ 11
- **వెబ్‌సైట్:** http://www.aiimsbhopal.edu.in

బామర్ లారీలో

బామర్ లారీ అండ్ కంపెనీ లిమిటెడ్‌లో కింది పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది.

వివరాలు:

బామర్ లారీ భారత ప్రభుత్వ రంగ సంస్థ. ఇది మినీరత్న కంపెనీ.

హెడ్ (ఆపరేషన్స్) - 1, చీఫ్ మేనేజర్ (ఎన్ఐ & డెలివరీ) - 1, సీనియర్ మేనేజర్ (కో ఆర్డినేషన్) - 1, అసిస్టెంట్ కంపెనీ సెక్రటరీ - 1, డిప్యూటీ మేనేజర్ - 1, డిప్యూటీ మేనేజర్ (సేల్స్) - 1, డిప్యూటీ మేనేజర్ (సేల్స్ ఈఈ గ్రేడ్ -1) - 1, అసిస్టెంట్ మేనేజర్ (ఎఫ్ అండ్ ఎఫ్) - 1, అసిస్టెంట్ మేనేజర్ (సేల్స్) - 1, అసిస్టెంట్ మేనేజర్ (గ్రేడ్ ఈ 1 సేల్స్) - 1, అసిస్టెంట్ మేనేజర్ (ఆపరేషన్స్) - 1 ఖాళీ ఉన్నాయి.

దరఖాస్తు: ఆన్‌లైన్‌లో

చివరితేదీ: ఏప్రిల్ 13

వెబ్‌సైట్: www.balmerlawrie.com

ఆర్‌జేసీ సెట్ - 2018

- ఆరు బాలికల, రెండు బాలుర గురుకుల కాలేజీల్లో ప్రవేశాలు
- మొత్తం 840 సీట్లు. ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ గ్రూపులు
- ప్రవేశ పరీక్ష ద్వారా ఎంపిక, ఇంటర్ ఫస్టియర్‌లో ప్రవేశాలు
- అత్యున్నత ప్రమాణాలతో శిక్షణ, ఉచిత విద్య, వసతి, భోజనం

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న గురుకుల (రెసిడెన్షియల్) జూనియర్ కాలేజీల్లో 2018-19 విద్యాసంవత్సరానికిగాను ఇంటర్ మొదటి సంవత్సరం (ఇం.మీ)లో ప్రవేశాల కోసం నిర్వహించే టీఎస్‌ఆర్‌జేసీ సెట్ -2018 నోటిఫికేషన్ విడుదలైంది.



వివరాలు:

తెలంగాణ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్ సొసైటీ (టీఆర్‌ఈఐ) పరిధిలోని 8 జూనియర్ కాలేజీల్లో ఈ ఎంట్రెన్స్ ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. ఎనిమిది

కాలేజీల్లో ఆరు జనరల్ బాలికల కాలేజీలు, రెండు జనరల్ బాలుర కాలేజీలు ఉన్నాయి.

- కాలేజీల వారీగా వివిధ గ్రూపుల్లోని సీట్ల వివరాలు:
- టీఎస్‌ఆర్ జూనియర్ కాలేజీ (బాలికలు), హసన్‌పర్తి, వరంగల్ అర్బన్ జిల్లా: ఎంపీసీ - 90, బైపీసీ - 60, ఎంఈసీ - 30. మొత్తం 180 సీట్లు.
- టీఎస్‌ఆర్‌జేసీ (బాలురు), సర్వేల్, యాదాద్రి భువనగిరి జిల్లా: ఎంపీసీ - 90, బైపీసీ - 60, ఎంఈసీ - 30. మొత్తం 180 సీట్లు.
- టీఎస్‌ఆర్ స్కూల్ (అప్‌గ్రేడెడ్ టు కాలేజీ), బాలానగర్, మహబూబ్‌నగర్ జిల్లా (జనరల్ బాలికలు): ఎంపీసీ - 40, బైపీసీ - 40. మొత్తం 80 సీట్లు.
- టీఎస్‌ఆర్ స్కూల్ (అప్‌గ్రేడెడ్ టు కాలేజీ), వైరా, ఖమ్మం జిల్లా (జనరల్ బాలికలు): ఎంపీసీ - 40, బైపీసీ - 40. మొత్తం 80 సీట్లు.
- టీఎస్‌ఆర్ స్కూల్ (అప్‌గ్రేడెడ్ టు కాలేజీ), సిద్దిపేట (జిల్లా) (జనరల్ బాలికలు): ఎంపీసీ - 40, బైపీసీ - 40. మొత్తం 80 సీట్లు.
- టీఎస్‌ఆర్ స్కూల్ (అప్‌గ్రేడెడ్ టు కాలేజీ), రామన్నపేట, యాదాద్రి భువనగిరి జిల్లా (జనరల్ బాలికలు): ఎంపీసీ - 40, బైపీసీ - 40. మొత్తం 80 సీట్లు.
- టీఎస్‌ఆర్ స్కూల్ (అప్‌గ్రేడెడ్ టుకాలేజీ), వికారాబాద్ (జిల్లా) (జనరల్ బాలికలు): ఎంపీసీ - 40, బైపీసీ - 40. మొత్తం 80 సీట్లు.
- టీఎస్‌ఆర్ స్కూల్ (అప్‌గ్రేడెడ్ టు కాలేజీ), కీసరగుట్ట, మేడ్చల్ జిల్లా (జనరల్ బాలురు): ఎంపీసీ - 40, బైపీసీ - 40. మొత్తం 80 సీట్లు.
- **నోట్:** పై అన్ని కాలేజీల్లో బోధనా మాధ్యమం ఇంగ్లిష్.
- మొత్తం సీట్ల సంఖ్య- 840. వీటిలో ఎంపీసీ -420, బైపీసీ - 360, ఎంఈసీ - 60 సీట్లు ఉన్నాయి.

అర్హతలు:

- విద్యార్థులు తెలంగాణలో చదివి ఉండాలి.
- పదోతరగతి పరీక్షను మొదటి ప్రయత్నంలో అంటే మార్చి 2018లో రాసి ఉత్తీర్ణులు కావాలి. 2018 కంటే ముందు ఉత్తీర్ణులైనవారు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు కారు.
- ఓసీ విద్యార్థులు 6 జీపీఏ, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థులు 5 జీపీఏతో ఉత్తీర్ణులై ఉండాలి. ఇంగ్లిష్ సబ్జెక్టులో కనీసం 4 జీపీఏ సాధించి ఉండాలి.
- **ఎంపిక:** రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించే ఎంట్రెన్స్ టెస్ట్ ద్వారా
- **పరీక్ష తేదీ:** మే 6 (ఉదయం 10 నుంచి 12.30 గంటల వరకు)
- **పరీక్ష కేంద్రాలు:** పాత పది జిల్లా కేంద్రాలు. విద్యార్థులు ఏ జిల్లా కేంద్రాన్నయినా సెంటర్‌ను ఎంచుకోవచ్చు.
- **గమనిక:** గురుకుల కాలేజీల్లో ప్రవేశాలు పొందిన విద్యార్థులకు ఉచిత విద్య, భోజనం, వసతి సౌకర్యాలు కల్పిస్తారు. వీటితోపాటు ఐఐటీ జేఈఈ/ ఎంసెట్, నీట్‌లకు లాంగ్‌టర్మ్ కోచింగ్ ఇస్తారు.

పరీక్ష విధానం:

- **ఎంపీసీ:** ఇంగ్లిష్, మ్యాథ్స్, ఫిజికల్ సైన్స్ నుంచి 150 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు.
- **బైపీసీ:** ఇంగ్లిష్, బయోసైన్స్, ఫిజికల్ సైన్స్ నుంచి 150 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు.
- **ఎంఈసీ/ఎంఈసీ:** ఇంగ్లిష్, సోషల్ స్టడీస్, మ్యాథ్స్ - 150 మార్కులు పరీక్ష నిర్వహిస్తారు.
- ఆబ్జెక్టివ్ విధానంలో పరీక్ష ఉంటుంది. జవాబులను ఓఎంఆర్ షీట్‌పై గుర్తించాలి.
- సిలబస్ పదోతరగతిస్థాయిలో స్టేట్ సిలబస్‌పై ప్రశ్నలు ఇస్తారు.

- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** ఏప్రిల్ 9
- **ఎగ్జామినేషన్ ఫీజు:** రూ. 150/-
- **హాల్‌టికెట్ల డౌన్‌లోడింగ్:** ఏప్రిల్ 28 నుంచి మే 2 వరకు.
- **వెబ్‌సైట్:** http://tsrjdc.cgg.gov.in